
'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పాడిపంటలతో పులకించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 358

గురువారం 20-3-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఆన్‌లైన్ గేమింగ్.. జూమింగ్

9.1 బిలియన్ డాలర్లకు విస్తరిస్తుంది... వింజో గేమ్స్, ఐఈఐసీ అంచనా -17లో



కోల్‌కథ ఎంతవరకు!

డిఫెండింగ్ చాంపియన్‌గా ఐపీఎల్ బరిలో కోల్‌కతా నైట్‌రైడర్స్ -17లో



బడ్జెట్ ప్రతుల బ్యాగ్‌ను సీఎం రేవంత్‌రెడ్డికి అందిస్తున్న డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క

అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన..

ఈ మూడు అంశాలే మా ఎజెండా...

రూ.3,04,965 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం భట్టి

- గత పాలన సవాళ్లకు.. మా పాలన సత్తాతోనే సమాధానం
- విధ్వంసం నుంచి వికసిత తెలంగాణగా రాష్ట్రాన్ని మారుస్తున్నాం
- యావత్ దేశానికే తలమానికంగా నిలిచేలా సాగుతున్నాం
- అంబేడ్కర్ నొక్కి చెప్పిన రాజ్యాంగ నైతిక విలువలనే పాటిస్తున్నాం
- ప్రభుత్వ ప్రతీ చర్యను శంకిస్తూ, అవాస్తవ ప్రచారాలు చేయడమే కొందరి పని
- ఆ కుట్రను సమర్థంగా తిప్పికొడుతూ ముందుకు సాగుతున్నామని భట్టి వెల్లడి
- ఇది చరిత్రాత్మక ప్రజా బడ్జెట్.. రాష్ట్రం మళ్లీ గాడిలో పడింది: సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన.. తమ ప్రాథమ్యాలని, ఈ మూడు అంశాలతో కూడిన తమ పాలన నమూనా యావత్ దేశానికే ఆదర్శంగా నిలిచేలా ముందుకు సాగుతున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గత ఏడాది లోక్‌సభ ఎన్నికల కారణంగా.. గత ప్రభుత్వ అస్తవ్యస్త పాలన పర్యవసానాలను మార్చుకునేందుకు కొంత ఇబ్బంది ఎదురైందని, అయినా 'చేతి'లో ఉన్న మిగతా కాలంలో పాలనను పరుగుపెట్టిస్తామని చెప్పారు. ''రాష్ట్రం పురోగమించేందుకు వేస్తున్న అడుగుల్లో మాకు ఎన్నో అవరోధాలు ఎదురవుతున్నాయి. గత పాలకులు సృష్టించిన సవాళ్లన్నింటినీ సమర్థంగా ఎదుర్కొంటూ మా పాలన సత్తా చాటుతున్నాం. విధ్వంసం నుంచి వికసిత తెలంగాణగా రాష్ట్రాన్ని మారుస్తున్నాం. తెలంగాణ రైజింగ్–2050 ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం..'' అని భట్టి పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పరిమాణం 200 బిలియన్ డాలర్లు అని.. పదేళ్లలో దీనిని వెయ్యి బిలియన్ డాలర్ (ట్రిలియన్ డాలర్) వ్యవస్థగా మార్చే దిశలో సాగుతున్నామని తెలిపారు. భట్టి విక్రమార్క బుధవారం 2025–26 ఆర్థిక సంవత్సర రాష్ట్ర బడ్జెట్‌ను రూ.3,04,965 కోట్ల అంచనాలతో అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పరుగెత్తించే కార్యాచరణతో ముందుకొచ్చామని చెప్పారు. బడ్జెట్ ప్రసంగం భట్టి మాటల్లోనే..

''ప్రజా ప్రయోజనాలే ధ్యేయంగా, పారదర్శకత, జవాబుదారీతనంతో సాగుతున్న మా ప్రభుత్వం వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశపెడుతోంది. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో రంగరించి జోడు గుర్రాల తరహాలో సుపరిపాలనా రథాన్ని పరుగులు పెట్టించడంలో సఫలీకృతం అయ్యాం. 'భారతదేశాన్ని ఒక రాజకీయ, సామాజిక, ఆర్థిక న్యాయం అమలు చేసే పటిష్టమైన ప్రజాస్వామ్య దేశంగా చూడాలనుకుంటున్నా'అని నాడు అంబేడ్కర్ పేర్కొన్నారు. రాజ్యాంగ నైతికతను పదే పదే నొక్కిచెప్పారు. ఆ నైతిక విలువలనే పాటిస్తూ ప్రజాపాలన

మిగతా 6వ పేజీలో ▶

ప్రధాన శాఖలు/ పథకాలకు కేటాయింపులు (రూ.కోట్లలో)					
56,084 6 గ్యారంటీలకు	18,000 'రైతు భరోసా'కు..	4,305 మహాలక్ష్మి పథకానికి..	3,683 కల్యాణలక్ష్మి	31,605 పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి	24,439 వ్యవసాయ శాఖకు
2,080 గృహజ్యోతి పథకానికి..	1,800 సన్నబియ్యం బోనస్‌కు..	1,143 ఆరోగ్యశ్రీ పథకానికి..	723 వంటగ్యాస్ సబ్సిడీకి..		

బడ్జెట్ వార్తలు, ప్రత్యేక కథనాలు 6, 7, 8, 9, 10 పేజీల్లో...

ఆరు గ్యారంటీలు గోవిందా... గోవిందా...



- బడ్జెట్‌లో వాటి ఊసే లేదు.. జాబ్ కేలండర్ ప్రస్తావనా లేదు
- సంక్షేమానికి సమాధి.. అభివృద్ధి అడ్రస్ గల్లంతు
- కరోనా వైరస్ కంటే కాంగ్రెస్ వైరస్ ప్రమాదం
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

6లో

ప్రజాసంక్షేమాన్ని, అభివృద్ధిని విస్మరించారు



- రాష్ట్ర బడ్జెట్ తీరు దున్నపోతుకు పాలు పితికినట్టు ఉంది
- అంచనాలు భారీ... కేటాయింపులు మాత్రం సారీ
- ఈ బడ్జెట్‌ను బీజేపీ ఖండిస్తోంది
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం

6లో



క్యాప్సూల్ నుంచి బయటకు వస్తూ అభివాదం చేస్తున్న సునీతా విలియమ్స్

సునీత వచ్చేసింది

- క్షేమంగా దిగిన వ్యోమనౌక.. ఫ్లోరిడా సమీపంలో ల్యాండింగ్
- సర్వత్రా అభినందనల వెల్లువ.. ఘనంగా స్వాగతించిన నాసా
- సిబ్బంది ఆత్మీయ ఆలింగనాలు.. కరచాలనాలు, పలకరింపులు
- పునరావాస కేంద్రానికి తరలింపు.. 45 రోజుల పాటు పర్యవేక్షణ
- ఆ తర్వాతే సొంతవారిని కలిసేందుకు అనుమతి

ముందే తీసుకొచ్చేవాళ్లం బైడెనే తిరస్కరించారు: మస్క్ 15లో **త్వరలో భారత్‌కు...**

సంతృప్తే సదానందం



బ్రహ్మాండమైన హాస్యనటుడు బ్రహ్మానందం. కానీ తనని మించిన నటులు ఉన్నారని ఆయన అంటున్నారు. ఎలా అంటే..? చుట్టూ ఉన్న వాళ్లను చూస్తూ.. ఆనందపరుస్తూ.. నవ్విస్తూ ఉండగలిగితే నీ అంతటి హాస్యనటుడు ఇంకొకడు లేడు' అన్నారు బ్రహ్మానందం. సంతృప్తే సంతోషం అనే ఈ సదానందం వరల్డ్ హ్యాపీనెస్ డే సందర్భంగా 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పంచుకున్న విశేషాలు.

16లో

పన్ను రాబడులపైనే ఆశలు!

రూ.1.75 లక్షల కోట్ల పన్నుల ఆదాయం వస్తుందని బడ్జెట్‌లో సర్కార్ అంచనా 10లో

తగినంత గ్యారంటీ

సంక్షేమానికి బడ్జెట్‌లో రూ. 90 వేల కోట్లు కేటాయించామని అంటున్న ప్రభుత్వ వర్గాలు

- ఆరు గ్యారంటీలకు రూ. 56 వేల కోట్లు.. ఇతర సంక్షేమ పథకాలకు రూ. 35 వేల కోట్లు
- రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం, రాజీవ్ యువ వికాసం లాంటి కొత్త పథకాలకు నిధులు
- రైతు బీమా, వడ్డీలేని రుణాలు, కల్యాణలక్ష్మి పథకాల కొనసాగింపు .... సొంత పన్నుల ఆదాయం, అప్పులపైనే ఆశలు

7లో



ఉస్మానియా ఉద్రిక్తం

నిషేధాజ్ఞలకు వ్యతిరేకంగా విద్యార్థుల ఆందోళన

- రాస్తారోకో.. అరెస్టులతో అట్టుడికిన వర్సిటీ క్యాంపస్
- ప్రభుత్వ దిష్టిబొమ్మ, బడ్జెట్ ప్రతుల దహనాలు
- ఎమ్మెల్సీ కోదండరామ్‌ను కలిసిన విద్యార్థి జేఏసీ నేతలు
- ఎమ్మెల్యే కూనంనేనికి పీహెచ్‌డీ స్కాలర్స్ వినతిపత్రం
- నేడు ఓయూ బంద్‌కు వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు

5లో

మెక్ డొనాల్డ్స్ గ్లోబల్ ఆఫీసు హైదరాబాద్‌లో..

- 2,000 మంది ఉద్యోగులతో జీసీసీ కార్యాలయం
- రాష్ట్ర ప్రభుత్వంతో కీలక ఒప్పందం
- వ్యవసాయ ఉత్పత్తులను స్థానిక రైతుల నుంచి కొనాలని కోరిన సీఎం రేవంత్
- తెలంగాణలో ఏటా 3–4 కొత్త ఔట్‌లెట్లు ప్రారంభిస్తామన్న సంస్థ

3లో

ఎస్సీలకు న్యాయం చేయాలన్నదే మా ఉద్దేశం

- వర్గీకరణ ఎవరికీ వ్యతిరేకంగా చేసింది కాదు
- నాకు మాత్రమే కాదు..మా నాయకుడు రాహుల్‌గాంధీకి కృతజ్ఞతలు చెప్పండి
- ఎస్సీ సంఘాల నాయకులతో సీఎం రేవంత్‌రెడ్డి


సీఎం రేవంత్‌ను కలిసిన ఎస్సీ సంఘం నాయకులు. చిత్రంలో మహేశ్‌కుమార్ గౌడ్, దామోదర రాజనరసింహ, అడ్లూరి లక్ష్మణ్, కడియం శ్రీహరి తదితరులు

సాక్షి, హైదరాబాద్: వర్గీకరణ ద్వారా ఎస్సీలకు న్యాయం చేయాలనేదే తమ ప్రభుత్వ ఉద్దేశమని..ఎవరికీ వ్యతిరేకంగా చేసింది కాదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మాదిగ సంఘాల నాయకులు కలిసి ధన్యవాదాలు తెలిపారు. వర్గీకరణ పోరాటంలో అమరులైన వారికి నివాళిగా ఈ సందర్భంగా సీఎం రేవంత్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం తనను కలిసిన నేతలనుద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, 'మీ ధన్యవాదాలు నాకు మాత్రమే కాదు.. మన నాయకుడు రాహుల్‌గాంధీకి తెలియజేయాలి. ఆయన లేకపోతే వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేశక్తి నాకు వచ్చేది కాదు. భవిష్యత్‌లో న్యాయపరమైన చిక్కులు ఉండకూడదనే వన్ మెన్ కమిషన్ ఏర్పాటు చేయగా,199 పేజీల నివేదిక ఇచ్చింది. ఎస్సీలను మూడు గ్రూపులుగా విభజించి రిజర్వేషన్లు కల్పిస్తున్నాం. ఆనాడు వర్గీకరణ తీర్మానం పెట్టాలని డిమాండ్ చేస్తే మమ్మల్ని సభ నుంచి సస్పెండ్ చేశారు. పదేళ్లలో పరిష్కారం కాని సమస్యకు మేం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే పరిష్కారం చూపాం. సుప్రీంకోర్టులో బలంగా వాదనలు వినిపించి వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చేందుకు కృషి చేశాం. న్యాయపరమైన హక్కుల సమస్యకు పరిష్కారం చూపాలనుకున్నాం. ఇప్పుడు సాధించుకున్నాం. వందేళ్లలో ఎప్పుడూ లేనివిధంగా ఉస్మానియా వర్సిటీ వీసీగా మాదిగ బిడ్డ కుమార్‌ను నియమించాం. ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ ఖాసిమ్‌ని నియమించాం. ఉన్నత విద్యామండలి, పబ్లిక్ సర్వీస్ కమిషన్, విద్యాకమిషన్‌లలో మాదిగలకు ప్రాధాన్యం ఇచ్చాం. ఈ అవకాశాన్ని నిలబెట్టుకుంటేనే భవిష్యత్‌లో మరిన్ని అవకాశాలు వస్తాయి. ఇదొక గొప్ప అవకాశం.. ఇది పదిమందికి ఉపయోగపడేలా చూడాలి. కుర్చీలో మీ వాడిగా నేనున్నాం..మీకు మంచి చేయడమే తప్ప నాకు మరో ఆలోచన లేదు. ఆవేశం తగ్గించుకొని ఆలోచనతో పనిచేయండి.. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి'అని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

బీసీ రిజర్వేషన్ల పెంపు భేష్

సీఎంకు బీసీ ఉద్యోగుల సంఘం సన్మానం


బీసీ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం, జాజుల తదితరులు

సాక్షి, హైదరాబాద్: బలహీనవర్గాలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును శాసనసభలో ఆమోదింపజేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీసీ సంఘాలు కృతజ్ఞతలు తెలిపాయి. ఈ మేరకు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రమాదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ తదితరులు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నీటిపారుదల, పౌర సరఫరాల శాఖమంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డిలను బుధవారం శాసనసభ కమిటీ హాలులో కలిశారు. ఇవే రిజర్వేషన్లను ఉద్యోగ, ఉపాధ్యాయ పదోన్నతులలో కూడా అమలుపరచాలని వారు విజ్ఞప్తి చేశారు. అనంతరం బీసీ ఉద్యోగుల సంఘం డైరీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయానికి భూమి ఇస్తే.. పక్క భూమినీ కబ్జా చేస్తున్నారు

- సయ్యద్ రఫీకి న్యాయం చేయాలి: జస్టిస్ చంద్రకుమార్


మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

పంజగుట్ట (హైదరాబాద్): ఒక ముస్లిం కుటుంబం దేవాలయానికి నాలుగు ఎకరాల భూమిని రాసిస్తే.. పక్కనే ఉన్న వారి పట్టా భూమిని కబ్జా చేసేందుకు చూడడం దారుణమని జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. స్వయానా ఒక మంత్రి కనుసన్నల్లోనే ఈ దారుణం చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..తెలంగాణ ఉద్యమంలో ఎంతో కీలకంగా ఉండి, ఎంతో కోల్పోయిన సయ్యద్ రఫీ కుటుంబానికి ఈ పరిస్థితి రావడం బాధాకరమన్నారు. సయ్యద్ రఫీ మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలో తాము ఎల్లమ్మ దేవాలయానికి 4.4 ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చామని, దానిపక్కనే 32 గుంటల తన సొంత పట్టా భూమి ఉందన్నారు. అయితే ఇటీవల ఎండోమెంట్ అధికారి దేవాలయ భూమికి చెందిన హద్దులు తొలగించి, తన స్థలంలోకి వచ్చి తవ్వకాలు ప్రారంభించారని తెలిపారు.

కేసీఆర్ తన పదవికి రాజీనామా చేయాలి

- బీజేపీ నాయకుల డిమాండ్
- కేసీఆర్ క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన


ప్లకార్డులతో ఆందోళన చేస్తున్న బీజేపీ నేతలు

గజ్వేల్: ప్రజలకు అందుబాటులో ఉండని గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ తన పదవికి రాజీనామా చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం గజ్వేల్‌లోని కేసీఆర్ క్యాంపు కార్యాలయాన్ని వారు ముట్టడించారు. కార్యాలయం గేటుకు 'వాంటెడ్ గజ్వేల్ ఎమ్మెల్యే, టు-లెట్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్'అంటూ పోస్టర్లను అతికించారు. అనంతరం అక్కడే ఆందోళనకు దిగారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న గజ్వేల్ సీఐ సైదా.. బీజేపీ నాయకులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. ఇదిలా ఉండగా బీజేపీ నేతలు క్యాంపు కార్యాలయంపై దాడి చేశారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి నేతృత్వంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కొత్త మద్యం బ్రాండ్ల దరఖాస్తులకు గడువు పెంపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్త మద్యం బ్రాండ్ల సరఫరాకు సంబంధించి కంపెనీలు దరఖాస్తు చేసుకునే గడువును ప్రభుత్వం పెంచింది. తొలుత మార్చి 15వ తేదీ వరకు గడువు ఇచ్చారు. ఇప్పుడు ఆ గడువును వచ్చే నెల 2 వరకు పొడిగించారు. తెలంగాణలో లేని విదేశీ, దేశీయ లిక్కర్, బీరు కంపెనీలు తమ మద్యం బ్రాండ్లను విక్రయించేందుకు టీజీబీసీఎల్‌కు ఇప్పటివరకు 39 కొత్త కంపెనీల నుంచి దరఖాస్తులు వచ్చాయి. టీజీబీసీఎల్‌లో రిజిస్టర్ కాని కొత్త కంపెనీలు.. ఇతర రాష్ట్రాల్లో జరుపుతున్న తమ మద్యం అమ్మకాలకు సంబంధించి నాణ్యత, ప్రమాణాలతో అమ్మకాలు జరుపుతున్నట్లుగా, మద్యం అమ్మకాలపై ఎలాంటి ఆరోపణలు లేవనే నిర్ధారణ సర్టిఫికేషన్ పత్రాలను దరఖాస్తుతో జతపరచాలని టీజీబీసీఎల్ కోరింది. అయితే టీజీబీసీఎల్ కోరిన విధంగా పత్రాలను జతపరచడం కొంత ఆలస్యం అవుతుందని, ఈ నేపథ్యంలో దరఖాస్తులకు మరింత గడువు ఇవ్వాలని కొన్ని కంపెనీలు విజ్ఞప్తి చేశాయి. దీనిని పరిగణనలోకి తీసుకుని విదేశీ, దేశీయ కంపెనీలకు ఏప్రిల్ 2 వరకు గడువు పెంచుతున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్ చెవ్వూరు హరికిరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అపరిష్కృత సమస్యలు పరిష్కరించాల్సిందే..

- యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ డిమాండ్
- 23 అర్ధరాత్రి నుంచి బ్యాంకు ఉద్యోగుల రెండ్రోజుల సమ్మె


మాట్లాడుతున్న యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ కన్వీనర్లు బీఎస్ రాంబాబు, కె.ఆంజనేయప్రసాద్

కాచిగూడ (హైదరాబాద్): దీర్ఘకాలికంగా, అపరిష్కృతంగా ఉన్న బ్యాంక్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ కన్వీనర్లు బీఎస్ రాంబాబు, కె.ఆంజనేయ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ బ్యాంకింగ్ రంగంలోని అన్ని విభాగాల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు. బుధవారం నారాయణగూడలో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్యవైఖరిని నిరసిస్తూ ఈనెల 23 అర్ధరాత్రి నుంచి 25 అర్ధరాత్రి వరకు బ్యాంకు ఉద్యోగుల సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. సమ్మెలో ఉద్యోగులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల పరిరక్షణ కోసం ఈ సమ్మె చేపట్టినట్లు తెలిపారు. తాత్కాలిక ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని, ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉద్యోగుల పనితీరు సమీక్షించే విధానం, పీఎల్ఐ మార్గదర్శకాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆయా యూనియన్ల నేతలు పలువురు పాల్గొన్నారు.

ఐదారేళ్ల తర్వాతే ఏఐ ప్రభావం

- వైద్యరంగంలో ఏఐతో కోడ్ బ్లూను నివారించొచ్చు
- ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి
- ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో సీడీఐటీహెచ్ ప్రారంభం


ట్రిపుల్ ఐటీలో సీడీఐటీహెచ్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి. చిత్రంలో జీవీఆర్ మోహన్‌రెడ్డి, శ్రీనిరాజు, పీజే నారాయణన్ తదితరులు

రాయదుర్గం: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికత వైద్యులను భర్తీ చేయలేదని ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్, పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. అయితే ఏఐ తెలిసిన వైద్యులు, ఏఐ తెలియని వైద్యులను భర్తీ చేస్తారని పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీలో నూతనంగా ఏర్పాటు చేసిన సెంటర్ ఫర్ డిజిటల్ టెక్నాలజీస్ ఇన్ హెల్త్‌కేర్ (సీడీఐటీహెచ్)ను నాగేశ్వర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. అనంతరం భారత ఐటీ పితామహుడు ఎఫ్‌సీ కోహ్లీ స్మారక ఉపన్యాసం చేశారు. 'చాలామంది వైద్యుల మాదిరిగానే నాకూ ఏఐ నచ్చలేదు. దాని గురించి నాకు చాలా భయంగా కూడా ఉంది. ఎందుకంటే ఇది మరో ఐదారేళ్ల తర్వాత మాత్రమే ప్రభావవంతంగా పనిచేస్తుంది. అప్పటికి నేను పదవీ విరమణ చేస్తాను. ఏఐ చాలా క్లిష్టంగా ఉన్నందున దానిని నా జీవిత కాలంలో ఉపయోగించకూడదని భావించాను. కానీ గత రెండేళ్లుగా ఏఐ ప్రాముఖ్యతను గ్రహించాను. ఏఐజీ ఆస్పత్రిలో నెలకు రెండు వేలకు పైగా శస్త్రచికిత్సలు చేస్తుంటాం. ఏఐని ఉపయోగించడం ద్వారా 'కోడ్ బ్లూ'(వైద్యపరంగా అత్యవసర పరిస్థితి) పరిస్థితిని నివారించవచ్చు. అంతేకాకుండా రోజుకు మూడు ప్రాణాలనైనా కాపాడవచ్చు'అని తెలిపారు.

రోగి పరిస్థితిని బెడ్ చెప్పేస్తుంది

ఆస్పత్రుల్లో ఏఐ ఆధారిత స్మార్ట్ పడకలు రోగి ఆరోగ్య పరిస్థితిని అనుక్షణం పర్యవేక్షించడానికి సెన్సార్లను, అల్గరిథమ్‌లను ఎలా ఉపయోగిస్తాయో నాగేశ్వర్‌రెడ్డి వివరించారు. ఏఐని ప్రిడిక్టివ్ మెడిసిన్, డ్రగ్ డిస్కవరీ మొదలైన వాటిలో కూడా ఉపయోగించవచ్చని తెలిపారు. అయితే డేటా తస్కరణ ఇందులో ప్రధాన సవాలు అని పేర్కొన్నారు. వైద్యసేవల్లో మానవ తప్పిదాలను తగ్గించడంలో ఏఐ సహాయపడుతుందని తెలిపారు. 'శరీరంలో 30 ట్రిలియన్ మానవ కణాలు, 39 ట్రిలియన్ సూక్ష్మజీవుల కణాలు, 20 వేల మానవ జన్యువులు, 20 మిలియన్ సూక్ష్మజీవుల జన్యువులు ఉంటాయి. వేలాది బ్యాక్టీరియాలను అధ్యయనం చేయడంలో ఏఐ సహాయపడుతుంది'అని వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాల ప్రముఖులు బీవీఆర్ మోహన్‌రెడ్డి, శ్రీనిరాజు, నాస్కాబ్ మాజీ అధ్యక్షుడు ఆర్.చంద్రశేఖర్, ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే నారాయణన్, విద్యార్థులు పాల్గొన్నారు.



'దేశం' అంటే మనం కాదయ్యా!

స్మితా సబర్వాల్‌కు వ్యవసాయ వర్సిటీ నోటీసులు?



సాక్షి, హైదరాబాద్: యూనివర్సిటీ నుంచి వాహన అలవెన్స్ కింద తీసుకొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించాలని సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్‌కు నోటీసులు జారీ చేయాలనే ఆలోచనలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు న్యాయ నిపుణుల సూచనలను తీసుకొని, తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని యోచిస్తున్నట్లు సమాచారం. సీఎంఓ అదనపు కార్యదర్శిగా ఉన్న సమయంలో స్మితా సబర్వాల్ యూనివర్సిటీ నుంచి వాహన అలవెన్సు కింద రూ.61 లక్షలు తీసుకున్నట్లు ఆడిట్ అధికారులు గుర్తించారని తెలిసింది. 2016 నుంచి 2024 సంవత్సరం మధ్యలో తీసుకున్న ఈ అలవెన్సుల విషయమై అభ్యంతరం వ్యక్తం చేసిన అధికారులు వాటిని రికవరీ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

నేటి భవితలో..

- టాప్ స్టోరీ:
సీఐఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్ కొలువులు
ప్రభుత్వరంగ సంస్థలకు భద్రతను కల్పించే సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్) పలు ఉద్యోగాలకు ప్రకటన విడుదల చేసింది. కేంద్ర హోంశాఖకు చెందిన ఈ సంస్థ అణుశక్తి ప్లాంట్లు, స్పేస్ స్టేషన్లు, కరెన్సీ నోట్ ప్రెస్, నౌకాశ్రయాలు, ఎయిర్ పోర్టులు, స్టీల్‌ప్లాంట్లు, హైడ్రాలిక్/థర్మల్ పవర్‌ప్లాంట్లు తదితర సంస్థల భద్రతను చేపడుతుంది. తాజాగా సీఐఎస్ఎఫ్ 1,161 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. సీఐఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్ కొలువులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ తదితర వివరాలు.. దీంతో పాటు సమగ్ర విద్య, ఉద్యోగ సమాచారం..

నేటి భవిత పేజీ కోసం సాక్షి ప్లస్ (ఈ పేపర్) ను చూడండి



బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మెక్ డొనాల్డ్స్ ప్రతినిధులు. చిత్రంలో జయేశ్ రంజన్, సీఎస్ శాంతికుమారి తదితరులు

మెక్ డొనాల్డ్స్ గ్లోబల్ ఆఫీసు హైదరాబాద్‌లో..

- 2000 మంది ఉద్యోగులతో మెక్ డొనాల్డ్స్ జీసీసీ కార్యాలయం
- అసెంబ్లీలో సీఎం కార్యాలయంలో ప్రభుత్వంతో కీలక ఒప్పందం
- వ్యవసాయ ఉత్పత్తులను స్థానిక రైతుల నుంచి కొనాలని కోరిన సీఎం రేవంత్
- బెంగళూరు కంటే హైదరాబాద్‌లో మెరుగైన సదుపాయాలున్నాయన్న మెక్ డొనాల్డ్స్ సీఈవో
- తెలంగాణలో ఏటా మూడు నాలుగు కొత్త ఔట్‌లెట్లు ప్రారంభిస్తామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: అమెరికాకు చెందిన మెక్ డొనాల్డ్స్ సంస్థ విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ కేంద్రం (జీసీసీ) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో పెట్టుబడుల ఒప్పందాన్ని కుదుర్చుకుంది. బుధవారం శాసనసభలోని సీఎం కార్యాలయంలో జీసీసీ విభాగం చైర్మన్, సీఈవో క్రిస్ కెంప్కెజెన్స్కీతోపాటు గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ అధ్యక్షుడు స్కై ఆండర్సన్, చీఫ్ గ్లోబల్ ఇంపాక్ట్ ఆఫీసర్ జాన్ బ్యానర్, గ్లోబల్ ఇండియా హెడ్ దేశాంత కైలా సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఒప్పందంపై సంతకాలు చేశారు. సుమారు 2000 మంది ఉద్యోగులతో మెక్‌డొనాల్డ్స్ ఇండియా సంస్థ గ్లోబల్ ఆఫీసును నెలకొల్పనుంది. ఈ కేంద్రాన్ని తమతమ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని పలు రాష్ట్రాలు పోటీ పడినప్పటికీ. మెక్‌డొనాల్డ్ సంస్థ తెలంగాణను తమ పెట్టుబడులకు గమ్యస్థానంగా ఎంచుకోవటం గర్వంగా ఉందని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. సంస్థకు అవసరమైన శిక్షణ నైపుణ్యమున్న ఉద్యోగులను నియమించుకునేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. వర్సిటీని స్కిల్ జోన్‌గా ఉపయోగించుకొని, ఇక్కడ శిక్షణ పొందిన వారికి గ్లోబల్ ఆఫీస్‌లోనే కాకుండా, దేశ విదేశాల్లో తమ ఆఫీసులు, అవుట్‌లెట్లలో ఉద్యోగాలు కల్పించాలని కోరారు. మెక్‌డొనాల్డ్స్‌కు అవసరమైన మొత్తం వ్యవసాయ ఉత్పత్తులను స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేసే అంశాన్ని పరిశీలించాలని సీఎం కోరారు. దీంతో రైతుల ఆదాయం పెరుగుతుందని, రాష్ట్ర వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడుతుందని అభిప్రాయపడ్డారు.

హైదరాబాద్‌లో ప్రతిభావంతులు: సీఈవో

బెంగళూరు లాంటి ఇతర నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో ప్రతిభావంతులైన నిపుణులతోపాటు మెరుగైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన జీవన ప్రమాణాలున్నాయని మెక్ డొనాల్డ్స్ సీఈవో క్రిస్ కెంప్కెజెన్స్కీ అన్నారు. అందుకే హైదరాబాద్‌ను తమ గ్లోబల్ ఇండియా ఆఫీస్ సెంటర్‌గా ఎంచుకున్నట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా మెక్ డొనాల్డ్స్ నిర్వహిస్తున్న కమ్యూనిటీ అభివృద్ధి కార్యక్రమాలను సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రస్తుతం తెలంగాణలో 38 మెక్‌డొనాల్డ్స్ అవుట్‌లెట్లు ఉన్నాయని, ప్రతి ఏటా 3, 4 కొత్త ఔట్‌లెట్లను విస్తరించే ప్రణాళికలున్నాయని తెలిపారు. గ్లోబల్ ఆఫీసు ఏర్పాటుతో రాష్ట్రంలోని యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్ శాంతికుమారి, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

సీఎం చేతుల మీదుగా కారుణ్య నియామక పత్రాలు

సాక్షి, హైదరాబాద్: కారుణ్య నియామకాల్లో భాగంగా పలువురు ఉద్యోగులకు చెందిన కుటుంబసభ్యులకు సీఎం రేవంత్‌రెడ్డి నియామకపత్రాలు అందజేయనున్నారు. గురువారం సాయంత్రం 4 గంటలకు రవీంద్రభారతిలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అధ్యక్షతన జరగనున్న కార్యక్రమంలో పీఆర్, ఆర్డీ, మున్సిపల్ శాఖల్లో ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తారు. పంచాయతీరాజ్ విభాగంలో 582 సూపర్ న్యూమరరీ జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు కారుణ్య నియామకాలతో పాటు, మిషన్ భగీరథ శాఖలో 55 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు, 27 మంది జూనియర్ టెక్నికల్ ఆఫీసర్లు, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖలో 38 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు, 55 మంది జూనియర్ టెక్నికల్ ఆఫీసర్లకు నియామక పత్రాలను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క అందజేయనున్నారు.



తాము సహించగలిగే నిరాశా స్థాయిని అంగీకరించి, జనం దాన్నే సంతోషం అంటారు.
- సోరెన్ కీర్క్‌గార్డ్

సాక్షి

గురువారం, 20 మార్చి 2025

నిరీక్షణ ఫలించిన క్షణం...

మహాకవి శ్రీశ్రీ చెప్పినట్టు 'రాశి చక్రగతులలో/రాత్రిందివాల పరిణామాలలో/ బ్రహ్మాండ గోళాల పరిభ్రమణాలలో/ కల్పాంతాలకు పూర్వం కదలిక పొందిన/ పరమాణువు సంకల్పంలో...' ప్రభవించిన మానవుడు మరోసారి అసాధ్యాన్ని సుసాధ్యం చేశాడు. కేవలం ఎనిమిది రోజులని భావించింది కాస్తా 286 రోజులపాటు అంతరిక్షంలో ఉండిపోక తప్పని వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్, వారిని వెనక్కి తీసుకురావడానికి వెళ్ళిన మరో ఇద్దరూ నిర్దేశించిన సమయానికల్లా క్షేమంగా, సురక్షితంగా భూమ్మీదకు చేరుకోవడం సంక్లిష్టమైన సవాళ్లపై విజ్ఞాన శాస్త్రం సాధించిన అపూర్వ విజయం. మెక్సికో జలసంధి కెరటాల్లో వారిని తీసుకొచ్చిన స్పేస్ ఎక్స్ డ్రాగన్ కాప్స్యూల్ తేలియాడుతుండగా డాల్ఫిన్ల గుంపు దాని చుట్టూ వలయాకారంలో స్వాగతిస్తున్నట్టు తిరుగాడటం ఆహ్లాదాన్ని పంచింది. మంగళవారం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)ను వీడి దాదాపు 16 గంటలు ప్రయాణించి భారత కాలమానం ప్రకారం తెల్లారు జామున 3.30కి చేరుకున్నారు. అంతరిక్షానికి రాకపోకలు సాగించటం, అక్కడున్నన్నాళ్లూ నిరంతర పరిశోధనల్లో నిమగ్నులు కావటం ఒక అనుపమానమైన, అసాధారణమైన విన్యాసం. ఎంతో ఏకాగ్రత, మరెంతో ఆత్మవిశ్వాసమూ, ఓరిమి ఉంటే తప్ప ఆ పరిశోధనలు పరిపూర్తి చేయటం కష్టం. ఎంతో ఇరుకైన ఒక చిన్న స్థలాన్ని మిగిలిన వారితో పంచుకోక తప్పక పోవటం సామాన్య విషయం కాదు. నిరుడు జూన్ 5న అంతరిక్షయానం ప్రారంభం కాగా, ఆ మరునాడు అక్కడికి చేరుకుని ఐఎస్ఎస్‌లో ఈ వ్యోమగాములు పని ప్రారంభించారు. సునీత ఇప్పటికే మూడుసార్లు అంతరిక్షయానం చేయటంతో పాటు ఒక దఫా ఐఎస్ఎస్ కమాండర్‌గానూ వ్యవహరించారు. సునీత, బుచ్ అంతరిక్షంలో చిక్కుకుపోయారనటాన్ని అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా అంగీకరించటం లేదు. వారిని సురక్షితంగా దించేందుకు అనువైన సమయం కోసం ఎదురుచూశామంటున్నది. వారికున్నంత ఆత్మవిశ్వాసం సాధారణ ప్రజలకుండదు. అందుకే సునీత రాక కోసం మానవాళి మొత్తం ఆదుర్దా ప్రదర్శించింది.

అంతరిక్షయానం ఎనిమిది రోజులే అనుకుని వెళ్లి తొమ్మిది నెలలు ఉండక తప్పక పోవటమంటే అది వారి మానసిక స్థితిని మాత్రమే కాదు... శారీరక స్థితిగతులనూ ప్రభావితం చేస్తుంది. కేవలం ఎనిమిది రోజులకోసమైతే వారు సాధారణ వ్యాయామంతో సరిపెట్టుకోవచ్చు. అసలు చేయక పోయినా ఫరవాలేదంటారు. కానీ ఇంత సుదీర్ఘకాలం అక్కడ కొనసాగాలంటే మాత్రం శరీరాన్ని బాగా కష్టపెట్టాలి. సుదీర్ఘ వ్యాయామం తప్పదు. గుండె, రక్తనాళాలూ సక్రమంగా పని చేయటానికి అవి అవసరం. ఈ వ్యాయామాలు సహజంగానే కష్టంతో కూడుకున్నవి గనుక అందుకు వారిని మానసికంగా సంసిద్ధుల్ని చేయటంతోపాటు వారి దినచర్యలో అవసరమైన మార్పులు చేయాల్సి వస్తుంది. వారికి అందాల్సిన ప్యాకేజ్డ్ ఆహారం వివిధ రకాల రుచులతో సిద్ధంగానే ఉన్నా నచ్చింది తినడానికి లేదు. నిర్ణీత కొలతలో వాటిని తీసుకోవాల్సి ఉంటుంది. ఇన్నిటిని తట్టుకుంటూ, నిర్దిష్టమైన సమయాల్లో వ్యాయామాలు చేస్తూ పరిశోధనలు సాగించటం, అందులో వెల్లడైన అంశాలపై పరస్పరం చర్చించుకుని నిర్ధారణలకు రావటం అంతరిక్ష యాత్రికులకు తప్పనిసరి.

ఇంతవరకూ మూడు దఫాలు అంతరిక్ష యాత్రకు వెళ్లిన సునీత మొత్తం 62 గంటల 6 నిమిషాలు స్పేస్ వాక్ చేశారంటే... ఆ రకంగా ఆమె మహిళా అంతరిక్ష యాత్రికుల్లో అగ్రస్థానాన్నీ, మొత్తం వ్యోమగాముల్లో నాలుగో స్థానాన్నీ పొందారంటే... అది సునీత దృఢసంకల్పానికి అద్దం పడుతుంది. ఈ అంతరిక్ష యానంలో భూమికి 408 కిలోమీటర్ల ఎత్తులో 900 గంటలపాటు ఆమె వివిధ రకాలైన 150 పరిశోధనల్లో నిమగ్నమయ్యారు. ఈ తొమ్మిది నెలల్లో ఆమె పరిశోధనలు సాగించిన ఐఎస్ఎస్... భూకక్ష్యలో 4,576 సార్లు తిరగ్గా ఆ నిడివి 19 కోట్ల 40 లక్షల కిలోమీటర్లు! అబ్బురపరిచే విషయమిది. అవకాశం లభిస్తే స్త్రీలు అందరినీ మించుతారనడానికి సునీత ప్రతీక.

ఈ అంతరిక్ష యాత్రలైనా, అంతరిక్ష నౌకల అన్వేషణలైనా... వాటి అంతిమ సారాంశం ఏక గ్రహజీవిగా ఉన్న మనిషిని బహు గ్రహజీవిగా మార్చటం. అంతరిక్షంలో సాగించే పరిశోధనలు భవిష్యత్తులో మనుషులందరూ సునాయాసంగా గ్రహాంతర యానాలు చేయటానికి, అక్కడి పరిస్థితులకు తట్టుకోవటానికీ తోడ్పడతాయి. ఈ యాత్రలు ముమ్ముందు మనుషుల్ని పోలిన గ్రహాంతర జీవులతో మనల్ని అనుసంధానించవచ్చు. 1906లో హెచ్‌జీ వెల్స్ రచించిన 'వార్ ఆఫ్ ది వర్ల్డ్స్' నవల ఊహించినట్టు ఆ గ్రహాంతర జీవులు మనపైకి దండయాత్రకొచ్చే ప్రమాదమూ లేకపోలేదు.

విశ్వం గురించిన మన జ్ఞానం పరిధి రోజురోజుకూ విస్తరిస్తోంది. కోట్లాది కాంతి సంవత్సరాల దూరంలో సైతం లెక్కలేనన్ని పాలపుంతలున్నాయని, భూమిని పోలిన గ్రహాల ఆచూకీ తెలిసిందని శాస్త్రవేత్తలు చెబుతుంటే ఎంతో విస్మయం కలుగుతుంది. రెక్కలు కట్టుకుని పైపైకి వెళ్లేకొద్దీ మన భూమి సూది మొన మోపినంత పరిమాణంలో కనిపిస్తుంది. అక్కడి నుంచి చూస్తే మనం కృత్రిమంగా ఏర్పర్చుకున్న సరిహద్దులు, ఆర్థిక సామాజిక తారతమ్యాలు కనబడవు. విషాదమేమంటే... ఎదిగినకొద్దీ విశాలం కావాల్సిన చూపు కాస్తా మూఢ విశ్వాసాల్లో, మూర్ఖత్వపు మలుపుల్లో సంకుచితమవుతోంది. నలుగురు వ్యోమగాములు సగర్వంగా భూమ్మీదకు తిరుగు పయనమైన రోజే 400 మంది అమాయక పాలస్తీనా పౌరులు ఇజ్రాయెల్ బాంబుదాడుల్లో కన్నుమూశారంటే అది మనుషుల్లోని రాక్షసత్వాన్ని చాటుతుంది. ఇలాంటి విషాదాలకు తావులేని కాలం ఆగమిస్తే తప్ప ఈ విజయాలు మనకు పరిపూర్ణమైన సంతోషాన్ని కలగజేయలేవు.


అరుదైన మిలిటరీ థ్రిల్లర్!

కామెంట్



కరణ్ థాపర్

ఒక సైనిక ప్రధానాధికారి నవల రాయటం అన్నది ప్రతిరోజూ జరిగేది కాదు. నిజానికి, స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఈ 77 ఏళ్లలో ఇలా ఒకసారి మాత్రమే సంభవించింది. జనరల్ ముకుంద్ మనోజ్ నరవణే రాసిన పుస్తకాన్ని అరుదైన వాటిలో ఒకటిగా, ప్రత్యేకమైనదిగా చేస్తున్నది ఇదే. నేను ఈ పుస్తకం గురించి రాస్తున్నది కూడా దానికున్న ఈ ప్రత్యేకత కారణంగానే!



విశ్రాంత ఇండియన్ ఆర్మీ జనరల్ మనోజ్ నరవణే

- 77 ఏళ్లలో ఒక సైనిక ప్రధానాధికారి నవల రాయడం ఎప్పుడూ జరగలేదు. రిటైర్డ్ జనరల్ మనోజ్ నరవణే రాసిన పుస్తకాన్ని ప్రత్యేకంగా నిలబెడుతున్నది ఇదే!
- థ్రిల్లర్లు రాయటం అంత తేలికేమీ కాదు. మొదట కథాంశం అన్నది ఉండాలి. అది ఆసక్తికరంగా ఉండాలి. చదువుతున్నకొద్దీ అది లోలోతుల్లోకి లాక్కెళుతుండాలి.
- ఈ కథ కొత్తగా ఆర్మీలో చేరిన ఇద్దరు యువ అధికారుల చుట్టూ తిరుగుతుంది... మూడో తరం అధికారి లెఫ్టినెంట్ రోహిత్ వర్మ, పదాతిదళం రెజిమెంట్‌లో నియామకం పొందిన తొలి మహిళ లెఫ్టినెంట్ రేణుకా ఖత్రీ.

నరవణే రాసిన ఈ నవల పేరు 'ద కంటోన్మెంట్ కాన్స్పిరసీ'. టైటిల్ కింద ఉన్న ఉపశీర్షికను బట్టి ఇదొక మిలిటరీ థ్రిల్లర్. ఇది 'లూ కరే' (గూఢచారి నవలలకు ప్రసిద్ధి చెందిన స్వర్గీయ బ్రిటిష్ రచయిత డేవిడ్ జాన్ కార్న్‌వెల్ కలం పేరు) ఒరవడిని కలిగి ఉన్నటువంటిది కాకున్నా... వేగంగా చదివిస్తూ, ముందుకు నడిపించేలా ఉంటుంది. నేనైతే, తెరిచిన పుస్తకం ముగిసే వరకు కూర్చున్న చోటు నుంచి కదల్లేదు. పేజీలు వాటంతటవే తిరిగిపోతున్నట్లుగా అనిపించింది.

ఈ కథ, కొత్తగా ఆర్మీలో చేరిన ఇద్దరు యువ అధికారుల చుట్టూ తిరుగుతుంది. ఒకరు లెఫ్టినెంట్ రోహిత్ వర్మ. ఇంకొకరు లెఫ్టినెంట్ రేణుకా ఖత్రీ. రోహిత్ మూడో తరం అధికారి. రేణుక పదాతిదళం రెజిమెంట్‌లో నియామకం పొందిన తొలి మహిళ. రోహిత్ మీద లైంగిక వేధింపుల ఆరోపణలు వస్తాయి. చాలామంది అతడు దోషి అని భావిస్తుంటారు. రోహిత్, రేణుకలలో రేణుకే అత్యంత శక్తిమంతమైన వ్యక్తిత్వం కల ఆఫీసర్. ఒక్క దుముకుతో రోహిత్ వెనుక అండగా నిలబడి ఈ కథను ముందుకు నడిపిస్తుంది రేణుక పాత్ర. కథాంశంలో ఒక్కో ముడీ విడివడుతున్నప్పుడు రెండు హత్యలు జరుగుతాయి. ఆ హత్యలు చేసిన వ్యక్తి మొదట మీరు అనుమానించిన వ్యక్తి కాదు. ఇంతకుమించి నేను మీకు చెప్పను. అలా చెప్తే కథ తెలిసిపోతుంది.

కథా నేపథ్యం భవిష్యత్ కాలం. ఇదంతా కూడా 2026 జూన్ తర్వాత జరుగుతుంది. ఫతేపురిలోని సిఖ్ రైఫిల్స్ రెజిమెంటల్ సెంటర్‌లో కథ మొదలవుతుంది. రోహిత్, రేణుక ఓరియెంటేషన్ ట్రైనింగ్ కోసం అక్కడ ఉంటారు. కొత్తను పోగొట్టి, దిశా నిర్దేశం చేసే శిక్షణ కార్యక్రమం అది. జనరల్ నరవణే సొంత రెజిమెంట్ కూడా '7వ సిఖ్ లైట్ ఇన్‌ఫాంట్రీ' కనుక ఆయన స్వీయానుభవాలు, ప్రత్యక్ష పరిశీలన ద్వారా గ్రహించిన విషయాలు ఈ నవల రాసేందుకు తోడ్పడ్డాయని స్పష్టంగా తెలుస్తోంది.

ఏమైనా, థ్రిల్లర్ కథలు రాయటం అంత తేలికేమీ కాదు. మొదట కథాంశం అన్నది ఉండాలి. అది ఆసక్తికరంగా ఉండాలి. మరీ ముఖ్యంగా – చదువుతున్న కొద్దీ అది మనల్ని లోలోతుల్లోకి లాక్కెళుతుండాలి. తర్వాత ప్రధానమైనది కథన వేగం. అది మనల్ని ముగింపు వైపు పరుగులెత్తించాలి. మహోగ్రమైనదిగా కూడా ఆ ముగింపు ఉండాలి. చివరిగా భాష. అది కుదింపుగా, ఉద్వేగభరితంగా ఉండాలి. సుదీర్ఘమైన తాత్విక ప్రసంగాల్లా కాకుండా, వాక్యాలు చిన్న చిన్నవిగా ఉండాలి. వీటి ద్వారా ప్రధాన పాత్రలు ఎటువంటి స్వభావం కలిగినవో మనకొక స్పష్టమైన అవగాహనను కలిగించటం అవసరం. ఇక రచయిత ఆ పాత్రల వ్యక్తిత్వాన్ని సూటిగా, పదునుగా శిల్పీకరించాలి. అంతేనా, ఏది తప్పో ఏది ఒప్పో చెప్పగలిగేలా ఉండాలి. థ్రిల్లర్ పుస్తకాలు సాధారణంగా నీతి కథలుగా ముగుస్తాయి.

ఇవన్నీ కూడా ఈ పుస్తకంలో ఉన్నాయి. నిజానికైతే, ఇది మనం ఆర్మీ జనరల్స్ నుంచి ఆశించేది కాదు. ఈ పుస్తకంలోని వివిధ వర్ణాల ఛాయలు, వివరాల్లోని సూక్ష్మత్వం ఆహ్లాదకరమైన అబ్బురపాటును కలిగించేలా ఉన్నాయని నేను చెప్పగలను. నేను ఎంతో మంది ఆర్మీ చీఫ్‌లను కలిశాను కానీ – మీరు నమ్మండి – ఈ విధమైన సాహితీ నైపుణ్యాలను కలిగి ఉన్న ఆర్మీ చీఫ్‌ను నేనెప్పుడూ కలవలేదు.

కథలో బ్రిగేడియర్ అశోక్ మీనన్‌ది కేవలం పైపైన పాత్రే అయినప్పటికీ, ఆ రెజిమెంటల్ సెంటర్ కమాండెంట్ ఇంగ్లిషు నన్ను పడేసింది. మీనన్ మాట్లాడేటప్పుడు 'బ్లింప్' అనే ఒక ఇంగ్లిష్ కల్నల్ (కార్టూన్ క్యారెక్టర్) గుర్తొచ్చారు నాకు. 'What the deuce?' (ఆశ్చర్యాన్ని, గందరగోళాన్ని లేదా చికాకును వ్యక్తపరిచే యాస), 'darn' (డామిట్) వంటి పదాలు ఆయన నోటి నుండి వచ్చేవి. ఆయన ప్రసంగమంతా కూడా ruddy, blighter, bugger అనే పదాల చిలకరింపుతో ఉంటుంది. అవన్నీ తిట్లు.

జనరల్ నరవణే ఉద్దేశపూర్వకంగానే ఇలా చేశారని స్పష్టంగా తెలుస్తోంది. ఆయన తన పాత్ర మాట్లాడే భాషతో ఆ పాత్రకు ఒక ప్రత్యేకమైన గుర్తింపును సృష్టించారు. కొన్నిసార్లు ఇది నాకు ఆర్థర్ కానన్ డోయల్ (రచయిత), షెర్లాక్ హోమ్స్(కానన్ డోయల్ సృష్టించిన పాత్ర)ను కూడా గుర్తుకు తెచ్చేది. అయితే ఆర్మీ బ్రిగేడియర్‌లు నిజంగా అలా ఉంటారా? లేదా, అలా ఉండాలని పాఠకులు ఆశిస్తారని ఈ రచయిత నమ్ముతున్నారా? ఏదైనా సరే, అది పని చేస్తుంది.

అయితే, సునిశితమైన శ్రద్ధతో సాగిన పాత్రల చిత్రీకరణ, సైనిక జీవిత స్ఫూర్తి, స్వభావాల సంగ్రహణలతో ఈ థ్రిల్లర్ పుస్తకం దోషరహితంగా ఉన్నప్పటికీ, ఇందులో నాకొక వింత లోపం మార్మికంగా అనిపించింది. బ్రిగేడియర్ మీనన్, రోహిత్‌తో మాట్లాడే సందర్భంలో రచయిత ఇలా రాశారు: ''గోడవైపు చూపిస్తూ ఆయన అంటారు, 'గురునానక్ చెప్పిన ఆ మాట నీకు తెలుసా? చెడు విజయం సాధించటానికి కావలసిన ఒకే ఒకటి, మంచి మనుషులు ఏమీ చేయకపోవటమే'' అని. నాకు తెలిసినంత వరకు ఈ మాటను 18వ శతాబ్దం నాటి బ్రిటిష్ కన్జర్వేటివ్ నాయకుడు ఎడ్మండ్ బర్క్ అన్నారని చెబుతుంటారు. అయితే ఈ మాటను అన్నది బర్క్ కాదు అని ఇటీవలి కాలంలో కొన్ని పండిత వాదనలు కూడా వినిపిస్తున్నాయి. గురునానక్ నిజంగా అలా చెప్పారా? చెబితే ఎప్పుడు చెప్పారు? ఎక్కడ చెప్పారు?

ఈ చిన్న విషయాన్ని పక్కన పెడితే జనరల్ నరవణే తర్వాతి థ్రిల్లర్ కోసం నేను కుతూహలంతో వేచి చూస్తున్నాను. ఈ పుస్తకానికి మంచి ఆదరణ లభిస్తే, హత్యల గురించి లెఫ్టినెంట్ రేణుకా ఖత్రి చెప్పే రహస్యాలు వరుసగా వెలువడతాయని ఆయన నాతో అన్నారు. ఎవరికి తెలుసు? ఆమె మన సొంత 'మిస్ మార్పుల్' (ఆంగ్ల రచయిత్రి అగాథా క్రిస్టీ డిటెక్టివ్ నవలల్లోని కల్పిత పాత్ర) కావచ్చు. అలా జరిగితే కనుక జనరల్ నరవణే కొత్త అగాథా క్రిస్టీ అవుతారు!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

దేనికోసం?



అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నెడీ హత్యకు సంబంధించిన ఫైల్స్‌ను ట్రంప్ ప్రభుత్వం విడుదల చేసింది. ఇది ఎలా ఉందంటే, కొండను తవ్వి ఎలుకను పట్టడంలా; పైగా ఎలుక అప్పటికే తప్పించుకుంది.

– బ్రెట్ వెయిన్‌స్టీన్, రచయిత

చూడలేక...



నా రూమ్మేట్ ఉరేసుకుని చనిపోయింది. ఆత్మహత్య చేసుకునేవాళ్లు తమను మొదట ఎవరు చూస్తారో ఆలోచించరనుకుంటాను. నేను ఆ సంవత్సరం దాదాపుగా పరీక్ష తప్పాను. పరీక్షలకు నెల ముందు ముగ్గురు థెరపిస్టులను కలవాల్సి వచ్చింది.

– కకాపీ హతాకే, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

దాన్నెందుకు అంటారు?



నాగపూర్ అల్లర్లకు 'ఛావా' కారణమని కొందరు అంటున్నారు. సినిమాలు హింసకు కారణమైతే, దశాబ్దాలుగా హిందువులు వీధుల్లో అల్లర్లకు దిగుతుండాలి! 'పీకే', 'హైదర్', ఆఖరికి అదే విక్కీ కౌశల్ నటించిన 'ద గ్రేట్ ఇండియన్ ఫ్యామిలీ' తర్వాత కూడా ఎవరూ అల్లర్లకు దిగలేదు.

– సునంద వశిష్ఠ్, పొలిటికల్ కామెంటేటర్

మరో పదేళ్లు



బీజేపీలో మాకు విధానపరమైన విభేదాలు ఉండొచ్చు. కానీ సాధారణ ఎన్నికల ద్వారా వచ్చే పదేళ్లపాటు కేంద్రంలోనూ, చాలా రాష్ట్రాల్లోనూ తిరిగి బీజేపీని అధికారంలోకి తెచ్చే విషయంలో కట్టుబడి ఉన్నాం. ఎన్నికల్లో పార్టీ ఐక్యతకు విధానపరమైన విభేదాలు లెక్కలోకి రావు.

– సుబ్రహ్మణ్య స్వామి, కేంద్ర మాజీ మంత్రి

అసంగత చర్చ



నా జీవితంలో చాలా భాగం ముస్లిం ఘెట్టోల్లో బతికాను. అక్కడి సగంమంది శుద్ధ, ఛాందస సున్నీలు. వాళ్లెవరూ ఔరంగజేబు గురించి మాట్లాడగా వినలేదు. 14 ఏళ్లు వచ్చాక స్కూల్లో మొదటిసారి ఆ పేరు విన్నాను. చెప్పాలంటే మా అమ్మ తరఫు నుంచి ఎక్కువగా మోజెస్, జీసస్, ఆమె వెళ్తుండే ఖ్వాజా మొయినుద్దీన్ చిస్తీ, స్థానిక గురువు ఖ్వాజా దానా, ఇంకా ఛత్రపతి శివాజీ మహారాజ్ తాత తన కుమారులకు షాజీ (శివాజీ తండ్రి), షరీఫ్‌జీ అని పేరు పెట్టడం గురించి విన్నాను. పవిత్రత అటుండనీ, 1980ల్లో చర్చలోకి వచ్చేదాకా మా నాన్నకు బాబ్రీ మసీదు పేరు తెలీదు. సంఘీయులు అసంగత వ్యక్తులు, నిర్మాణాలను చర్చలోకి తెస్తారు; అవతలి వైపు నుంచి స్పందనలు వస్తాయి; తద్వారా హిందూ–ముస్లిం ద్వంద్వం బలపడిపోతుంది.

– అయూబ్ దావూద్, వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

అద్వితీయ మేధావి

రాయలసీమ ప్రజలలో చైతన్యం తెచ్చిన మహా నేతలలో పప్పూరు రామాచార్యులు ఒకరు. అనంతపురానికి చెందిన ఆయన 1896 నవంబర్ 8న జన్మించారు. అనంతపురంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్నప్పుడు డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ వీరికి అధ్యాపకులుగా ఉండేవారు. పేదరికం కారణంగా 1920 మార్చిలో బీఏ డిగ్రీ పూర్తి చేయకుండా మధ్యలో వదిలేసి అనంతపురం కలెక్టర్ కచేరీలో గుమస్తా ఉద్యోగంలో చేరారు. కానీ స్వతంత్రంగా జీవించాలనే ఉద్దేశంతో 1921 మార్చి నెలలో గుమస్తా ఉద్యోగాన్ని కూడా వదిలేసి ఇల్లూరు చేరి, నీలం సంజీవరెడ్డి (మాజీ రాష్ట్రపతి)కి చిన్నప్పుడు ట్యూషన్ చెప్పారు. 'పినాకిని' పత్రికలో వ్యాసాలు రాసేవారు. అది ఆగిపోయిన తర్వాత 1926 ఆగస్టు 14న అనంతపురం నుండి ఆయన సంపాదకత్వంలో 'శ్రీ సాధన' వారపత్రిక తొలి సంచిక వెలువడింది. ఆయన 'సహాయ నిరాకరణ' ఉద్యమం, 'క్విట్ ఇండియా' ఉద్యమం వంటి వాటిలో పాల్గొని అరెస్టు అయ్యి జైలుకు వెళ్లినప్పుడు మినహా పత్రిక 1972 మార్చి నెల వరకూ వెలువడింది. 'శ్రీ సాధన' పత్రిక, రామాచార్యులు... ఈ రెండూ రాయలసీమ రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో 'జంట కవులు' అనవచ్చు అన్నారు 'ఆంధ్రా గాంధీ' వావిలాల గోపాలకృష్ణయ్య.



పప్పూరు రామాచార్యులు

1937 నవంబర్ 16న మద్రాస్‌లోని దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు ఇల్లు' శ్రీబాగ్' భవనంలో జరిగిన 'పెద్ద మనుషుల ఒప్పందం'లో రాయలసీమ ప్రాంత ప్రతినిధిగా పప్పూరు రామాచార్యులు పాల్గొని అనేక విషయాలపై చర్చించారు. 1947 నుంచి 1952 వరకు అనంతపురం మున్సిపల్ చైర్మన్‌గా పనిచేశారు. ధర్మవరం నియోజకవర్గ ఎమ్మెల్యేగా 1955 నుండి 1962 వరకు వ్యవహరించారు. రేడియో సలహా సంఘ సభ్యులుగా ఉన్న కాలంలో ఆయన సూచన మేరకు రేడియోలో 'సుప్రభాత' కార్యక్రమం మొదలయింది. గ్రంథాలయోద్యమం, సహకార ఉద్యమాల్లోనూ ఆయన పాల్గొని సేవలందించారు. ఫలవంతమైన జీవితం గడిపి 1972 మార్చి 21వ తేదీన కన్నుమూసిన ఆయన ఎందరికో స్ఫూర్తి ప్రదాత.

– డా॥ ఎ.ఎ. నాగేంద్ర, అనంతపురం

పేరు ఏదైతేనేం... అంతా అణచివేతే!

అభిప్రాయం



ఎన్. వేణుగోపాల్

దేశంలో, ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వంలో, ఉన్న పాలన స్వభావాన్ని ఎలా నిర్వచించాలి, దాన్ని 'ఫాసిజం' అనాలా, 'నయా ఫాసిజం' అనాలా, 'నయా ఫాసిజం లక్షణాలు' అనాలా అని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) నాయకత్వం మల్లగుల్లాలు పడుతున్నదని ప్రచార సాధనాలలో వార్తలూ, వ్యాఖ్యలూ వస్తున్నాయి. ఆ పార్టీకే చెందిన కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మాత్రం తన విధానాల ద్వారా, ఆచరణ ద్వారా, బహుశా మౌనం ద్వారా కూడా ఆ చర్చను మరొక స్థాయికి తీసుకు పోదలచుకున్నట్టున్నారు. కార్పొరేట్ ప్రయోజనాల పరిరక్షణ, ప్రజల సామూహిక ఆందోళనల అణచివేత, వ్యక్తిగత ఆందోళనల పట్ల మౌనం అనే మూడు విషయాలలో ఆయన ప్రభుత్వం, ఏ పేరు పెట్టినా, కేంద్ర ప్రభుత్వం చేయదలచిన, చేస్తున్న పనులనే చేసి చూపిస్తున్నది.

కేరళలోని వియ్యూర్ సెంట్రల్ జైలులో టి. ఆర్. రూపేష్ అనే మావోయిస్టు ఖైదీ ఉన్నారు. కేరళ మావోయిస్టు పార్టీ నాయకులలో ఒకరైన ఆయనను, ఆయన సహచరి షైనా, మరొక ముగ్గురు అనుచరులతో సహా 2015 మేలో తమిళనాడులోని కోయంబత్తూరులో అరెస్టు చేశారు. అంతకు ముందువీ, ఈ పదకొండేళ్లలో పెట్టినవీ కలిసి ఆయన మీద మొత్తం 43 కేసులున్నాయి. అందులో ఒక కేసు విచారణ జరిగి, ఆయన నిర్దోషిగా తీర్పు వెలువడింది. పదమూడు కేసులు డిశ్చార్జి అయ్యాయి. ఒక కేసులో శిక్ష పడి, శిక్షాకాలం ముగిసిపోతుండగా, విడుదల కాకుండా చూడడానికి రాష్ట్ర ప్రభుత్వం పదకొండేళ్ల కిందటి కేసు తవ్వి తీసింది. జైలు అధికారులు ఇవ్వవలసిన రెమిషన్ ఇవ్వకుండా ఉండిపోయారు.

ఇదంతా రాష్ట్ర ప్రభుత్వ మహత్కార్యమే గాని ఇప్పుడిక్కడ చర్చ అది కాదు. రూపేష్ జైలుకు వెళ్లక ముందే కవిగా, రచయితగా గుర్తింపు పొందారు. అజ్ఞాతవాసంలో ఉండగానే, 2013లో వెలువడిన ఆయన మొదటి నవల 'వసంత్తిలె పూమరంగళ్' (వసంతకాలపు పూలచెట్లు) మలయాళ సాహిత్య లోకంలో విస్తృత చర్చకు దారి తీసింది. అంతకు ముందు న్యాయ శాస్త్ర పట్టభద్రుడైన రూపేష్ గత పదేళ్ల జైలు జీవితంలో చరిత్రలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి, తత్వశాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తున్నారు. జైలు రేడియో నడుపుతున్నారు. బాడ్మింటన్ క్రీడాకారుడిగా పేరు తెచ్చుకున్నారు. వీటితో పాటే, జైలులో ఆయన తన రెండో నవల రాశారు. 'బంధితారుడె ఒర్మక్కురిప్పుగళ్' (ఖైదీల జ్ఞాపకాలు) అనే ఈ నవల ప్రచురణను అనుమతించమని జైలు అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. దాదాపు 130 పేజీలు గల ఈ నవల ఇతివృత్తం ఒక కవి–రాజకీయ కార్యకర్త జైలు జీవితం.

జైళ్ల నిర్వహణ రాజ్యాంగంలో రాష్ట్రాల జాబితాలో ఉన్న అంశంగా పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) నాయకత్వంలోని లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వానికి ఒక ఖైదీకి ఉన్న ఈ రాజ్యాంగ బద్ధ హక్కును గౌరవించి అనుమతి ఇచ్చే అధికారం ఉంది. జైలులో ఉన్న ఖైదీకి తన రచనను ప్రచురించుకునే హక్కు ఉందని సుప్రీం కోర్టు ఇచ్చిన ఎన్నో తీర్పులు చెబుతున్నాయి. కాని రూపేష్ లిఖితపూర్వక దరఖాస్తుకు వియ్యూర్ సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ నెల గడిచినా అధికారిక జవాబు ఇవ్వలేదు. దరఖాస్తును పై అధికారులకు పంపామని, జవాబు కోసం వేచి చూస్తున్నామని తాత్సారం చేశాడు. నవలలో జైలుకు, యూఏపీఏ, కోర్టు ప్రస్తావనలు ఉన్నాయి గనుక అనుమతి ఇవ్వబోమని నోటిమాటగా చెప్పాడు.



మావోయిస్టు నాయకుడు టి. ఆర్. రూపేష్, కేరళ సీఎం విజయన్

తన నవల ప్రచురణకు అనుమతించకపోతే, ఎమర్జెన్సీలో క్యాలికట్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థి రాజన్ హత్య చేయబడిన మార్చ్ 2న ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభిస్తానని రూపేష్ అధికారులకు తెలియజేశారు. మిత్రుల సలహా మేరకు దాన్ని ఒక్కరోజు నిరాహారదీక్షగా మార్చారు. అప్పటికే నవల డీటీపీ ప్రతి చదివిన కె. సచ్చిదానందన్, అశోకన్ చారువిల్, ఎన్. ఇ. సుధీర్ వంటి మలయాళ సాహిత్య ప్రముఖులెందరో ఆ నవల కళాత్మక విలువను ప్రశంసిస్తూ, ప్రచురణను అడ్డుకోవడం లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వానికి తగదని ప్రకటించారు. 'సృజనాత్మకత నేరం కాదు' అనే శీర్షికతో సామాజిక మాధ్యమాలలో, ఇతర ప్రచార సాధనాలలో పెద్ద ఎత్తున ప్రచారం సాగుతున్నది. ముఖ్యమంత్రికి బహిరంగ లేఖలు వెలువడుతున్నాయి.

ఒక ఖైదీ రచన ప్రచురణను ఫాసిస్టు, నయా ఫాసిస్టు, నయా ఫాసిస్టు లక్షణాలు గల ప్రభుత్వం అడ్డుకోవడానికి ప్రయత్నిస్తే అర్థం చేసుకోవడం సులభమే. కాని ఆ పని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రభుత్వం చేయడమే ఆశ్చర్యకరం, విషాదకరం. అదే ప్రభుత్వపు మరి రెండు విధానాలు కూడా ఈ నేపథ్యంలోనే ఆసక్తికరమైనవి.

కేరళలోని ఆశా (అక్రెడిటెడ్ సోషల్ హెల్త్ యాక్టివిస్ట్స్ – ఏఎస్‌హెచ్‌ఏ) సిబ్బందిలో అత్యధికులు ఈ సోమవారానికి ముప్పై ఆరు రోజులుగా సమ్మె చేస్తున్నారు. రోజుకు ఎనిమిది గంటలు పని చేస్తున్నప్పటికీ తమను ఉద్యోగులుగా కాక వాలంటీర్లుగా గుర్తించడం మానేయాలని, అధికారపక్షం ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేసినట్టు గౌరవ వేతనాన్ని రూ. 7,000 నుంచి రూ. 21,000కు పెంచాలని, ఉద్యోగ విరమణానంతర సౌకర్యాలు కల్పించాలని ప్రధాన డిమాండ్లతో, మరెన్నో డిమాండ్లతో ఈ సమ్మె జరుగుతున్నది. అనేక రాష్ట్రాలలో ఇవే డిమాండ్ల మీద సీపీఎం కార్మిక సంఘం సీఐటీయూ ఆందోళనలు నిర్వహిస్తున్నది. కాని కేరళలో సీఐటీయూ కాక మరొక సంఘం ఈ ఆందోళనను నిర్వహిస్తున్నందువల్లనేమో ప్రభుత్వం ఆందోళనకారులతో చర్చలకు కూడా సిద్ధపడడం లేదు.

గౌతమ్ అదానీ కంపెనీల మీద విదేశాలలోనూ, దేశంలోనూ లెక్కలేనన్ని విమర్శలు వస్తుండగా, కేరళ ముఖ్యమంత్రి మాత్రం అదానీ మీద పొగడ్తలు కుమ్మరించడంలో దేశ ప్రధానితో పోటీ పడుతున్నారు. ఇందుకు ప్రతిఫలంగా అన్నట్టు, కొద్ది వారాల కిందనే కొచ్చిలో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన ఇన్వెస్ట్ కేరళ గ్లోబల్ సమ్మిట్‌లో కరణ్ అదానీ అదే స్థాయిలో నరేంద్ర మోదీ, పినరయి విజయన్‌లు ఇద్దరినీ ఒకే ఊపులో పొగడ్తల్లో ముంచెత్తాడు.

ఏది ఫాసిజం? ఏది నయా ఫాసిజం? ఏవి నయా ఫాసిస్టు లక్షణాలు? ఓ మహాత్మా! ఓ మహర్షీ!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

బుద్బుదప్రాయం

ప్రాపంచిక విషయాలు భ్రమ గొల్పుతాయి. కావున కేవలం భగవంతుని కోరుకొనే సాధకుడు అటువంటి విషయాలను తుంచివేయాలి. ఎవరైతే పరిస్థితులకు లోబడి బానిసగా ప్రవర్తిస్తారో, అటువంటి వారు భగవంతునిపై సంపూర్ణమైన ప్రేమ చూపలేరు.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

కేవలం ప్రయత్నం ద్వారా పరిస్థితులను తనకు తగినట్టుగా మార్చుకోలేరు. కాని, వాటిని సరిగా వినియోగించి... అనగా వాటిని భగవంతుని సేవలో వినియోగించుకోవడం ద్వారా వాటినుంచి బయట పడవచ్చు. జీవితమే ఒక సముద్రం. జీవితంలో సంభవించే సంఘటనలు, పరిస్థితులు సముద్రంపై నీటి బుడగల వంటివి. వానినే ప్రాణంగా తలచుట అవివేకం. అందువలన సాధకుడు ఎట్టి పరిస్థితుల్లోనూ వాటివలన చలించకూడదు. భగవత్ సాక్షాత్కార ప్రయత్నంలో ఎల్లప్పుడూ నిశ్చలంగా ఉండాలి.

భౌతిక ప్రపంచంలో నీకు గల పేరు ప్రఖ్యాతులు, ఐశ్వర్యం వంటివి ఏవీ ఆధ్యాత్మిక మార్గంలో ఉపయోగపడవు. ఈ మార్గానికి కావలసిన యోగ్యతలు: భక్తిపట్ల నమ్రత కలిగి ఉండడం, సద్గురువు బోధనలను గ్రహించడం, శిశువు వలె, అమాయకంగా ఉండడం, గురువు బోధనలను ఆచరించుటకు సిద్ధంగా ఉండడం! ఈ లక్షణాలు నీకు ఉన్నాయా? నీవు వానిని పెంపొందించుకోవడానికి సిద్ధంగా ఉన్నావా? ఉంటే ఆధ్యాత్మిక మార్గం నీకు సులభ సాధ్యం అవుతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: బ.షష్ఠి రా.10.35 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం: అనూరాధ రా.7.55 వరకు, తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం: రా.1.57 నుండి 3.40 వరకు, దుర్ముహూర్తం: ఉ.10.07 నుండి 10.55 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.44 వరకు, అమృతఘడియలు: ఉ.8.32 నుండి 10.20 వరకు; రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు, యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు, సూర్యోదయం: 6.09, సూర్యాస్తమయం: 6.07.

క్లుప్తంగా...

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు సుప్రీంలో ఊరట

గోపీనాథ్ ఎన్నికను రద్దుచేయాలని హైకోర్టును ఆశ్రయించిన అజారుద్దీన్



సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు దేశ సర్వోన్నత న్యాయస్థానంలో ఊరట లభించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన గోపీనాథ్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌పై విజయం సాధించారు. అయితే, గోపీనాథ్ ఎన్నికను రద్దు చేయాలని కోరుతూ అజారుద్దీన్ హైకోర్టును ఆశ్రయించారు. అజారుద్దీన్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేయాలని కోరుతూ గోపీనాథ్ హైకోర్టులో కౌంటర్ పిటిషన్ దాఖలు చేశారు. గోపీనాథ్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. హైకోర్టు తీర్పును గతేడాది నవంబర్ 6న గోపీనాథ్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్ బుధవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఎమ్మెల్యే గోపీనాథ్ తరఫున యలమంచిలి శివసంతోష్‌కుమార్ వాదనలు వినిపిస్తూ... ఎటువంటి ఆధారాలు లేకుండా, నిరాధార ఆరోపణలతో పిటిషన్ దాఖలు చేశారని తెలిపారు. ఆ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఎమ్మెల్యే గోపీనాథ్ పిటిషన్ కొట్టివేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేసింది. మరోసారి మొదటినుంచీ కేసు విచారణ చేపట్టాలని, సమగ్రంగా ఇరుపక్షాల వాదనలు వినాలని, ఆ తర్వాత మరోసారి తీర్పు ఇవ్వాలని ఆదేశాల్లో స్పష్టం చేసింది.

సంబురాలు చేసుకుంటూనే కుట్రలను ప్రజల్లోకి తీసుకెళతాం

ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



పంజగుట్ట (హైదరాబాద్): ఎస్సీ వర్గీకరణ సంబురాలు చేసుకుంటూనే.. సీఎం రేవంత్‌రెడ్డి, మాదిగజాతిలో పుట్టి జాతికి అన్యాయం చేసిన దామోదర రాజనరసింహ ద్రోహాన్ని ఎండగడతామని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్గీకరణ ఎవరి భిక్ష కాదని.. 30 సంవత్సరాల ఎంఆర్‌పీఎస్ సుదీర్ఘ పోరాట ఫలితమని, ఈ ముఖ్యమంత్రి కాకపోతే ఏ ముఖ్యమంత్రి ఉన్నా తప్పక చేయాల్సిందేనన్నారు. కానీ మాదిగజాతికి తీరని అన్యాయం చేసి వర్గీకరణ చేశారని మందకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చినప్పటి నుంచి వర్గీకరణ అడ్డుకున్న వారు, ఇప్పుడు ఉద్యోగాల్లో మాదిగలకు తీరని అన్యాయం చేసిన వారి ప్రతీఒక్కరి చిట్టా మావద్ద ఉందని, వారే మా ప్రధానశత్రువులని వారు తప్పకుండా రాజకీయ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో తెలంగాణ క్రాంతిదళ్ వ్యవస్థాపకుడు డాక్టర్ పృథ్వీరాజ్ యాదవ్, తెలంగాణ విఠల్, ఇస్మాయిల్, గోవిందుల నరేష్ మాదిగ, శివకుమార్ మాదిగ పాల్గొన్నారు.

తెలంగాణలో వైద్యరంగాన్ని అభివృద్ధి చేశాం: వద్దిరాజు



సాక్షి, న్యూఢిల్లీ: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలో వైద్యరంగం ఎంతో అభివృద్ధి చెందిందని ఆ పార్టీ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పేర్కొన్నారు. ఇందుకు హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండటమే కారణమని అన్నారు. ఇక్కడి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులలో విదేశాలకు చెందిన వారు సైతం వైద్యసేవలు పొందుతున్నారని వివరించారు. బుధవారం రాజ్యసభలో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంరక్షణ బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. కరోనా మహమ్మారిని నిర్మూలించడంలో హైదరాబాద్ కీలకపాత్ర పోషించిందని వద్దిరాజు ఈ సందర్భంగా గుర్తు చేశారు. భారత్ బయోటెక్ ప్రపంచంలో మూడోవంతు వ్యాక్సిన్లు అందించిందని తెలిపారు. దేశంలోని 1/3 ఫార్మా ఉత్పత్తులు హైదరాబాద్ నుంచే సరఫరా అవుతున్నాయని తెలిపారు. అయితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మాసిటీని కనుమరుగు చేసి ఫోర్త్ సిటీని స్థాపించాలని చూస్తోందని ఆరోపించారు.

వీరశైవ లింగాయత్‌లను ఓబీసీ జాబితాలో చేర్చాలి

కాంగ్రెస్ ఎంపీ సురేశ్ షెట్కార్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో బీసీ జాబితాలో ఉన్న వీరశైవ లింగాయత్, లింగ బలిజ కులాన్ని కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని కాంగ్రెస్ ఎంపీ సురేశ్ షెట్కార్ డిమాండ్ చేశారు. కేంద్ర స్థాయిలో ఓబీసీ జాబితాలో లేని కారణంగా వీరశైవ లింగాయత్, లింగ బలిజకు చెందిన చాలా మంది విద్యార్థులు కేంద్రంలో విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం లోక్‌సభలో ప్రత్యేక ప్రస్తావన ద్వారా ఆయన ఈ అంశంపై మాట్లాడుతూ.. 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వీరశైవ లింగాయత్‌లను రాష్ట్ర బీసీ జాబితాలో చేర్చారని గుర్తు చేశారు. అంతేగాక ఓబీసీ జాతీయ కమిషన్ దేశంలోని 54 కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని కోరినా.. అది ఇంకా కేంద్ర కేబినెట్ వద్ద పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు.



వైభవంగా ముివ్వురు స్వాముల రథోత్సవం

ధర్మపురి: జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో ముఖ్యఘట్టమైన ముివ్వురు స్వాముల రథోత్సవాన్ని బుధవారం వైభవంగా జరిపించారు. ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి, శ్రీవేంకటేశ్వర స్వామి, శ్రీరామలింగేశ్వరుల స్వాములను రథాలపై ఆసీనుల్ని చేసి ఆలయం నుంచి నందికూడలి వరకు శోభాయాత్ర చేపట్టారు. దారి పొడవునా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. రథోత్సవాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 50 వేల మందికి పైగా భక్తులు తరలివచ్చారు.

సాగర్ ఎర్త్‌డ్యాంపై మంటలు

- సీసీ కెమెరాల కేబుళ్లు, విద్యుత్ కేబుళ్లు దగ్ధం



సాగర్ ఎర్త్‌డ్యాంపై కాలిపోతున్న గడ్డి

నాగార్జునసాగర్: సాగర్ ప్రధాన డ్యాం ఎడమ వైపునున్న ఎర్త్‌డ్యాంపై బుధవారం అగ్ని ప్రమాదం జరిగింది. విద్యుదాఘాతంతో మంటలు లేచి, గడ్డికి అంటుకున్నాయి. మెయిన్ డ్యాంకు సమీపంలో వ్యూ పాయింట్ దగ్గర విధులు నిర్వహిస్తున్న స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) సిబ్బంది మంటల తీవ్రత గమనించి అధికారులను అప్రమత్తం చేశారు. వెంటనే మెయిన్ డ్యాం వద్ద విధుల్లో ఉన్న సిబ్బంది, జెన్‌కో, సాగునీటి శాఖ సిబ్బంది అప్రమత్తమయ్యారు. అగ్నిమాపక సిబ్బంది నాలుగు గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఎర్త్ డ్యాంపై విద్యుత్ కేబుళ్లు, సీసీ కెమెరాల కేబుళ్లు పూర్తిగా కాలిపోయాయి. ఎంతమేరకు నష్టం జరిగిందో తెలియడం లేదని, గురువారం నష్టాన్ని అంచనా వేస్తామని డ్యాం ఈఈ మల్లికార్జున్‌రావు తెలిపారు.

ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు

- ప్రభుత్వ వైఖరితోనే పంటలు ఎండిపోతున్నాయి: కేటీఆర్
- అసెంబ్లీ ఆవరణలో ఎండిన వరికంకులతో ఆందోళన
- మండలి వద్దా బీఆర్ఎస్ ఎమ్మెల్సీల నిరసన



అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో తలసాని, పద్మారావు, సునీతా లక్ష్మారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, హరీశ్‌రావు, కౌశిక్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, వివేకానంద, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ ముందుచూపు లేని వైఖరితోనే లక్షల ఎకరాల పంటలు ఎండిపోతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువని విమర్శించారు. ఎండిన వరి పంటతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి అసెంబ్లీ ఆవరణలో ఆయన ఆందోళన నిర్వహించారు. 'రేవంత్‌రెడ్డి పాపం రైతన్నలకు శాపం.. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే అందాల పోటీలా'అంటూ నినదిస్తూ అసెంబ్లీ మీడియా పాయింట్‌కు చేరుకుని మాట్లాడారు. ఎండల వల్ల పంటలు ఎండిపోతున్నాయని, ముఖ్యమంత్రి చేతకాని మాటలు చెబుతున్నారని దుయ్యబట్టారు. సీఎం తెలివిలేనితనం, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ చేతకానందునే పంటలు ఎండిపోతున్నాయని ఆరోపించారు. దేవాదులకు పంపుల నిర్వహణ కోసం రూ.6 కోట్లు ఇవ్వకపోవడంతో రూ.600 కోట్ల నష్టం వాటిల్లిందని, లక్షల ఎకరాల పంట దెబ్బతిందన్నారు. మొద్దు నిద్రపోతున్న ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేదాకా దేవాదుల పంపులను పట్టించుకోలేదని మండిపడ్డారు. ఎండిపోయిన ప్రతి ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు అండగా నిలిచేందుకు ఆయా ప్రాంతాల్లో పర్యటించనున్నట్లు వెల్లడించారు. గోదావరి పరీవాహక ప్రాంతంలో పూర్తిగా పంటలు ఎండుతున్నా.. ప్రభుత్వం చేష్టలుడిగి నిలుచున్నదని పేర్కొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

రాష్ట్రంలో రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు ధ్వజమెత్తారు. బుధవారం శాసన మండలి ఆవరణలో వారు నిరసనకు దిగి.. సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు బడ్జెట్ ప్రసంగం ముగిసిన తర్వాత ఎమ్మెల్సీ కవితతో పాటు బీఆర్ఎస్ సభ్యులు ఎండిన వరికంకులు తీసుకొచ్చి మీడియాకు చూపించారు. అనంతరం మండలి మీడియా పాయింట్ వద్ద బీఆర్ఎస్ పక్షనాయకుడు ఎస్.మధుసూదనాచారి మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం గత పదేళ్లలో తాగు, సాగు నీటితో తెలంగాణను సస్యశ్యామలం చేస్తే.. ఇవాళ పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ ఏపీ సీఎం చంద్రబాబునాయుడు రోజుకు పదివేల క్యూసెక్కుల నీటిని తీసుకుపోతున్నా.. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవటం లేదని మండిపడ్డారు.

డీఎంకే అఖిలపక్ష భేటీకి కేటీఆర్

- ఈ నెల 22న చెన్నైకి బీఆర్ఎస్ ప్రతినిధి బృందం

సాక్షి, హైదరాబాద్: డీఎంకే పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 22న జరిగే దక్షిణాది రాష్ట్రాల అఖిల పక్ష భేటీకి బీఆర్ఎస్ పార్టీ హాజరుకానుంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం అదే రోజు ఉదయం చెన్నైకి చేరుకుంటుంది. ఈ బృందంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, రాజ్యసభ ఎంపీలు కేఆర్.సురేశ్‌రెడ్డి, దామోదర్‌రావు, వద్దిరాజు రవిచంద్ర సభ్యులుగా ఉంటారు. చెన్నై పర్యటనలో భాగంగా దక్షిణాది పార్టీల అఖిల పక్ష భేటీలో పాల్గొనడంతో పాటు తమిళనాడు సీఎం స్టాలిన్‌తోనూ కేటీఆర్ బృందం ప్రత్యేకంగా భేటీ అవుతుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇదిలా ఉంటే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాలు, వచ్చే నెల 27న వరంగల్‌లో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు కేటీఆర్ గురువారం నుంచి జిల్లాల పర్యటనకు శ్రీకారం చుడుతున్నారు. ఇందులో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగే బీఆర్ఎస్ నేతలు, ముఖ్యకార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొంటారు.

కట్టుకున్నోడిని కాటికి పంపింది..

- కోడలికి సహకరించిన మృతుడి తల్లి
- పరారీలో అత్తాకోడళ్లు
- వికారాబాద్ జిల్లా హన్మాపూర్‌లో ఘటన



వెంకటేశ్

తాండూరు రూరల్: మద్యానికి బానిసైన భర్త పెడుతున్న వేధింపులు భరించలేని ఓ భార్య కట్టుకున్నోడిని హతమార్చింది. మృతుడి తల్లి కూడా ఇందుకు సహకరించింది. తండ్రి హత్యకు గురికావడం, తల్లి, నాయనమ్మ పరారీలో ఉండటంతో ఇద్దరు పిల్లలూ బిక్కుబిక్కుమంటున్నారు. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం హన్మాపూర్‌లో బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. హన్మాపూర్‌కు చెందిన బక్కని వెంకటేశ్ (33)కు 14 ఏళ్ల క్రితం ఇదే ఊరికి చెందిన సబితతో వివాహం జరిగింది. వీరికి లావణ్య, కిషోర్ ఇద్దరు పిల్లలు సంతానం. తల్లి లక్ష్మమ్మ, భార్యాపిల్లలతో కలిసి ఒకే ఇంట్లో నివాసం ఉంటున్నారు. కొంత కాలం క్రితం పొలం అమ్మగా డబ్బులు రావడంతో వెంకటేశ్ మద్యానికి బానిసయ్యాడు. నిత్యం తాగి వచ్చి భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున వెంకటేశ్ ఇంటి ఆవరణలో రక్తపు మడుగులో పడి ఉన్నాడు. తల్లి, భార్య మృతుడి సోదరుడైన శ్రీనివాస్‌కు విషయం చెప్పారు. ఆయన పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి సిబ్బందితో చేరుకొని పరిశీలించారు. తన అన్న మృతికి తల్లి, వదినే కారణమని శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, లక్ష్మమ్మ, సబిత పరారీలో ఉన్నారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి రూరల్ సీఐ నగేశ్‌తో కలిసి హన్మాపూర్‌లో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

నిర్బంధం ఏ ప్రజాపాలనకు మార్గం?

- ఉస్మానియాలో నిషేధాజ్ఞల ఉత్తర్వులను రద్దు చేయాలి
- నిర్బంధ వ్యతిరేక వేదిక తెలంగాణ విభాగం డిమాండ్

సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిరసన కార్యక్రమాలపై నిర్బంధం విధించటం ఏ ప్రజాపాలనకు మార్గమని నిర్బంధ వ్యతిరేక వేదిక తెలంగాణ విభాగం కన్వీనర్ ప్రొఫెసర్ జి హరగోపాల్ ప్రశ్నించారు. విశ్వవిద్యాలయాలు పోరాడకుండానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందా? అని నిలదీశారు. నిషేధాజ్ఞలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నిర్బంధ వ్యతిరేక వేదిక, తెలంగాణ కన్వీనర్ ప్రొఫెసర్ జి హరగోపాల్, కో–కన్వీనర్లు ప్రొ.జి లక్ష్మణ్, రాఘవాచారి, రవిచందర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచ వ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు సరికొత్త ఆలోచనలతో ప్రపంచ ప్రగతికి ఎంతగా దోహదం చేస్తున్నాయో.. ప్రగతి నిరోధక విధానాలను నిలువరించడానికి కూడా అదేస్థాయిలో ఉద్యమాలను ముందుకు తీసుకు వస్తున్నాయని పేర్కొన్నారు.

ఉస్మానియా ఉద్రిక్తం

- నిషేధాజ్ఞలకు వ్యతిరేకంగా విద్యార్థుల ఆందోళన
- రాస్తారోకో.. అరెస్టులతో అట్టుడికిన వర్సిటీ క్యాంపస్
- ప్రభుత్వ దిష్టిబొమ్మ, బడ్జెట్ ప్రతుల దహనాలు
- ఏబీవీపీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ
- ఎమ్మెల్సీ కోదండరామ్‌ను కలిసిన విద్యార్థి జేఏసీ నేతలు
- సీపీఐ ఎమ్మెల్యే కూనంనేనికి పీహెచ్‌డీ స్కాలర్స్ వినతిపత్రం
- నేడు ఓయూ బంద్‌కు వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు

ఉస్మానియా యూనివర్సిటీ: ఆందోళనలు.. రాస్తారోకోలు.. దిష్టిబొమ్మ, బడ్జెట్ ప్రతుల దహనాలు.. సంతకాల సేకరణ.. విద్యార్థి నాయకుల అరెస్టులతో ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ బుధవారం అట్టుడికింది. క్యాంపస్‌లో నిరసన ప్రదర్శనలపై నిషేధం విధిస్తూ జారీచేసిన సర్క్యులర్‌ను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ సమీపంలో రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి, వైస్‌చాన్స్‌లర్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. సర్క్యులర్‌ను వెనక్కు తీసుకునేలా వర్సిటీ యాజమాన్యాన్ని ఒప్పించాలని ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్‌ను కలసి విద్యార్థి జేఏసీ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఇదే డిమాండ్‌తో ఏబీవీపీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును వెనక్కు తీసుకోవాలని మాల స్టూడెంట్ జేఏసీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. విద్యారంగానికి బడ్జెట్‌లో తక్కువ శాతం నిధులు కేటాయించారని బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఓయూలో 2018లో ప్రవేశం పొందిన పీహెచ్‌డీ స్కాలర్స్‌కు మరో ఏడాదిపాటు గడువు పొడిగించేలా వీసీతో మాట్లాడాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రం సమర్పించారు. ఆందోళన చేపట్టిన 23 మంది విద్యార్థి నేతలను అరెస్ట్ చేసి ఓయూ, అంబర్‌పేట, లాలాగూడ పోలీసు స్టేషన్లకు తరలించినట్లు సీఐ రాజేందర్ తెలిపారు. కాగా, నిషేధాజ్ఞల సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలనే డిమాండ్‌తో వామపక్ష విద్యార్థి సంఘాలు గురువారం ఓయూ బంద్‌కు పిలుపునిచ్చాయి.



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

ఐదు రోజులుగా వీసీ ఆఫీస్ గేటు మూసివేత

క్యాంపస్‌లో విద్యార్థుల ఆందోళనతో వీసీ కార్యాలయం ప్రధాన ప్రవేశ ద్వారాన్ని గత ఐదు రోజులుగా మూసివేశారు. కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులను మాత్రమే లోపలికి అనుమతిస్తున్నారు. దీంతో వివిధ పనులపై వీసీ, రిజిస్ట్రార్, ఇతర అధికారులను కలిసేందుకు వచ్చే సందర్శకులు నిరాశతో వెనుతిరుగుతున్నారు.

పట్టు వీడని విద్యార్థులు.. బెట్టు వీడని అధికారులు

ఓయూలో ఆందోళనలపై విధించిన నిషేధాజ్ఞలను వ్యతిరేకిస్తూ వర్సిటీ క్యాంపస్‌లో ఐదు రోజులుగా నిరసన కార్యక్రమాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని విద్యార్థి నేతలు డిమాండ్ చేస్తుండగా, అధికారులు ససేమిరా అంటున్నారు. సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని సాధారణ విద్యార్థులు కోరుతున్నారు. ఓయూలో జరుగుతున్న పరిణామాలపై వీసీ ప్రొ.కుమార్‌ను ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా, ఆయన అందుబాటులోకి రాలేదు.

2025-26 పద్దు





అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టేముందు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, ఆది శ్రీనివాస్, సీఎస్ శాంతికుమారి ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన

మొదటి పేజీ తరువాయి

సాగిస్తున్నాం. దశాబ్దకాలం వ్యవస్థల విధ్వంసం, ఆర్థిక అరాచకత్వంతో ఛిద్రమైన తెలంగాణ పాలనా, ఆర్థిక వ్యవస్థలను గాడిలో పెడుతూ ముందుకు సాగుతున్నాం.

స్వార్థపరుల అబద్ధపు ప్రచారం..

నిజం కూడా ప్రతి రోజూ ప్రచారంలో ఉండాలి. లేదంటే అబద్ధమే నిజంగా మారి రాష్ట్రాన్ని, దేశాన్నే కాదు ప్రపంచాన్ని కూడా నాశనం చేస్తుంది. ప్రభుత్వం చేసే ప్రతి చర్యను శంకిస్తూ, నిరాధార విమర్శలు చేయడమే కొందరు పనిగా పెట్టుకున్నారు. సోషల్ మీడియాలో, సొంత పత్రికలలో అబద్ధపు వార్తలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఈ కుట్రను సమర్థంగా తిప్పికొడుతూ, వాస్తవాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందుంచడం మా బాధ్యత. ప్రజలకు వాస్తవాలు చెప్పకపోతే.. ఆ స్వార్థపరులు ప్రచారం చేసే అబద్ధాలే నిజాలుగా భ్రమించే ప్రమాదం ఉంది.

కేవలం కేటాయింపులకే పరిమితం కాదు..

మేం బడ్జెట్‌లో ప్రస్తావించిన ప్రణాళికలు కేవలం ఆర్థిక కేటాయింపులు మాత్రమే కాదు. అవి సమాన అభివృద్ధికి, ఆర్థిక స్థిరత్వానికి, సామాజిక న్యాయానికి మార్గదర్శకంగా నిలుస్తాయి. మా ప్రభుత్వం సామాజిక న్యాయం, అభివృద్ధి, సంక్షేమ సమ్మిళిత విధానాలతో ప్రగతివైపు అడుగులు వేసేందుకు నిర్విరామంగా కృషి చేస్తోంది. రైతులు, వ్యాపారవేత్తలు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, దినసరి కూలీలు, ఐటీ నిపుణులు.. ఇలా ప్రతి ఒక్కరినీ ఈ పథకాలు బలోపేతం చేస్తాయి. సమష్టి కృషితో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది.

జాతీయ సగటు కంటే మన వృద్ధి రేటు ఎక్కువ

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వేగంగా వస్తున్న మార్పుల పర్యవసానాలను సమర్థంగా ఎదుర్కొంటూ.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధిని సాధిస్తోంది. 2024–25లో తెలంగాణ జీఎస్‌డీపీ ప్రస్తుత ధరల ప్రకారం రూ.16,12,579 కోట్లు. గత సంవత్సరంతో పోలిస్తే 10.1 శాతం వృద్ధిరేటు నమోదైంది. ఇదే సమయంలో దేశ జీడీపీ వృద్ధిరేటు 9.9 శాతంగానే ఉంది. 2024–25లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3,79,751, వృద్ధిరేటు 9.6 శాతం అయితే.. దేశ తలసరి ఆదాయం రూ.2,05,579, వృద్ధి రేటు 8.8 శాతం మాత్రమే. దేశ తలసరి ఆదాయంతో పోల్చితే తెలంగాణ తలసరి ఆదాయం రూ.1,74,172 (1.8 రెట్లు) మేర ఎక్కువగా ఉంది.

రాష్ట్ర పన్నుల వాటా 50శాతానికి పెంచాలని కోరాం

కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు న్యాయమైన భాగం దక్కాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 16వ ఆర్థిక సంఘానికి సమర్పించిన సమగ్ర నివేదికలో కోరింది. కేంద్రం విధిస్తున్న సెస్సులు, అదనపు చార్జీల వల్ల రాష్ట్రాలకు వస్తున్న ఆదాయం గణనీయంగా తగ్గుతోందని రాష్ట్రం తరఫున వివరించాం. ప్రస్తుతం రాష్ట్రాలకు ఇస్తున్న 41శాతం పన్నుల వాటాను 50 శాతానికి పెంచాలని కోరాం. తెలంగాణకు 14వ ఆర్థిక సంఘం ద్వారా 2.437 శాతం నిధుల పంపిణీ జరిగితే.. 15వ ఆర్థిక సంఘం కాలంలో 2.102 శాతానికి తగ్గింది. అభివృద్ధిలో ముందున్న రాష్ట్రాలకు తక్కువ నిధులు కేటాయించడం అన్యాయం. దేశ ఆర్థిక వృద్ధికి దోహదపడుతున్న రాష్ట్రాలను ప్రోత్సహించే విధంగా పన్నుల పంపిణీ విధానాన్ని హేతుబద్ధం చేయాలన్నది మా వాదన.

విధ్వంసం నుంచి వికసిత తెలంగాణగా..

గత దశాబ్దంలో ఎదుర్కొన్న ఎన్నో సవాళ్లను అధిగమించి తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి బాటలో కొనసాగుతోంది. ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుంటూ.. సుసంపన్నత, సమగ్రత, స్థిరమైన అభివృద్ధితో కూడిన తెలంగాణను నిర్మిస్తాం. ప్రతి పౌరుడికి విద్య, ఆరోగ్యం, ఉపాధి, సామాజిక భద్రతను కల్పించే స్థాయికి ఈ రాష్ట్రాన్ని తీసుకువెళ్లడమే మా లక్ష్యం.



అసెంబ్లీలో బడ్జెట్ చదువుతున్న భట్టి విక్రమార్క

'ఫ్యూచర్'లో ఏఐ సిటీ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఫ్యూచర్ సిటీలో అంతర్భాగంగా 200 ఎకరాల్లో ప్రత్యేకంగా ఏఐ సిటీని నిర్మిస్తాం. అది ప్రపంచంలోని పారిశ్రామిక దిగ్గజ కంపెనీలకు కేంద్రంగా మారుతుంది. గూగుల్ కంపెనీ ఇక్కడ ఏఐ ఆధారిత యాక్సిలరేటర్ సెంటర్‌ను నెలకొల్పేందుకు సిద్ధంగా ఉంది" అని భట్టి బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు.



రైతు పక్షపాతి అని రుజువైంది

మంత్రి ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని మరోసారి రుజువైందని నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రైతాంగం అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని సమపాళ్లలో రూపొందించిన బడ్జెట్ అని అభివర్ణించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం.. గ్రామీణ సాధికారత, ఆహార భద్రత, స్థిరమైన అభివృద్ధితో పాటు నీటిపారుదల, పౌర సరఫరాలను పటిష్టపరిచేందుకు ఈ బడ్జెట్ ఉపయోగపడుతుందన్నారు. నల్లగొండ జిల్లాలో లక్ష ఎకరాలకు నీరందించేందుకు ఉదయ సముద్రం నుంచి బ్రాహ్మణ వెల్లెంల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులను పూర్తి చేయడంతో పాటు.. నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాలోని 107 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు ఫ్లోరోసిస్ రహిత తాగునీరు అందించే ప్రాజెక్టు పూర్తికి కృషి చేస్తామన్నారు.



సంక్షేమం.. అభివృద్ధి సమతూకంగా..

మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా రాష్ట్ర బడ్జెట్ ఉందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా బడ్జెట్ రూపొందించారని స్పష్టం చేశారు. ఇది సామాన్యుల బడ్జెట్ అని, ప్రజాప్రయోజనాలే లక్ష్యంగా అన్ని రంగాలు, వర్గాలకు మేలు చేసేలా ఉందని అభిప్రాయపడ్డారు. విద్య, వైద్యం ఉపాధి, పారిశ్రామిక, మహిళా, రైతు విభాగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రభుత్వం కేటాయించిన నిధులు.. రానున్న కాలంలో ఉత్తమ ఫలితాలిస్తాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు, పదేళ్లలో ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంగా.. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో.. ప్రభుత్వ ప్రాధాన్యతాంశాల్లో ప్రధానమైన ఆరు గ్యారంటీలకు నిధులు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఇవేగాక వివిధ సందర్భాలలో ఇచ్చిన హామీలకు బడ్జెట్‌లో నిధులు మంజూరు చేసి చేతల ప్రభుత్వమని నిరూపించుకోవడం ప్రశంసనీయమన్నారు.

చరిత్రాత్మక ప్రజా బడ్జెట్: సీఎం

డిప్యూటీ సీఎం, ఆయన బృందానికి అభినందనలు

సాక్షి, హైదరాబాద్: గొప్ప మేధస్సు, నైపుణ్యం, సమర్థతతో రాష్ట్ర అభివృద్ధి, సుపరిపాలన, ప్రజా సంక్షేమం కోసం తీసుకుని వచ్చిన చరిత్రాత్మక ప్రజా బడ్జెట్ అని 2025–26 వార్షిక బడ్జెట్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. దశాబ్దం పాటు చీకటిలో మగ్గిపోయిన రాష్ట్ర ప్రజానీకానికి గత 15 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం స్థిరత్వం, వృద్ధి శ్రేయస్సుతో కూడిన పాలన అందిస్తోందని, హామీలను నిలబెట్టుకుంటోందని బుధవారం 'ఎక్స్' వేదికగా ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలను పునః ప్రతిష్ఠించడానికి తీవ్రంగా కృషి చేస్తున్నామని తెలిపారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు, ఆయన బృందానికి సీఎం అభినందనలు తెలిపారు. రాష్ట్రం మళ్లీ గాడిలో పడిందని, సవాళ్లు ఉన్నప్పటికీ తమ కృషితో విజయాన్ని అందుకుంటామని వ్యాఖ్యానించారు.

ఇంటి దగ్గర గుడిలో పూజలు చేసి..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆర్థిక మంత్రి హోదాలో మూడోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బుధవారం ఉదయం తమ ఇంటి దగ్గరున్న దేవాలయంలో భట్టి విక్రమార్క దంపతులు పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి అసెంబ్లీకి వచ్చిన భట్టికి ఆర్థిక శాఖ అధికారులు, శాసనసభ అధికారులు స్వాగతం పలికారు. తోటి మంత్రులతో కలసి అల్పాహార విందు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బడ్జెట్ పుస్తకాలున్న బ్యాగ్‌ను అందచేశారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌లకు కూడా బడ్జెట్ ప్రతులతో కూడిన బ్యాగును అందించారు. ఈ క్రమంలో మంత్రి మండలి భేటీ అయి బడ్జెట్‌ను ఆమోదించింది. ఈ సందర్భంగా సహచర మంత్రులంతా భట్టిని అభినందించారు. కాగా, శాసన మండలిలో అసెంబ్లీ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు బడ్జెట్ ప్రవేశపెట్టారు. కాగా.. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఏకంగా 14వ సారి బడ్జెట్ రూపకల్పనలో పాలు పంచుకోవడం విశేషం. ఆర్థిక శాఖ కార్యదర్శిగా, ముఖ్య కార్యదర్శిగా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఆయన బడ్జెట్ రూపకల్పనలో భాగమవుతూ వచ్చారు.

ధరణి కష్టాలకు చెక్ పెట్టాం..

భూమి కేవలం స్థిరాస్తి కాదు. ఒక భావోద్వేగం. భూమితో బంధం కన్నతల్లితో, సొంత ఊరితో ఉన్న అనుబంధంతో సమానం. గత ప్రభుత్వ హయాంలో ధరణి ప్రాజెక్టులో చోటు చేసుకున్న అక్రమాల వల్ల భూసంబంధిత సమస్యలు ప్రజలకు వేదన మిగిల్చాయి. ఆ సమస్యలకు చెక్ పెడుతూ మా ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తెచ్చింది. ఇందులో నిబంధనలు పారదర్శకంగా, సమగ్రంగా.. భూవివాదాలకు తావులేకుండా, భూ యజమానుల హక్కులు పూర్తిగా పరిరక్షించడానికి వీలుగా ఉన్నాయి.

ఎన్నడూ లేని స్థాయిలో కులగణన

అసమానతలను రూపుమాపే లక్ష్యంతో.. గతంలో ఎన్నడూ చేపట్టని విధంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను తెలంగాణ ప్రభుత్వం నిర్వహించింది. మొత్తం 1.12 కోట్ల కుటుంబాల వివరాలను సేకరించింది. సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేందుకు, సమర్థవంతమైన పాలన కోసం ఈ సర్వే కీలక డేటా అందించింది. వచ్చే పంచాయతీ ఎన్నికల్లో వెనుకబడిన తరగతుల వారికి జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు అందించడానికి అవకాశం ఏర్పడింది. భవిష్యత్తులో సంక్షేమ పథకాలు, రిజర్వేషన్లు, సమగ్ర ఆర్థిక పురోగతి విధానాల రూపకల్పనకు ఇది ఆధారంగా మారనుంది'' అని భట్టి బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు.

ప్రజాసంక్షేమాన్ని అభివృద్ధిని విస్మరించారు


కిషన్‌రెడ్డి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బడ్జెట్ తీరు చూస్తుంటే.. దున్నపోతుకు పాలు పిండినట్లుందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్రఅధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. 'అంచనాలు భారీ.. కేటాయింపులు మాత్రం సారీ'అని కాంగ్రెస్ ప్రభుత్వం తేటతెల్లం చేసిందని విమర్శించారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని ధ్వజమెత్తారు. 'కాంగ్రెస్ పార్టీ అమలుకు వీలుకాని హామీలు ఇచ్చి, అబద్ధాలతో అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు వాటిని అమలు చేయకుండా తప్పించుకుంటోంది. ప్రజాసంక్షేమాన్ని, రాష్ట్రాభివృద్ధిని విస్మరించిన ఈ బడ్జెట్‌ను బీజేపీ పూర్తిగా ఖండిస్తోంది'అని తెలిపారు. బుధవారం రాష్ట్ర బడ్జెట్‌పై ఆయన స్పందిస్తూ.. అట్టహాసంగా ప్రకటించిన గ్యారంటీల అమలుపై ప్రజలు ఆశలు వదులుకునేలా పద్దుల రూపకల్పన జరిగిందని అన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన చేశారు. అంకెల గారడీతో ప్రజలను మరోసారి మోసం చేశారని విమర్శించారు. 'పదేళ్లపాటు బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అగాధంలోకి నెట్టేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం పెనంపైనుంచి పొయ్యిలోకి పడేసినట్లు చేసింది'అని విమర్శించారు. గత ఏడాది బడ్జెట్ పెట్టినపుడు.. తొలి ఏడాదే కదా అని తప్పించుకున్నారని, 15 నెలలపాటు పాలించిన తర్వాత కూడా 6 గ్యారంటీలు, 420 వాగ్దానాల అమలును పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. వివిధ ప్రాజెక్టుల గురించి భారీగా ప్రకటనలు చేసినా.. కేటాయింపులు మాత్రం లేవని అన్నారు. రాష్ట్రంలో మద్యం వినియోగాన్ని పెంచి, దాని ద్వారా ఆదాయం పెంచుకోవడంపైనే ప్రభుత్వం దృష్టిపెట్టడం దురదృష్టకరమన్నారు. ప్రతిచోటా అంచనాలను పెంచి రాష్ట్ర ఆదాయాన్ని దాదాపు 12% ఎక్కువగా చూపిస్తున్నారని పేర్కొన్నారు. రైతులు, యువత, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, ఉద్యోగులను.. ఇలా ప్రతీవర్గాన్ని మోసం చేస్తూనే ఉన్నారన్నారు. నిరుద్యోగ భృతి గురించి బడ్జెట్ ప్రసంగంలో ఎక్కడా లేదని విమర్శించారు.

ఓం.. భూం.. బుష్

బడ్జెట్‌పై బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: 'ఆర్థికమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ డొల్ల అని తేలిపోయింది. గత బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులను పరిశీలిస్తే పొంతనే లేదు. అయినా, కేటాయింపులు పెంచి తెలంగాణ ప్రజలను దారుణంగా మోసం చేసేందుకు బడ్జెట్‌ను సాధనంగా ఉపయోగించుకోవడం సిగ్గుచేటు' అని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ విమర్శించారు. మొత్తంగా అబద్ధాలు, అంకెల గారడీ, 6 గ్యారంటీలకు పాతరేసేలా రాష్ట్ర బడ్జెట్ ఉందని.. ఓం..భూం.. బుష్ అంటూ మాయ చేసేందుకే ప్రయత్నిస్తున్నట్టు స్పష్టంగా కన్పిస్తోందన్నారు. రాష్ట్ర బడ్జెట్‌పై బండి సంజయ్ తన స్పందనను ఒక ప్రకటనలో తెలియజేశారు. 'అబద్ధాల్లో, అంకెల్లో, అప్పుల్లో, దోపిడీలో నాటి బీఆర్‌ఎస్ సర్కార్‌ను కాంగ్రెస్ మించిపోయింది. 6 గ్యారంటీలపై ఆశలు వదులుకునేలా బడ్జెట్ తీరు ఉంది. విద్య, వైద్య రంగాలకు కేటాయింపులు దారుణం. అభయహస్తం కాదు..మహిళల పాలిట శూన్య హస్తమని నిరూపించిన బడ్జెట్. 2 లక్షల ఉద్యోగాల భర్తీ, రూ.4 వేల నిరుద్యోగ భృతి ఊసేలేదు. వృద్ధుల పింఛన్ పెంపును గాలికొదిలేశారు. రైతుకిచ్చిన హామీలన్నీ హుష్‌కాకి. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బిల్లులన్నీ ఇక ఎగవేసినట్టేనా? ఎస్సీ, ఎస్టీ, బీసీలకంటే మీకు మైనారిటీలే ముఖ్యమా'అని సంజయ్ ప్రశ్నించారు. మహిళలకు నెలనెలా రూ.2,500, తులం బంగారం, స్కూటీ ఇస్తామని చెప్పి బడ్జెట్‌లోనూ ఆ ప్రస్తావన తీసుకురాకపోవడం దుర్మార్గమన్నారు.

ప్రవచనాలు ఎక్కువ పైసలు తక్కువ

ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్: బడ్జెట్‌లో ప్రవచనాలు ఎక్కువ పైసలు తక్కువగా ఉన్నాయని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ప్రభుత్వం రూ. 30 వేల కోట్లు అప్పు కట్టామని చెప్పగా, రూ.లక్షా 40 వేల కోట్లు కట్టామని సీఎం చెబుతున్నారని, ఇదంతా అబద్ధమని బడ్జెట్ లెక్కలతో తేలిపోయిందని విమర్శించారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి కేసీఆర్ రూ.4 లక్షల 37 వేల కోట్లు అప్పు చేశారని బడ్జెట్‌లో చెప్పారని, బయటనేమో రూ. 7 లక్షల కోట్లు అప్పు తెచ్చినట్లు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ. లక్షా 58 వేల కోట్లు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభలోనే చెప్పారని ఆమె అన్నారు.

6 గ్యారంటీలు గోవిందా గోవిందా!



అసెంబ్లీ మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేటీఆర్

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
బడ్జెట్‌లో వాటి ఊసే లేదు.. జాబ్ కేలండర్ ప్రస్తావనా లేదు
సంక్షేమానికి సమాధి.. అభివృద్ధి అడ్రస్ గల్లంతు
కరోనా వైరస్ కంటే కాంగ్రెస్ వైరస్ ప్రమాదం

సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్ర బడ్జెట్‌లో జాబ్ కేలండర్‌తో పాటు ఆరు గ్యారంటీల ఊసే లేదు. ఇక వాటి అమలు గోవిందా.. గోవిందా అంటూ బడుగు, బలహీన వర్గాలను మోసం చేసేలా బడ్జెట్ ఉంది. ఆరు గ్యారంటీలు, నూరు రోజులు అని సొల్లు పురాణం చెప్పి, అఫిడవిట్లు రాసి.. ఇవి భగవద్గీతతో సమానం అంటూ అబద్ధాలతో ఓట్లు వేయించుకొని వాటికి పాతరేశారు. ఒక్క హామీ కూడా అమలు కాలేదు. తులం బంగారం, మహాలక్ష్మికి దిక్కు లేదు. మహిళలకు రూ.2,500 ఇస్తామని, పెద్దలకు రూ.4 వేల పింఛను ఇస్తామని ఓట్లు వేయించుకుని గెలిచి మోసం చేశారు. 420 హామీలు గురించి బడ్జెట్‌లో కనీసం ప్రస్తావించలేదు. ఇది ప్రజల కష్టాలను తీర్చే బడ్జెట్ కాదు.. ఢిల్లీకి మూటలు పంపే బడ్జెట్. సంక్షేమానికి సమాధి..అభివృద్ధి అడ్రస్ గల్లంతు లాగా ఈ బడ్జెట్ కనిపిస్తోంది..' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ధ్వజమెత్తారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఆయన మాట్లాడారు.

దమ్ముంటే రాహుల్ అశోక్‌నగర్ రావాలి

'ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు గురించి అతీగతీ లేదు. ఫుడ్ డెలివరీ చేసే బాయ్స్ కోసం గిగ్ వర్కర్స్ బోర్డు పెడతామని చెప్పి మోసం చేశారు. అంబేడ్కర్ అభయహస్తం కింద రూ.12 లక్షలు ఇస్తామని దళితులకు వెన్నుపోటు పొడిచారు. అధికారంలోకి రాగానే తొలి ఏడాది 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని విస్మరించారు. కేసీఆర్ ఉద్యోగాల ప్రక్రియ పూర్తి చేస్తే కాగితాలు ఇచ్చి వాళ్లు ఉద్యోగాలు ఇచ్చినట్టు కాంగ్రెస్ పెద్దలు గొప్పలు చెప్పుకుంటున్నారు అశోక్‌నగర్‌లో చాయ్ తాగుతూ 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని రాహుల్‌గాంధీ పోజులు కొట్టారు. దమ్ముంటే రాహుల్‌గాంధీ అశోక్‌నగర్‌కు వచ్చి ఉద్యోగాల భర్తీ ఏమైందో చెప్పాలి..' అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం

'తెలంగాణ ఆర్థిక వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం పేకమేడల్లా ఛిన్నాభిన్నం చేసింది కరోనా వైరస్ కంటే కాంగ్రెస్ వైరస్ ప్రమాదం. ఇది బడ్జెట్ ద్వారా స్పష్టంగా కనబడుతోంది. పదేళ్లలో కేసీఆర్ రూ.4.17 లక్షల కోట్లు అప్పుచేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఒకటే ఏడాదిలో లక్షా 60 వేల కోట్లు అప్పు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వ 20 శాతం కమీషన్ పాలన దేశానికి సిగ్గుచేటు. రుణమాఫీ చేశామని సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారు. రాష్ట్రంలోని ఏ గ్రామంలోనైనా 100 శాతం రుణమాఫీ జరిగిందని నిరూపిస్తే మా శాసనసభ సభ్యత్వాలను వదులుకుంటాం. రైతు కూలీలకు రూ.12 వేలు ఇచ్చినట్లు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధం..' అని మాజీమంత్రి సవాల్ చేశారు.

భట్టి బడ్జెట్ బడా జూటా

సాక్షి, హైదరాబాద్: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం శాసనసభలో ప్రవేశ పెట్టిన వార్షిక బడ్జెట్ అబద్ధాలు, అసత్యాలతో రాజకీయ ప్రసంగాన్ని తలపించిందని బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు మండిపడ్డారు. 'భట్టి బడ్జెట్ బడా జూటా' అని విమర్శించారు. అసెంబ్లీలో భట్టి బడ్జెట్ ప్రసంగం అనంతరం హరీశ్‌రావు అసెంబ్లీ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ లోపలా, బయటా అబద్ధాలే మాట్లాడుతున్నారనేందుకు బడ్జెటే ఉదాహరణ అని విమర్శించారు. '72 పేజీల బడ్జెట్ ప్రసంగంలో ఆరు గ్యారంటీల ప్రస్తావన లేదు. మహాలక్ష్మి, చేయూత, పెన్షన్, రుణమాఫీ వంటి అనేక అంశాల ఊసే లేదు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం చెప్పిన అబద్ధాలు బడ్జెట్ ప్రసంగంలో బయటపడ్డాయి. సామాజిక పింఛన్లలో 1.50 లక్షలు కోత విధించారు' అని విమర్శించారు.



అసెంబ్లీ బయటా లోపలా సీఎం రేవంత్‌వన్నీ అబద్ధాలే
ఆరు గ్యారంటీలపై ఆశ లేదు.. మహాలక్ష్మి ఊసులేదు
2025-26 బడ్జెట్‌పై బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు విమర్శ

జీఎస్‌డీపీ వృద్ధి రేటు తగ్గుముఖం

గతంలో 12.9 శాతంగా ఉన్న రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధిరేటు, కాంగ్రెస్ పాలనలో 2.8 శాతం తగ్గి 10.1 శాతానికి పడిపోయిందని హరీశ్‌రావు విమర్శించారు. అప్పులు అంటూ పదే పదే చెప్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. బడ్జెట్ పుస్తకాల్లో రెవెన్యూ మిగులు రాష్ట్రంగా చూపారని ఎద్దేవా చేశారు. తెలంగాణను తాగుబోతుల రాష్ట్రంగా మార్చుతూ మహిళల పుస్తెల తాళ్లు తెంచుతున్నారని మండిపడ్డారు. ఎక్సైజ్ విభాగం ద్వారా ఈ ఏడాది ఏకంగా రూ.50 వేల కోట్ల రాబడిని ఆశించడమే దీనికి నిదర్శనమని అన్నారు. బీసీలకు రూ.20 వేల కోట్లతో సబ్ ప్లాన్ ఏర్పాటు చేస్తామన్న కాంగ్రెస్ హామీకి బడ్జెట్‌లో చోటు దక్కలేదని విమర్శించారు. 'మహిళలకు రూ.లక్ష కోట్లు వడ్డీ లేని రుణం ఇస్తామని ప్రకటించి, రూ.5 లక్షల లోపు రుణాలకు మాత్రమే వర్తిస్తుందని చెప్తూ ప్రభుత్వం మోసగించింది. స్కూల్ విద్యార్థుల యూనిఫారాల కుట్టు కూలీ రూ.75గా చెప్తూ రూ.50 మాత్రమే ఇస్తున్నారు. మైనారిటీ గురుకుల పాఠశాలలను ఇంటిగ్రేటెడ్ స్కూళ్లలో విలీనం చేయటం ద్వారా మైనారిటీలకు అన్యాయం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ బడ్జెట్ ప్రసంగం అబద్ధాల కుప్పగా మారింది' అని దుయ్యబట్టారు.

బడ్జెట్ సమగ్ర స్వరూపం (రూ.కోట్లలో)

పద్దు	2024-25 (ప్రతిపాదన)	2024-25 (సవరించిన అంచనా)	2025-26 (ప్రతిపాదన)
ఏ. రెవెన్యూ ఆదాయం	2,21,242.23	2,02,107.69	2,29,720.62
ప్రారంభ నిల్వ	-4,886.56	-1.46	672.72
కేంద్ర పన్నుల్లో వాటా	26,216.38	27,050.25	29,899.77
రాష్ట్ర పన్నుల ఆదాయం	1,38,181.26	1,29,406.75	1,45,419.58
పన్నేతర ఆదాయం	35,208.44	25,814.54	31,618.77
గ్రాంట్స్ ఇన్ ఎయిడ్	21,636.15	19,836.15	22,782.50
బి. మూలధన ఆదాయం	69,572.48	64,501.00	74,645.92
బహిరంగ మార్కెట్ రుణాలు	57,112.48	56,940.00	64,539.00
కేంద్ర రుణాలు	3,900.00	2,500.00	4,000.00
ఇతర రుణాలు	1,000.00	1,000.00	1,000.00
నగదు డిపాజిట్ల లావాదేవీలు	4,000.00	4,500.00	4,000.00
రుణాల అడ్వాన్సులు	3,560.00	61.00	1,106.92
మొత్తం ఆదాయం (ఏ+బి)	2,90,814.71	2,66,608.69	3,04,366.55

వ్యయం అంచనాలివీ..

పద్దు	2024-25 (ప్రతిపాదన)	2024-25 (సవరించిన అంచనా)	2025-26 (ప్రతిపాదన)
రెవెన్యూ వ్యయం	2,20,944.81	1,96,218.98	2,26,982.29
మూలధన వ్యయం	33,486.50	33,087.85	36,504.45
రుణాల అడ్వాన్సులు	19,626.32	19,626.32	21,350.55
ప్రజారుణ చెల్లింపులు	13,117.60	13,117.60	15,848.20
కేంద్ర రుణాల చెల్లింపులు	397.66	397.66	440.85
ఇతర రుణాల చెల్లింపులు	3,486.10	3,486.10	3,738.66
మొత్తం వ్యయం	2,91,159.00	2,66,034.51	3,04,965.00

ద్రవ్యలోటు, రెవెన్యూ మిగులు లెక్కలివీ..


పద్దు	2024-25 (ప్రతిపాదన)	2024-25 (సవరించిన అంచనా)	2025-26 (ప్రతిపాదన)
ముగింపు నిల్వ	-5,130.85	672.72	174.27
రెవెన్యూ మిగులు	297.42	5,888.71	2,738.33
ద్రవ్య లోటు	49,255.41	46,764.46	54,009.74
ప్రాథమిక లోటు	31,525.63	29,034.69	34,640.72

సాక్షి
గురువారం । 20 । మార్చి । 2025 । హైదరాబాద్ । www.sakshi.com


2025-26 పద్దు



ప్రధాన రంగాలు/ శాఖల వారీగా కేటాయింపులు ఇవీ.. (రూ.కోట్లలో)



సామాజిక, ఆర్థిక సర్వే



రాష్ట్ర వృద్ధిరేటు 10.1%!

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్డీపీ) ప్రస్తుత ధరల వద్ద 2024-25లో 10.1 శాతం వృద్ధి నమోదు చేయనుంది. ఇదే కాలంలో దేశ స్థూల జాతీయోత్పత్తి(జీడీపీ) వృద్ధి రేటు 9.9 శాతానికే పరిమితం కానుంది. రాష్ట్ర జీఎస్డీపీ విలువ రూ.16,12,579 కోట్లు ఉండనుండగా, జీడీపీ విలువ రూ.3,31,03,215 కోట్లు ఉండనుంది. స్థిర ధరల వద్ద రాష్ట్ర జీఎస్డీపీ 6.8 శాతం వృద్ధిని నమోదు చేయనుండగా, దాని విలువ రూ.8,16,835 కోట్లుగా ఉంటుందని అంచనా. స్థిర ధరల వద్ద జీడీపీ 6.5 శాతం వృద్ధి నమోదు చేయనుండగా, దాని విలువ రూ.1,87,95,095 కోట్లు ఉండనుంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బుధవారం శాసనసభలో 'తెలంగాణ ఆర్థిక సామాజిక సర్వే 2025' నివేదికను ప్రవేశపెట్టారు. కేంద్ర అర్థగణాంక, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ వేసిన ముందస్తు అంచనాల ప్రకారం..2024-25లో జాతీయ, రాష్ట్ర వృద్ధి రేటు అంచనాలను ప్రభుత్వం ఇందులో వెల్లడించింది.



తలసరి ఆదాయంలో 9.6% వృద్ధి

రాష్ట్ర తలసరి ఆదాయం ప్రస్తుత ధరల వద్ద 2024-25లో 9.6 శాతం వృద్ధితో రూ.3,79,751కు పెరగనుందని అంచనా. ఇదే కాలంలో జాతీయ తలసరి ఆదాయం రూ.2,05,579కే పరిమితం కానుంది. జాతీయ స్థాయితో పోల్చితే రాష్ట్ర తలసరి ఆదాయం 1.8 రెట్లు అధికం కావడం గమనార్హం. రాష్ట్రం మెరుగైన జీవన ప్రమాణాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ఆర్థికాభివృద్ధిని కలిగి ఉందని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి.

జీడీపీ/జీఎస్డీపీ అంటే?

ఒక ఆర్థిక సంవత్సరంలో దేశం/ రాష్ట్రం ఉత్పత్తి చేసిన వస్తు, సేవల మొత్తం విలువే జీడీపీ/జీఎస్డీపీ. దేశం, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ముఖ్య కొలమానంగా వీటిని పరిగణిస్తారు.



ఉద్యోగ కల్పనలో వ్యవసాయమే టాప్


జూలై 2023-జూన్ 2024 మధ్యకాలంలో నిర్వహించిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) ప్రకారం రాష్ట్రంలో 42.7 శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలను ప్రాథమిక రంగాలైన వ్యవసాయ, అనుబంధ రంగాలే కల్పిస్తున్నాయి. సేవల రంగం (తృతీయ రంగం) 34.8 శాతం, ద్వితీయ రంగం 22.5 శాతం అవకాశాలు కల్పిస్తున్నాయి. ఇక రాష్ట్రంలోని మొత్తం మహిళా ఉద్యోగుల్లో 23.9 శాతం, మొత్తం పురుష ఉద్యోగుల్లో 41.5 శాతం సేవల రంగంలోనే పనిచేస్తున్నారు.

భవిష్యత్తు ఈ రంగాలదే..

హైదరాబాద్‌లో 30 వేల మంది విజువల్ ఎఫెక్ట్స్ (వీఎఫ్ఎక్స్), గేమింగ్, యానిమేషన్ వంటి ఎమర్జింగ్ రంగాల్లో పనిచేస్తుండగా, రానున్న సంవత్సరాల్లో ఈ సంఖ్య లక్షకు పెరగనుందని అంచనా.

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆరు గ్యారంటీల పేరుతో రాష్ట్ర ప్రజలకిచ్చిన హామీలతో పాటు మహిళలు, రైతులు, విద్యార్థులకు వర్తించే ఇతర సంక్షేమ పథకాలకు ప్రాధాన్యత ఇస్తూ 2025-26 సంవత్సరానికి బడ్జెట్ కేటాయింపులు చేసినట్టు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. విద్య, వైద్యం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం తదితర రంగాలకు చూపెట్టిన గణాంకాలను చూస్తే ఈ విషయం స్పష్టమవుతుందని అంటున్నాయి. ఆరు గ్యారెంటీలతో పాటు అన్ని సంక్షేమ పథకాలకు కలిపి ఈసారి బడ్జెట్‌లో రూ.90,500 కోట్లు ప్రతిపాదించినట్లు వెల్లడించాయి. ఆరు గ్యారంటీల కింద రూ.56,084 కోట్లు, స్కాలర్ షిప్‌లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, రాజీవ్ యువ వికాసం (కొత్త పథకం), డైట్ చార్జీలు, రైతు బీమా, డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు, విద్యుత్ సబ్సిడీలు, రేషన్ బియ్యానికి మరో రూ. 34,416 కోట్లు ప్రతిపాదించినట్లు చెబుతున్నాయి. ఆరు గ్యారంటీల్లో భాగంగా రైతు భరోసా, చేయూత, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, గృహలక్ష్మి, గృహజ్యోతి, సన్న ధాన్యానికి బోనస్, రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలకు నిధులు కేటాయించినట్లు ఆ వర్గాలు వివరిస్తున్నాయి.

\- సాక్షి, హైదరాబాద్



తగినంత గ్యారంటీ

సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.90 వేల కోట్లు కేటాయించామంటున్న ప్రభుత్వ వర్గాలు

ఆరు గ్యారంటీలకు రూ. 56,000 కోట్లు..

ఇతర సంక్షేమ పథకాలకు రూ. 35,000 కోట్లు..

- రేషన్ షాపుల్లో సన్న బియ్యం, రాజీవ్ యువ వికాసం లాంటి కొత్త పథకాలకు నిధులు
- రైతు బీమా, వడ్డీలేని రుణాలు, కల్యాణలక్ష్మి కొనసాగింపు
- సొంత పన్నుల ఆదాయం, అప్పులపైనే ఆశలు

రుణ సేకరణ లక్ష్యమూ పెరిగింది

అప్పుల విషయానికి వస్తే 2024-25లో ప్రతిపాదించిన మొత్తానికి రూ.7,500 కోట్లు అదనంగా రూ.69 వేల కోట్లకు పైగా సమీకరించాలని ఈ బడ్జెట్‌లో లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో బహిరంగ మార్కెట్ రుణాలు రూ.64,539 కోట్లు కాగా, కేంద్రం నుంచి, ఇతర రుణాలు కలిపి మొత్తం రూ.69 వేల కోట్లు చూపెట్టారు. ఇది మొత్తం బడ్జెట్‌లో 21 శాతం కంటే ఎక్కువ కావడం గమనార్హం. అప్పులు తీసుకోవడంతో పాటు అప్పులు చెల్లించే పద్దును కూడా ఈసారి పెంచారు. గతంలో చేసిన అప్పులకు వడ్డీ, అసలు చెల్లింపు కింద రూ. 35,217 కోట్లు చూపెట్టారు. ఇది మొత్తం బడ్జెట్‌లో దాదాపు 11.5 శాతం.

విద్య, వైద్యానికి కాస్త ఎక్కువగా..

ప్రధాన శాఖల వారీగా పరిశీలిస్తే విద్యా శాఖకు గత ఏడాది కంటే రూ.2 వేల కోట్లు అధికంగా రూ.23 వేల కోట్ల వరకు ప్రతిపాదించారు. వైద్యరంగానికి గత ఏడాది కంటే రూ.800 కోట్లు అధికంగా రూ.12,393 కోట్లు ప్రతిపాదించారు. రైతు రుణమాఫీ చేసిన నేపథ్యంలో వ్యవసాయ రంగానికి గత ఏడాది కంటే కొంచెం తక్కువ నిధులను కేటాయించారు. గత ఏడాది వ్యవసాయ శాఖకు రూ.26,500 కోట్లు ప్రతిపాదించగా, ఈసారి రూ.24,500 కోట్లు చూపెట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖలకు కలిపి ఈసారి రూ.34,070 కోట్లు కేటాయించారు. గ్రామీణాభివృద్ధి శాఖకు రూ. 31,605 కోట్లను ప్రతిపాదించారు. ఈసారి కల్యాణలక్ష్మి పథకానికి ప్రత్యేకంగా రూ.3,683 కోట్లు, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, డైట్ చార్జీల కింద రూ.7 వేల కోట్లకు పైగా నిధులు చూపెట్టారు. ఇందిరమ్మ ఇళ్లకు రూ.12 వేల కోట్లు, ఆర్టీసీకి రూ.4,305 కోట్లు కేటాయించారు.

పెరిగిన పన్ను ఆదాయం అంచనాలు

బడ్జెట్‌లో పేర్కొన్న రెవెన్యూ రాబడుల గణాంకాలను పరిశీలిస్తే..ఈసారి రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం పద్దు భారీగా కనిపిస్తోంది. గత బడ్జెట్‌తో పోలిస్తే సుమారు రూ.7 వేల కోట్లు అదనంగా పన్ను రాబడుల కింద చూపెట్టారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.1.38 లక్షల కోట్ల పన్ను ఆదాయ ప్రతిపాదనలు చేయగా, రూ.1.29 లక్షల కోట్లు వసూలు అయ్యాయి. ఈ నేపథ్యంలో ఈసారి రూ.1.45 లక్షల కోట్లను రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం కింద చూపెట్టినట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. కేంద్ర పన్నుల్లో వాటాను కలుపుకొంటే ఈ ఆదాయ గణాంకాలు రూ.1.75 లక్షల కోట్లకు చేరాయి. వీటికి తోడు పన్నేతర ఆదాయం, గ్రాంట్ ఇన్ ఎయిడ్‌లను కలిపి మొత్తం రూ.2.29 లక్షల కోట్ల రెవెన్యూ రాబడులను ప్రతిపాదించారు. గత ప్రతిపాదనల కంటే ఇది రూ.8 వేల కోట్లు ఎక్కువ. గత బడ్జెట్‌లో రూ.2.21 లక్షల కోట్లు రెవెన్యూ రాబడుల కింద చూపెట్టగా, సవరించిన అంచనాల ప్రకారం ఇది రూ.2.02 లక్షల కోట్లు మాత్రమే వచ్చింది. అంటే రెవెన్యూ రాబడులు అంచనాల కంటే రూ.20 వేల కోట్లు తగ్గాయి. అయినా, ఈసారి రెవెన్యూ రాబడులను రూ.2.29 లక్షల కోట్లుగా ప్రతిపాదించారు.


సవరణల బడ్జెట్‌లో భారీ వ్యత్యాసం

2024-25 ఆర్థిక సంవత్సరం సవరించిన అంచనాలను పరిశీలిస్తే ప్రతిపాదనలకు, సవరణల బడ్జెట్‌కు మధ్య భారీ వ్యత్యాసం కన్పిస్తోంది. 2024-25 వార్షిక బడ్జెట్‌లో మొత్తం వ్యయం రూ.2,91,059 కోట్లుగా ప్రతిపాదించగా, సవరించిన అంచనాల మేరకు అది రూ.2,66,034.51 కోట్లకు తగ్గింది. ఈ సవరించిన అంచనాలకు మరో రూ.40 వేల కోట్లను కలిపి ఈసారి బడ్జెట్ మొత్తం వ్యయాన్ని రూ.3,04,965 కోట్లుగా ప్రతిపాదించారు. పన్ను రాబడుల కింద రూ.1.38 లక్షల కోట్లు వస్తాయని 2024-25 బడ్జెట్‌లో ప్రతిపాదించగా, సవరించిన బడ్జెట్‌లో అది రూ.1.29 లక్షల కోట్లకు తగ్గింది. పన్నేతర ఆదాయం రూ.35 వేల కోట్ల వరకు వస్తుందని అంచనా వేయగా, రూ.10 వేల కోట్ల మేర తగ్గి రూ.25 వేల కోట్లుగా నమోదైంది. 2024-25లో రూ.21,636 కోట్లు గ్రాంట్ ఇన్ ఎయిడ్ పద్దు కింద వస్తాయని అంచనా వేయగా, రూ.19,836 కోట్లు మాత్రమే సమకూరినట్లు సవరించిన అంచనాలు వెల్లడిస్తున్నాయి. అప్పుల కింద 2024-25లో ప్రతిపాదించిన మొత్తంలో సింహభాగం సమకూరింది. అన్ని రకాల రుణాలు కలిపి రూ.62 వేల కోట్ల వరకు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకోగా, రూ.60 వేల కోట్లకు పైగా సమకూరాయి.

అప్పుల పద్దు.. మరింత!

తాజా బడ్జెట్‌లో రుణాల సేకరణ లక్ష్యం రూ.69,539 కోట్లు

గత బడ్జెట్‌తో పోలిస్తే రూ.7,500 కోట్లు పెరుగుదల



సాక్షి, హైదరాబాద్

రాష్ట్ర అప్పుల పద్దు ఈసారి కూడా పెరిగిపోయింది. 2024-25 బడ్జెట్ కంటే రూ.7,500 కోట్లు ఎక్కువగా.. 2025-26లో రూ. 69,539 కోట్ల రుణ సమీకరణను ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందులో రూ.64,539 కోట్లు బహిరంగ మార్కెట్ రుణాలు కాగా.. రూ.4 వేల కోట్లు కేంద్ర ప్రభుత్వం నుంచి, మరో రూ.1,000 కోట్లను ఇతర రూపాల్లో సమీకరించనుంది. 2024-25లో రూ.62,012 కోట్ల రుణాలను లక్ష్యంగా పెట్టుకోగా.. సవరించిన అంచనాల ప్రకారం రూ.60,440 కోట్లకు తగ్గుతున్నట్టు ప్రభుత్వం పేర్కొంది.

గత అప్పుల చెల్లింపులకు అధికంగానే..


పాత అప్పుల తిరిగి చెల్లింపులకు కూడా ఈసారి బడ్జెట్‌లో భారీ పద్దునే చూపెట్టారు. ఈసారి రుణ లక్ష్యంలో సగం మేర అంటే సుమారు రూ.35వేల కోట్లు పాత అప్పుల అసలు, వడ్డీల కింద చెల్లించాల్సి ఉండనుంది. బడ్జెట్‌లో ప్రజారుణం పద్దు కింద రూ.15,848 కోట్లు చూపారు. ఇవి అప్పుల అసలు చెల్లించేందుకు ప్రతిపాదించగా, వడ్డీల చెల్లింపుకోసం మరో రూ.19,369 కోట్లు చూపారు.

ఏడాదికేడాది పెరుగుతూనే..

రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచీ అప్పుల చిట్టా పెరిగిపోతోందని.. ఏటికేడు రుణ పద్దు పెరుగుతోందన్న ఆందోళనకు తాజా బడ్జెట్ కూడా ఉపశమనం ఇవ్వలేదు. అప్పులు 2022-23లో రూ.44,060 కోట్లు, 2023-24లో రూ.52,576 కోట్లు, 2024-25లో రూ.60,440 కోట్లుకాగా.. ఈసారి రూ.69,539 కోట్లుగా ప్రతిపాదించారు. అంటే నాలుగేళ్లలో ఏటా చేస్తున్న అప్పుల పద్దు రూ.26 వేల కోట్ల మేర (50శాతానికిపైగానే) పెరగడం గమనార్హం.

నాలుగేళ్ల కిందటితో పోలిస్తే.. ఈసారి అప్పు 50% అధికం

గత మూడేళ్ల అప్పుల లెక్క ఇది



జీఎస్టీ రాబడి రూ. 59 వేల కోట్లు



సాక్షి, హైదరాబాద్: వస్తుసేవల పన్ను (జీఎస్టీ) రూపంలో రూ.59,704 కోట్లు సమకూరుతాయని రాష్ట్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో అంచనా వేసింది. ఇందులో రాష్ట్ర జీఎస్టీ (ఎస్‌జీఎస్టీ) కింద రూ.51,000 కోట్లు, కేంద్ర జీఎస్టీ (సీజీఎస్టీ)లో వాటా కింద రూ.8,090 కోట్లు అందుతాయని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) బడ్జెట్‌లో ఎస్‌జీఎస్టీ కింద రూ.50,762 కోట్లు, సీజీఎస్టీ కింద రూ.7,832 కోట్లు కలిపి మొత్తం రూ.58,594 కోట్లు వస్తాయని ప్రభుత్వం అంచనా వేసింది. అయితే సవరించిన అంచనాల్లో జీఎస్టీ రూపంలో రూ. 53,665 కోట్లు మాత్రమే సమకూరుతున్నట్టు పేర్కొంది. ఇందులో సీజీఎస్టీ అంచనాల కంటే కొంచెం ఎక్కువే రాగా, రాష్ట్ర జీఎస్టీ రూ.5 వేల కోట్ల మేర తగ్గడం గమనార్హం. అయినా ఈసారి గత ఏడాది ప్రతిపాదనల కంటే రూ. 250 కోట్లు ఎక్కువగా రూ.51 వేల కోట్లు ఎస్‌జీఎస్టీ వస్తుందని ప్రతిపాదించడం గమనార్హం. మరోవైపు కార్పొరేషన్ పన్ను కింద రూ.8,349 కోట్లు, ఆదాయ పన్ను కింద రూ. 11,140 కోట్లు, కస్టమ్స్ కింద రూ. 1,376 కోట్లు కేంద్రం నుంచి వస్తాయని ప్రభుత్వం బడ్జెట్ అంచనాల్లో పేర్కొంది.

బడ్జెట్ 2025-26లో అంచనా వేసిన రాష్ట్ర ప్రభుత్వం

రాష్ట్ర జీఎస్టీ (ఎస్‌జీఎస్టీ) కింద రూ.51,000 కోట్లు

లోటు భారీగానే..



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ద్రవ్యలోటు నానాటికీ పెరుగుతోందని బడ్జెట్ గణాంకాలు చెబుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి ఏకంగా రూ.54,009.74 కోట్లు లోటు ఉంటుందని ప్రభుత్వం అంచనా వేసింది. ప్రస్తుత (2024-25) ఆర్థిక సంవత్సరం ముగిసేసరికి ద్రవ్యలోటు రూ.46,764.46 కోట్లుగా నమోదుకానున్నట్టు సవరించిన అంచనాల్లో వెల్లడించింది. ఇక 2025-26లో ఖర్చులన్నీ పోను రూ.2,738 కోట్లు రెవెన్యూ మిగులు ఉంటుందని తాజా బడ్జెట్‌లో పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 5,888.71 కోట్లు రెవెన్యూ మిగులు ఉన్నట్టు సవరించిన అంచనాల్లో తెలిపింది. ఇక 2023-24లో రూ. 4,881 కోట్లు రెవెన్యూ మిగులు ఉంటుందని అప్పట్లో అంచనా వేసినా.. సవరించిన అంచనాల్లో అది రూ. 1,704.89 కోట్లకు తగ్గింది.

తొలిసారి రూ. 50 వేల కోట్లు దాటుతున్న ద్రవ్యలోటు

2025-26 ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి రూ. 54 వేల కోట్లకు చేరుతుందని అంచనా

తగ్గిన జీఎస్డీపీ వృద్ధి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్డీపీ) వృద్ధిలో తగ్గుదల నమోదయింది. 2023-24లో 11.1 శాతం వృద్ధి రేటు నమోదవగా.. 2024-25లో 10.1 శాతంగా నమోదైనట్టు ప్రభుత్వం అసెంబ్లీ ముందు పెట్టిన ఆర్థిక విధాన పత్రంలో వెల్లడించింది. గత ఏడాది తెలంగాణ జీఎస్డీపీ రూ.14,64,378 కోట్లుకాగా.. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.16,12,579 కోట్లుగా నమోదయింది. ఇక రాష్ట్ర తలసరి ఆదాయంలోనూ కొంత మేర తగ్గుదల కనిపించింది. 2023-24లో 10.3 శాతం వృద్ధితో తలసరి ఆదాయం రూ.3,46,457గా నమోదవగా.. 2024-25లో 9.6 శాతం వృద్ధితో రూ.3,79,751కి చేరింది. అంటే తలసరి ఆదాయం రూ.36 వేలకుపైగా పెరిగింది.

2023-24లో 11.1 శాతం వృద్ధి.. 2024-25లో 10.1 శాతంగా నమోదు

రూ.16 లక్షల కోట్లు దాటిన రాష్ట్ర స్థూల ఉత్పత్తి

రాష్ట్ర ప్రధాన ఆర్థిక సూచీ గణాంకాలివీ.. (శాతాల్లో)

సూచీ	2023-24	2024-25
జీఎస్డీపీలో స్థూల ద్రవ్యలోటు	3.41	2.90
స్థూల ద్రవ్యలోటులో రెవెన్యూ మిగులు	1.56	12.59
జీఎస్డీపీలో రెవెన్యూ మిగులు	0.05	0.37
జీఎస్డీపీలో మొత్తం అప్పులు	27.57	27.98
రెవెన్యూ ఆదాయంతో పోలిస్తే అప్పులు	238.44	223.25
సొంత పన్ను రాబడులతో పోలిస్తే అప్పులు	297.65	290.68
రెవెన్యూ వ్యయంలో సొంత పన్నుల రాబడులు	80.48	79.11
రెవెన్యూ రాబడుల్లో వడ్డీల చెల్లింపులు	14.38	8.77
రెవెన్యూ రాబడుల్లో జీతాల చెల్లింపులు	23.62	20.16
రెవెన్యూ రాబడుల్లో పింఛన్ల చెల్లింపులు	9.95	5.76
మొత్తం పన్ను రాబడులతో పోలిస్తే పన్నేతర ఆదాయం	14.07	12.77

మూలధన వ్యయం రూ. 36 వేల కోట్లు





సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బడ్జెట్ పరిమాణంలో దాదాపు 12 శాతాన్ని ప్రభుత్వం మూలధన వ్యయం కింద చూపింది. 2025-26 బడ్జెట్‌లో రూ.36,504.45 కోట్లను మూలధన వ్యయం కింద ప్రతిపాదించింది. ఇది 2024-25 బడ్జెట్ ప్రతిపాదనలతో పోలిస్తే రూ.3 వేల కోట్లు ఎక్కువ. 2024-25 బడ్జెట్‌లో రూ.33,486.50 కోట్లను ఈ పద్దు కింద ప్రతిపాదించగా.. సవరించిన అంచనాల ప్రకారం రూ.33,087.85 కోట్లు ఖర్చవుతోంది. ఈసారి మూలధన వ్యయంలో రూ.12,652 కోట్లు సాగునీటి శాఖ పరిధిలోనే ఖర్చు చేయనున్నట్టు ప్రభుత్వం పేర్కొంది. రూ.3,859 కోట్లు గ్రామీణాభివృద్ధి, రూ.3,431.47 కోట్లు రవాణా, రూ.3,458 కోట్లు ఆర్థిక సేవల రంగాల్లో వ్యయం అవుతుందని ప్రతిపాదించింది. సాధారణ సేవలు, సాంఘిక సేవల రంగాల్లో మిగతా మొత్తం ఖర్చవుతుందని అంచనా వేసింది.

గత బడ్జెట్ కంటే రూ. 3 వేల కోట్లు అదనం

ఒక్క సాగునీటి శాఖలోనే మూలధన ఖర్చు రూ.12,652 కోట్లు

2025-26 పద్దు





సామాజిక, ఆర్థిక సర్వే



ఆర్థికాభివృద్ధికి ఐటీ దన్ను

తృతీయ రంగంలో కీలకమైన ఐటీ రంగం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దన్నుగా నిలిచింది. ఆర్థిక వ్యవస్థను ప్రాథమిక, ద్వితీయ, తృతీయ రంగాలుగా విభజించి ఏ రంగం ఎంత విలువను జోడించిందో (గ్రాస్ వాల్యూ యాడెడ్/జీవీఏ) లెక్కిస్తారు. పరిశ్రమలు, టెక్నాలజీని ప్రోత్సహించడానికి బడ్జెట్‌లో చేసిన కేటాయింపులు దీనికి దోహదపడ్డాయి. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి 66.3 శాతం చేయూత తృతీయ రంగమే అందిస్తుండగా, ప్రాథమిక, ద్వితీయ రంగాల వాటాలు 17.3 శాతం, 16.4 శాతంగా ఉండనున్నట్లు సామాజిక ఆర్థిక సర్వే అంచనా వేసింది.



ప్రాథమిక రంగంలో వ్యవసాయం, అనుబంధ రంగాలు, మైనింగ్, క్వారియింగ్ వస్తాయి. ప్రాథమిక రంగం 5.5 శాతం వృద్ధి రేటుతో రాష్ట్ర జీఎస్డీపీకి రూ.2,56,498 కోట్ల విలువను జోడించనుందని అంచనా.

ద్వితీయ రంగంలో పరిశ్రమలు, తయారీ, నిర్మాణం, విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా, ఇతర సేవలు రానుండగా, ఈ రంగం 7.6 శాతం వృద్ధి రేటుతో రూ.2,43,081 కోట్ల విలువను జోడించనుందని అంచనా.

ఇక తృతీయ రంగంలో వాణిజ్యం, మరమ్మతు సేవలు, హోటళ్లు, రెస్టారెంట్లు, రవాణా, స్టోరేజీ, కమ్యూనికేషన్, ప్రసార సేవలు, ఆర్థిక సేవలు, స్థిరాస్తి, గృహాల యాజమాన్యం, వృత్తి సేవలు, ప్రజాపాలన వంటి సేవలు రానుండగా, ఈ రంగం 11.2 శాతం వృద్ధి రేటుతో రూ.9,83,529 కోట్ల విలువను జోడించనుందని అంచనా. తృతీయ రంగంలోని స్థిరాస్తి, గృహాల యాజమాన్యం, వృత్తి సేవలు వంటి ఉపరంగాలు రాష్ట్ర జీఎస్డీపీకి ఏకంగా 24.9 శాతం విలువ (గ్రాస్ స్టేట్ వాల్యూ యాడెడ్/జీఎస్‌వీఏ)ను జోడిస్తుండగా, వాణిజ్యం, రిపేర్, హోటళ్లు, రెస్టారెంట్లు 18.2 శాతం, రవాణా, స్టోరేజీ, కమ్యూనికేషన్, ప్రసార సేవలు 7.5 శాతం, ఆర్థిక సేవలు 5 శాతం, ప్రజాపాలన 2.9 శాతం, ఇతర సేవలు 7.9 శాతం విలువను జోడిస్తున్నాయి.



సేవల రంగంలో భాగమైన స్థిరాస్తి, గృహాల యాజమాన్యం, వృత్తిసేవలు 15.4 శాతం వృద్ధితో ముందంజలో ఉండనుండగా, ఇతర సేవలు 11.7 శాతం, వాణిజ్యం, రిపేర్లు, హోటళ్లు, రెస్టారెంట్లు 11.1 శాతం వృద్ధిని నమోదు చేయనున్నాయి.



యువజనాభ్యుదయం, పర్యాటక శాఖకు రూ.1,411 కోట్లు

తాజా బడ్జెట్‌లో పర్యాటక శాఖకు ప్రభుత్వం రూ.775 కోట్లు కేటాయించింది. పర్యాటక ప్రాంతాల్లో అభివృద్ధి పనులను పీపీపీ పద్ధతిలో నిర్వహించాలని నిర్ణయించినందున ప్రైవేట్ నిధులు వస్తాయని అంచనా వేస్తోంది. దీంతో ప్రభుత్వపరంగా పరిమిత మొత్తంలోనే నిధులు కేటాయించింది. దీంతోపాటు యువజనాభ్యుదయం, పురావస్తు, సాంస్కృతిక విభాగాలకు కలిపి రూ.1,411 కోట్లు కేటాయించింది. దేవాదాయ శాఖకు రూ.190 కోట్లు ప్రతిపాదించింది.

అంకెల్లో పెరిగింది శాతంలో తగ్గింది


2025-26 బడ్జెట్‌లో విద్యకు **రూ.23,108 కోట్లు**

రూ.1,816 కోట్లు గత బడ్జెట్‌తో పోలిస్తే అధికంగా కేటాయించింది

7.57% మొత్తం బడ్జెట్‌లో కేటాయింపు

7.77% 2024-25 బడ్జెట్‌లో కేటాయించింది

పాఠశాల విద్యకు 13,763 కోట్లు పెరిగినా 10 వేల మంది కొత్త టీచర్ల జీతాలకే ఇది చెల్లు



తాజా బడ్జెట్‌లో ప్రభుత్వం విద్యా రంగానికి రూ.23,108 కోట్లు కేటాయించింది. గత బడ్జెట్‌తో పోలిస్తే రూ.1,816 కోట్లు ఎక్కువని పేర్కొంది. మొత్తం బడ్జెట్‌లో విద్యాశాఖ వాటా 7.57 శాతంగా ఉంది. అయితే గత బడ్జెట్‌తో పోలిస్తే కేటాయింపు పెరిగినా, మొత్తం బడ్జెట్‌ను పరిగణనలోకి తీసుకుంటే ఈసారి కేటాయింపుల శాతం తగ్గింది. 2024-25 బడ్జెట్ మొత్తం రూ.2,74,058 కోట్లు. ఇందులో విద్యా రంగం కేటాయింపులు రూ.21,292 కోట్లు అంటే మొత్తం బడ్జెట్‌లో 7.77 శాతం. కానీ 2025-26 మొత్తం బడ్జెట్ రూ.3,04,965 కోట్లు. ఇందులో విద్యారంగానికి కేటాయింపులు రూ.23,108 కోట్లు. అంటే 7.57 శాతం. అంటే 2024-25తో పోల్చుకుంటే ఈసారి విద్యకు 0.20 శాతం మేర కేటాయింపులు తగ్గాయన్నమాట. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లల్లో మౌలిక సదుపాయాల కల్పన, డిజిటల్ విద్య, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో బోధన, విశ్వవిద్యాలయాల ఆధునీకరణ, బోధనా సిబ్బంది నియామకాలు, ఉన్నత విద్యలో సాంకేతిక పురోగతి, నైపుణ్యాభివృద్ధి కల్పన, ప్రభుత్వ వర్సిటీల పరిధిలో తీసుకొచ్చే కొత్త కంప్యూటర్ కోర్సులకు మౌలిక వసతులు కల్పనకు సరిపడా నిధుల కేటాయింపు జరగలేదని విద్యారంగ నిపుణులు అంటున్నారు.

విద్య పద్దులో ఇవీ కీలకాంశాలు..

పాఠశాల విద్యకు రూ.19,341.23 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌తో పోలిస్తే ఇది రూ.13,763 కోట్లు ఎక్కువ. కేటాయింపుల్లో 91 శాతం టీచర్లు, సిబ్బంది వేతనాలకే ఖర్చవుతుంది. గత ఏడాది కొత్తగా 10 వేల మంది టీచర్ల నియామకం చేపట్టారు. దీంతో వేతనాల ఖర్చు పెరగనుంది.

రాష్ట్ర వ్యాప్తంగా 26 వేల ప్రభుత్వ స్కూళ్ళున్నాయి. వీటిల్లో 3 వేల స్కూళ్ళల్లో డిజిటల్ విద్య, మరో 1,500 స్కూళ్ళల్లో ఏఐ టెక్నాలజీతో బోధన చేపడతామని ప్రభుత్వం తెలిపింది. తొలిదశలో రూ.50 కోట్లు ఖర్చవుతుందని విద్యాశాఖ అంచనా వేయగా..ప్రస్తుత బడ్జెట్‌లో రూ.40 లక్షలు కేటాయించారు. పరీక్షల నిర్వహణకు రూ.6 కోట్ల నుంచి రూ.7.50 కోట్లకు నిధులు పెంచారు.


ఉన్నత విద్యకు గత బడ్జెట్‌లో రూ.2,554.88 కోట్లు కేటాయించారు. ఈసారి రూ.506 కోట్లు పెంచి రూ.3,061.11 కోట్లు కేటాయించారు. ఇందులో ఉస్మానియా, మహిళా యూనివర్సిటీలు ఒక్కోదానికి రూ.100 కోట్లు చొప్పున ఇచ్చారు. కేటాయింపుల్లో రూ.2,500 కోట్లు సిబ్బంది వేతనాలు, నిర్వహణకే వెళ్తాయి. వర్సిటీల్లో 3 వేల బోధన సిబ్బంది ఖాళీలు భర్తీ చేయాల్సి ఉంది. మౌలిక సదుపాయాల కోసం కనీసం రూ.100 చొప్పున ఇవ్వాలని అన్ని వర్సిటీలు కోరాయి. కానీ రెండు వర్సిటీలు తప్ప అన్నింటికీ రూ.31 కోట్లు మాత్రమే దక్కాయి.

ఉన్నత విద్యలో సమూల మార్పుల దిశగా అనేక నివేదికలు రూపొందించారు. ఇప్పటికే వర్సిటీల్లో కొత్త కోర్సులు తీసుకొచ్చారు. కంప్యూటర్ అనుబంధ కోర్సులకు ప్రత్యేక మౌలిక వసతుల కల్పన అవసరం. వీటికోసం రూ.500 కోట్లు కావాలని ప్రతిపాదించినా వాటి ఊసు లేదు.

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటును ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న సంగతి తెలిసిందే. నియోజకవర్గానికి ఒకటి చొప్పున వీటిని ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. రూ.11,600 కోట్ల మంజూరుకు పాలనపరమైన అనుమతులూ ఇచ్చింది.

ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు రూ.2,900 కోట్లే..

కానీ ప్రస్తుత బడ్జెట్‌లో ఈ స్కూళ్ళ నిర్మాణానికి ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ.2,900 కోట్లే కేటాయించింది. ఒక్కో స్కూల్‌కు రూ.200 కోట్లు వెచ్చించినా, ఈ ఏడాది మొదలు పెట్టే స్కూళ్ళ సంఖ్య 15కు మించే అవకాశం లేదు. నైపుణ్యాభివృద్ధి దిశగా కాలేజీల్లో స్కిల్ కోర్సులు, ఏఐ విద్యా విధానం ప్రతిపాదనలు సిద్ధం చేసినా... వీటికి నిధుల కేటాయింపును చూపించలేదు. పారిశ్రామిక కార్పస్ ఫండ్ నుంచి వీటిని అమలు చేయాలనే ఆలోచనతో ఉంది.



6 గ్యారంటీలు రూ.56 వేల కోట్లు

ఎన్నికల హామీలకు వరుసగా రెండో ఏడాదీ ప్రాధాన్యత

గత బడ్జెట్‌లో కేటాయింపు కంటే రూ.9వేల కోట్లు ఎక్కువ


సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకిచ్చిన ప్రధాన హామీలైన ఆరు గ్యారంటీల కోసం బడ్జెట్‌లో రూ.56,084 కోట్లు కేటాయించారు. వీటికి వరుసగా రెండో ఏడాది కూడా ప్రాధాన్యమిస్తూ గత బడ్జెట్‌లో కేటాయించిన దాని కంటే రూ.9వేల కోట్ల వరకు అదనంగా ప్రతిపాదించడం విశేషం. రైతుభరోసా, చేయూత, ఇందిరమ్మ ఇళ్లు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్లలోపు ఉచిత కరెంటు, సన్నధాన్యానికి బోనస్, రాజీవ్ ఆరోగ్యశ్రీ, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలకు ఈ నిధులను కేటాయిస్తున్నట్టు బడ్జెట్ పత్రంలో పేర్కొన్నారు. రైతు భరోసాకు గత ఏడాది కంటే రూ.3వేల కోట్లు పెంచగా, గత ఏడాది తరహాలోనే పింఛన్లకు నిధులు చూపెట్టారు. అంటే ఈసారి కూడా పింఛన్ల పెంపు హామీ పరిష్కారమయ్యే అవకాశాలు కనిపించడం లేదని బడ్జెట్ గణాంకాలు చెబుతున్నాయి. ఇక, నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో అవసరమయ్యే 4 లక్షలకుపైగా ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.12,571 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. ఇళ్ల నిర్మాణంలో కేంద్రమిచ్చే సాయం పోను ఈ నిధులు సరిపోతాయని ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. అదేవిధంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, గృహజ్యోతి, గృహలక్ష్మికి తగిన కేటాయింపులు చేశామని అంటున్నాయి. అయితే, మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున భృతి ఇస్తామనే ముఖ్యమైన గ్యారంటీతోపాటు ఆరు గ్యారంటీల్లోని ఇతర అంశాలను బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం గమనార్హం. అంటే ఆ గ్యారంటీల అమలుకు మరో ఏడాది ఆగాల్సిందేనన్న మాట.

ఆరు గ్యారంటీలకు బడ్జెట్ కేటాయింపులు ఇలా..

రైతు భరోసా	18,000	మహాలక్ష్మి (ఆర్టీసీ)	4,305	రాజీవ్ ఆరోగ్యశ్రీ	1,143
చేయూత	14,861	గృహజ్యోతి	2,080	ఎల్పీజీ సబ్సిడీ	723
ఇందిరమ్మ ఇళ్లు	12,571	సన్న ధాన్యానికి బోనస్	1,800	ఇందిరమ్మ ఆత్మీయ భరోసా	600

మొత్తం 56,084 కోట్లు

రోడ్లు, భవనాల శాఖకు రూ.5,907 కోట్లు



సాక్షి, హైదరాబాద్: రోడ్లు, భవనాల శాఖకు ప్రభుత్వం రూ.5,907 కోట్లను ప్రతిపాదించింది. ఇందులో రీజినల్ రింగురోడ్డుకు గత బడ్జెట్‌లో చూపినట్టుగానే రూ.1,525 కోట్లను చూపింది. భూసేకరణకు వీటిని వినియోగించనున్నారు. గత బడ్జెట్‌లో ఈ నిధులను చూపినా, వాటిని వినియోగించలేదు. ఇక మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు రెండు వరుసల రోడ్ల నిర్మాణానికి రూ. 50 కోట్లను మాత్రమే ప్రతిపాదించింది. జిల్లాల్లో సమీకృత కలెక్టరేట్ భవనాల కోసం రూ.300 కోట్లు, నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి రూ.251 కోట్లు కేటాయించింది. హైబ్రిడ్ యాన్యూట్ మోడ్‌లో రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ఇటీవల నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందుకుగాను రూ.300 కోట్లను బడ్జెట్‌లో చూపింది.

ఏటేటా పెరుగుతూనే ఉన్నాయ్

మొత్తం రాష్ట్ర అప్పులు రూ. 6,92,731 కోట్లు

మార్కెట్ రుణాలు రూ. 4,51,203 కోట్లు..

ప్రభుత్వ గ్యారంటీలతో తీసుకున్న అప్పులు రూ.2,41,528 కోట్లు

2023-24 కంటే.. 2024-25లో పెరిగిన అప్పు రూ. 48,000 కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన అప్పు రూ.1,57,351 కోట్లు. ఇదే సమయంలో గతంలో చేసిన అప్పులకు అసలు, వడ్డీ కింద చేసిన చెల్లింపులు రూ.1,09,812 కోట్లు. సుమారు మరో రూ.48 వేల కోట్లు అవసరాల కోసం వాడుకుంది. ఈ మేరకు రాష్ట్ర మొత్తం అప్పు పెరిగింది. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా అసెంబ్లీకి సమర్పించిన ఆర్థిక విధాన పత్రంలో ప్రభుత్వం ఈ వివరాలను వెల్లడించింది. 'ద్రవ్య జవాబుదారీ, బడ్జెట్ నిర్వహణ (ఎఫ్‌ఆర్‌బీఎం)' చట్టానికి లోబడి నేరుగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పులు రూ.4,51,203 కోట్లకు చేరాయి. 2023-24లో ఇది రూ.4,03,664 కోట్లు మాత్రమే. ఇక కార్పొరేషన్లు, స్పెషల్ పర్పస్ వెహికల్స్ (ఎస్పీవీ)కు గ్యారంటీలు ఇచ్చి తెచ్చిన రుణాలు రూ.2,41,528 కోట్లు. ఇవి కూడా కలిపి రాష్ట్ర ప్రభుత్వ మొత్తం అప్పులు రూ. 6,92,731 కోట్లకు చేరాయి.

సాక్షి, హైదరాబాద్



రుణాలు, గ్యారంటీలు కలిపి రాష్ట్ర అప్పుల తీరు (రూ.కోట్లలో)


కేటగిరీ	ఏడాదిలో తెచ్చిన రుణాలు 2023-24 ప్రతిపాదన	ఏడాదిలో తెచ్చిన రుణాలు 2024-25 సవరణ అంచనా	తిరిగి చెల్లింపులు 2023-24 ప్రతిపాదన	తిరిగి చెల్లింపులు 2024-25 సవరణ అంచనా	ఔట్ స్టాండింగ్ 2023-24 ప్రతిపాదన	ఔట్ స్టాండింగ్ 2024-25 సవరణ అంచనా
మార్కెట్ రుణాలు	49,618	56,940	9,341	13,118	3,14,546	3,58,368
కేంద్ర రుణాలు	1,948	2,500	325	398	18,057	20,159
ఎన్ఎస్ఎస్ఎఫ్	0	0	827	1,389	4,723	3,334
బ్యాంకు రుణాలు	99,008	1,100	99,123	2,097	13,194	12,197
ప్రావిడెంట్ ఫండ్	3,468	3,181	1,568	2,226	16,862	17,816
ఫండ్స్ డిపాజిట్	76,587	93,630	72,266	90,584	36,283	39,328
మొత్తం	2,30,629	1,57,351	1,83,451	1,09,812	4,03,664	4,51,203

కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థలకు ప్రభుత్వ గ్యారంటీలతో తీసుకున్న అప్పులు: రూ. 2,41,528 కోట్లు

ఇవి కూడా కలిపితే మొత్తం రాష్ట్ర అప్పులు: రూ. 6,92,731 కోట్లు

ప్రభుత్వ గ్యారంటీ లేకుండా ప్రభుత్వరంగ సంస్థలు, స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) కింద తీసుకున్న రుణాలు రూ.59,956 కోట్లు. వీటిని ఆయా సంస్థలే చెల్లించుకుంటాయి.


హోం శాఖకు స్వల్పంగా పెంపు



సాక్షి, హైదరాబాద్: హోంశాఖకు ఈ బడ్జెట్‌లో నిధులు స్వల్పంగా పెరిగాయి. గత వార్షిక బడ్జెట్‌లో రూ.9,564 కోట్లు కేటాయించగా, 2025-26 బడ్జెట్‌లో రూ.10,188 కోట్లు కేటాయించారు. మొత్తం బడ్జెట్‌లో సిబ్బంది జీతభత్యాలు ఇతర ఖర్చులు కలిపి నిర్వహణ పద్దు కింద రూ.9,337 కోట్లు, ప్రగతి పద్దు కింద పలు పనులకు రూ.851 కోట్లు కేటాయించారు. ఈ బడ్జెట్‌లోనూ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు నిధుల కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇచ్చారు. సైబర్ నేరాల కట్టడితోపాటు డ్రగ్స్ ముఠాలను అడ్డుకోవడం... మత్తు పదార్థాల కట్టడికి కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి పలు సందర్భాల్లో ప్రస్తావించారు. అందుకు తగ్గట్టుగానే ఈ రెండు విభాగాలకూ గత బడ్జెట్‌తో పోలిస్తే ఎలాంటి కోత విధించలేదు. సముచిత స్థానం కల్పించారు. 2024-25 బడ్జెట్ మాదిరే ఈ బడ్జెట్‌లోనూ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు రూ.15 కోట్లు, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరోకు రూ.20 కోట్లు కేటాయించారు. కొత్త పోలీస్‌స్టేషన్లు, కార్యాలయాలు, స్టాఫ్ క్వార్టర్స్ నిర్మాణానికి గత బడ్జెట్‌లో రూ.90 కోట్లు కేటాయించి.. అందులో రూ.49 కోట్ల 81 లక్షలు ఖర్చు చేశారు. ఈ ఏడాది బడ్జెట్‌లోనూ రూ.90 కోట్లు కేటాయించారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ కమ్యూనికేషన్ నెట్‌వర్క్ టెక్నాలజీ, ఇతర పరికరాల కొనుగోలుకు రూ.21.55 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో మాదిరిగానే ఈసారి కూడా జైళ్లశాఖకు రూ.16.78 కోట్లు, అగ్నిమాపకశాఖకు రూ.26.39 కోట్లు కేటాయించారు. ఇంటెలిజెన్స్ విభాగానికి రూ.108.70 కోట్లు కేటాయించారు. గ్రేహౌండ్స్‌కు గత బడ్జెట్‌లో రూ.3.17 కోట్లు కేటాయించగా.. ప్రస్తుత బడ్జెట్‌లో రూ.6 కోట్లు కేటాయించారు.


గత ఏడాది రూ.**9,564** కోట్లు..
ఈ బడ్జెట్‌లో రూ.**10,188** కోట్లు

కల్యాణ లక్ష్మికి పెరిగిన కేటాయింపులు



సాక్షి, హైదరాబాద్: సంక్షేమ శాఖల ద్వారా అమలవుతున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో కేటాయింపులు స్వల్పంగా పెంచింది. ఈ రెండింటికి కలిపి రూ.3,683 కోట్లు కేటాయించింది. గత బడ్జెట్‌లో రూ.3,585 కోట్లు కేటాయించగా.. ఈసారి రూ.98 కోట్లు పెంచింది. తాజాగా కల్యాణలక్ష్మి పథకం కింద అత్యధికంగా బీసీ సంక్షేమ శాఖకు రూ.2,173 కోట్లు, ఎస్సీ సంక్షేమ శాఖకు రూ.600 కోట్లు, గిరిజన సంక్షేమ శాఖకు రూ.260 కోట్లు, షాదీముబారక్ కింద మైనార్టీ సంక్షేమ శాఖకు రూ.650 కోట్లు చొప్పున నిధులు కేటాయించారు. గత బడ్జెట్‌తో పోలిస్తే బీసీ సంక్షేమ శాఖకు కేటాయింపుల్లో రూ.2 కోట్లు కోత పడగా... ఎస్సీ సంక్షేమ శాఖకు రూ.100 కోట్లు అదనంగా కేటాయించారు. మరోవైపు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం లబ్ధిదారులకు ఆర్థిక సాయంతో పాటు తులం బంగారం కూడా ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినప్పటికీ... తాజా బడ్జెట్‌లో ఇందుకు సంబంధించిన ప్రస్తావన లేదు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లకు కలిపి రూ.3,683 కోట్లు



అడవులకు అంతంతే..



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బడ్జెట్‌లో అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖకు రూ.1,023 కోట్లు ప్రతిపాదించారు. గత బడ్జెట్‌తో పోల్చితే (రూ.1,063.87 కోట్లు) రూ.40.87 కోట్లు తక్కువ. ఇందులో భాగంగా.. ఫారెస్ట్ అండ్ వైల్డ్‌లైఫ్ కింద రూ.162.13 కోట్లు ప్రతిపాదించారు. ఇందులో స్టేట్‌సెక్టర్ స్కీమ్స్ కింద రూ.128.64, మ్యాచింగ్ స్టేట్ షేర్ కింద రూ.13.88 కోట్లు, సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీమ్స్ కింద రూ.19.61 కోట్లుగా ఉంది. అయితే గత బడ్జెట్‌లోనూ రూ.162.13 కోట్లుగా చెప్పి, సవరించిన బడ్జెట్‌లో రూ.149.49 కోట్లుగా చూపారు.

- తెలంగాణ బయో డైవర్సిటీ బోర్డుకు రూ. 27 కోట్లు ప్రతిపాదించారు. 13వ ఆర్థిక సంఘం నుంచి తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలికి ఎలాంటి కేటాయింపులు చేయలేదు (గత బడ్జెట్‌లోనూ అంతే).
- రాష్ట్రంలోని అటవీ విస్తీర్ణాన్ని 24.05 శాతం నుంచి 33 శాతం వరకు పెంచేందుకు జాతీయ అటవీ విధాన లక్ష్యాలకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 18 ప్రాంతాలను ఎకో టూరిజం కేంద్రాలుగా పర్యావరణ హితం, వన్యప్రాణుల సంరక్షణ నిబంధనల మేరకు అభివృద్ధి చేయనున్నట్టు ప్రకటించారు.

వేతనాలకు రూ.40 వేల కోట్లు.. పెన్షన్లకు రూ.11 వేల కోట్లు

సాక్షి, హైదరాబాద్ : రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 50 వేల కోట్లకుపైగా ఉద్యోగుల వేతనాలు, ఉద్యోగ విరమణ చేసిన వారి పెన్షన్ల చెల్లింపులకు వెళుతున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, స్థానిక సంస్థలు, వర్సిటీలు ఇలా మొత్తం రాష్ట్రంలో 8,09,861 మంది ఉద్యోగులున్నట్టు తెలిపింది. ఉద్యోగులపై ఏటా రూ.40,739 కోట్లు, పెన్షన్ల కింద రూ.11,642 కోట్లు చెల్లిస్తున్నట్టు పేర్కొంది. పెన్షన్ల తర్వాత ప్రభుత్వ ఉద్యోగులు అధిక సంఖ్యలో ఉంటే, ఆ తర్వాత ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే వారి సంఖ్య ఉంది.

ఉద్యోగుల వివరాలు ఇలా..

ప్రభుత్వ ఉద్యోగులు :	2,34,597	మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు :	5,712
పెన్షనర్లు :	2,88,169	పట్టణాభివృద్ధి సంస్థలు :	323
ప్రభుత్వ రంగ సంస్థలు:	1,14,869	జిల్లా గ్రంథాలయ సంస్థలు:	324
న్యాయ వ్యవస్థ:	9,557	విశ్వవిద్యాలయాలు:	5,266
ఎయిడెడ్ విద్యా సంస్థలు:	2,220	సహకార సంస్థలు, ఇతర ప్రభుత్వ బాడీస్:	34,516
జిల్లా, మండల పరిషత్‌లు:	98,278	దేవాలయాలు:	2,518
గ్రామ పంచాయతీలు	:13,512		


రుణాలు..: ద్రవ్య బాధ్యత, బడ్జెట్ నిర్వహణ (ఎఫ్ఆర్‌బీఎం) కింద 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం అప్పులు జీఎస్డీపీలో 27.38 శాతంగా అంచనా వేస్తే..సవరించిన అంచనాలకు వచ్చేసరికి అది కాస్త 27.98 శాతానికి పెరిగినట్టు చూపించారు.

సాక్షి
గురువారం । 20 । మార్చి । 2025 ।
హైదరాబాద్ । www.sakshi.com

2025-26 పద్దు



ప్రభుత్వ ఆదాయ వ్యయాలు ఇలా..
(అంకెలు రూ. కోట్లలో)



గ్రామీణాభివృద్ధికి అధిక నిధులు..



బడ్జెట్‌లో సాంఘిక సంక్షేమ శాఖ తర్వాత పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి అధిక నిధులు కేటాయించాం. గుంట భూమి లేని ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ.600 కోట్లు, ఇంకా మహిళా శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఎక్కువ నిధులు కేటాయించాం. ఆర్థిక ఒత్తిడిలో ఉన్నా ఆరు గ్యారంటీలకు అధిక ప్రాధాన్యమిచ్చాం. ఆర్థిక అవకాశాలు, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించిన సమగ్ర బడ్జెట్ ఇది. 100 శాతం మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేసిన బడ్జెట్.

– మంత్రి సీతక్క



'చేప'కు రూ.250 కోట్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో మత్స్యశాఖకు కేటాయింపుల్లో ఎలాంటి మార్పు చేర్పులు చేయలేదు. గత ఏడాది రూ.250 కోట్లు కేటాయిస్తే.. ఈ ఏడాది కూడా ప్రభుత్వం రూ.250 కోట్లు కేటాయించింది. 2024–25లో రూ.250 కోట్లు కేటాయిస్తే.. అందులో రూ.231 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. మత్స్యశాఖ ఇంకా రూ.20 కోట్లు ఖర్చు చేయలేదు. దీంతో ప్రభుత్వం ఆ శాఖకు ఎలాంటి బడ్జెట్ పెంపు లేకుండా.. రూ.250 కోట్లు కేటాయించింది.



తలసరి ఆదాయంలో మళ్లీ రంగారెడ్డి టాప్.. (సామాజిక ఆర్థిక సర్వే)

సాక్షి, హైదరాబాద్: తలసరి ఆదాయంలో మళ్లీ రంగారెడ్డి జిల్లా టాప్‌లో నిలవనుంది. 2023–24లో రంగారెడ్డి జిల్లా రూ.10,55,913 తలసరి ఆదాయంతో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలవగా, రూ.5,54,105తో హైదరాబాద్ రెండో స్థానంలో, రూ.3,45,478తో సంగారెడ్డి జిల్లా మూడో స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోనే అత్యల్పంగా రూ.1,98,401 తలసరి ఆదాయాన్ని వికారాబాద్ జిల్లా కలిగి ఉంది.

జిల్లా	తలసరి ఆదాయం
రంగారెడ్డి	10,55,913
హైదరాబాద్	5,54,105
సంగారెడ్డి	3,45,478
మేడ్చల్-మల్కాజిగిరి	3,43,130
భద్రాద్రి కొత్తగూడెం	3,21,281
మహబూబ్‌నగర్	2,93,823
యాదాద్రి భువనగిరి	2,88,599
పెద్దపల్లి	2,84,661
మెదక్	2,83,567
సిద్దిపేట	2,78,352
నల్లగొండ	2,76,273
జయశంకర్ భూపాలపల్లి	2,57,851
కరీంనగర్	2,50,243
ఖమ్మం	2,49,517
ములుగు	2,49,338
సూర్యాపేట	2,48,429
వరంగల్	2,44,278
నిర్మల్	2,34,640
జనగామ	2,33,215
నాగర్‌కర్నూల్	2,29,649
మంచిర్యాల	2,27,716
వనపర్తి	2,27,422
నిజామాబాద్	2,23,282
ఆదిలాబాద్	2,22,233
కుమ్రుం భీమ్	2,21,456
గద్వాల	2,14,861
కామారెడ్డి	2,14,861
రాజన్న సిరిసిల్ల	2,13,725
మహబూబాబాద్	2,12,232
నారాయణపేట	2,07,784
జగిత్యాల	2,05,273
హనుమకొండ	1,99,490
వికారాబాద్	1,98,401



రాష్ట్రంలోనే అత్యధిక నిరుద్యోగం..

పనిచేసే వయసు (15–59) జనాభాలో నిరుద్యోగిత రేటు జాతీయ సగటు కంటే తెలంగాణ రాష్ట్రంలో అధికంగా ఉంది. 2023–24 సర్వే ప్రకారం జాతీయ స్థాయిలో నిరుద్యోగిత రేటు 3.5 శాతం ఉండగా, తెలంగాణలో మాత్రం 5.1 శాతంగా నమోదైంది. జాతీయ స్థాయిలో గ్రామీణ ప్రాంతాల్లో 2.8 శాతం ఉండగా, తెలంగాణలో 3.8 శాతంగా నమోదైంది. పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగిత రేటు జాతీయ స్థాయిలో 5.4 శాతం ఉండగా, తెలంగాణలో 7.6 శాతంగా ఉంది.

బీసీలకు సంక్షేమం

రూ.11,405 కోట్లు కేటాయింపు

2024-25 బడ్జెట్‌తో పోలిస్తే రూ.2,200 కోట్లు పెరుగుదల


నాలుగు సంక్షేమ శాఖలకు కలిపి రూ.34,079 కోట్లు ప్రతిపాదన

రాజీవ్ యువ వికాసానికి రూ.6 వేల కోట్లు



సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖకు తాజా బడ్జెట్ భారీ ఊరటనిచ్చింది. 2025–26 బడ్జెట్‌లో బీసీ సంక్షేమ శాఖకు రూ.11,405 కోట్లు కేటాయించారు. ఇందులో శాఖాపరమైన అవసరాల కోసం రూ.1,008 కోట్లు కేటాయించగా.. సంక్షేమ పథకాల కోసం రూ.10,397 కోట్లు కేటాయించారు. 2024–25 బడ్జెట్‌లో బీసీ సంక్షేమ శాఖకు రూ.9,200.32 కోట్లు కేటాయించగా ప్రస్తుతం రూ.2,204 కోట్లు అదనంగా ప్రతిపాదించారు. వివిధ కులాలకు చెందిన ఒక్కో ఆర్థిక సహకార సంస్థకు రూ.50 కోట్లు చొప్పున కేటాయించారు. వడ్డెర, కృష్ణబలిజ, వాల్మీకి బోయ, భట్రాజు, విశ్వబ్రాహ్మణ, శాలివాహన, కల్లుగీత, సగర, నాయీబ్రాహ్మణ, వాషర్‌మెన్, ముదిరాజ్, కుమ్మర, మున్నూరుకాపు, పద్మశాలి, పెరిక, లింగాయత్, మేర, గంగపుత్ర కార్పొరేషన్లకు నిధులు ప్రతిపాదించారు. రజక, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్లకు విద్యుత్ చార్జీల రాయితీకి రూ.100 కోట్లు చొప్పున కేటాయించారు. ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.400 కోట్లు కేటాయించారు.

సంక్షేమ శాఖల వారీగా కేటాయింపులు ఇలా(రూ.కోట్లలో)..



- 4 ప్రధాన సంక్షేమ శాఖలకు తాజా బడ్జెట్లో రూ.34,079 కోట్లు కేటాయించారు. ఇందులో బీసీ శాఖకు రూ.11,405 కోట్లు, ఎస్సీడీడీకి రూ.11,561 కోట్లు, గిరిజన సంక్షేమానికి రూ.7,522 కోట్లు, మైనార్టీ సంక్షేమ శాఖకు రూ.3,591 కోట్లు కేటాయించారు. షెడ్యూల్డ్ కులాల అభి వృద్ధి శాఖకు తాజా బడ్జెట్‌లో రూ.11,561 కోట్లు కేటా యించారు. ఇందులో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురు కుల విద్యా సంస్థల సొసైటీకి రూ.4,394.68 కోట్లు కేటా యించారు. దళితబంధు పథకానికి (అంబేడ్కర్ అభయ హస్తం) రూ.1,000 కోట్లు ప్రతిపాదించారు. గతేడాది రూ.2

'రాజీవ్ యువ వికాసం'తో స్వయం ఉపాధి

వేల కోట్లు ప్రతిపాదించినప్పటికీ నిధులు విడుదల చేయకపోవడం గమనార్హం. కాగా రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖకు రూ.7,522 కోట్లు కేటాయించారు. గిరిజన గురు కుల సొసైటీకి రూ.667.89కోట్లు ప్రతిపాదించారు. మైనా ర్టీ సంక్షేమ శాఖకు రూ.3,591 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌తో పోలిస్తే మైనార్టీ సంక్షేమానికి రూ.589 కోట్లు అధికంగా కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వం స్వయం ఉపాధి పథకాలకు ప్రాధాన్యత ఇస్తూ రాజీవ్ యువ వికాసాన్ని కొత్తగా ఆవిష్కరించింది. ఈ పథకం కోసం బడ్జెట్‌లో రూ.6వేల కోట్లు కేటాయించింది. సంక్షేమ శాఖలకు సంబంధించి కార్పొరేషన్ల ద్వారా రాయితీ పద్ధతిలో ప్రభుత్వం ఆర్థిక సహకారాన్ని అందించనుంది.

- రాష్ట్ర మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖకు ఈసారి బడ్జెట్‌లో రూ.2,862 కోట్లు కేటాయించారు. ఇందులో శాఖాపరమైన నిర్వహణకు రూ.973 కోట్లు, సంక్షేమ పథకాల కోసం రూ.1,888 కోట్లు కేటాయించారు.
- కార్మిక సంక్షేమ శాఖకు రూ.900 కోట్లు కేటాయించారు. ఇందులో నిర్వహణ కింద రూ.479 కోట్లు, పథకాల కింద రూ.421 కోట్లు ప్రతిపాదించారు.

'ప్రత్యేక నిధి'కి భారీగా..

ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధికి రూ.57,400 కోట్లు

ఇందులో ఎస్సీ ఎస్డీఎఫ్‌కు రూ.40,231.61 కోట్లు, ఎస్టీ ఎస్డీఎఫ్‌కు రూ.17,168.82 కోట్లు

గత కేటాయింపుల కంటే రూ.7,220 కోట్లు అదనం

సాక్షి, హైదరాబాద్

దళిత, గిరిజన ప్రత్యేక అభివృద్ధి నిధి ఈసారి భారీగా పెరిగింది. 2025–26 వార్షిక బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ ఎస్డీఎఫ్ కింద రూ.57,400.43 కోట్లు కేటాయించింది. గత వార్షిక బడ్జెట్‌లో ఎస్డీఎఫ్ కింద 50,180.13 కోట్లు కేటాయింపులు జరపగా... ప్రస్తుత బడ్జెట్లో ప్రభుత్వం రూ.7,220.30 కోట్లు అదనంగా కేటాయింపులు చేసింది. ఇందులో షెడ్యూల్డ్ కులాల ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్సీ ఎస్డీఎఫ్) కింద రూ.40,231.61 కోట్లు కేటాయించగా, గిరిజన ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్టీ ఎస్డీఎఫ్) కింద రూ.17,168.82 కోట్లు కేటాయించారు. ఈ కేటాయింపుల్లోనూ ఎస్సీ ఎస్డీఎఫ్‌కు అధిక ప్రాధాన్యం దక్కింది. గతేడాదితో పోలిస్తే ప్రస్తుత ఎస్సీ ఎస్డీఎఫ్ కింద రూ.7,107.57 కోట్ల మేర కేటాయింపులు పెరిగాయి. ఎస్టీ ఎస్డీఎఫ్‌కు మాత్రం 112.73 కోట్లు మాత్రమే పెరిగాయి.



- తాజా బడ్జెట్లో ఎస్సీ ఎస్డీఎఫ్‌లో కొత్తగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం కోసం రూ.2,400 కోట్లు కేటాయించింది. దీంతో ఎస్సీ ఎస్డీఎఫ్‌కు బడ్జెట్ కేటాయింపులు కాస్త పెరిగాయి. సాధారణంగా బడ్జెట్ కేటాయింపుల్లో ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం నిధులు కేటాయించి ఖర్చు చేస్తుంది.

ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి కింద వరుసగా ఐదేళ్లలో బడ్జెట్ కేటాయింపులు ఇలా... (రూ.కోట్లలో)

కేటగిరీ	2021-22	2022-23	2023-24	2024-25	2025-26
ఎస్సీ ఎస్డీఎఫ్	21,306.84	33,937.75	36,750.48	33,124.04	40,231.61
ఎస్టీ ఎస్డీఎఫ్	12,304.22	13,412.62	15,232.61	17,056.09	17,168.82

ఇంధన శాఖకు 'భట్టి' వెలుగులు

బడ్జెట్‌లో రూ.21,221 కోట్ల భారీ కేటాయింపులు

సాక్షి, హైదరాబాద్: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనల్లో సొంత ఇంధన శాఖకు అగ్ర తాంబూలం ఇచ్చారు. ప్రగతి పద్దు కింద రూ.19,590 కోట్లు, నిర్వహణ పద్దు కింద రూ.1,630 కోట్లు కలిపి ఇంధన శాఖకు మొత్తం రూ.21,221 కోట్లను కేటాయించారు. ఈ శాఖ బడ్జెట్ రూ.20వేల కోట్లను దాటడం ఇదే తొలిసారి. ఇంధన శాఖకు 2023–24లో రూ.12,727 కోట్లు, 2024–25లో రూ.16,410 కోట్లను కేటాయించగా, తాజాగా కేటాయింపులు గణనీయంగా పెరిగాయి. ఇక రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల ఏర్పాటును ప్రోత్సహించేందుకు తెచ్చిన గ్రీన్ ఎనర్జీ పాలసీ–2025 కింద పెట్టుబడిదారులకు రాయితీ, ప్రోత్సాహకాలను అందించడానికి ప్రభుత్వం రూ.754.7 కోట్లను కేటాయించింది. ఎంపిక చేసిన గ్రామాలను 100 శాతం సౌర విద్యుదీకరించడానికి మరో రూ.1,132.05 కోట్లను కేటాయించింది.


వ్యవసాయ సబ్సిడీలు యథాతథం

వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నందుకు విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లకు చెల్లిస్తున్న రూ.8,260 కోట్ల సబ్సిడీలను ప్రభుత్వం యథాతథంగా కొనసాగించింది. గృహజ్యోతి పథకం కింద పేదల గృహాలకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ సరఫరా చేసినందుకు డిస్కంలకు చెల్లిస్తున్న సబ్సిడీలను మాత్రం రూ.1825.01 కోట్ల నుంచి రూ.1509.4 కోట్లకు తగ్గించింది. విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ సరఫరాకి కొత్తగా రూ.198.87 కోట్లను కేటాయించింది.

సాక్షి, హైదరాబాద్: వచ్చే 25 ఏళ్లలో రాష్ట్రమంతటా పారిశ్రామిక అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించింది. వచ్చే ఐదేళ్లలో రూ.4 వేల కోట్లతో 25 వేల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమల స్థాపన జరుగుతుందని తెలిపింది. ప్రైవేటు ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ల అభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తామని వెల్లడించింది. పారిశ్రామిక రంగానికి గత ఏడాదికంటే రూ.765 కోట్లు పెంచి 2025–26 బడ్జెట్‌లో రూ.3,527 కోట్లు ప్రతిపాదించింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగానికి గత ఏడాది తరహాలోనే రూ.774 కోట్లు ప్రతిపాదించారు. కేటాయింపుల్లో చేనేత, మినీ పారిశ్రామిక వాడలు, హైదరాబాద్ మినహా 9 ఉమ్మడి జిల్లాల్లో కొత్త పారిశ్రామిక జోన్లు ఏర్పాటు, నిమ్జ్, ఫార్మా విలేజ్‌ల ఏర్పాటుకు భూసేకరణ తదితరాలకు ప్రాధాన్యత ఇచ్చారు. రావిర్యాల ఈ – సిటీ ప్రాజెక్టు, మహేశ్వరం ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్‌కు నిధులు కేటాయించారు.

పరిశ్రమలకు రూ.3,527 కోట్లు

ఐటీ శాఖకు రూ.774 కోట్లు.. పారిశ్రామిక ప్రోత్సాహకాలకు రూ.1,730 కోట్లు



విభాగాలవారీగా కేటాయింపులు(రూ.కోట్లలో)

అంశం	కేటాయింపులు
నేత కార్మికులకు ఆర్థిక సాయం	237.46
చేనేత, వస్త్ర పరిశ్రమ అభివృద్ధి	102.54
స్కిల్స్ యూనివర్సిటీ	113.26
కొత్త ఇండస్ట్రియల్ జోన్లు	50
నిమ్జ్ భూ సేకరణ	125.47
10 ఫార్మా విలేజ్‌లకు భూ సేకరణ	50
ఈ - సిటీ	16
మహేశ్వరం ఈఎంసీ	21.50
నిజాం షుగర్స్ పునరుద్ధరణ	138.62
వి హబ్	18.98
సాఫ్ట్‌నెట్	30
టీ వర్క్స్	30
టీ ఫైబర్‌గ్రిడ్	55

- ప్రగతి పద్దు కింద 2024–25 వార్షిక బడ్జెట్‌లో పరిశ్రమల శాఖకు 2,248.13 కోట్లు కేటాయించి, తర్వాత రూ.1,321.57 కోట్లకు సవరించారు. తాజా బడ్జెట్‌లో పరిశ్రమల శాఖకు ప్రగతిపద్దు కింద రూ.2,383.42 కోట్లు ప్రతిపాదించారు.
- పారిశ్రామిక ప్రోత్సాహకాలు, రాయితీల బకాయిలు రూ.4,236 కోట్ల మేర పేరుకుపోయిన నేపథ్యంలో ప్రస్తుత బడ్జెట్‌లో వీటికి రూ.1,730 కోట్లు కేటాయించారు.
- టీ హబ్ ఫౌండేషన్‌కు గత ఏడాది బడ్జెట్‌లో రూ.40 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో నయాపైసా ఇవ్వలేదు.
- ఐటీ శాఖకు 2024–25 బడ్జెట్‌లో ప్రగతిపద్దు కింద రూ.771.20 కోట్లు ప్రతిపాదించి, చివరకు 337.30 కోట్లకు సవరించారు. తాజా బడ్జెట్‌లోనూ ప్రగతిపద్దు కింద ఈ శాఖకు రూ.771.20 కోట్లు ప్రతిపాదించారు.
- కొత్త పారిశ్రామిక పార్కుల్లోని ప్లాట్లలో 5 శాతం మహిళా పారిశ్రామికవేత్తలకు, 15 శాతం ఎస్సీ, ఎస్టీలకు కేటాయిస్తారు.
- ప్రైవేటు ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ల అభివృద్ధిని ప్రోత్సహించేందుకు స్టాంప్ డ్యూటీ, విద్యుత్ చార్జీలు, భూమి ధరల్లో రాయితీలు ఇస్తామని ప్రకటించారు.
- ఫ్యూచర్‌సిటీలో 200 ఎకరాల్లో ప్రత్యేకంగా ఏఐ సిటీని నెలకొల్పుతారు.
- 2050 నాటికి రాష్ట్రమంతటా పారిశ్రామిక అభివృద్ధి కోసం 'మెగా మాస్టర్‌ప్లాన్ 2050' పాలసీ తెస్తామని ప్రభుత్వం తెలిపింది.
- పాలసీలో భాగంగా ఐటీ, ఫార్మా, హెల్త్, ఫుడ్ ప్రాసెసింగ్, స్పోర్ట్స్, ఆటోమొబైల్, మెటల్, చేనేత, ఆభరణాల తయారీ క్లస్టర్లు ఏర్పాటు చేస్తారు.
- జాతీయ రహదారి 163కు ఇరువైపులా హైదరాబాద్– వరంగల్ పారిశ్రామిక కారిడార్ ఏర్పాటును ప్రతిపాదించారు.
- రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.
- ఐటీ రంగంలో ఏఐ ఆధారిత స్టార్టప్ కంపెనీలకు ప్రోత్సాహం ఇస్తారు.

రైతుకు ఊతం

రైతు భరోసాకు రూ.18 వేల కోట్లు

వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ. 24,439 కోట్లు కేటాయింపు

ఇందులో వ్యవసాయ అభివృద్ధికి రూ.16,962.87 కోట్లు

రుణమాఫీ నేపథ్యంలో గత బడ్జెట్ కన్నా తగ్గిన వ్యవసాయ కేటాయింపులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం 2025–26 బడ్జెట్‌లో రైతుకు పెట్టుబడి సాయం అందించే 'రైతుభరోసా' పథకానికి రూ.18 వేల కోట్లు కేటాయించింది. ఒక్కో ఎకరాకు సంవత్సరానికి రూ.12 వేల చొప్పున కోటిన్నర ఎకరాలకు చెల్లించే విధంగా ఈ కేటాయింపులు జరిపారు. రైతు రుణమాఫీ కింద రూ.23 వేల కోట్లకు పైగా రైతుల రుణాలను చెల్లించిన నేపథ్యంలో ఈసారి వ్యవసాయ బడ్జెట్ కేటాయింపులను తగ్గించారు. గతసారి వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం రూ.32,479 కోట్లు కేటాయించిన ప్రభుత్వం సవరించిన బడ్జెట్‌లో ఆ మొత్తాన్ని రూ.26,550 కోట్లకు పరిమితం చేసింది. కానీ ఈసారి వ్యవసాయ, అనుబంధ రంగాలన్నింటికీ కలిపి రూ.24,439 కోట్లు కేటాయించిన ప్రభుత్వం.. ఇందులో వ్యవసాయ అభివృద్ధికి రూ.16,962.87 కోట్లు మాత్రమే కేటాయించింది. నిర్వహణ పద్దు కింద రూ. 1,138 కోట్లు పోగా, సహకార శాఖ కోసం రూ.22.65 కోట్లు కేటాయించింది. పౌరసరఫరాల శాఖకు రూ.5,734 కోట్లు కేటాయించగా, అందులో రూ.3,835.64 కోట్లను ప్రగతి పద్దు కింద చూపించింది. ఈ మొత్తంలో బియ్యం సబ్సిడీకి చెల్లించే మొత్తమే రూ.3,000 కోట్లుగా పేర్కొనడం గమనార్హం. ఎల్పీజీ సబ్సిడీ పథకం మహాలక్ష్మి కోసం మరో రూ.723 కోట్లు కేటాయించారు. సన్న ధాన్యం పండించిన రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్‌గా ఇస్తుండగా, ఆ మొత్తాన్ని పౌరసరఫరాల శాఖ పద్దు నుంచి కాకుండా ప్రభుత్వమే నేరుగా ఆర్థిక శాఖ నుంచి ఇస్తుండడంతో అందుకయ్యే రూ.3,000 కోట్లను విడిగా చూపించారు.

వ్యవసాయం, అనుబంధ రంగాలకు కేటాయింపులు

ఉద్యానవన శాఖకు	రూ. 646.24 కోట్లు
పట్టు పరిశ్రమ శాఖకు	రూ.21.08 కోట్లు
రైతులకు విత్తన సరఫరాకు రాయితీ	రూ. 106.22 కోట్లు
విత్తనం నాటే మెటీరియల్‌కు ఇచ్చే మొత్తం	రూ. 18.69 కోట్లు
జాతీయ ఆహార భద్రతా మిషన్, ఇతర ఒప్పంద సేవలు	రూ. 27.55 కోట్లు
పంటల బీమా	రూ. 981.11 కోట్లు
రైతు బీమా	రూ. 1167.92 కోట్లు
వ్యవసాయ యాంత్రీకరణ, క్రాప్ డైవర్సిఫికేషన్ నేషనల్ మిషన్	రూ. 47.35 కోట్లు
వ్యవసాయ యాంత్రీకరణ (స్టేట్)	రూ. 25.47 కోట్లు
నూనెగింజలు, ఆయిల్‌పామ్	రూ. 10.81 కోట్లు
రైతు వేదికల వద్ద అభివృద్ధి	రూ. 43.03 కోట్లు
ఇతర సేవలు, సహాయక గ్రాంట్లు	రూ. 37.98 కోట్లు

పింఛన్లకు పెరిగింది కొంతే..




సాక్షి, హైదరాబాద్: బడ్జెట్‌లో సామాజిక పింఛన్లకు రూ.14,861 కోట్లు కేటాయించారు. 2024–25 బడ్జెట్‌లో కేటాయించిన రూ.14,628.91 కోట్లతో పోల్చితే.. రూ.232.09 కోట్లు మాత్రమే అధికంగా కేటాయించారు. దీనినిబట్టి చూస్తే ఈ ఏడాది కూడా చేయూత పింఛన్ల మొత్తం పెంపుదల లేనట్టేననే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అంటే ప్రస్తుతం ఇస్తున్న పాత పింఛన్లే ఇకమీదట కూడా చెల్లించనున్నారు. దీంతో వృద్ధులు ఇతర కేటగిరీల పింఛన్లను రూ.2,016 నుంచి రూ.4 వేలకు, దివ్యాంగుల పింఛన్లు రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంపుదల ఎప్పటినుంచి అమల్లోకి వస్తుందనే దానిపై స్పష్టత కొరవడింది. అలాగే మహిళలకు ప్రతినెలా రూ.2,500 చెల్లిస్తామన్న హామీకి కూడా ఈసారి ఎలాంటి కేటాయింపులు లేవు. గతంలో మాదిరిగానే ఇప్పుడు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో చేయూత పింఛన్ల పెంపు ఇప్పట్లో ఉండకపోవచ్చునని అంటున్నారు. అలాగే వృద్ధాప్య పింఛను అర్హత వయస్సు 57 ఏళ్లకు తగ్గింపు, ఇతర కేటగిరీల వారీగా కొత్త పింఛనుదారుల ఎంపిక, వారికి పింఛను మంజూరుపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా చూస్తే...2025–26 బడ్జెట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.31,605 కోట్లు కేటాయించారు. 2024–25లో ఈ మొత్తం రూ.29,816 కోట్లు కావడం గమనార్హం. కాగా గత బడ్జెట్‌తో పోల్చితే ఈసారి రూ.1,789 కోట్లు అధికంగా కేటాయించారు.

ముఖ్యమైన కేటాయింపులు ఇలా...

చేయూత పింఛన్లు	రూ.14,861 కోట్లు
మిషన్ భగీరథ బకాయిల చెల్లింపు	రూ.6,000 కోట్లు
స్టేట్ ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్స్	రూ. 2,062 కోట్లు
ఇందిరమ్మ ఆత్మీయ భరోసా	రూ. 600 కోట్లు
మహిళా సంఘాలకు వడ్డీలు	రూ.1,511 కోట్లు
గ్రామీణ రోడ్ల నిర్మాణం, నిర్వహణ	రూ.1,220 కోట్లు
హామ్ విధానంలో గ్రామీణ రోడ్ల నిర్మాణం	రూ. 200 కోట్లు

గ్రామీణ అభివృద్ధికి రూ.13,376.35 కోట్లు



గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయానికి రూ.13,376.35 కోట్లు కేటాయించగా.. 2024–25 సవరించిన అంచనాలతో పోల్చితే రూ.879 కోట్లు అధికంగా కేటాయించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థకు గత బడ్జెట్ సవరించిన అంచనాల్లో చూపిన ట్టుగా ఈ బడ్జెట్‌లోనూ రూ.295కోట్లు కేటాయించారు.

పథకాల వారీగా ఇలా..

- స్వయం సహాయ సంఘాలకు (ఎస్‌హెచ్‌జీ) వడ్డీలేని రుణాలకు రూ.892 కోట్లు
- ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం రూ.413.52 కోట్లు
- విలేజీ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లకు హానరోరియమ్ కింద రూ.108 కోట్లు
- ఎస్‌హెచ్‌జీ సభ్యులకు రుణబీమా కింద రూ.55.41 కోట్లు
- ఎస్‌హెచ్‌జీ సభ్యులకు ప్రమాదబీమా కోసం రూ.96.53 కోట్లు
- తెలంగాణ మహిళాశక్తి కింద రూ.80.39 కోట్లు
- నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ కింద రూ.119.87 కోట్లు
- స్వచ్ఛ భారత్ గ్రామీణ్ కింద రూ.120 కోట్లు
- మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.1,026.32 కోట్లు
- పంచాయతీలకు స్టేట్ ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్స్ రూ.1,114.69 కోట్లు

వీటికి కేటాయింపుల్లేవు

గ్రామీణాభివృద్ధి శాఖాపరంగా అమలు చేసే వివిధ పథకాల విషయానికొస్తే... స్త్రీనిధి, డ్వాక్రా మహిళలకు (అభయహస్తం) ఇన్సూరెన్స్/పింఛను స్కీమ్‌కు గత బడ్జెట్‌లో మాదిరి ఈసారి కూడా కేటాయింపులు చేయలేదు. శ్యామాప్రసాద్ ముఖర్జీ రూర్బన్ మిషన్ కింద కూడా గతంలో మాదిరిగానే ఈసారీ కేటాయింపులు లేవు. డీఆర్డీఏలకు సహాయ సహకారం కోసం కూడా ఎలాంటి కేటాయింపులు లేవు.

2025-26 పద్దు

సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయం

పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: సబ్బండ వర్గాలకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలను చేరవేయాలన్న లక్ష్య సాధనకు ఈ బడ్జెట్ మార్గనిర్దేశం చేస్తుందని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. సంతులిత అభివృద్ధికి బాటలు వేస్తుందన్నారు. సంక్షేమం, ఆర్థిక స్థిరత్వం, వ్యవసాయాభివృద్ధి, మౌలిక వసతుల పెంపు, విద్యారంగ పురోగతి, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, పారిశ్రామికాభివృద్ధి వంటి కీలక అంశాలకు పెద్దపీట వేసిన ప్రగతిశీల బడ్జెట్ అని పేర్కొన్నారు.

ప్రజా ప్రభుత్వ నిబద్ధతకు నిలువుటద్దం

రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రజా ప్రభుత్వ ఆదర్శాలు, నిబద్ధతకు నిలువుటద్దం ఈ బడ్జెట్ అని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఇది తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ బడ్జెట్ అని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు హర్షించే బడ్జెట్‌గా పేర్కొన్నారు. నిరుపేదలు, మధ్యతరగతి, మహిళలకు అండగా నిలుస్తూ.. యువకులను వ్యాపారవేత్తలుగా మార్చే అద్భుతమైన బడ్జెట్ అని ప్రశంసించారు. ప్రజలే పాలకులు – ప్రజలే విధాన నిర్ణాయక నాయకులుగా మారి ప్రవేశపెట్టిన బడ్జెట్ అని అభివర్ణించారు. ఈ బడ్జెట్ తెలంగాణ రాష్ట్రాన్ని శక్తివంతం చేసి, రాష్ట్ర ఆర్థిక, విద్య, వైద్య, వ్యవసాయం, ఉపాధి రంగాల్లో అగ్రస్థానంలో నిలబెడుతుందన్నారు.



పన్ను రాబడులపైనే ఆశలు!

రూ.1.75 లక్షల కోట్ల పన్నుల ఆదాయం వస్తుందని బడ్జెట్‌లో ప్రభుత్వం అంచనా

సొంత పన్నులు రూ.1.45 లక్షల కోట్లు.. కేంద్ర పన్నుల్లో వాటా సుమారు రూ.30 వేల కోట్లు

ఈసారి రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్ ఆదాయంపై ఫోకస్ - 2024-25లో ఆశాజనకంగానే పన్నుల ఆదాయం

సాక్షి, హైదరాబాద్: పన్నుల ఆదాయమే ప్రాతిపదికగా రాష్ట్ర ప్రభుత్వం 2025–26 బడ్జెట్‌ను ప్రతిపాదించింది. మొత్తం రాబడుల్లో 58 శాతం పన్నుల రూపంలోనే అందుతాయని అంచనా వేసింది. పన్నుల రూపంలో మొత్తం రూ.1.75 లక్షల కోట్లు సమకూరుతాయని పేర్కొనగా.. అందులో రాష్ట్ర సొంత పన్నుల రాబడులే రూ.1.45 లక్షల కోట్ల మేర ఉంటాయని అంచనా వేసింది. ఈసారి వస్తుసేవల పన్ను (జీఎస్టీ) కింద రూ.51 వేల కోట్లు, స్టాంపులు–రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.19 వేల కోట్లు, ఎక్సైజ్ శాఖ ద్వారా రూ.27 వేల కోట్లు, అమ్మకపు పన్ను ద్వారా రూ.37 వేల కోట్లు, వాహనాల పన్ను రూపంలో రూ.8,535 కోట్లు వచ్చే అవకాశం ఉందని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25)లో రూ.1,38,181.26 కోట్లు పన్నుల రాబడి ఉంటుందని గత బడ్జెట్‌లో వస్తుందని అంచనా వేయగా.. సవరించిన అంచనాల్లో రూ.1,29,406.75 కోట్లుగా ప్రభుత్వం పేర్కొంది. అంటే బడ్జెట్ అంచనాల కంటే తగ్గినది రూ.8 వేల కోట్లు మాత్రమేకావడం గమనార్హం. ఈ క్రమంలో వచ్చే ఆర్థిక సంవత్సరం భారీగా పన్నుల ఆదాయం సమకూరుతుందని ప్రభుత్వం అంచనా వేసుకుంటోంది.

రిజిస్ట్రేషన్ల శాఖపై ఆశలు..


వచ్చే ఆర్థిక సంవత్సరం (2025–26)లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం పెరుగుతుందని ప్రభుత్వం ఆశలు పెట్టుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25)లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా రూ.18,228 కోట్లు సమకూరుతాయని గత బడ్జెట్‌లో పేర్కొన్నా.. సవరించిన అంచనాల మేరకు ఇది రూ.14,692 కోట్లకు తగ్గింది. అయినప్పటికీ ప్రభుత్వం ఈసారి రూ.19,087.26 కోట్లు సమకూరుతాయని అంచనా వేసుకుంది. ఇది గత బడ్జెట్ ప్రతిపాదన కంటే రూ.1,000 కోట్లు, సవరించిన అంచనా కంటే రూ.5 వేల కోట్లు ఎక్కువ కావడం గమనార్హం. భూముల విలువల సవరణ తోపాటు రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటుందన్నది ప్రభుత్వ ఆలోచనగా కనిపిస్తోంది.

పన్నేతర ఆదాయం ఎలా?

బడ్జెట్‌లో పన్నేతర ఆదాయం అంచనాలు కూడా పెద్దగా తగ్గలేదు. ఈ పద్దు కింద 2024–25లో రూ.35వేల కోట్లు వస్తాయని ప్రతిపాదించగా, సవరించిన అంచనాల మేరకు రూ.25,807 కోట్లు సమకూరుతోంది. అంటే రూ.10వేల కోట్లు తేడా ఉంది. అయినా రాష్ట్ర ప్రభుత్వం ఈసారి పన్నేతర ఆదాయం అంచనాలను రూ.31,611.47 కోట్లుగా చూపింది. ఇందులో మైనింగ్ రాయల్టీ, సీవరేజీ ఫీజు, ఇసుక ద్వారా ఆదాయం కింద రూ.8 వేల కోట్ల వరకు వస్తాయని అంచనా వేసింది. మరో రూ.21 వేల కోట్ల వరకు భూముల అమ్మకాల ద్వారా సమకూర్చుకోవాలనే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం. ఇక కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ పద్దు కూడా పెంచారు. 2024–25లో రూ.21,636.15 కోట్లు వస్తాయని అంచనా వేయగా.. సవరణలో రూ.19,836 కోట్లు వస్తున్నట్టు చూపెట్టారు.

ఎక్సైజ్ ఆదాయమూ కీలకమే..

2024–25 సవరణ అంచనాల మేరకు ఎక్సైజ్ శాఖ ద్వారా రూ.25,617.53 కోట్లు సమకూరుతుండగా.. 2025–26లో రూ.27,623.36 కోట్లు వస్తాయని ప్రతిపాదించారు. ఇది సుమారు రూ.2 వేల కోట్లు అదనం. ఈ ఏడాదిలో వైన్ (ఏ4) షాపులకు లైసెన్సు గడువు ముగియనుండటంతో.. టెండర్లు పిలవనున్నారు. వైన్‌షాపుల కోసం వచ్చే దరఖాస్తుల ఫీజు రూపంలో ఈ మొత్తం సమకూర్చుకోవాలనేది ప్రభుత్వ ఆలోచనగా కనిపిస్తోందని అంటున్నారు.



పట్టణాలకు రూ.17,677 కోట్లు



నిర్వహణ వ్యయం రూ.7,639.57 కోట్లు

ప్రగతి పద్దు రూ. 8,796.73 కోట్లు

గతేడాది కంటే ప్రగతి పద్దు రూ.3 వేల కోట్లు అధికం

మూసీ రివర్‌ఫ్రంట్‌కు రూ.1,500 కోట్లు

2025-26 బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రతిపాదన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం 2025–26 బడ్జెట్‌లో పురపాలక శాఖకు రూ.17,677 కోట్లు కేటాయించింది. ఇందులో నిర్వహణ పద్దు రూ.7,639.96 కోట్లు ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరంలో అభివృద్ధి పనుల కోసం ప్రగతి పద్దు కింద రూ.8,796.73 కోట్లు ప్రతిపాదించింది. 2024–25 బడ్జెట్‌లో ఈ శాఖకు ప్రగతి పద్దు రూ.5,642.35 కోట్లు ఉండగా, ఈసారి రూ.3 వేల కోట్లు అదనంగా కేటాయించారు. ఇందులో పట్టణాభివృద్ధి కోసం రూ.2,957.58 కోట్లు, ప్రజారోగ్యం కోసం రూ.525.47 కోట్లు ప్రతిపాదించారు. గత సంవత్సరం సవరించిన అంచనాల్లో ఈ మొత్తం రూ.106.07 కోట్లు మాత్రమే కావడం గమనార్హం. తాజా బడ్జెట్‌లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) నిర్వహణ ఖర్చుల కోసం రూ.2,700 కోట్లు, వాటర్‌బోర్డుకు రూ.635 కోట్లు ప్రభుత్వం కేటాయించింది.

పట్టణాభివృద్ధి శాఖలోని వివిధ విభాగాలకు కేటాయించిన మొత్తం (రూ.కోట్లలో)

విభాగం	నిధులు
హైడ్రా	100
అమృత్	20
అమృత్ 2.ఓ సహాయక గ్రాంటు	130.34
కేంద్ర ప్రభుత్వ గ్రాంటు	316.20
కరీంనగర్ స్మార్ట్ సిటీ	88.94
వరంగల్ స్మార్ట్ సిటీ	156.52
యాదగిరి గుట్ట ఆలయ అభివృద్ధి అథారిటీ	200
ఖుడా	63.38
మూసీ రివర్ ఫ్రంట్	1,500
వేములవాడ అభివృద్ధి (వీటీడీఏ)	100
టీయూఎఫ్ఐడీసీ	344.37
అభివృద్ధి పనుల భూసేకరణకు కేంద్ర సాయం	18.11
20 కిలోలీటర్ల ఉచిత నీటి సరఫరాకు	
వాటర్‌బోర్డుకు రీయింబర్స్‌మెంట్	300
హైదరాబాద్ పాతబస్తీకి మెట్రో కనెక్టివిటీ	500
ఎయిర్‌పోర్టు మెట్రో కనెక్టివిటీ	100
ఎంఎంటీఎస్	50
మిలియన్ ప్లస్ సిటీస్‌కు కేంద్రం సాయం	419
ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ	100
రాష్ట్ర ఆర్థిక సంఘం కింద మున్సిపాలిటీలకు	1,380
ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్స్	100
స్వచ్ఛ భారత్ గ్రాంట్	226.41
పురపాలక సంఘ ఎన్నికలు	85
వైకుంఠధామాలకు	75
మంచిర్యాల, మహబూబ్‌నగర్, కొత్తగూడెం,	
పాల్వంచ పురపాలికల అభివృద్ధికి	754.70
ఖమ్మం నగరపాలక సంస్థ	30
వరంగల్ నగరపాలక సంస్థ	50
ఖమ్మం, వరంగల్ మినహా ఇతర కార్పొరేషన్లకు	50

పేదింటికి కొంతే..

కావాల్సింది రూ.22,500 కోట్లు.. ఇచ్చింది రూ.12,571 కోట్లు

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్లతోపాటు గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేసేందుకు రూ. 22,500 కోట్లు అవసరమన్నది గృహనిర్మాణ శాఖ లెక్కలు. కానీ, తాజా బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.12,571 కోట్లను ప్రతిపాదించింది. అయితే గత బడ్జెట్‌తో పోలిస్తే ఈ మొత్తం చాలా ఎక్కువ. గత బడ్జెట్‌లో రూ.7,740 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. గత ఆర్థిక సంవత్సరంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాదని ప్రభుత్వానికి స్పష్టత ఉంది. అయితే ప్రభుత్వం ఏర్పడిన 15 నెలల తర్వాత ఎట్టకేలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభమైంది. ఇందులో 72 వేల ఇళ్లకు సంబంధించి ముగ్గు పోసుకునే పనిని లబ్ధిదారులు ప్రారంభించారు. ఈనెలాఖరుకు తొలివిడత రూ.లక్ష వారి ఖాతాల్లో వేయాల్సి ఉంది. ఇప్పుడు నిధుల అవసరం చాలా ఉంది. దీంతో ప్రతిపాదించిన నిధులు, మంజూరు చేస్తున్న ఇళ్ల సంఖ్య ప్రకారం చూస్తే సరిపోదు. అయితే, ఈ ఆర్థిక సంవత్సరం ఆ ఇళ్లన్నీ పూర్తయ్యే పరిస్థితి ఉండదన్న అంచనాలో ప్రభుత్వం ఉంది. రెండు మూడు విడతల నిధుల విడుదలతోనే ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. దీంతో ఈ కేటాయింపులు సరిపోతాయన్న అంచనాతో ఉన్నట్టు సమాచారం. ఇక, ఈ ఇళ్లకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద నిధులు ఇవ్వాల్సి ఉంది. అక్కడి నుంచి ఎన్ని నిధులు వస్తాయో ఇంకా స్పష్టత రాలేదు.

వైద్య, ఆరోగ్య శాఖ కొంచెం మెరుగు

ఈసారి బడ్జెట్ రూ.12,393 కోట్లు

- గత బడ్జెట్‌తో పోలిస్తే రూ.825 కోట్లు అధికం
- రాజీవ్ ఆరోగ్యశ్రీకి రూ.1,143 కోట్లు



సాక్షి, హైదరాబాద్: వైద్య ఆరోగ్యశాఖకు 2025–26 సంవత్సరానికి బడ్జెట్‌లో రూ.12,393 కోట్లు కేటాయించారు. ఇది గత బడ్జెట్ రూ.11,468 కోట్లతో పోలిస్తే రూ.825 కోట్లు అధికం. ఈ కేటాయింపుల్లో నిర్వహణ పద్దు కింద రూ. 5,666.86 కోట్లు కేటాయించగా, అభివృద్ధి కోసం రూ. 6,070 కోట్లు కేటాయించారు. ఇందులో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు కలిపి రూ. 680.63 కోట్లు కేటాయించగా. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ హెల్త్ (డీఎంఈ)కు రూ. 3,011 కోట్లు కేటాయించారు. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ విభాగాధిపతికి రూ. 554.24 కోట్లు కేటాయించారు. ఆరోగ్య, కుటుంబసంక్షేమ శాఖ కమిషనర్ పరిధిలోని కార్యక్రమాలకు రూ. 1686.80కోట్లు కేటాయించడం గమనార్హం. ఇవి కాకుండా ఆయుష్ కోసం రూ.133.52 కోట్లు, డ్రగ్స్ కంట్రోల్ విభాగాధిపతికి రూ.2.10 కోట్లు కేటాయించారు.

ఆరోగ్యశ్రీ చెల్లింపులకు ఎలా?

రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకానికి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ. 1,143 కోట్లు కేటాయించింది. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షల వరకు పెంచడంతోపాటు వైద్యం ఖర్చుల స్లాట్లను కూడా పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో జిల్లా ఆసుపత్రులతోపాటు కొన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో కూడా రోగులకు చికిత్సలు పెరిగాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఆరోగ్యశ్రీ బకాయిలు రూ.1200 కోట్ల వరకు ఉన్నట్లు అంచనా. తమకు బకాయిలు చెల్లించాలని రెండు నెలల క్రితం నెట్‌వర్క్ ఆసుపత్రులు సమ్మె కూడా చేశాయి. ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో కేవలం రూ.1,143 కోట్లను కేటాయించడాన్ని ఆరోగ్య శ్రీ చెల్లింపులకు కొంత ఇబ్బంది కలిగించే విషయంగా ప్రైవేటు ఆసుపత్రులు చెప్తున్నాయి. ఇందులో నిర్వహణ ఖర్చులు పోను మిగిలే రూ. 695.79 కోట్లు మాత్రమే ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్‌కు చేరే అవకాశం ఉంది.

కేటాయింపులు ఇలా (రూ.కోట్లలో)...

తెలంగాణ వైద్య విధాన పరిషత్తుకు	98.40
ఎంఎన్‌జే అంకాలజీ ఇనిస్టిట్యూట్	60
నిమ్స్‌కు	11.40
టీవీవీపీ ఆసుపత్రుల స్థాయి పెంచేందుకు	164
టీవీవీపీ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్స పరికరాలకు	50
టీవీవీపీ సమగ్ర ఆసుపత్రుల నిర్వహణకు	116
హెల్త్ యూనివర్సిటీకి సాయం	2
టీవీవీపీ, ఎంఎన్‌జేలలో నూతన భవనాలు, ఇతర ఖర్చులకు	104
ఆయుష్మాన్‌భవ, ఇతర కేంద్ర మ్యాచింగ్	81.64
వైద్య కాలేజీల్లో ఉపకార వేతనాలు, స్టైపెండ్లు, ఇతర చార్జీలు	292.70
నర్సింగ్ కాలేజీల్లో ఉపకారవేతనాలు, స్టైపెండ్లు	55.94
వైద్య కాలేజీల్లో భవన నిర్మాణం, భవన సామగ్రి	565
ఆస్పత్రుల్లో డయాగ్నొస్టిక్స్ కొనుగోలు	200
సర్జికల్స్ కొనుగోలు	110
సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్స్ ఏర్పాటు	272.96
కొత్త నర్సింగ్ కాలేజీల నిర్మాణం	187.33



ప్రజల ఆకాంక్షలను బడ్జెట్ ప్రతిబింబించింది

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

సాక్షి, హైదరాబాద్: యావత్ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను బడ్జెట్ ప్రతిబింబించిందని అటవీ, దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖ ప్రశంసించారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల అవసరాలను గుర్తించి తగిన మేరకు కేటాయింపులు చేసిందన్నారు. ఈ బడ్జెట్ సమ్మిళిత వృద్ధిని ప్రతిబింబిస్తుందని భావిస్తున్నామని తెలిపారు. ఓ వైపు అభివృద్ధి.. మరోవైపు సంక్షేమాన్ని సమతుల్యం చేస్తూ రాష్ట్ర భవిష్యత్‌కు దిశానిర్దేశం చేసేలా బడ్జెట్ ఉందని ఒక ప్రకటనలో మంత్రి సురేఖ పేర్కొన్నారు.



వాస్తవాలకు దగ్గరగా వార్షిక బడ్జెట్

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ వాస్తవాలకు దగ్గరగా ఉందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద విప్‌లు బీర్ల ఐలయ్య, రామచంద్ర నాయక్, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, కొత్త మనోహర్ రెడ్డిలతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ బడ్జెట్‌తో అన్ని వర్గాలు లబ్ధి పొందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్‌లా ఫామ్‌హౌస్ నుంచి పరిపాలన చేయడంలేదన్నారు. అభివృద్ధిలో రాష్ట్రం దూసుకుపోతుంటే ఓర్వలేక రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారన్నారు.



హామీల ఎగవేత బడ్జెట్

ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్: రాష్ట్ర బడ్జెట్ హామీల ఎగవేత, దివాలా దిశగా ఉందని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అభివర్ణించారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. అరకొర బడ్జెట్‌తో అభివృద్ధి ఎలా చేస్తారో అర్థం కావడం లేదన్నారు. ఆరు గ్యారంటీల ఊసెత్తలేదని, అన్ని వర్గాలను మోసం చేశారని ఆరోపించారు. పాత పింఛన్ల పెంపుతో పాటు కొత్త పింఛన్ల జాడ లేదన్నారు. మైనారిటీలపై ఉన్న ప్రేమ బీసీలపై లేదని ఏలేటి పేర్కొన్నారు. ఆచరణలో అమలు కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేసిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై చీటింగ్ కేసు పెట్టాలన్నారు.



బడ్జెట్‌లో ఆత్మస్తుతి పరనింద

బీఆర్ఎస్ పక్షనేత మధుసూదనాచారి

సాక్షి, హైదరాబాద్: బడ్జెట్‌లో పరనింద ఆత్మస్తుతి తప్ప ఏమీ లేదని శాసన మండలి బీఆర్ఎస్ పక్షనేత ఎస్.మధుసూదనాచారి విమర్శించారు. బుధవారం మండలి మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ, పరిపాలన చేతగాక పలాయన వాదాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎంచుకుందన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ స్వర్ణయుగమైందని కొనియాడారు. అన్ని రంగాల ప్రజల ఆశల మీద బడ్జెట్ నీళ్లు చల్లిందన్నారు. బీసీలకు సంబంధించి ప్రతి సంవత్సరం రూ 20 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పారని, గతేడాది రూ. 9 వేల కోట్లు, ఇప్పుడు రూ.11 వేల కోట్లు కేటాయించి మాట తప్పారని విమర్శించారు.



నీటిపారుదల శాఖకు రూ.23,372 కోట్లు

తిరిగి అప్పుల చెల్లింపులకే పోనున్న రూ.9,877 కోట్లు

ప్రాధాన్య ప్రాజెక్టులకు రూ.7,120 కోట్లు కేటాయింపు

కాంగ్రెస్ సొంత ప్రాజెక్టు ప్రాణహితకు మొండిచెయ్యే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2025–26 బడ్జెట్‌లో నీటిపారుదల శాఖకు రూ.23,372.7 కోట్లు కేటాయించింది. ఇందులో ప్రగతి పద్దు కింద రూ.11,786.77 కోట్లు, నిర్వహణ పద్దు కింద రూ.11,543.87 కోట్లు చూపించింది. చార్జ్‌డ్ మొత్తం కింద రూ.42.06 కోట్లు కేటాయించింది. అయితే ఈ కేటాయింపుల్లో సింహభాగం రుణాల తిరిగి చెల్లింపులకే పోనున్నాయి. ప్రాధాన్య ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తిచేస్తామన్న ప్రభుత్వ హామీకి తగ్గట్లుగా నిధుల కేటాయింపులు జరగలేదు. 2024–25 బడ్జెట్‌లో నీటిపారుదల శాఖకు రూ.22,301 కోట్లు కేటాయించగా, తాజా బడ్జెట్‌లో రూ.1,071 కోట్లు పెంచారు. ఈ శాఖకు 2022–23లో రూ.19,349.24 కోట్లు, 2023–24లో రూ.29,766 కోట్ల బడ్జెట్ కేటాయింపులు జరిగాయి.

రుణమే పెనుభారం

కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డితో పాటు ఇతర ప్రాజెక్టుల నిర్మాణానికి తీసుకున్న భారీ రుణాలు తిరిగి చెల్లించడానికి సాగునీటి శాఖ బడ్జెట్ కేటాయింపుల్లోని సింహభాగం నిధులు వెళ్లనున్నాయి. రుణాల తిరిగి చెల్లింపులకు రూ.9,877.01 కోట్లు అవసరమని బడ్జెట్‌లో ప్రభుత్వం తెలిపింది. మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల రుణాల తిరిగి చెల్లింపులకు రూ.2,962.47 కోట్లు, కాళేశ్వరం కార్పొరేషన్ రుణాల తిరిగి చెల్లింపులకు రూ.6,914.54 కోట్లు కేటాయించారు. ఇక తెలంగాణ జలవనరుల సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీడబ్ల్యూఆర్ఐడీసీఎల్)కు రుణం కింద రూ.2,962.47 కోట్లు ప్రతిపాదించింది. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, పర్యవేక్షణకు నిధులు రూ.385.38 కోట్లకు తగ్గాయి.

ప్రాధాన్య ప్రాజెక్టులకు రూ.7,120 కోట్లు..

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి మూలధన పెట్టుబడుల కింద బడ్జెట్‌లో రూ.12,652 కోట్లు కేటాయించారు. ఇందులో ప్రాధాన్య ప్రాజెక్టులకు రూ.7120.27 కోట్లు ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టుల పూర్తితో 2024–25 ఆర్థిక సంవత్సరంలో 6,55,895 ఎకరాలు, 2025–26లో 9,42,778 ఎకరాలను సాగులోకి తేవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇలా 2025–26 నాటికి మొత్తం 15,98,673 ఎకరాల ఆయకట్టు సాగులోకి రావాల్సి ఉంది. అయితే, నిధులు అరకొరగానే కేటాయించటంతో గడువులోగా ఆయా ప్రాజెక్టులను పూర్తిచేయటం అనుమానంగా మారింది. ప్రాణహిత–చెవెళ్ల ప్రాజెక్టులో భాగంగా వచ్చే నెలలో తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మాణానికి సీఎం రేవంత్ శంకుస్థాపన చేస్తారని ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది. బడ్జెట్‌లో మాత్రం ఈ ప్రాజెక్టుకు నిధులను రూ.248.99 కోట్ల నుంచి రూ.32.22 కోట్లకు తగ్గించడం గమనార్హం.

ప్రాజెక్టులకు బడ్జెట్ కేటాయింపులు ఇలా (రూ.కోట్లలో)

ప్రాజెక్టు	2024-25 అంచనా	2024-25 సవరించిన అంచనా	2025-26 అంచనా
ప్రాధాన్య ప్రాజెక్టులు (కేటగిరీ-ఏ)			
ఎస్సారెస్పీ స్టేజీ-2	31	31	31
పిప్రి	-	-	0
కల్వకుర్తి	715	715	800
రాజీవ్ బీమా	35	-	299.16
ఎస్ఎల్‌బీసీ	800	800	900
నెట్టెంపాడు	105	130	144
దేవాదుల	245	245	245
శ్రీపాద ఎల్లంపల్లి	349.66	349.66	349.66
చిన్న కాళేశ్వరం	200	0	0
లోయర్ పెన్‌గంగా	133.83	133.83	179.13
డిండి	300	300	400
సీతారామ	687.81	687.81	643.04
కోయిల్‌సాగర్	429.86	429.86	81.78
పాలెంవాగు	17.02	3.76	16.94
నీల్వాయి	0	0	0
మత్తడివాగు	1.85	1.85	3
సదర్మాట్ బరాజ్	0	0	0
కేటగిరీ-బీ ప్రాధాన్య ప్రాజెక్టులు			
కాళేశ్వరం	1,676.46	1,676.46	2,685
ఫ్లడ్ ఫ్లో కెనాల్	265.21	265.21	299.16
మోడికుంటవాగు	86.68	86.68	43.4
ఇతర ప్రాజెక్టులు..			
పాలమూరు-రంగారెడ్డి	1,285	1,285	1,714
ప్రాణహిత-చెవెళ్ల	248.99	248.99	32.22
మంచిర్యాలకు రక్షణ గోడ	100	100	100
లెండి	27.5	27.5	42
కంతనపల్లి	20.04	20.04	
ఎస్సారెస్పీ స్టేజీ-1	140	140	100
నాగార్జునసాగర్	96.07	96.07	297.95



హ్యాపీ.. హైదరాబాద్
సంతోషాన్ని మించిన సంతృప్తి లేదని.. ఎన్ని కష్ట నష్టాలున్నా సంతోషం కోసం వెతుకుతూనే ఉన్నారు నగర వాసులు. ఉన్నదాంట్లోనే హ్యాపీగా లైఫ్ గడిపేస్తున్నారు. - సిటీప్లస్‌లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురువారం సా. 6.33 గం.	శుక్రవారం ఉ. 4.58 గం.

వాతావరణం
గరిష్టం/కనిష్టం 37.0/22.0
నగరంలో గురువారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 37, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.



అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. బుధవారం శాసన సభ సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పద్మారావు గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, బండారి లక్ష్మారెడ్డి, ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, మల్లారెడ్డి, వివేకానంద్, మర్రి రాజశేఖర్ రెడ్డి, సబితా రెడ్డి (ఎడమ నుంచి కుడికి).

ఈ 'సారీ' అంతంతే!



విత్త మంత్రి మల్లు భట్టివిక్రమార్క బుధవారం శాసన సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గ్రేటర్ నగరానికి గత ఏడాది వలెనే ఈసారి కూడా నిధులు అంతంతగానే దక్కాయి. ప్రధానంగా బల్దియా, హెచ్‌డీడీఏ, జలమండలికి పోయినసారి బడ్జెట్‌లో కేటాయించిన విధంగానే నిధులు ఇస్తామని ప్రభుత్వం పేర్కొంది. ఫ్యూచర్ సిటీలోనే ఏఐ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సీ)ని కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. మెట్రో రెండో దశ పనులకు రూ.1150 కోట్లు కేటాయించింది. కాగా.. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్‌కు బడ్జెట్‌లో రూ.219.95 కోట్లు కేటాయించింది. గత ఏడాది రూ.308.84 కోట్లు కేటాయించగా.. ఈసారి రూ.88.89 కోట్లు తక్కువ దక్కాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న మూసీ రివర్ ఫ్రంట్‌కు రూ.1,500 కోట్లు కేటాయించారు. మొత్తానికి ప్రస్తుత రాష్ట్ర పద్దులో గ్రేటర్‌కు ప్రాధాన్యం అంతంతే దక్కింది. - సాక్షి, సిటీబ్యూరో

గృహజ్యోతికి పెద్దపీట

గ్రేటర్‌లో 10.5 లక్షల మందికి లబ్ధి

గృహజ్యోతి పథకానికి ప్రభుత్వం బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించే గృహ వినియోగదారులకు 2024 మార్చి నుంచి జీరో విద్యుత్ బిల్లులు జారీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకానికి ప్రభుత్వం రూ.2080 కోట్లు కేటాయించింది. గ్రేటర్‌లో 10.5 లక్షల మంది లబ్ధిదారులు ఉచిత విద్యుత్ పథకాన్ని పొందుతున్నారు. వీరికి సంబంధించిన విద్యుత్ బిల్లులను ప్రభుత్వం చెల్లిస్తోంది. నగరవాసుల వాటాను ఏటా రూ.450 కోట్లు ప్రభుత్వం చెల్లిస్తోంది. ప్రస్తుతం కొత్త రేషన్ కార్డులు జారీ చేయనుంది. దీంతో ఈ లబ్ధిదారుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

మైనారిటీలకు నిరాశే

రాష్ట్ర బడ్జెట్‌లో మైనారిటీలకు నిరాశే మిగిలింది. మైనార్టీ సంక్షేమ శాఖలోని పలు విభాగాలకు గత మూడేళ్లుగా బడ్జెట్‌లో నిధులు పెంచకపోవడం ప్రభుత్వ వివక్షకు అద్దం పడుతోందని మైనారిటీలు ఆరోపిస్తున్నారు. గత బడ్జెట్‌లోనూ దాదాపు 3,500 కోట్లు మైనారిటీల కోసం ప్రవేశపెట్టారని, కానీ.. అందులో రూ.వెయ్యి కోట్లు కూడా విడుదల చేయలేదంటున్నారు. మరోవైపు హజ్ యాత్రకు, ఉర్దూ అకాడమీలకు సైతం ప్రభుత్వం నిధులు పెంచలేదని మైనారిటీలు పెదవి విరుస్తున్నారు.

జలమండలికి అదే పద్దు..

రాష్ట్ర బడ్జెట్‌లో జలమండలికి ప్రభుత్వం రూ.3,385 కోట్ల నిధులు కేటాయించింది. గత ఏడాది కూడా సరిగా ఇన్ని నిధులే కేటాయించడం గమనార్హం. గోదావరి రెండు, మూడు దశలు, ఇతరత్రా అభివృద్ధి కార్యక్రమాలకు సుమారు రూ. 5,500 కోట్ల కేటాయించాలని ప్రభుత్వానికి జలమండలి ప్రతిపాదించింది. అయితే.. కేవలం వివిధ పథకాలకు తీసుకున్న రుణాల చెల్లింపులకు పెద్దపీట వేసింది. ఉచిత తాగునీటికి గతేడాది మాదిరిగానే నిధులు కేటాయించింది. బడ్జెట్‌లో మొత్తం మీద జలమండలి అభివృద్ధి పనులకు తీసుకున్న రుణాల చెల్లింపునకు రూ.1450 కోట్లు, మురుగు పనుల కోసం తీసుకున్న రుణాల కింద రూ. 635 కోట్లు, సుంకిశాల ప్రాజెక్టు రుణం కింద రూ.1000 కోట్లు, ఉచిత నీరు రియింబర్స్‌మెంట్ కింద రూ. 300 కోట్లు కేటాయించింది. గత బడ్జెట్‌లోనూ రూ.3385 కోట్లు కేటాయించగా అందులో కేవలం రూ.800 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది.

మూసీ రివర్ ఫ్రంట్‌కు రూ.1,500 కోట్లు



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మూసీ రివర్ ఫ్రంట్ కోసం ప్రత్యేకంగా రూ.1,500 కోట్లు కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుంచి మూసీ పరివాహక ప్రాంతాల అభివృద్ధి పై దృష్టి పెడతామని వెల్లడిస్తున్న విషయం విదితమే. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రూ.1,500 కోట్ల భారీ మొత్తాన్ని కేటాయించడం విశేషం. ఈ నిధులతో మూసీ అభివృద్ధికి అడుగులు పడతాయని పలువురు నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

నగర మేయర్ హర్షం



రాష్ట్ర బడ్జెట్‌లో జీహెచ్ఎంసీకి అధిక నిధులు కేటాయించారంటూ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జీహెచ్ఎంసీ ఆర్థిక ఇబ్బందులు గట్టెక్కించేందుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

బల్దియాకి గతం మాదిరిగానే..

హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హై సిటీ) పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.2654 కోట్లు కేటాయించింది. గత సంవత్సర బడ్జెట్‌లో జీహెచ్ఎంసీ నుంచి ఎలాంటి ప్రతిపాదన లేకున్నా రూ. 2654 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఈసారి బడ్జెట్‌లో సైతం ఒక్క అంకె కూడా మారకుండా అవే నిధుల్ని బడ్జెట్‌లో పొందుపరిచింది. హైసిటీ కింద ఇప్పటికే రూ.7,032 కోట్ల పనులకు సీఎం లాంఛనంగా శంకుస్థాపన చేశారు. ఈ పనుల్ని చేసేందుకు బడ్జెట్‌లో క్యాపిటల్ నిధుల కింద రూ.3,000 కోట్లు, ఇతరత్రా గ్రాంట్ల కింద, భూసేకరణల కోసం రూ. 4,200 కోట్లు కేటాయించాలని, ఇతరత్రా పనులు.. అవసరాలకు వెరసి.. ఆమేరకు మరిన్ని నిధులు కేటాయించాల్సిందిగా జీహెచ్ఎంసీ విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం గత సంవత్సరం నాటి స్పందనే చూపించింది. ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లుగా సైతం గత సంవత్సరం రూ.411కోట్లు కేటాయించగా, ఈసారి అంతకంటే నామమాత్రంగా రూ.8 కోట్లు పెంచి రూ.419 కోట్లు కేటాయించారు. అంతకుమించి చెప్పుకోదగ్గవేమీ లేవు.

షరా మామూలు..

షరా మామూలుగా ఎప్పటి మాదిరిగానే వృత్తి పన్ను పరిహారం, ఎంవీ ట్యాక్స్ పరిహారం, సిబ్బంది జీతభత్యాలతో పాటు భూసేకరణ కోసం నామమాత్రంగా కేటాయించినప్పటికీ అవి చెప్పుకోదగ్గవిగా పరిగణనలోకి తీసుకోరు. ఈ లెక్కన బడ్జెట్‌లో జీహెచ్ఎంసీకి కేటాయించింది రూ.3,073 కోట్లు. జీహెచ్ఎంసీ దాదాపు రూ.7,600 కోట్ల మేర ఆశలు పెట్టుకోగా, కేటాయించిందివి. గత సంవత్సరం మొత్తం కేటాయింపులు రూ. 3,065 కోట్లు కాగా, ఇప్పటి వరకు రూ.902 కోట్లు మాత్రమే జీహెచ్ఎంసీకి అందాయి. బహుశా ఈ అనుభవాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకొని ఉండవచ్చని భావిస్తున్నారు.



బడ్జెట్ అంకెల్లో ..

హైసిటీ: రూ.2654 కోట్లు
ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్స్: రూ. 419 కోట్లు
- హైదరాబాద్ మెట్రో ఎయిర్‌పోర్ట్ ఎక్స్‌ప్రెస్ పద్దు కింద హైసిటీకి నిధులు కేటాయించారు.
- ఫైనాన్స్ కమిషన్‌గ్రాంట్స్ మిలియన్ ప్లస్ సిటీసీ పద్దు కింద కేటాయించారు.

నామ్‌కే వాస్తేగా..

భూసేకరణలకు గ్రాంట్స్: రూ.18.11 కోట్లు
వృత్తిపన్ను పరిహారం: రూ. 10 కోట్లు
ఎంవీ ట్యాక్స్ వాటా : రూ.10 లక్షలు
వేతనాలు,అలవెన్సులు:రూ. 12.16 కోట్లు

'కుడా'కు రూ. 63.38 కోట్లు

నగరంలోనే ఉన్న పాతబస్తీలోని ఖులీకుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా)కి రూ.63.38 కోట్లు కేటాయించారు.

సిటీ కమిషనరేట్‌కు గతంలో కంటే రూ.88.89 కోట్లు తక్కువగా

హైదరాబాద్ పోలీసు కమిషనరేట్‌కు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.219.95 కోట్లు కేటాయించింది. గత ఏడాది రూ.308.84 కోట్లు కేటాయించగా.. ఈసారి రూ.88.89 కోట్లు తక్కువ దక్కాయి. నగర కమిషనరేట్‌కు ఇచ్చిన మొత్తంలో ట్రాఫిక్ విభాగానికి రూ.6.75 కోట్లు, గణేష్ నిమజ్జనం ఏర్పాట్లకు రూ.15.5 కోట్లు, నగర నేర పరిశోధన విభాగానికి రూ.40 లక్షలు, కమ్యూనిటీ పోలీసింగ్‌కు రూ.50 లక్షలు దక్కాయి. మహిళలు, చిన్నారుల భద్రతకు ఉద్దేశించిన సేఫ్ సిటీ ప్రాజెక్టుకు సంబంధించిన నిర్భయ ఫండ్‌కు మ్యాచింగ్ గ్రాండ్ కోసం రూ.50 కోట్లు కేటాయించింది. ప్రస్తుతం నగర పోలీసు కమిషనరేట్ కొనసాగుతున్న తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ పనులకు రూ.2 కోట్లు, పోలీసుస్టేషన్లలో సిటిజన్ ఫ్రెండ్లీ సేవలకు రూ.25 లక్షలు, సీసీ కెమెరాల కోసం రూ.10 కోట్లు, ట్రాఫిక్ నిర్వహణకు అవసరమైన టెక్నాలజీ సమీకరణకు రూ.5 కోట్లు, వ్యవస్థీకృత నేరాల నిరోధానికి ఉపకరించే సాంకేతిక పరిజ్ఞానం కోసం రూ.5 కోట్లు, నూతన పోలీసు స్టేషన్ భవనాలు, సిబ్బంది బ్యారెక్‌లు, కార్యాలయాని నిర్మాణానికి రూ.132.25 కోట్లు ప్రభుత్వం కేటాయించింది.

హైడ్రాకు రూ.100 కోట్లు..

రాజధానిలో జలవనరులతో పాటు ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ఏర్పాటైన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)కి ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించింది. అక్రమ నిర్మాణాల కూల్చివేత, చెరువుల్లో పూడిక తీత కోసం హైడ్రా బుల్డోజర్లు వినియోగిస్తోంది. వీటిని ప్రస్తుతం అధికారులు లీజు ప్రాతిపదికన తీసుకుంటున్నారు. మరోపక్క చెరువులకు సంబంధించిన ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్లను సాంకేతికంగా నిర్ధారిస్తున్నారు. దీనికోసం గూగుల్ సహా వివిధ సంస్థల నుంచి ఆన్‌లైన్ మ్యాప్స్ సేవలు తీసుకుంటోంది. వీటితో పాటు ఇతర దైనందిన ఖర్చుల కోసం హైడ్రా ఈ నిధులను వెచ్చించనుంది. ఇప్పటికే చెరువులు పునరుజ్జీవానికి అవసరమైన నిధులను హెచ్ఎండీఏ అందిస్తున్న విషయం విదితమే.

మెట్రో రెండో దశ పరుగు పెట్టేలా..



హైదరాబాద్ మెట్రో రైల్‌కు ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో రూ.1150 కోట్లు కేటాయించింది. రెండో దశలో రెండు విభాగాలుగా మెట్రో విస్తరణకు ప్రణాళికలను రూపొందించింది. ఇందులో మొదటి విభాగంలో ప్రతిపాదించిన 5 కారిడార్లలో 76.4 కిలోమీటర్ల మెట్రో నిర్మాణానికి సుమారు రూ.24000 కోట్లకు పైగా ఖర్చు కానున్నట్లు అంచనా. ఈ మేరకు డీపీఆర్‌లు కూడా సిద్ధం చేసి కేంద్రం ఆమోదానికి పంపించారు. ఇప్పటి వరకు కేంద్రం నుంచి ఎలాంటి ఆమోదం లభించకపోయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో రైల్‌లో వివిధ రకాల అవసరాల కోసం రూ.1150 కోట్లు కేటాయించింది. గత సంవత్సరం కూడా రూ.1100 కోట్లు కేటాయించగా ఈ ఏడాది బడ్జెట్‌లో మరో రూ.50 కోట్లు పెంచింది.

హెచ్ఎండీఏకు సేమ్ టు సేమ్..

హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ)కు బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించారు. హెచ్ఎండీఏ చేపట్టే వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాల కోసం ఈ నిధులను వినియోగించే అవకాశం ఉంది. ముఖ్యంగా రహదారుల విస్తరణ, పార్కుల అభివృద్ధి, ఔటర్‌రింగ్ రోడ్డు మార్గంలో పచ్చదనం పరిరక్షణ వంటి వివిధ రకాల అవసరాలు,మౌలిక సదుపాయాల కోసం వినియోగించనున్నారు. గత బడ్జెట్‌లో కూడా రూ.500 కోట్లు కేటాయించిప్పటికీ నిధులు విడుదల చేయలేదు. ఆ కేటాయింపులనే ఈ బడ్జెట్‌లో మరోసారి ప్రకటించినట్లు అధికారులు అభిప్రాయపడుతున్నారు.

'ఫ్యూచర్'కు ప్రాధాన్యం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఫ్యూచర్ సిటీలోనే ఏఐ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సీ)ని కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. బుధవారం ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో ఈ సిటీని ప్రముఖంగా ప్రస్తావించారు. ఐటీ, ఫార్మా, స్పోర్ట్స్ హబ్‌గా దీన్ని తీర్చిదిద్దనున్నట్లు ప్రకటించారు. శంకర్‌పల్లిలో 250 మెగావాట్ల విద్యుత్ బ్యాటరీ స్టోరేజీ యూనిట్ సహా కోహెడలో రూ.47 కోట్లతో చేపల మార్కెట్‌ను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు.

200 ఎకరాల్లో ఏఐ సిటీ..

- దేశానికే తలమానికంగా నెట్‌జీరో ఫ్యూచర్ సిటీని రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తోంది. శ్రీశైలం, నాగార్జునసాగర్ రహదారుల మధ్య 56 గ్రామాల్లో, 765 చ.మి.మి విస్తీర్ణంలో దీన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఫ్యూచర్ సిటీలో మౌలిక వసతుల కల్పనకు రూ.వంద కోట్లు కేటాయించింది.
- ఫ్యూచర్ సిటీలో ప్రత్యేకంగా 200 ఎకరాల్లో ఏఐ సిటీని నెలకొల్పనున్నట్లు ప్రభుత్వం తన వార్షిక బడ్జెట్‌లో ప్రకటించింది. పారిశ్రామిక దిగ్గజ కంపెనీలన్నీ ఇక్కడ తమ సంస్థలను నెలకొల్పనున్నాయి. ఏఐ విశ్వవిద్యాలయం సహా డేటా సెంటర్లు, కంప్యూటింగ్ సౌకర్యాలు, పౌరులకు అవగాహన కల్పించే కేంద్రాలను ఇక్కడ స్థాపించనుంది. ముచ్చర్ల కేంద్రంగా 150 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీ ద్వారా ఏటా 30 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. చేపల ఎగుమతిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నగర శివారు కోహెడలో ఎక్స్‌పోర్ట్ ఓరియెంటెడ్ హోల్ సేల్ చేపల మార్కెట్‌ను నిర్మించనున్నట్లు ప్రకటించింది. బడ్జెట్‌లో ఇందుకు రూ.47 కోట్లు కేటాయించింది.



రాష్ట్ర బడ్జెట్‌లో గ్రేటర్ నగరానికి దక్కిన కేటాయింపులివీ

- జీహెచ్ఎంసీకి రూ. 3,073 కోట్లు
- జలమండలికి రూ.3,385 కోట్లు
  - రుణాల కోసం రూ.3,085 కోట్లు
  - ఉచిత నీటికి రూ.300 కోట్లు
- గత ఏడాది కంటే పైసా పెంచని ప్రభుత్వం
- హైదరాబాద్ మెట్రో రైల్‌కు రూ.1150 కోట్లు
- పాతబస్తీలో ఆస్తుల సేకరణ, రోడ్ల విస్తరణకు అవకాశం
- హెచ్ఎండీఏకు రూ.500 కోట్లు
- అభివృద్ధి కార్యక్రమాల కోసం కేటాయింపు
- ఔటర్ అప్పుల కోసం రూ.200 కోట్లు
- గృహజ్యోతి పథకానికి రూ.2080 కోట్లు
- నగర కమిషనరేట్‌కు రూ.219.95 కోట్లు
- గత ఏడాది కేటాయింపులు రూ.308.84 కోట్లు
- ఈసారి సీసీ కెమెరాల నిర్వహణకు రూ.10 కోట్లు
- ట్రాఫిక్‌కు రూ.6.75 కోట్లు, సీసీఎస్‌కు రూ.40 లక్షలు
- వైద్యానికి కేటాయింపులు నామమాత్రమే..
- నిమ్స్, ఎంఎన్‌జే మినహా మిగతావాటికి మొండిచేయి
- హైడ్రాకు రూ.100 కోట్లు

సర్కారు ఆస్పత్రులకు కొంతే..!

మహా నగరంలో ప్రభుత్వాస్పత్రులకు బడ్జెట్ కేటాయింపుల్లో నిరాశే మిగిలింది. జనాభా అవసరాలకు అనుగుణంగా నగరంలోని ఆస్ప త్రులు, వైద్య కళాశాలల విస్తరణ, అభివృద్ధికి ఈ బడ్జెట్‌లో కేటాయింపులు కనిపించలేదు. నిమ్స్, ఎంఎన్‌జే మినహా గాంధీ ఆస్పత్రితో మిగతా వాటికి పైసా విదల్చలేదు. ఉస్మానియా ఆస్పత్రి కొత్త భవనానికి రూ.2,700 కోట్లు కేటాయించగా, నిమ్స్‌లో అత్యవసర పరికరాల కొనుగోలుకు రూ.16.50 కోట్లు, ఆరోగ్య శ్రీ పథకంలో అర్హులు కాని నిరుపేద కుటుంబాల చికిత్సల కోసం నిమ్స్‌కు రూ.7.90 కోట్లు, సహాయక గ్రాంట్లుగా మరో రూ.11.40 కోట్లు, మూల ధన పనుల కోసం రూ.50 కోట్లు కేటాయించారు. ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి భవనాలకు రూ.4 కోట్లు, సహాయక గ్రాంట్లు మరో రూ.60 కోట్లు కేటాయించారు. టిమ్స్ ఆస్పత్రులకు రూ.లక్ష, జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులు, సహాయకులకు రాయితీపై ఆహారం అందించడానికి రూ.169 కోట్లు కేటాయించారు. తెలంగాణ ఔషధ, సుగంధ మొక్కల బోర్డుకు రూ.కోటి, రామంతాపూర్ ప్రభుత్వ హోమియోపతి ఫార్మసీ మందుల కొనుగోళ్లు, ఇతర మౌలిక సదుపాయాలకు రూ.29 కోట్లు కేటాయించారు.

సుందర మూసీకి అడుగులు..

● మూసీ పునరుజ్జీవానికి ప్రత్యేక మాస్టర్ ప్లాన్ ● సామాజిక, ఆర్థిక సర్వే-2025లో వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: మూసీకి పునరుజ్జీవం కల్పించి తీరాల్సిందేనని రేవంత్ సర్కారు కంకణం కట్టుకుంది. నదిని శుభ్రపరిచి, పునరుద్ధరణ చేయడంతో పాటు దాని పరిసరాలను సుందరీకరించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. జీహెచ్ఎంసీ పరిధిలో 55 కి.మీ. ప్రవహించే ఈ మూసీ నదికి పునరుజ్జీవం కల్పించాలని మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) లక్ష్యంగా పెట్టుకుంది. చారిత్రక పరిసరాలు, మార్కెట్ ప్లేస్‌లను పునరుద్ధరించి..కొత్త వాణిజ్య, నివాస కేంద్రాలను సృష్టించడం, వారసత్వం, సంస్కృతిని పరిరక్షించడం, పర్యాటకాన్ని ప్రోత్సహించడం, మెరుగైన ప్రయోజనాలను అందిస్తుందని ఈమేరకు సామాజిక, ఆర్థిక సర్వే-2025లో వెల్లడించారు.

110 చ.కి.మీ. వరకూ..

- నగరంలో 55 కి.మీ. నదికి (ప్రతివైపు కిలో మీటరు) వరకు ఇరువైపులా 110 చదరపు కిలోమీటర్ల వరకు అభివృద్ధి చేయనున్నారు. మూసీకి ప్రత్యేక మాస్టర్ ప్లాన్‌ను రూపొందించనున్నారు. మూసీ పునరుజ్జీవంతో 200 చదరపు కిలోమీటర్ల వరకు వృద్ధి అవకాశాలు మెరుగవుతాయి.
- ఉస్మాన్‌సాగర్ డ్యామ్ నుంచి గౌరెల్లి వరకు, హిమాయత్ సాగర్ డ్యామ్ నుంచి బాపూఘాట్ వరకు మూసీ నదిని సుందరీకరించనున్నారు. అలాగే మూసీ నదిపైన ఔటర్ రింగ్ రోడ్డు వరకు 17 వంతెనలను నిర్మించనున్నారు.
- ఇప్పటికే మూసీ నది గర్భం, బఫర్ జోన్లలో ఆక్రమణల తొలగింపుతో పాటు భూసేకరణ, పునరావాసం గణన పూర్తయింది.

నగరవాసుల సమస్యల పరిష్కారానికి రూ.7,032 కోట్ల పనులు

గ్రేటర్ నగరంలో ప్రజలెదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి పలు ఫ్లై ఓవర్ల నిర్మాణం, వరద నిర్వహణ, పాదచారులు సాఫీగా నడిచేందుకు రూ. 5,942 కోట్ల వ్యయంతో హైసిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)పథకానికి రూపకల్పన చేయడంతో పాటు కేబీఆర్ పార్కు వద్ద ఆరు జంక్షన్లలో ఫ్లై ఓవర్ల నిర్మాణానికి మరో రూ, 1,090 కోట్లు కేటాయించినట్లు 'తెలంగాణ సోషియో ఎకనామిక్-2025' నివేదికలో ప్రభుత్వం పేర్కొంది. ప్లానింగ్ విభాగం రూపొందించిన ఈ నివేదికలో ఘన వ్యర్థాల నిర్వహణలో భాగంగా రోజుకు వెయ్యి టన్నుల ఆర్డీఎఫ్‌తో జవహర్‌నగర్‌లో గత ఆగస్టు నెలలో చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ ప్రారంభమైందని పేర్కొంది. ఇంకా.. ల్యాండ్‌ఫిల్ గ్యాస్‌తో 1.5 మెగావాట్ల గ్యాస్- ఇంజిన్ పవర్‌ప్లాంట్ కూడా పని చేస్తోందని తెలిపింది. సైక్లిస్టులు, పాదచారుల కోసం పర్యావరణ హితంగా, ఆహ్లాదకరంగా ఉండేలా హుస్సేన్‌సాగర్ చుట్టూ 10 కి.మీ ఎలివేటెడ్ సైకిల్ ట్రాక్, పాదచారుల కోసం 6 కి.మీ నడక మార్గాలకు ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొంది.

200 ఎకరాలు పరిరక్షించిన హైడ్రా

రాజధానిలోని జలవనరులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం గత ఏడాది ద్వితీయార్థంలో ఏర్పాటైన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) పనితీరును ప్రభుత్వం సామాజిక-ఆర్థిక ముఖచిత్రంలో (తెలంగాణ సోషియో ఎకనమిక్ ఔట్‌లుక్-2025) ప్రభుత్వం ప్రస్తావించింది. ఈ విభాగం ఇప్పటి వరకు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడినట్లు పేర్కొంది. వీటిలో చెరువులు, పార్కులతో పాటు ఖాళీ స్థలాలు ఉన్నట్లు వివరించింది. హైడ్రాలో అంతర్భాగంగా ఉన్న డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) 2024లో 4684 ఎమర్జెన్సీ ఆపరేషన్స్ చేపట్టిందని, వీటిలో ప్రమాదాలతో పాటు రెస్క్యూలు ఉన్నాయని సర్కారు తెలిపింది. ప్రస్తుతం 12 చెరువుల్లో పునరుజ్జీవం కల్పించడమే లక్ష్యంగా హైడ్రా పని చేస్తోందని, దీనిలో ఉన్న 42 డీఆర్ఎఫ్ బృందాలను 72కు పెంచనున్నట్లు పేర్కొంది.

చెరువుల అభివృద్ధికి ఆటంకాలు లేకుండా చేస్తాం: రంగనాథ్



సాక్షి, సిటీబ్యూరో: ఔటర్ రింగు రోడ్డు పరిధిలో చెరువుల అభివృద్ధికి ఉన్న ఆటంకాలన్నీ తొలగిస్తామని, ఈ నేపథ్యంలో సీఎస్ ఆర్ నిధులతో కార్పొరేట్, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కోరారు. చెరువుల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు వెచ్చిస్తున్న, వెచ్చించడానికి సిద్ధంగా ఉన్న దాదాపు 72 సంస్థల ప్రతినిధులతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుధవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., తమ ప్రయత్నంలో భాగంగా చెరువుల సుందరీకరణకే పరిమితం కారాదని, చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టాలని సంస్థలకు సూచించారు. మాదాపూర్‌లోని సున్నం చెరువు, తమ్మిడికుంట, కూకట్‌పల్లిలోని నల్ల చెరువు, ఉప్పల్‌లోని నల్లచెరువు, అంబర్‌పేటలోని బతుకమ్మకుంట, పాతబస్తీలోని బమ్రుక్నుద్దీన్ దౌలా చెరువులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఔటర్ రింగు రోడ్డు పరిధిలో 1025 చెరువులుండగా.. ఇందులో 61 శాతం జాడ లేకుండా ఉన్నాయని, ఉన్న 39 శాతం చెరువులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని కమిషనర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా చెరువులు అభివృద్ధి చేస్తున్న సంస్థలకు క్షేత్ర స్థాయిలో ఎదురౌతున్న ఇబ్బందులను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ఎఫ్‌టీఎల్ నిర్ధారణ, ఆక్రమణల తొలగింపు, మురుగు కాలువలను మళ్లించడం, అనుమతుల కోసం వివిధ శాఖల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఇబ్బందిగా పరిణమించాయని పలు సంస్థల ప్రతినిధులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. చెరువుల అభివృద్ధికి ఉన్న ఆటంకాలన్నీ తొలగిస్తాం..వివిధ శాఖల మధ్య సమన్వయ పాత్ర హైడ్రా పోషిస్తుంది, అంతేకాకుండా సింగిల్ విండో మాదిరి అనుమతులు మంజూరయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఎన్ఆర్ఎస్‌సీ, సర్వే ఆఫ్ ఇండియా, రెవెన్యూ రికార్డులతో పాటు.. విలేజ్ మ్యాప్‌ల ఆధారంగా ఎఫ్‌టీఎల్ నిర్ధారణ కూడా మే నెల నాటికి పూర్తవుతుందని.. దీనిని ఎంతో పారదర్శకంగా చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ లేక్స్ విభాగం అదనపు కమిషనర్ కిల్లు శివకుమార్‌నాయుడు, తెలంగాణ సోషల్ ఇంపాక్ట్ గ్రూప్ సీఎస్ ఆర్ వింగ్ డైరెక్టర్ అర్చనా సురేష్‌తో పాటు హెచ్ఎండీఏ, జీహెచ్ ఎంసీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అమ్మా..ఇదే నా చివరి కాల్..

● ఆత్మహత్య చేసుకున్న సినీ కెమెరామెన్



ఆత్మహత్య చేసుకున్న మహ్మద్ నవాజ్

బంజారాహిల్స్: భార్య వేధింపులు తట్టుకోలేక సినీ కెమెరామెన్ ఆత్మహత్య చేసుకున్న ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..శ్రీకృష్ణానగర్‌లో నివసించే తెలుగు సినీ కెమెరామెన్ మహ్మద్ నవాజ్.. శ్వేత అనే యువతిని పెళ్లి చేసుకున్నాడు. అయితే కొంతకాలంగా తనను భార్య వేధిస్తున్నదని, తాను ఇంతటితో జీవితాన్ని ముగించదలచుకున్నానని, ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ తన తల్లి సబేరాబేగంకు ఫోన్ చేసి చెప్పాడు. తనను మానసికంగా, శారీరకంగా వేధించడమే కాకుండా కొంతమందితో కలిసి కొట్టిస్తున్నదని, ఈ వేధింపులు తట్టుకోలేకపోతున్నానని తల్లికి చెప్పాడు. తాను చనిపోతున్నానని, నువ్వు, చెల్లి జాగ్రత్త అని చెప్పడమే కాకుండా ఇదే తన చివరి కాల్ అంటూ ఫోన్ పెట్టేశాడు. తాను తేరుకునే లోపే తన కొడుకు మరణ వార్త వినాల్సి వచ్చిందని తల్లి సబేరాబేగం కన్నీరుమున్నీరయ్యారు. నవాజ్‌కు చెందిన ఆస్తితో పాటు శ్వేత పెద్ద ఎత్తున డబ్బులు డిమాండ్ చేసిందని, పోలీసులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించిందని, ఈ నేపథ్యంలోనే తన కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడని ఆమె జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కాగా నవాజ్, ఆయన భార్య శ్వేత కొంతకాలం క్రితం జీడిమెట్లలో నివసించారు. ఇటీవలే కృష్ణానగర్‌కు వచ్చారు. నవాజ్ మీద గతంలోనే శ్వేత బాన్సువాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇటీవల జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో కూడా భర్తపై ఫిర్యాదు చేసింది.

సారీ నాన్నా..పరీక్షలు బాగా రాయలేదు

● ఆత్మహత్య చేసుకున్న ఇంటర్ విద్యార్థిని

బంజారాహిల్స్: పరీక్షలు బాగా రాయలేదని ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..వెంకటగిరి హైలాంకాలనీలో నివసించే జి.సుమ (17) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలులో బీసీ గర్ల్స్ హాస్టల్‌లో ఉంటూ ఇటీవలే ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రాసింది. అనంతరం నగరంలోని వెంకటగిరిలో నివసించే తండ్రి యెర్రా స్వామి ఇంటికి వచ్చింది. ఇంటికి వచ్చిన తర్వాత ముభావంగా ఉండడంతో ఏం జరిగిందని యెర్రా స్వామి కూతురు సుమను అడిగాడు. తాను పరీక్షలు బాగా రాయలేదని బాధతో చెప్పింది. ఏమి కాదులే మంచిగా ఉండు..మళ్లీ పరీక్షలు రాద్దువులే అంటూ తండ్రి భరోసా ఇచ్చాడు. ఎప్పటి లాగే ఉదయం యెర్రాస్వామితో పాటు ఆయన భార్య పనులకు వెళ్లిపోగా ఇంట్లో ఒంటరిగా ఉన్న సుమ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భద్రతా సిబ్బంది లేకుండా పర్యటించొద్దు

● ఎమ్మెల్యే రాజాసింగ్‌కు పోలీసుల సూచన

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం కేటాయించిన (1+4) భద్రతా సిబ్బంది, బుల్లెట్ ప్రూఫ్ వాహనం లేకుండా బయట తిరగొద్దని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు మంగళ్‌హాట్ పోలీసులు సూచించారు. ఈ మధ్య తరచుగా వస్తున్న బెదిరింపు కాల్స్ నేపథ్యంలో మరింత జాగ్రత్తగా ఉండాల్సిందిగా పోలీసు శాఖ హెచ్చరించింది. రాజాసింగ్ ఎటువంటి భద్రతా సిబ్బంది లేకుండా నివాసం, కార్యాలయం నుంచి బయలుదేరి ప్రజల మధ్య పర్యటిస్తున్నారని, భద్రతా కారణాల దృష్ట్యా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు అభ్యర్థించారు.

PUBLIC NOTICE

The General Public are hereby informed that, my client, **M/s. DCB Bank Ltd(a Scheduled Bank), incorporated under the Companies Act, 1956 and having its registered office at 601 & 602, Peninsula Business Park, 6th floor, Tower A, Senapati Bapat Marg, Lower Parel, Mumbai, Maharashtra, India, 400013** and also having Branch offices at Secunderabad and Hyderabad; are into the business of providing credit facility to customers through Housing and Mortgage Loans.

It is informed that, my client has engaged the services of Maruti Air Couriers & Cargo Pvt Ltd (Courier Company) for transportation of the Original property documents to the Original Document Holding and Management Depository at Mumbai, Maharashtra (Location)

It is further informed to the General Public that the original title documents pertaining to the properties as mentioned below have been destroyed in the fire accident occurred during the transit and shifting of documents from branch to depository on 26th November, 2024.

1. File No.: DRHL46900634057, **Customer Name: SAPPA RAJESH NAIDU, Property Details:** Semi-finished Flat No. 101 (In First Floor), with built up area of 1280 Sft., (Including common area and Car Parking).along with an total UDS of land admeasuring 28.825 Sq. Yds (out of 586.66 Sq. Yds), on Open Land, in SY Nos. 70 and 74/D of "Sri Sai Soroja Heaven" situated at Nizampet Village and Grampanchayat, Quthbullapur Mandal, Ranga Reddy District. **Documents Details: 1.** Original Regd. Sale Deed Bearing Doc. No. 8275/2016 Dated : 30-06-2016 In Favour Of Sappa Rajesh Naidu And Sappa Durga Praveena Executed By Shenigaram Ram Reddy. **2.** Original Regd. Memorandum Of Deposit Of Title Deeds Bearing Doc. No. 8492/2016 Dated : 05-07-2016 In Favour Of Can Fin Homes Ltd Executed By Sappa Rajesh Naidu And Sappa Durga Praveena **3.** Regd. Release Of Modt In Favour Of Sappa Rajesh Naidu And Sappa Durga Praveena Executed By Can Fin Homes Ltd Doc. No. 28635/2024 Dated 16/1/2024 **4.** Modt In Favour Of Dcb Bank Limited Doc. No.28636/2024 Dated 16/11/2024

2. File No.: DRBL46600637875, **Customer Name: KAMALAPURI SUBBA SUJIT KUMAR, Property Details:** Residential Semi-Finished Flat No. 101, in First Floor of "SAI LAKSHMI BHAVAN", with a plinth area of 1250.00 Sft, (Including common area & Car Parking), together with an undivided shareof land admeasuring area 46.25 Square Yards, (Out of Total land admeasuring area 400.00 SquareYards), Constructed on Plot No. 511, Covered Under Block No. 49, Situated at Padma Nagar Colony-II, of Quthbullapur Village and Mandal, Under GHMC Circle, Medchal-Malkajgiri District, Telangana State. **Documents Details:** 1.Original Sale Deed Doc.No.28761/2019 Dated 02.12.2019.

3. File No.: DRHL46600636163, **Customer Name: MIRYALA SREEKANTH, Property Details:** Semi-Finished Flat No.204, in Second Floor of "Vamshi Elina", having plinth area of 1175 Sft., including common area and Car Parking area of 100 Sft., in Stilt Floor, together with undivided share of land admeasuring 46.765 Sq.Yds., out of 2081 Sq.Yds., on Plot No.7, admeasuring 2081 in Sy.No.221 situated at Bagh Hayathnagar, Hayathnagar Revenue Mandal, Ranga Reddy District, under LB Nagar Municipal Circle of GHMC. **Documents Details: 1.** Modt In Favour Of Dcb Bank Ltd Doc No. 5622/2024 Dt 12/11/2024 **2.** Registered Sale Deed Executed By Mr.Boyapally Dasharath Reddy Rep By Agpa Holder M/S Jnr Builders In Favour Of Mr.Miryala Sreekanth Doc No. 5412/2024 Dt 30/10/2024

4. File No.: DEMHHYD00635458, **Customer Name: GANDAVARAPU SOWJANYA, Property Details:** Flat No. 207, in the Second Floor of the said property named " Shambhavi Residency" having a built up area of 1204 SFT (including common areas and amenities and Car Parking) in the basement of the said property together with an UDS of 24 Sq. Yds in the said land consisting of Plot Nos.202 & amp; 209, in SY Nos. 61, 62, 64, 65, 67, 68/1, 68/2, 69, 69/1, 70, 70/1, 71, 72, 72/1, 73, 76, 77, 85, 85/1, 86, 94, 120 to 126, situated at Sreeramnagar Colony, Secretariat Colony of Poppalguda Village and GP, Rajendranagar Mandal now under Gandipet Mandal, Ranga Reddy District TS. **Documents Details: 1.** Regd. Sale Deed In Favour Of Mr.Vattem Venkata Ravi Kumar By Vengalakeshav Bhat Doc No. 11860/2018 Date 14-12-2018. **2.** Regd Sale Deed In Favour Of Gandavarapu Soujanya Executed By Vattem Venkata Ravi Kumar Doc No.15371/2024 Dt 06/11/2024

5. File No.: DRHL46600636233, **Customer Name: B RAJKUMAR, Property Details: Schedule of the Property:-I:** All that the House bearing Municipal No. 7-3-67/4/1, on Plot bearing No. 137/A/1, IN Survey No.101, admeasuring 50.00 Square Yards equivalent to 41.8 Square Meters, with a built up area of 100.00 Square feet (A.C.C.), Situated at Gaganpahad Village, GHMC Rajendra nagar Circle, Ranga Reddy District, Telangana State. **Schedule of the Property:- II:** All that the House bearing Municipal No. 7-3-67/4/1/1, on Plot bearing No. 137/A/2, in Survey No.101, admeasuring 50.00 Square Yards equivalent to 41.8 Square Meters, with a built up area of 100.00 Square feet (A.C.C.), Situated at Gaganpahad Village, GHMC Rajendra nagar Circle, Ranga Reddy District, Telangana State. **Documents Details: 1.** Modt In Favour Of Dcb Bank Doc No 9566/2024 Dt 02/11/2024 **2.** Reg Gift Settlement Deed Doc No. 65/1998 In Favour Of S Bala Naramma Executed By D Bhemamma Dt 08/01/1998 **3.** Regd Sale Deed Bearing Doc No. 1385/2016 In Favour Of K Amarnath Yadav Excected By S Bala Narasamma Dt 15/02/2016 **4.** Regd Sale Deed In Favour Of Applicant Doc No. 9544/2024 Dt 02/11/2024 **5.** Regd Sale Deed Doc No. 32/2000 In Favour Of S Kurmaiah Executed By Devaiah Dt 04/01/2000 **6.** Org Sale Deed Bearing Doc No. 1384/2016 In Favour Of K Amarnath Yadav Executed By D Kurmaiah Dt 15/02/2016

6. File No.: DRBLGHT00636999, **Customer Name: TEKULA MAHIPAL REDDY, Property Details:** Flat No.103, in First Floor, of SLV SUN FLOWER;. having plinth area 1395 Sft, (including common area and wall thickness & Car Parking area in Stilt Floor), together with undivided share of land in above said plot admeasuring area 61.97 Square Yards, equivalent to 51.806 Square Metres, out of area 814 Square Yards, being constructed on Open Plot Nos.7 Northern Part, 381 Square Yards, and 8, admeasuring 433 Square Yards, Totally 814, Square Yards, out of 5002.00 Square Yards in Survey Nos.764/P, 766/P, 769/P, 770/P, 771/P, 772/P, 776, 777/P, 783, 784, Situated At Srighda Colony, & Quot; Near Teacher & #39;S Colony&Quot;, Bhongir Town And Mandal, Under Bhongir Municipality, Yadadri- Bhongir District, Telangana. **Documents Details:** 1.Modt In Fav Of Dcb Bank Ltd Doc No.7861/2024 Dt 05/11/2024

7. File No.: DRHLSEC00637154, **Customer Name: NUSRATH BEGUM, Property Details:** RCC House constructed on Portion of Plot No.54, land admeasuring 100 sq.yds., or 83.61 sq.mtrs., having built up area 700 sft., in Survey No.43/B, situated at Essa Colony, Kothapet Village, Balapur Mandal, under Jalpally Municipality, Ranga Reddy District **Documents Details: 1.** Modt In Favour Of Dcb Bank Doc No.13690/2024 Dt 12/11/2024 **2.** Registered Sale Deed Executed By Shaik Esa In Favour Of Ms.Nusrath Begum, Doc No.13670/2024 Dt 12/11/2024 **3.** Registered Sale Deed Executed By Syed Taher Ali, In Favour Of Ms .Shaik Esa, Document No.13382/2023 Date 15/11/2023 **4.**Registered Sale Deed Executed By M R . Mishkat Kausar, In Favour Of M R .Mohammed Abdul Aleem, Document No.2205/2019 Date 04/02/2019 **5.**Registered Sale Deed Executed By Ms. Qudaiya Sultana In Favour Of Mr. Mohammed Munawar, Document No.767/2015 Date11/02/2015 **6.**Registered Sale Deed Executed By M R .Shaik Dawood ,Shaik Mohammed In Favour Of M S.Qudsiya Sultana, Document No.2479/2009, Date 30/09/2009 **7.**Registered Sale Deed Executed By Mr. Mohammed Munawar, In Favour Of M R. Mishkat Kausar, Document No. 2063/2015 Date 23/04/2015 **8.**Registered Sale Deed Executed By Mr Mohammed Abdul Aleem, In Favour Of Mr. Syed Taher Ali, Document No.8452/2019 Date 09/05/2019

8. File No.: DRHL46600636688, **Customer Name: JAJALA RAMESH, Property Details:** Residential House bearing No.1-23-296/13/1, Vide PTIN No.1270169388, on Plot bearing Nos.13 Part (North West Side) and 12 Part (North West Side), in Survey Nos.395 Part, 396, 397, 430 & 431, covered under Ward No.1 and Block No.23, land admeasuring 172.22 sq.yrds., or 143.97 sq.mtrs., i.e. on Plot No.13 Part (North West Side) land admeasuring 124.0 sq.yrds., and on Plot No.12 Part(North West Side), land admeasuring 48.22 sq.yrds., Ground Floor with builtup area 1400.0 sq.ft., and First Floor with builtup area 1400.0 sq.ft., total builtup area 2800.0 sq.ft., situated at Venkatapuram, under GHMC Alwal Circle, Alwal Mandal, Medchal-Malkajgiri District **Documents Details: 1.** Modt In Favour Of Dcb Bank Doc No. 5728/2024 Dt 08/11/2024 **2.** Sale Deed In Favour Of Applicant Doc No 5727/2024 Dt 08/11/2024 **3.** Reg Sale Deed Doc No 821/2021 Dt 25/01/2021 **4.** Reg Sale Deed Doc No. 3070/2019 Dt 25/05/2019

9. File No.: DRHL46600637029, **Customer Name: KADARI SATHEESH KUMAR, Property Details:** Flat No.11, in Second Floor, with certain additional fittings, bearing Municipal No.6-3-1092/D/11, of Block-D, "SHANTI SIKHARA APARTMENTS", having an area of 600.0 sq.ft., together with undivided share of land admeasuring 1/24th share in 2400.0 sq.ft., i.e. 11.10 sq.yrds., in Survey Nos.11, 12, 16, 17, 18, 20 & 26(New), situated at Somajiguda, Hyderabad **Documents Details: 1.** Sale Deed Doc No.2419/1987 Excuted By M/S Virgo Constructions Rep By Its Managing Partner B.N.Reddy in Favour Of M.Prema Lata Dated.29.10.1987 **2.** Regd. Sale Deed In Favour Of Kadari Satheeh Kumar Executed By M.Prema Lata Doc No 3562/2024 Dt 11/11/2024 **3.** Modt In Favour Of Dcb Bank Ltd Doc No.3563/2024 Dt 11/11/2024

10. File No.: DRHL46600637099, **Customer Name: EDUKULLA PRASAD, Property Details:** Semi-Finished Flat No.201 in Second Floor of "S.L.N.Residency", having plinth area of 1800.0 sq.ft., including common area, Car parking area 100.0 sq.ft., in Stilt, together with an undivided share of land admeasuring 73.2 sq.yrds., out of 366.5 sq.yrds., on Plot No. 19 Eastern Part, Plot No. 163 and Plot No. 164 Western Part, in Survey Nos.25 to 29, 58/1/H (old in Survey No.58), in Survey No.58, Ward No.8, Block No.7, situated at Hasthinapuram North Extension, in Karmanghat Village, Saroornagar Revenue Mandal, under GHMC, L.B.Nagar Circle, Ranga Reddy District **Documents Details: 1.** Modt In Favour Dcb Bank Doc No.9902/2024 Dt 09/11/2024 **2.** Registered Sale Deed To Be Executed By 1) Madireddy Raja Reddy 2) Madireddy Narsimaha Reddy Rep. By His Development Agreement Cum General Power Of Attorney Holder M/S . Sai Krupa Constructions Rep. By Its Manging Partner Sri Burugu Srinivas In Favour Of Edukulla Prasad Doc No. 9889/2024 Dt 08/11/2024

11. File No.: DRHLSEC00634991, **Customer Name: GANJAI PRAVEEN KUMAR, Property Details:** All that the piece and parcel of open land bearing Plot No. 42, admeasuring 255.6 Sq. Yds, or its equivalent to 213.7 Sq. Mtrs, in Survey Nos. 533, 535, 536, & 537, Situated at Pedda Amberpet village, Hayathnagar Revenue Mandal, Ranga Reddy District, under Pedda Amberpet Nagara Panchayat. **Documents Details: 1.** Reg Modt In Favour Of Canfin Homes Doc No 2266/2022 Date 08/03/2022 **2.** Original Registered In Favour Of G Praveen Doc No 1159/2016 Date 27/02/2016 **3.** Modt In Favour Of Dcb Bank Doc No 8827/2024 Dt 13/11/2024 **4.** Original Registered In Favour Of Ch.Venkatesham &Bhasker Doc No 24579/2006 Date 10/11/2006 **5.** Release Deed Of Canfin Homes Doc No 8809/2024 Dt 12/11/2024

12. File No.: DRHL46600635714, **Customer Name: KANDARI PRAVEEN KUMAR, Property Details:** House bearing No. 4-9-2/SSN/P452/1 (PTIN No. 1036001320) constructed on Plot No. 452, admeasuring 120 Sq. Yds, equivalent to 100.33 Sq. Mtrs., having Plinth area of 1050 Sft in Ground Floor with RCC Roofing in Sy No. 195/1 of Veerannagutta, situated at Bagh Hayathnagar Revenue Village, Hayathnagar Revenue Mandal, Ranga Reddy District. **Documents Details: 1.** Regd. Deed Of Conveyance Bearing Doc. No. 3880/2023 In Favour Of Adula Yadamma Dt 30/06/2023 **2.** Regd. Sale Deed In Favour Of Kandari Srinivas Executed By Adula Yadamma Doc No. 5532/2024 Dt 06/11/2024 **3.** Regd. Modt In Favour Of Dcb Bank Ltd Doc No. 5546/2024 Dt 07/11/2024 **5.** Certified Copy Regd. Deed Of Conveyance Bearing Doc. No.3880/2023 In Favour Of Adula Yadamma Dt 30/06/2023

13. File No.: DRHL46600636220, **Customer Name: RANGU JANAIAH, Property Details:** Residential Flat bearing No. "E" in Second floor, bearing Municipal No. 5-2-116/1/41-TIR (PTIN No. 1010501028) of "Tirumala Apartments" admeasuring 700 Sfts, of plinth area (including common areas) together with undivided share of land admeasuring 25.6 Sq. Yards, 1/20th undivided share out of 512 Sq. yards on Plot No. 3, in Sy. No. 43, situated at Tirumala Nagar, Meerpet, Under GHMC Kapra Circle, Uppal Mandal, Medchal-Malkajgiri District. **Documents Details: 1.** Regd Sale Deed Doc No 13269/2017 Dt 11/10/2017 **2.** Regd Sale Deed In Favour Of Applicant Doc No 15666/2024 Dt 18/11/2024 **3.** Regd Sale Deed Doc No 8877/1995 Dt 20/12/1995 **4.** Photo Copy Ec No 158675 Dt 20/11/2024

14. File No.: DRHL46600637502, **Customer Name: SABAVAT SHANKARI BAI, Property Details:** Semi-Finished House on Plot No. 537 Southern Part, admeasuring area 133.33 Square Yards or equivalent to 111.47 Square Meters, having a Plinth area of 729 Square Feet, in Ground Floor, with RCC Roof, in Survey No. 92 Part, Situated at Injapur Village, Abdullapurmet Revenue Mandal, Under Turkayamjal Municipality Ranga Reddy District. **Documents Details: 1.** Original Registered Agreement Of Sale Cum Executed A By Sri. Cherukuri Gopinath S/o. Sri. Ch. Rama Rao, In Favour Of Sri. Tanneru Adi Narayana S/o. Sri. T. Subba Rao **2.** General Power Of Attorney Document No. 11414/2023 Date. 22.09.2023 **3.** Modt In Favour Of Dcb Bank Ltd Doc No 10223/2024 Dt 16/11/2024 **4.** Original Registered Sale Deed Executed By 1. Sri. Nagulla Yesuraghava Raja S/o. Nagulla Narasimha Rao, 2. Sri. Thanneeru Anka Rao S/o. Sri. T. Govind To Bee In Favour Of Shankari Bai Document No. 10000/2024 Date. 07/11/2024 **5.** Original Registered Sale Deed Executed By Sri. Cherukuri Gopinath S/o. Sri. Ch. Rama Rao Represented By His Agpa Holders: Sri.Tanneru Adi Narayana S/o. Sri. T. Subbarao In Favour Of 1. Sri. Nagulla Yesuraghava Raja S/o. Nagulla Narasimha Rao, 2. Sri. Thanneeru Anka Rao S/o. Sri. T. Govind Document No. 11529/2023 Date. 25.09.2023

15. File No.: DRBL46600637892, **Customer Name: MOHAMMAD JAHANGEER, Property Details:** All that the House No.2-98/2, land admeasuring 99.3 sq.yrds., or 83.01 sq.mtrs., plinth area 286.0 sq.ft., roof covered with A.C.Sheets, situated at Koulampet Village, Kandi Mandal, Sangareddy District, under Koulampet Gramapanchayat, Sangareddy District. **Documents Details: 1.** Regd Gift Deed Doc No 6251/2024 Dt 06/09/2024 **2.** Org Ec No 860815 Dt 10/11/2024 **3.** Certified Copy Gift Deed Doc No 6251/2024 Dt 06/09/2024

16. File No.: DRHLSEC0063725, **Customer Name: N ADINARAYANA, Property Details:** Semi-Finished Flat No.502, in Fifth Floor, with a plinth aera of 1070 sft., (including common area) & car parking area with an undivided share of land admeasuring 38 sq.dys., out of 400 sq.yds., "DIVYA LAKSHMI HEIGHTS" on Plot Nos.3 & 4, in Survey No.154, situated at Suraram Village, Quthbullapur Mandal, under GHMC Limits, Medchal-Malkajgiri District. **Documents Details: 1.** Registered Reconveyance Deed Executed By Gottipati Chandra Mohan In Favour Of Nizampatnam Indira Sai Rep By Her Development Agreement Cum Gpa Holders 1)Vallabhapurapu Nageswararao 2)Durga Varaprasad Setty Doc No. 26968/2024 Dated:-23-10-2024. **2.** Registered Simple Mortgage Deed without possession executed by Nizampatnam Indira sai rep by her Development Agreement Cum GPA holders 1) Vallabhapurapu Nageswararao 2) Durga varaprasad setty in favour of Namireddy venumadhava Reddy doc no 16071/2024 , Dated:- 20-06-2024 **3.** Registered Simple Mortgage Deed without possession executed by Nizampatnam Indira sai rep by her Development Agreement Cum GPA holders 1) VallabhapurapuNageswararao 2) Durga varaprasad setty in favour of Gottipati Chandra Mohan doc no 34837/2023, Dated:-28-12-2023. **4.** Registered Reconveyance Deed executed by Gottipati chandra mohan in favour of Nizampatnam Indira sai rep by her Development Agreement Cum GPA holders 1) Vallabhapurapu Nageswararao 2) Durga varaprasad setty Doc No.14681/2024, Dated:-05-06-2024.**5.** Registered sale deed to be executed by Nizampatnam Indira sai rep.by her Development agreement cum GPA of attorney Holders 1) vallabhapurapu Nageswararao 2) Durga vara prasad setty in favour of Adinarayana .N DOC No.27999/2024 DT 06/11/2024. **6.** MODT IN FAVOUR OF DCB BANK DOC NO 28000/2024 DT 06/11/2024

17. File No.: DEMHHYD00635455, **Customer Name: SRIDEVI JAKKULA, Property Details:** All that the Newly Constructed Residential House on Plot No. 37 South Part, admeasuring 110.17 Sq. Yds, or equivalent to 92.58 Sq. Mtrs, along with an plinth area of 1600.0 Sq. Ft, (i.e., Ground Floor 800.0 Sq. Ft & amp; First Floor 800.0 Sq. Ft), in Survey Nos. 415 Part and 416 Part, Situated at Rampally village, Keesara Mandal, Medchal-Malkajgiri District. **Documents Details: 1.** Regd. Sale Deed In Favour Of In Favour Of Smt. Jakkula Sridevi Doc No 20036/2019 Date 02-12-2019 **2.** Regd. Sale Deed In Favour Of In Favour Of Sri. Vennakandla Ramana Doc No 9961/2019 Date 17-05-2019 **3.** Org Plan And Permit Doc No Gpr/392/2018 Dt 27/07/2018

18. File No.: DRHL46600637289, **Customer Name: D MANIKUMAR, Property Details:** All that the House bearing No. 11-169-24P/706, PTIN No. 1198021313, on Plot No. 24 Part, and 25 Part, admeasuring 100 Sq.Yds., in Survey No. 169, 170 & amp; 169/AA, & amp; 170/AA, Situated at Peerzadiguda Village, Ghatkesar Mandal, Ranga Reddy District. **Documents Details: 1.** Modt In Favour Of Dcb Bank Ltd Doc No 15282/2024 Dt 08/11/2024 **2.** Registered Sale Deed In Favour Of Sri. M.Meramma Doc No 9022 Of 2013 Date 29/09/2013 **3.** Registered Sale Deed In Favour Of Damala Mani Kumar Doc No 15274/2024 Dt 07/11/2024

19. File No.: DRHL46900636665, **Customer Name: N V D RAMESH BALLA, Property Details:** Flat No. 104, in First Floor of "KRISHNA SAI ORCHID", with a Built up area of 1100 Square Feet, (including common area and Car Parking) and along with an undivided share of land admeasuring area 27 Square Yards, (Out of Total land admeasuring area 500 Square Yards), being Constructed on Plot bearing Nos. 41 and 42, in Block No.5, in Survey No. 148 Part, Situated at Bachupally Village, Bachupally Mandal, Medchal-Malkajgiri District. **Documents Details: 1.** Regd Sale Deed In Favour Of Applicant Doc No 28518/2024 Dt 14/11/2024 **2.** Regd Sale Deed Doc No 14006/2019 Dt 20/06/2019

20. File No.: DRHLGHT00637017, **Customer Name: GUDIPALLY CHANDRASHEKAR, Property Details:** Residential Premises bearing H. No. 9-875/9 (PTI No. 1227108708), consisting of Ground + 2 Upper Floors with the total built up area of 2800 sft., constructed on Plot No. 31Part (West Part), admeasuring 125 Sq.Yds., in Survey No. 345, Situated at Nagaram Revenue Village, under Nagaram Municipality, Keesara Mandal, Medchal-Malkajgiri District, Telangana State. **Documents Details: 1.** Modt In Favour Of Dcb Bank Ltd Doc No 10821/2024 Dt 16/11/2024 **2.** Original Registered Sale Deed In Favour Of Mr. B Vamshi Krishna, Doc No : 9876 Of 2016, Dated: 20-10-2016 **3.** Original Registered Sale Deed To Be Executed In Favour Of Mr.G Chandrashekar By Mr. K Sreenu Doc No 10787/2024 Dt 14/11/2024 **4.** Original Registered Simple Mortgage In Favour Of From Southern Power Distribution Company Of Telangana Limited, Doc No : 239 Of 2019 Dated.04-01-2019 **5.** Original Registered Sale Deed In Favour Of Mr. K Sreenu. Doc No: 451 Of 2018, Dated: 08-01-2018 **6.** Registered Reconveyance Deed In Favour Of Mr. K Sreenu. Doc No: 9873 Of 2023, Dated 31-08-2023 **7.** Regd Sale Deed In Favour Of Mr K Balakistha Reddy Doc No 6829/2003 Dt 25/08/2003

21. File No.: DRHLGHT00638072, **Customer Name: TADOORI KRISHNA, Property Details:** All that the House No.3-165/4/Part, vide PTIN No.1259101133, constructed on Plot, inSy.no.19/^A, admeasuring 150.5 Sq.yds, (total out of 301 Sq.yds), with RCC Roof plinth area 448 Sft, situated Block no.3, Gundlapally Village, Yadagirigutta Mandal,under Yadagirigutta Municipality, Yadadri Bhongir District. **Documents Details: 1.** Regd. Gift Deed Doc. No: 20200/2023 In Favour Tadoori Krishna Of Date 08/11/2023 **2.** Regd Ratification Deed Doc. No.22309/2023 In Favour Of Tadoori Krishna Of Date 23/12/2023

Sd/- Mr. K.Ram Ratan Reddy, Advocate (K3R Associates)
#A 13, Ground Floor, Vikrampuri Colony, Secunderabad-500009.
Mobile: 9390399911 Land line: 040-35051113
Email:k3r.advocate@gmail.com

ఘనంగా మహాత్మానగర్ పాఠశాల వార్షికోత్సవం



రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్‌లోని మహాత్మానగర్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో హోరెత్తించారు. అలాగే ప్రతిభ చూపిన విద్యార్థులకు హెచ్‌ఎం ప్రసన్న బహుమతులు అందజేశారు. డివిజన్‌లోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పది'లో వందశాతం ఫలితాలు సాధించాలి



ఎగ్జామ్ కిట్లు అందజేస్తున్న కార్పొరేటర్

వెంగళరావునగర్: పదో తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని కార్పొరేటర్ దేదీప్య విజయ్ ఆకాంక్షించారు. జవహర్‌నగర్ ప్రభుత్వోన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఎగ్జామ్ కిట్లను బుధవారం అందజేశారు. బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, శ్యాంరావు, వేణు, ఆంజనేయులు యాదవ్, రాములు ముదిరాజ్, అఫ్సర్, పూజారి బాల్‌రాజ్, బాలు రజక, సత్యనారాయణ, మహబూబ్, అబున్, సమద్, కట్టా లక్ష్మి, శారద, రమ్య, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాహుల్, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న విజయారెడ్డి

బంజారాహిల్స్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లులు ఏకగ్రీవంగా ఆమోదం పొందడంపై ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బంజారాహిల్స్ రోడ్డునంబర్-1లోని జీవీకే చౌరస్తాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలతో కలిసి రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు బుధవారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో షెడ్డు నిర్మించాలని వినతి

రహమత్‌నగర్: బోరబండ సైట్-3 శ్మశాన వాటికలో దహన సంస్కారాల షెడ్డు నిర్మించాలని పీజేఆర్ ఎస్పీఆర్‌హిల్స్ ఉమ్మడి బస్తీల ఐక్యత డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు వేముల యాదయ్య కోరారు. ఈమేరకు జీహెచ్‌ఎంసీ ఈఈ రాజ్‌కుమార్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో నిర్మించిన దహన సంస్కారాల షెడ్డు శిథిలావస్థకు చేరుకుని కూలిపోతున్నాదన్నారు. వెంటనే నిర్మించాలని లేకుంటే లోకాయుక్తాను ఆశ్రయిస్తామని పేర్కొన్నారు.

ఇళ్లు లేని వారికి గృహాలు నిర్మించి ఇవ్వాలి

వెంగళరావునగర్: ఇళ్లు లేనివారికి ప్రభుత్వమే గృహాలు నిర్మించి ఇవ్వాలని సీఐటీయూ జోన్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. రైతాంగ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం మూడో వర్ధంతిని పురస్కరించుకుని యూసుఫ్‌గూడ లేబర్‌అడ్డా బుధవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దున్నేవాడిదే భూమి కావాలని తుపాకీ చేతబట్టి పోరాడిన వీర వనిత మల్లు స్వరాజ్యమని కొనియాడారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు జి.భిక్షపతి, రాపర్తి అశోక్, ప్రసాద్, జగదీష్, రమేశ్, ముత్తయ్య, సత్యనారాయణ, సైదయ్య, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

అనుమానంతో హత్యాయత్నం..

ఫిలింనగర్: భార్యతో అక్రమ సంబంధం ఉందన్న అనుమానంతో ఓ యువకుడిపై దాడి చేయడంతో పాటు అతన్ని హత్య చేసేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే ఫిలింనగర్ బసవతారక నగర్‌లో నివాసం ఉంటున్న మహ్మద్ అమీర్‌కు తన భార్యపై అనుమానం ఉంది. షోయబ్ అనే వ్యక్తితో సన్నిహితంగా ఉంటోందని అనుమానించిన అతడు..ఈ నెల 17న షోయబ్ అంతు చూస్తానని బెదిరించి ఇంటివద్ద కాపు కాశాడు. దీంతో ఆందోళనకు గురైన షోయబ్ తన బంధువులకు చెప్పగా వారు వచ్చి అమీర్‌ను పంపించి వేశారు. కొంత సేపటికి అక్కడి నుంచి బయటకు వెళ్లగా మహాత్మా గాంధీ నగర్ వద్ద కత్తితో న్యూసెన్స్ చేయడంతో పాటు షోయబ్ మీద దాడి కోసం యత్నించాడు. బాధితుడు షోయబ్ మంగళవారం రాత్రి ఫిలిం నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఠాణాల్లో ప్రశ్నాపత్రాలు భద్రం!

రేపటి నుంచే 'పది' పరీక్షలు.. ఏర్పాట్లు పూర్తి

నిర్వహణాధికారులకు అవగాహన | సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు | 5 నిమిషాలు ఆలస్యమైనా అనుమతి

100 మీటర్ల దూరంలో జిరాక్స్ సెంటర్లు బంద్



పరీక్షల నిర్వహణాధికారులకు సూచనలు ఇస్తున్న ఖైరతాబాద్-1 డిప్యూటీ ఐఓఎస్ పరమేశ్వరమ్మ

బంజారాహిల్స్: పదో తరగతి వార్షిక పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరగనున్నాయి. ఇప్పటికే కస్టోడియన్లు ప్రశ్నాపత్రాలను బాక్స్‌ల్లో భద్రపరిచి బంజారాహిల్స్, పంజగుట్ట పోలీస్‌స్టేషన్లలో అందజేశారు. విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ నియోజకవర్గాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఈయేడు వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా బోధన సాగించారు.

- ఇప్పటికే విద్యార్థులకు పునఃశ్చరణ తరగతులు, రెండుసార్లు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించారు.
- చదువుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించారు.
- ఉదయం, సాయంత్రం 2 గంటల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులకు అల్పాహారం అందించారు.
- ఒత్తిడికి గురికాకుండా ఆరోగ్యకర వాతావరణంలో రెండుసార్లు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించి ఓఎంఆర్ షీట్‌పై అవగాహన కలిగించారు.
- పరీక్షల నిర్వహణపై డిపార్ట్‌మెంటల్ అధికారులు, చీఫ్ సూరింటెండెంట్లు, కస్టోడియన్లు, జాయింట్ కస్టోడియన్లకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
- ఖైరతాబాద్ జోన్ డిప్యూటీ డీఈఓ శామ్యూల్ రాజ్, ఖైరతాబాద్-1 డిప్యూటీ ఐఓఎస్ పరమేశ్వరమ్మ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు.
- ముఖ్యంగా ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఉండేలా బాధ్యత తీసుకోవాలన్నారు. వేసవి దృష్ట్యా చల్లని తాగునీటిని అందుబాటులో ఉంచాలన్నారు.
- మరుగుదొడ్లు, పరిసరాలు శుభ్రంగా ఉండేలా దృష్టిపెట్టాలన్నారు.
- ప్రశ్నాపత్రాలు లీక్ అవ్వకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని, కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో జిరాక్స్ సెంటర్లు, ఇతర షాపులు మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.
- కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తుతో పాటు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు.
- చీఫ్ సూపరింటెండెంట్ సమక్షంలో నిఘా నేత్రాల నీడలో ప్రశ్నాపత్రాలు తెరవడంతో పాటు పరీక్ష ముగిశాక సమాధాన పత్రాలకు సీల్ వేసేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.
- ప్రైవేట్ యాజమాన్యాలు ఫీజుల విషయంలో ఇబ్బంది పెడితే విద్యార్థులు హాల్ టికెట్లను నేరుగా వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరుకావచ్చన్నారు.
- ఏఎన్‌ఎంలు, ఇతర ఆరోగ్య వైద్య సిబ్బంది పరీక్షా కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారన్నారు.
- ప్రతి పరీక్షా కేంద్రంలోనూ ఫ్యాన్లు, లైట్లు ఉండేలా చూసుకోవాలని కోరారు.
- పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు, పరీక్షల నిర్వాహకులు సైతం పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లవద్దని సూచించారు. ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు.

ఖైరతాబాద్ జోన్ పరిధిలో..

మొత్తం ప్రభుత్వ పాఠశాలలు -	17
ఎయిడెడ్ స్కూళ్లు -	2
తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు -	4
మహాత్మా జ్యోతిబాపూలే స్కూళ్లు -	4
ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లు -	3
ప్రైవేట్ పాఠశాలలు -	103
పరీక్షలకు హాజరయ్యే మొత్తం విద్యార్థులు -	8,112
పరీక్షా కేంద్రాలు -	35
చీఫ్ సూపరింటెండెంట్లు -	35
డిపార్ట్‌మెంటల్ అధికారులు -	35
ప్రశ్నాపత్రాలు భద్రపరిచే ఠాణాలు -	2
కస్టోడియన్లు -	2
జాయింట్ కస్టోడియన్లు -	2
ఫ్లయింగ్ స్క్వాడ్స్ -	140
సిట్టింగ్ స్క్వాడ్స్ -	63
వైద్య సిబ్బంది (ఒక్కో కేంద్రంలో) -	2
పోలీసులు (ఒక్కో కేంద్రంలో) -	1

21 నుంచి 'జాతీయ జైళ్ల కాన్ఫరెన్స్- 2025'



కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: ప్రిసన్ వరల్డ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20, 21న జూబ్లీహిల్స్‌లో మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థలో 'మొదటి జాతీయ జైళ్ల కాన్ఫరెన్స్- 2025' నిర్వహించనున్నట్లు ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షుడు, మాజీ జైళ్లశాఖ ఐజీ ఆకుల నరసింహ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని సభ్యులు లక్ష్మీ చౌదరి, అశోక్ కుమార్, వినీత్ సింగ్‌తో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కారాగారాల్లో సంస్కరణలు తెచ్చేందుకు ఏ విధమైన మార్పులు తీసుకురావాలి అనే అంశంపై చర్చిస్తామన్నారు. ఖైదీల్లో పరివర్తన తీసుకువచ్చి వారిని సమాజంలో వదిలిపెట్టాలని, తెలిసో తెలియకో నేరం చేసిన వారు జైళ్లల్లో మగ్గడం సరికాదన్నారు. కార్యక్రమానికి జాతీయ స్థాయిలో పోలీస్ ఉన్నతాధికారులు, జైళ్ల శాఖ అధికారులు, విద్యావంతులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పలు యూనివర్సిటీల వీసీలు హాజరుకానున్నట్లు తెలిపారు. మొదటి రోజు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరై ప్రారంభిస్తారని రెండో రోజు సీఎం రేవంత్ రెడ్డి రానున్నట్లు వారు పేర్కొన్నారు.

గతి ప్రభుత్వ పాఠశాలలో ఫేర్‌వెల్ హంగామా



వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డునంబర్-7లోని గతి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అలాగే స్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం లక్ష్మీకాంత్‌రెడ్డి విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేశారు. అనంతరం వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి ఎగ్జామ్ కిట్లను అందజేశారు.

సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు కల్పించాలి

హిమాయత్‌నగర్: తెలంగాణ సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు కల్పించి ఆదుకోవాలని ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అన్వోజు వెంకటేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు కల్పించి ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ సాంస్కృతిక సారథిలో 550 ఉద్యోగాలకే పరిమితం చేస్తూ నాటి చైర్మన్ రసమయి బాలకిషన్ చేసిన దుర్మార్గపు ఆలోచనల వల్ల ఎంతోమంది కళాకారులు రోడ్డున పడ్డారన్నారు. గ్రేటర్ హైదరాబాద్ ఇన్‌చార్జి జవ్వాజి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. బడ్జెట్ సమావేశాల్లో కళాకారుల గురించి ప్రస్తావించకపోతే 33 జిల్లాల్లోని కళాకారులతో ఇందిరా పార్క్ ధర్నాకు పిలుపునిస్తామని హెచ్చరించారు. పేరాల యాదగిరి, డాక్టర్ సలీం, నకిరేకంటి చిరంజీవి, పున్న రమేశ్, రాజేశ్, నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని పరిరక్షిస్తేనే మానవ మనుగడ



సావనీర్ ఆవిష్కరిస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ వి.బాలకిష్టారెడ్డి

హిమాయత్‌నగర్: ప్రకృతిని పరిరక్షిస్తేనే మానవ మనుగడ సాధ్యమని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ వి.బాలకిష్టారెడ్డి పేర్కొన్నారు. నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో 'గ్రీన్ ట్రెండ్స్-మార్గదర్శక పర్యావరణ స్థిరత్వం అనే అంశం'పై అంతర్జాతీయ సదస్సును కాలేజీ ప్రిన్సిపాల్ డా.విజయ్ కుమార్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డీఎస్ఆర్ రాజేంద్ర సింగ్‌తో కలిసి ఆయన హాజరై మాట్లాడారు. ప్రకృతి, పర్యావరణం పెంపుదలకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. అనంతరం కాలేజీ ముద్రించిన సావనీర్‌ను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు ప్రొ.కె.శైలజ, డా.సునీత, కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డా.సత్యనారాయణరెడ్డి, డా.రామలక్ష్మి, అధ్యాపకులు డా.గడ్డం ఆదాము, డా.కె.శ్రీనివాస్, డా.గంగాధర్, డా.రాజశేఖర్, రాజేశ్వర్, డా.భిక్షపతి, గోవింద్, రవికుమార్, కడారి శ్రీనివాస్, సీవీఎల్ నారాయణ, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

నిమ్స్‌కు సోలార్ ప్యానల్స్ విరాళం





లక్డీకాపూల్: అకార్డియన్ సొల్యూషన్ నిర్మాణ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అకతి నిమ్స్ డైరెక్టర్‌ను బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్జీఓ ద్వారా రూ. 20 లక్షల విలువైన సోలార్ ప్యానల్స్‌ను విరాళంగా అందజేశారు. నిమ్స్‌లోని డయాలసిస్ కేంద్రానికి సౌర విద్యుత్‌ను అందించే 'ప్రాజెక్ట్ గ్రీన్ డయాలసిస్ ఇనిషియేటివ్' అనే సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేశారు. ఇది 50 కిలోవాట్ల సామర్థ్యం కాగా రోజుకు 200 యూనిట్లను ఉత్పత్తి చేస్తుంది. దీని ద్వారా నెలకు రూ. 65,000 ఆదా అవుతోంది. 200 యూనిట్ల సౌరశక్తిని 40 సెషన్ల డయాలసిస్‌కు ఉపయోగించవచ్చని వారు తెలిపారు. కార్యక్రమంలో నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప నెఫ్రాలజీ ప్రొఫెసర్లు డా. భూషణ్ రాజు , డా. గంగాధర్, డా. స్వర్ణలత, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ డా. చరణ్, డా. రాకేశ్, ఆర్‌ఎంఓ హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎంలో డబ్బులు డ్రా చేసి మూత్ర విసర్జన

కేసు నమోదు చేసిన పోలీసులు

పంజగుట్ట: ఏటీఎంలో డబ్బులు డ్రా చేసి అందులోనే మూత్ర విసర్జన ఘటన పంజగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. రాజ్‌భవన్ రోడ్డులో ఆర్‌బీఎల్ బ్యాంక్ ఏటీఎం ఉంది. అందులో డబ్బులు డ్రా చేసేందుకు ఈనెల 10న వ్యక్తి వచ్చాడు. డబ్బులు డ్రా చేసిన తర్వాత ఏటీఎం డబ్బులు తీసుకునే ప్రాంతంలో మూత్ర విసర్జన చేశాడు. దీంతో ఏటీఎం సెన్సార్ పాడయ్యింది. ఇటీవల ఏటీఎం పరిశీలించేందుకు ఆర్‌బీఎల్ బ్యాంక్ ఆపరేషన్స్ మేనేజర్ రవికుమార్ రాగా సెన్సార్ పని చేయడం లేదని గ్రహించాడు. దీంతో సీసీ కెమెరాలు పరిశీలించగా ఓ వ్యక్తి ఉద్దేశపూర్వకంగా మూత్రవిసర్జన చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హీరో విశ్వక్సేన్ ఇంట్లో చోరీ నిందితుల అరెస్టు

ఫిలింనగర్: సినీ హీరో విశ్వక్సేన్ ఇంట్లో చోరీకి పాల్పడిన ముగ్గురు నిందితులను ఫిలింనగర్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. ఫిలింనగర్ రోడ్డునంబర్-8లో సినీ హీరో విశ్వక్సేన్ నివసిస్తున్నాడు. ఈనెల 14న తెల్లవారుజామున దుండగులు అతని ఇంటి తాళాలు పగులగొట్టి వజ్రాభరణాలతో పాటు హెడ్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. దీంతో అదేరోజు విశ్వక్సేన్ తండ్రి రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన ఎస్ఐ సతీశ్‌కుమార్, కానిస్టేబుళ్లు సురేందర్ రాథోడ్, ఇంతియాజ్ హుస్సేన్ ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించి సీసీ కెమెరాలను పరిశీలించారు. 4 రోజుల పాటు సుమారుగా 200లకు పైగా సీసీ కెమెరాల ఫుటేజీలు పరిశీలించారు. బేగంపేట మయూరిమార్గ్‌లో అద్దెకు ఉంటున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ కేసు వీడింది. కొత్తగూడెంకు చెందిన భీమవరపు స్వరాజ్ (21), బొల్లి కార్తీక్ (22), నేరేడుమల్లి సందీప్ (21) ఫుడ్ డెలివరీబాయిస్‌గా పనిచేస్తూ జల్సాలకు అలవాటు పడి ఈజీ మనీపై దృష్టిపెట్టారు. సినీ హీరో విశ్వక్సేన్ ఇంటి వద్ద వారం పాటు రెక్కీ నిర్వహించి ఆయన కుటుంబ సభ్యుల కదలికలపై దృష్టి పెట్టారు. ముగ్గురూ కలిసి ఒకే బైక్‌పై విశ్వక్సేన్ ఇంటికి చేరుకుని కొద్ది దూరంలో బైక్ ఆపారు. స్వరాజ్ ఇంటి తాళాలు పగులగొట్టి డైమండ్ రింగ్‌లతో పాటు హెడ్‌ఫోన్ చోరీ చేసి బయటకు రాగానే ముగ్గురు కలిసి బైక్‌పై ఉడాయించారు. వీరిని అరెస్టు చేసి డైమండ్ రింగ్‌లతో పాటు 3 మొబైల్ ఫోన్లు, ఒక ఎలక్ట్రిక్ బైక్‌ను స్వాధీనం చేసుకుని ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఉద్యోగాల పేరిట మోసం చేస్తున్న నిందితులు..

బంజారాహిల్స్: ఉద్యోగాల పేరిట నిరుద్యోగులను మోసం చేస్తున్న నిందితులను బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే..బంజారాహిల్స్ రోడ్డు నంబర్-1లోని సూఫీ చాంబర్స్‌లో ఫ్యూజన్ ఫ్యూచర్ హబ్ పేరిట సంస్థ ఉన్నది. వారు నిరుద్యోగులకు మెరుగైన జీతంతో ఉద్యోగాలు కల్పిస్తామంటూ సోషల్ మీడియాలో ప్రకటనలు ఇస్తూ నమ్మిస్తున్నది. దీంతో ప్రతిరోజూ 70-100 మంది వరకు ఈ కార్యాలయాన్ని సంప్రదిస్తున్నారు. దీంతో ఉద్యోగ ప్రక్రియ కోసం అని రూ.5 వేల నుంచి రూ.15వేల వరకు నిరుద్యోగుల నుంచి వసూలు చేస్తున్నారు. అయితే దివ్య అనే యువతి 3 నెలల క్రితం ఉద్యోగం కోసం ఈ సంస్థను సంప్రదించింది. తన నుంచి రూ.5 వేలు తీసుకున్నారని, అటు జాబ్ అవకాశం కల్పించకపోగా డబ్బులు కూడా ఇవ్వడం లేదని బంజారాహిల్స్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు సంస్థ చైర్‌పర్సన్ ఆర్యా, మేనేజర్ డేవిడ్, హెచ్‌ఆర్ వైభవ్, మేనేజింగ్ డైరెక్టర్ హరీశ్‌తో పాటు సెక్యూరిటీ గార్డ్, కంప్యూటర్ ఆపరేటర్లపై చీటింగ్ కేసు నమోదు చేశారు. వీరు నిరుద్యోగ యువత ఉద్యోగాలు కోసం వస్తుండగా వారిని నమ్మిస్తూ రోజుకు రూ.లక్ష వరకు దండుకుంటున్నారని పోలీసుల దర్యాప్తులో తేలింది. చిన్న మొత్తమే కదా? అని ఇంకా చాలామంది పోలీసుల దాకా రావడం లేదని కూడా నిర్ధారించారు. ఇప్పటికే వీరిపై 20కి పైగా కేసులు నమోదయ్యాయని బాధితులు ఆరోపించారు. వీరందరినీ అరెస్టు చేయాలంటూ బాధితులు మంగళవారం ధర్నా కూడా నిర్వహించారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాట రూ.11, నల్లవంకాయ 18, పొడుగువంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 33, బజ్జిమిర్చి 28, క్యాప్సికం 40, పచ్చికాకరకాయ 45, పందిరిబీర 38, క్యాబేజీ 9, క్యారెట్ 15, దొండకాయ 40, గుండు బీన్సీస్ 45, గింజచిక్కుడు 50, గోకరకాయ 35, కీర 15, దోసకాయ 20, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 25, చామగడ్డ 45, మొరంగడ్డ 23, కందగడ్డ 60, క్యాలీఫ్లవర్ 18, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9.

గేమింగ్ కన్సోల్ పంపుతానంటూ మోసం

వెంగళరావునగర్: గేమింగ్ కన్సోల్ పంపుతానంటూ యువకుడిని ఆన్‌లైన్‌లో మోసం చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కార్మికనగర్‌లో నివాసం ఉంటున్న మహ్మద్ బుర్హానుద్దీన్ ఈనెల 14న ప్లే స్టేషన్-5 (గేమింగ్ కన్సోల్) కోసం ఓఎల్‌ఎక్స్‌లో వెతికాడు. అదేరోజు రాజు సింగ్ ఫోన్ చేసి వాట్సాప్ ద్వారా వివరాలు అడిగాడు. తనకు షాపు ఉందని, రూ.22 వేలు నగదు పంపితే దానిని కొరియర్ చేస్తానన్నాడు. దీంతో రెండు దఫాలుగా క్యూఆర్ కోడ్‌ద్వారా డబ్బులు పంపాడు. అయితే మెషీన్ ప్రాబ్లం ఉందని, మరోసారి ఒకేసారి రూ.22 వేలు పంపమన్నారు. దాంతో రెండోసారి కూడా యువకుడు డబ్బు పంపాడు. కొరియర్‌తో పాటు రెండోసారి పంపిన నగదు కూడా రిటర్న్ వస్తాయన్నాడు. అయితే 16న రాజుసింగ్‌కు ఫోన్ చేయగా ట్యాక్స్ పే చేస్తే వస్తుందని చెప్పగా యువకుడు రూ.6160 పంపాడు. బుధవారం వరకు కూడా రాకపోవడంతో అతనికి ఫోన్ చేయగా దురుసుగా మాట్లాడి తాను పంపనని, ఏమైనా చేసుకో అని బెదిరించాడు. దాంతో యువకుడు సైబర్ క్రైం స్టేషన్‌లో తెలియజేసిన అనంతరం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి, కుమారుడిపై దాడి

వెంగళరావునగర్: తల్లి, కుమారులపై దాడి చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..రహమత్‌నగర్‌లో నివాసం ఉంటున్న రాజీవ్ గతేడాది అదేప్రాంతంలోని అనిత నుంచి 50 గజాల స్థలం ఇంటిని రూ.41 లక్షలకు కొనుగోలు చేసి అగ్రిమెంట్ చేసుకున్నాడు. వారం తర్వాత అనితకు బంధువైన సుదర్శన్ ఆ ఇంటికి వచ్చి దాని తాళం తొలగించి తాను వేరే తాళం వేశాడు. దీంతో రాజీవ్ ప్రశ్నించగా అనిత తనకు బాకీ ఉందని, అందుకే తాళం వేశానని చెప్పి బెదిరించాడు. తర్వాత రాజీవ్ ఆ తాళాన్ని తొలగించి మరమ్మతులు చేయిస్తున్నాడు. దాంతో పలుమార్లు సుదర్శన్, ఆయన తోబుట్టువులు వచ్చి గొడవపడ్డారు. ఈ క్రమంలో మంగళవారం ఇంట్లో ఒంటరిగా ఉన్న రాజీవ్ భార్యను అనిత సోదరుడు సుదర్శన్, బంధువులు ప్రభావతి, అనూరాధ, దినేశ్, హితేష్, శివ దాడి చేయగా అడ్డుకోబోయిన కుమారుడు అమృత్‌ను కొట్టారు. మరోసారి ఆ ఇంటి వద్దకు వస్తే చంపేస్తామని బెదిరించారు. దాడిలో గాయపడిన తల్లీకుమారులు ఆసుపత్రిలో చికిత్స అనంతరం బుధవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి పేరుతో ఎమ్మెల్యే స్టిక్కర్

ఉపయోగిస్తున్న వ్యక్తిపై కేసు

పంజగుట్ట: మంత్రి సీతక్క పేరుతో ఉన్న ఎమ్మెల్యే స్టిక్కర్‌ను వాడుతున్న వ్యక్తిపై పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. మంత్రి సీతక్క (అనసూయ) పేరుతో ఉన్న ఎమ్మెల్యే నకిలీ స్టిక్కర్‌ను థార్ కారుకు పెట్టుకుని తిరుగుతున్నాడని సీతక్క పీఆర్‌ఓ పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు కారును స్వాధీనం చేసుకుని యజమానిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కానీ పోలీసులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచుతున్నారు.

భార్య, అత్త, మామపై దాడి

వెంగళరావునగర్: భార్య, అత్త, మామపై దాడి చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. విశాఖపట్నం ప్రాంతానికి చెందిన జి.వి.రవీంద్రనాథ్ తన కుమార్తెను స్థానిక ఎల్లారెడ్డిగూడలో నివసించే కాట్రగడ్డ రాహుల్ చౌదరికి ఇచ్చి రెండేళ్ల కిత్రం వివాహం చేశాడు. అప్పటి నుంచి చౌదరి భార్యను వేధిస్తూ కొట్టేవాడు. ఈ విషయాన్ని ఆమె తన తల్లిదండ్రులకు తెలియజేసింది. ఈ క్రమంలో గతేడాది వారికి కుమారుడు జన్మించాడు. తర్వాత కూడా భార్యను తిడుతూ పుట్టింటికి తీసుకెళ్లాలని అత్త, మామకు ఫోన్ చేసి చెప్పాడు. వారు రాగానే గొడవ పెట్టుకున్నాడు. దీంతో రవీంద్రనాథ్ గత నవంబర్‌లో కుమార్తెను పుట్టింటికి తీసుకెళ్లగా డిసెంబర్‌లో అత్తారింటికి వచ్చింది. అనంతరం కుమారుడు పుట్టినరోజు వేడుకలు నిర్వహించిన చౌదరి అత్తగారింటి వారిని పిలవలేదు. అయినా రవీంద్రనాథ్ తన మనవడికి బహుమతిగా కారు కొని వాళ్ల ఇంటి ముందు పెట్టి వెళ్లిపోయాడు. తరచూ చౌదరి తన భార్యను వేధిస్తుండడంతో గతనెల రవీంద్రనాథ్, ఆయన భార్య వచ్చి అడిగారు. దాంతో ప్రసాద్ అనే వ్యక్తితో పాటుగా అల్లుడు కూడా అత్త, మామలపై దాడి చేసి అత్త మెడలోని తాళి కూడా తెంచి ఇద్దరిని బాగా కొట్టారు. ఈ క్రమంలో పోలీసులు అక్కడికి చేరుకుని బాధితులను ఆసుపత్రికి తరలించారు. అనంతరం విశాఖపట్నం వెళ్లిన రవీంద్రనాథ్ తరచూ గొడవలు జరుగుతుండడంతో బుధవారం మధురానగర్ పీఎస్‌కు వచ్చి తన కుమార్తె అత్తగారింటి కుటుంబ సభ్యులపై ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పు చెల్లించాలని ..

వెంగళరావునగర్: అప్పు చెల్లించాలని యువకుడిపై దాడి చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లాకు చెందిన అమరేశ్ అత్తాపూర్‌లో ఉంటూ ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. కొంతకాలం కిందట కామన్ ఫ్రెండ్ ద్వారా రమేశ్ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. ఇరువురు కలిసి ప్రైవేట్ కంపెనీలో ఫుడ్ సర్వీస్ సంస్థను ఏర్పాటు చేద్దామనుకున్నారు. ఈ విషయాన్ని రమేశ్ తన స్నేహితుడు శివకు సైతం చెప్పాడు. అతను అంగీకరించగా అర్జంట్‌గా కొంత డబ్బు పెట్టుబడి పెట్టాలనుకున్నారు. దాంతో అమరేశ్ అతనికి పరిచయం ఉన్న శివ వద్ద రూ.59 వేలు అప్పుగా తీసుకుని రమేశ్‌కు ఇచ్చాడు. అయితే గత నెలలో శివ అమరేశ్‌కు ఫోన్ చేసి అర్జంట్‌గా బేగంపేటలోని టూరిజం ప్లాజాకు రమ్మన్నాడు. అక్కడ అసలు వడ్డీ కలిపి రూ. లక్ష ఇవ్వాలని కోరాడు. దీంతో అమరేశ్ స్పందించకపోవడంతో శివ ఇద్దరు స్నేహితుల సహాయంతో అమరేశ్‌ను బంధించి కొట్టారు. గాయపడిన అమరేశ్ బుధవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం అపహరణ

హాస్టల్ ఎదుట నిలిపిన ద్విచక్ర వాహనం అపహరణకు గురైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లాకు చెందిన అజయ్‌కృష్ణ కొంతకాలంగా మధురానగర్‌లోని హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 7న రాత్రి హాస్టల్ ఎదుట బైక్ పార్క్ చేసి ఉదయం వచ్చి చూడగా కనిపించలేదు. దాంతో పలు ప్రాంతాల్లో వెతికినా దొరకకపోవడంతో బుధవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి సిటీ ప్లస్
14
హైదరాబాద్, గురువారం, 20, మార్చి, 2025



'లైఫ్‌లో ఏమున్నా లేకున్నా హ్యాపీగా ఉండాలి బ్రో..' ఇలాంటి మాటలు నగరవాసుల రోజువారీ సంభాషణల్లో సర్వసాధారణంగా మారాయి. సంతోషాన్ని మించిన సంతృప్తి లేదనే ఆలోచన రోజురోజుకూ బలం పుంజుకుంటోంది. ఎన్ని కష్టనష్టాలున్నా సంతోషం కోసం వెతుకుతూనే ఉన్నారు. ఉన్నదాంట్లో హ్యాపీగా లైఫ్ గడిపేస్తున్నారు.

- సాక్షి, సిటీబ్యూరో

- పదేళ్లనాటి 12వ స్థానం నుంచి టాప్ 10లోకి చేరిక
- కోవిడ్ తర్వాత మారిన ఆలోచనా ధోరణి కూడా కారణమే..
- అంతిమ లక్ష్యం సంతోషమే అంటున్న సిటిజనులు
- నేడు ఇంటర్నేషనల్ డే ఆఫ్ హ్యాపీనెస్

హ్యాపీ.. హైదరాబాద్

హ్యాపీనెస్ ర్యాంకింగ్స్‌లో మెరుగుపడుతున్న సిటీ స్థానం



పదేళ్ల క్రితం ఐఎమ్ఆర్‌బీ అధ్యయనంలో 190 పాయింట్లు దక్కించుకున్న చత్తీస్‌ఘడ్ తొలి స్థానంలో నిలిచింది. లక్నో, చెన్నై, బెంగళూర్‌లు ఆ తర్వాత స్థానాల్లో నిలిచాయి. మన హైదరాబాద్ 75 పాయింట్లను దక్కించుకుని 12వ స్థానంతో సరిపెట్టుకుంది. అయితే ఆ తర్వాత నిదానంగా తన స్థానాన్ని మెరుగుపరుచుకుంటూ వస్తోంది. 5 ఏళ్ల క్రితం గురుగ్రామ్ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో స్ట్రాటజీ ప్రొఫెసర్ డా.రాజేష్ పిలానియా టీమ్ ఇండియా హ్యాపీనెస్ రిపోర్ట్ రూపొందించింది. దీని కోసం 34 నగరాల్లో అధ్యయనం నిర్వహించగా.. లూథియానా, అహ్మదాబాద్, చండీగఢ్ సంతోషకరమైన నగరాలుగా అవతరించాయి. గురుగ్రామ్, విశాఖపట్నం, రాయ్‌పూర్ చివరి స్థానాలు దక్కించుకున్నాయి. ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, పూణె, అహ్మదాబాద్‌ను టైర్–2 నగరాలుగా విభజించి నిర్వహించిన అధ్యయనంలో.. అహ్మదాబాద్, చెన్నై, హైదరాబాద్ మొదటి మూడు ర్యాంకులను కైవసం చేసుకున్నాయి. మొత్తంగా చూస్తే హైదరాబాద్ టాప్–10లో నిలిచింది. అప్పటి నుంచి హైదరాబాద్ 5 నుంచి 10లోపు ర్యాంకింగ్‌లో ఉంటూ హ్యాపీనెస్ రిపోర్ట్‌లో ప్రముఖంగా ఉంటోంది.

కోవిడ్ తర్వాత కొలత మారింది..

ఈ అధ్యయనాలు విశ్లేషిస్తున్న ప్రకారం.. నగరాల్లోని హ్యాపీనెస్ ట్రెండ్స్‌లో కోవిడ్ ప్రభావం స్పష్టంగా కనిపించింది. అసలైన సంతోషానికి కొలమానం తెలిసి వచ్చింది. కరోనా మహమ్మారి కారణంగా అనూహ్యంగా ప్రపంచం స్తంభించిపోవడం ఉరుకులు పరుగుల జీవనంలోని డొల్లతనాన్ని పట్టిచ్చింది. దాంతో తమ తమ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తూనే సంతోషానికి కూడా తమ డైలీ రొటీన్‌లో తగిన ప్రాధాన్యత ఇవ్వడం పెరిగింది. విభిన్న రకాల హాబీలకు సానపెట్టడం, టూర్లకు, పిక్నిక్‌లకు వెళ్లడం మరింత ఎక్కువైంది. అంతేకాకుండా ఆధ్యాత్మిక భావనలు, తాత్విక చింతనలూ పెరిగి ప్రశాంత జీవనం వైపు ఆలోచనలు మళ్లిస్తున్నారు.



ట్రావెలింగ్.. ఫొటోగ్రఫీ..

ఎన్ని బాధ్యతలు ఉన్నాయి? ఎన్ని రకాల పనులు చేస్తూ ఉన్నాం అనేదాని కన్నా.. ఎంత సంతోషంగా ఉన్నాం.. అనేదే ముఖ్యమని నేను నమ్ముతాను. అందుకు అనుగుణంగానే నా లైఫ్‌స్టైల్ ఉంటుంది. ఒకప్పుడు ఫ్యాషన్ ఫొటోగ్రాఫర్‌గా కొంత కాలం పనిచేశాను. ఆ తర్వాత సినిమా నటుడిగా మారాక అదే ఫొటోగ్రఫీ నాకు సంతోషాన్ని అందించే హాబీగా మారింది. అలాగే ట్రావెలింగ్ కూడా నాకు చాలా ఆనందాన్ని అందిస్తుంది.

– కృష్ణుడు, సినీనటుడు




పాజిటివ్ మైండ్.

ఏదో ఒక రోజు అని కాదు.. ప్రతీ రోజూ సంతోషంగానే ఉంటాను. సంతోషం అనేది ప్రత్యేకంగా ఒక మార్గంలో తెచ్చుకోవడం అనేది కాదు. ముఖ్యంగా నేను దేనికీ టెన్షన్ పడను.. ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఏడవను.. హ్యాపీగా ఉండాలి అని నా మనసును ట్యూన్ చేసుకున్నాను కాబట్టి ఎప్పుడూ ఆనందంగా ఉంటాను.

– సుధ, సినీ నటి





మ్యూజిక్ కిక్.. రైడింగ్ బైక్..

కొన్ని హాబీస్ నాకు హ్యాపీనెస్‌ని అందిస్తాయి. అలాంటి వాటిలో మొదటిది మ్యూజిక్ అని చెప్పాలి. నా ఉదయం ఎప్పుడూ సంగీతంతో ప్రారంభిస్తా.. నచ్చిన మ్యూజిక్ వింటూ డే స్టార్ట్ చేస్తే ఆ కిక్కే వేరు. రోజులో ఏ మాత్రం డల్‌గా అనిపించినా నా చూపులు బైక్ మీదకు వెళ్తాయి. చిన్నప్పటి నుంచీ బైక్ రైడింగ్ బాగా ఇష్టం.

– ప్రిన్స్, సినీనటుడు







ఫేర్‌వెల్.. ఫుల్ చిల్



సనత్‌నగర్: సంవత్సరాలు క్షణాల్లా కరిగిపోయినా.. ఎన్నెన్నో జ్ఞాపకాలు మదినిండా నింపుకొని వెళ్తున్నాం.. మళ్లీ కలుస్తూనే ఉందాం.. అంటూ విద్యార్థినులు ఒకరినొకరు ప్రేమగా పలకరించుకుంటూ.. సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. స్నేహానికి హద్దులు లేవంటూ ఆడీ పాడీ ఉత్సాహంగా గడిపారు. బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ ఉమెన్స్ కళాశాలలో 'గ్లిజ్ అండ్ గ్లాం' థీమ్‌తో నిర్వహించిన ఫేర్‌వెల్–25 వేడుకను మరిచిపోలేని విధంగా జరుపుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగ కళాశాల ప్రిన్సిపాల్ ఉమా జోసఫ్ మాట్లాడుతూ చీకటి ఉన్న చోట ఒక మెరుపులా విద్యార్థినులు ఉండాలన్నారు. మిస్ ఫ్రాన్సిస్ టైటిల్‌ను జూలిషా మోరేస్ గెలుచుకోగా ప్రతిభ కనబర్చిన దాదాపు 54 మందికి బహుమతులను అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ షెర్లీ, కరస్పాండెంట్ కార్మెలీ తనియాత్, పవికియా దవ్, విభా పాల్గొన్నారు.

హ్యాపీ హార్మోన్లు.. కీలకం..

రోజువారి కొన్ని అలవాట్లు చేసుకుంటే మెదడు సంతోషకర హార్మోన్లను విడుదల చేస్తుంది. ఉదాహరణకు–క్రమం తప్పకుండా ఎక్సర్‌సైజులు చేసే వారిలో ఎండార్ఫిన్స్ అనే హార్మోన్లు విడుదల అవుతాయి. వీటి వల్ల డిప్రెషన్, ఆందోళన వంటి ప్రతికూల భావాలు దరిచేరవు. అలాగే బరువు తగ్గడం, శరీరాన్ని సరైన ఆకృతిలో ఉంచుకోవడం లాంటి చిన్నా, పెద్దా లక్ష్యాలను మనం చేరుకోగలిగినప్పుడు ఫీల్‌గుడ్ హార్మోన్ డోపమైన్.. అధికంగా ఉత్పత్తి అవుతుంది. జీవితంలో మనకున్న వాటితో సంతృప్తి చెందడం, కృతజ్ఞతాభావం కలిగి ఉండటం కూడా మనసులో సానుకూల భావాలను నింపుతుంది. ఫలితంగా సెరటోనిన్ స్థాయి పెరిగి జీవితం ఆనందమయంగా కనిపిస్తుంది. మనసుకు దగ్గరైన వారితో సరదాగా గడపడం చేస్తే మెదడు ఆక్సిటోసిన్‌ను విడుదల చేస్తుంది. మూడ్ మెరుగుపరచడంలో ఆహారం పాత్ర కూడా కీలకం. వారంలో రెండుసార్లు 50 నుంచి 100 గ్రాముల వరకు డార్క్ చాక్లెట్‌ని తినడం వల్ల మనలో హ్యాపీ హార్మన్లు విడుదలవుతాయి. అయితే ఆ డార్క్ చాక్లెట్‌లో 70 నుంచి 85 శాతం కొకొవా మాత్రమే ఉండాలని గుర్తుంచుకోవాలి. ట్రిఫ్టోఫాన్ అధికంగా ఉండే టర్కీ కోడి, గుడ్లు, బాదంపప్పులు వంటి ఆహారాలతో సెరటోనిన్ ఉత్పత్తి పెరుగుతుంది. ఓమెగా–3 ఫ్యాటీ యాసిడ్ అధికంగా ఉండే చేపలు కూడా డోపమైన్ స్థాయిల్ని పెంచి మూడ్‌ను మెరుగుపరుస్తాయి.



– వనజా శ్రీపెరంబుదూరు, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్

సంతోషానికి వారధులు





సాక్షి, సిటీబ్యూరో: జీవితంలో సంతోషమనేది.. సంతృప్తికరమైన వృత్తితో పాటు ఆర్థిక స్థిరత్వం, కెరీర్ అభివృద్ధిపై ఆధారపడి ఉంటుందని నోవాటెల్ హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ జనరల్ మేనేజర్ సుఖ్‌బీర్ సింగ్ అన్నారు. అంతర్జాతీయ సంతోష దినోత్సవం నేపథ్యంలో నోవాటెల్ ఉద్యోగుల సంతోషం కోసం తమ ప్రణాళికలు, సేవలను వెల్లడించారు. హైదరాబాద్ వంటి మహానగరాల్లో అందరూ సంతోషంగా ఉండటం కోసం వినోద కార్యక్రమాలు, ఉల్లాసవంతమైన ప్రదేశాలపై ఆసక్తి చూపిస్తారు. ఈ సేవలు అందించే ఉద్యోగులు సంతోషంగా ఉన్నప్పుడు మాత్రమే ప్రజలంతా ఆ సంతోషాలను అనుభవిస్తారన్నారు. హాస్పిటాలిటీ రంగంలో తీరిక లేకుండా కృషి చేసే ఉద్యోగులను ఒక బృందంగా విహారయాత్రలకు పంపడం, పండగ వేడుకల్లో భాగం చేయడం వంటి వినూత్న ప్రయత్నాలు చేస్తున్నామని, సౌకర్యాలు కల్పించడంతో పాటు కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నట్లు వివరించారు.

స్వచ్ఛమైన గాలికి ఆహ్వానం


పర్యావరణ పరిరక్షణ సమష్టి బాధ్యత

స్లొవేనియా రిపబ్లిక్ రాయబారి మతేజా వోడెబ్ ఘోష్



సాక్షి, సిటీబ్యూరో: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వాలు, కార్పొరేట్లు, వ్యాపార సంస్థలు సమష్టిగా పనిచేయడం చాలా అవసరం' అని స్లొవేనియా రిపబ్లిక్ రాయబారి మతేజా వోడెబ్ ఘోష్ అన్నారు. పర్యావరణ అనుకూల ప్రాజెక్టులకు పేరొందిన స్టోన్ క్రాఫ్ట్ గ్రూప్ తమ ఉడ్స్ శంషాబాద్‌లో గాలి నాణ్యతను పరీక్షించడం, మెరుగుపర్చడం కోసం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్(ఏక్యూఐ) మానిటరింగ్ స్టేషన్ ఏర్పాటు చేసింది. దీన్ని బుధవారం ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుభ్రమైన గాలి, వెలుతురు వచ్చేలా నిర్మాణాలు ఉండాలని, పర్యావరణ అనుకూల భవనాలు, వాటర్ హార్వెస్టింగ్ రీసైక్లింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్టోన్ క్రాఫ్ట్ సంస్థ వ్యవస్థాపకులు కీర్తి చిలుకూరి మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలి కోసం చేసే కృషిలో తమవంతుగా ఈ ఏక్యూఐని ఏర్పాటు చేశామన్నారు.

RED LORRY PARALLEL VERSE HYDERABAD
21 - 23 March 2025



రెడ్ లారీకి కార్పెట్



నగరంలో ప్రతిష్టాత్మక రెడ్ లారీ ఫిలిం ఫెస్టివల్	జాతీయ, అంతర్జాతీయ చిత్రాల ప్రదర్శన	సందడి చేయనున్న సినీ ప్రముఖులు

సాక్షి, సిటీబ్యూరో: నగరం వేదికగా మరో ప్రతిష్టాత్మక ఫిల్మ్ ఫెస్టివల్ జరగనుంది. 21, 22, 23 తేదీల్లో రెడ్ లారీ ఫిల్మ్ ఫెస్టివల్ పేరుతో నిర్వహించే వేడుక బుక్‌మై షో ఆధ్వర్యంలో కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయి అత్యుత్తమ, ప్రయోగాత్మక చిత్రాలను ప్రదర్శిస్తామని చెప్పారు. ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన సినీ ప్రియులు, ఔత్సాహికులకు అద్భుత అనుభూతినిచ్చే సినిమా యాత్రకు వారిని తీసుకెళ్తామని వివరించారు. దేశవ్యాప్తంగా సినిమాలు, సినిమా ప్రియులకు పుష్పక విమానంలా వరిగణించే నగరంలో 120కి పైగా టైటిల్స్‌తో మల్టీప్లెక్స్‌లలో ప్రదర్శిస్తున్నట్లు వారు తెలిపారు.

తెలుగు సినిమాల సందడి

క్షణక్షణం, చందమామ, పుష్పక విమానం, మాయాబజార్, హ్యాపీడేస్, మగధీర వంటి పలు చిత్రాలను ప్రదర్శిస్తారు. దర్శకులు రామ్‌గోపాల్‌వర్మ, కృష్ణవంశీ, శేఖర్ కమ్ముల తదితరులు పాల్గొంటారు. వీరితో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయి సినీ ప్రముఖులు, దర్శకులు, నటులు, నిర్మాతలు తదితరులు సందడి చేయనున్నారు.

సినిమాల జాబితా..

21వ తేదీ: సిక్స్ జార్స్, ఆల్ఫా, జువెల్ థీఫ్, క్షణక్షణం, అనోరా, యూనివర్సల్ లాంగ్వేజ్, ఘాటక్, చందమామ, ది లాస్ట్ షో గర్ల్, లాక్డ్, మామ్..

22వ తేదీ: నట్టింగ్ హిల్, క్వీర్, ఇట్స్ కమింగ్, 999 ది ఫర్ గెట్టెన్ గర్ల్స్, హై వే 65, రెడ్ రూమ్స్, పుష్పక విమానం, మాయాబజార్, బీయింగ్ మరియా, హ్యాపీడేస్, మగధీర, ది స్టోరీ ఆఫ్ సోలెమన్, సెప్టెంబర్ 5, నైట్ సైలెన్స్, ది డ్రాఫ్ట్, ఎమాన్యుయేల్, ది లాస్ట్ ఆఫ్ మోహికాన్స్..

23వ తేదీ: ఎల్లీస్, జో జీతా వోహీ సికిందర్, మాగ్మా, థింగ్స్ యూ కిల్, ది ఔట్‌రన్, కార్జ్, ది డే ఆఫ్ ది జాకల్, తీస్రీ మంజిల్, ఛత్రపతి, ది బాయు, వన్ టూ వన్: జాన్ అండ్ యోకో, థింగ్స్ విల్ బి డిఫరెంట్, లాస్ట్ బ్రీత్..











1. సునీత బృందంతో బుధవారం తెల్లవారుజామున భూమిని సమీపిస్తున్న డ్రాగన్
2. ఫ్లోరిడా సమీపంలో సముద్ర జలాల్లో సురక్షితంగా దిగిన క్యాప్సూల్
3. పడవల్లో డ్రాగన్ క్యాప్సూల్‌ను సమీపిస్తున్న నాసా రెస్క్యూ సిబ్బంది చుట్టూ చక్కర్లు కొడుతున్న డాల్ఫిన్లు
4. డ్రాగన్ క్యాప్సూల్‌ను సముద్రంలో నుంచి సురక్షితంగా నౌకలోకి చేరుస్తున్న సిబ్బంది

సునీత వచ్చేసింది

క్షేమంగా దిగిన వ్యోమనౌక

- సర్వత్రా అభినందనల వెల్లువ
- వ్యోమగాములకు నాసా స్వాగతం
- ఆత్మీయ కరచాలనాలు, పలకరింపులు
- పునరావాస కేంద్రానికి తరలింపు
- 45 రోజులపాటు పర్యవేక్షణ
- ఆ తర్వాతే సొంతవారి చెంతకు


విజయ సంకేతం చూపుతున్న సునీతా విలియమ్స్

కేప్ కెనావెరాల్: కోట్లాది మంది ప్రార్థనలు ఫలించాయి. అంతా ఆశించినట్టుగానే జరిగింది. 286 రోజుల అంతర్జాతీయవాసం ముగిసింది. సునీతా విలియమ్స్ క్షేమంగా తిరిగొచ్చారు. సహచర వ్యోమగాములు బచ్ విల్మోర్, నిక్ హేగ్, అలెగ్జాండర్ గోర్బునోవ్‌లతో కలిసి స్పేస్ ఎక్స్ ఫ్రీడం డ్రాగన్ వ్యోమనౌకలో బుధవారం తెల్లవారుజామున భూమికి చేరారు. అప్పటిదాకా అత్యంత ఉత్కంఠ నడుమ టీవీ తెరలకు కళ్లప్పగించిన కోట్లాది మంది ఆనందంతో కేరింతలు కొట్టారు. తిరుగు ప్రయాణాన్ని ఆద్యంతం పర్యవేక్షించిన నాసా కమాండ్ సెంటర్ చప్పట్లు, అభినందనలతో మార్మోగిపోయింది.

ఆ 11 నిమిషాలు తీవ్ర ఉత్కంఠ

అంతకుముందు నాసా కమాండ్ సెంటర్లో తీవ్ర ఉత్కంఠ రాజ్యమేలింది. బుధవారం తెల్లవారుజామున 3.10కి మొత్తం ప్రయాణంలోనే అత్యంత కీలకమైన ఘట్టానికి తెర లేచింది. గంటకు 17,500 మైళ్ల అపార వేగంతో వ్యోమనౌక భూ వాతావరణంలోకి ప్రవేశించింది. దాంతో ఏకంగా 1,650 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత ఉత్పన్నమైంది. ఫలితంగా చుట్టూ కమ్ముకున్న ప్లాస్మాతో రేడియో సైలెన్స్ ఏర్పడి కమ్యూనికేషన్ మూగవోయింది. తర్వాత 11 నిమిషాలు అతి భారంగా గడిచాయి. వ్యోమనౌకకు రక్షణ కవచంగా ఉన్న హీట్‌షీల్డ్ అంతసేపూ వేడిని సమర్థంగా తట్టుకుని నిలిచింది. 3.21కి కమ్యూనికేషన్ కలిసి కమాండర్ హేగ్ 'హలో' అనగానే అంతా తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు. తర్వాత భూమికి 18 వేల అడుగుల ఎత్తులో డ్రాగన్ గంటకు 560 కి.మీ. వేగంతో ఉండగా రెండో డ్రోగ్‌చూట్లు తెరుచుకున్నాయి. ఫలితంగా 6,500 అడుగుల ఎత్తుకు చేసేసరికి వేగం 190 కిలోమీటర్లకు తగ్గింది. అప్పుడు రెండు ప్రధాన పారాచూట్లు తెరుచుకుని దాన్ని పూర్తిగా నెమ్మదింపజేశాయి. 3.28 గంటలకు క్యాప్సూల్ సురక్షితంగా అమెరికాలో ఫ్లోరిడాలోని తలహాసీ సమీపంలో సముద్ర జలాల్లో దిగింది. అప్పటికే సిద్ధంగా ఉన్న నాసా రికవరీ బృందం వెంటనే అక్కడికి చేరుకుంది. చూస్తుండగానే క్యాప్సూల్‌ను సముద్ర జలాల్లోంచి జాగ్రత్తగా బయటికి లాగి నౌకలోకి చేర్చింది. దాదాపు గంటపాటు రొటీన్ పరీక్షల అనంతరం ఎంతగానో ఎదురు చూసిన తరుణం రానేవచ్చింది. క్యాప్సూల్ సైడ్ డోర్ నెమ్మదిగా తెరుచుకుంది. వ్యోమగాములు చిరునవ్వులు చిందిస్తూ, తమను ఆత్రంగా బందిస్తున్న కెమెరాలకేసి చేతులూపుతూ ఒక్కొక్కరుగా క్యాప్సూల్ నుంచి బయటికొచ్చారు. ముందుగా మిషన్ కమాండర్ హ్యాస్, తర్వాత సునీత, గోర్బునోవ్, చివరగా విల్మోర్ బయటికొచ్చారు. నాసా సిబ్బంది, సహచరులు వారికి సాదర స్వాగతం పలికారు. ఆత్మీయ కరచాలనాలు, ఆలింగనాలతో ఉద్వేగపూరిత వాతావరణం నెలకొంది. అనంతరం వారిని స్ట్రెచర్లపై పడుకోబెట్టి వైద్య పరీక్షల నిమిత్తం తీసుకెళ్లారు.

కొన్నాళ్లు జీవితం భారమే

9 నెలలు గడిపిన భారరహిత స్థితిలో గడిపిన కారణంగా భూ వాతావరణానికి పూర్తిస్థాయిలో అలవాటు పడేందుకు సునీత బృందానికి సమయం పడుతుంది. గురుత్వాకర్షణ శక్తికి పూర్తిగా అలవాటు పడేదాకా జీవితం భారంగానే గడుస్తుంది. ఎముకల సాంద్రత తగ్గడం తదితరాల దృష్ట్యా చూపు స్థిరంగా ఉంచడం, కూచోవడం, లేచి సజావుగా నిలబడటం, నడవడం, పక్కకు తిరగడం కూడా కష్టంగానే ఉంటుంది. పాదాలు నవజాత శిశువులంత మృదువుగా మారి నేలపై ఆన్చడం కూడా బాధాకరంగా తోస్తుంది. నలుగురు వ్యోమగాములనూ బుధవారం ఉదయం 9 గంటలకు హూస్టన్‌లో నాసా జాన్సన్ స్పేస్ సెంటర్లోని ఎలింగ్టన్ ఫీల్డ్‌కు చేర్చారు. అక్కడ వారికి 45 రోజుల పాటు పూర్తిస్థాయి పునరావాస కార్యక్రమం ఉంటుంది. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిని నాసా వైద్యుల బృందం నిరంతరం పర్యవేక్షిస్తుంది. వైద్యం, వ్యాయామాలు, ఈత తదితరాలతో వారు నెమ్మదిగా కోలుకుంటారు. ఆ తర్వాతే వారిని సొంతవారితో కలిసేందుకు అనుమతిస్తారు.

డాల్ఫిన్లూ స్వాగతించాయి

స్పేస్‌ఎక్స్ డ్రాగన్ క్యాప్సూల్ సముద్ర జలాల్లో దిగగానే డాల్ఫిన్ల గుంపు దాన్ని చుట్టుముట్టింది. డాల్ఫిన్లన్నీ దానిచుట్టూ కాసేపు రౌండ్లు కొట్టడం విశేషం. నాసా రెస్క్యూ బృందాలు క్యాప్సూల్‌ను అన్నివైపుల నుంచీ పడవల్లో చుట్టుముడుతున్నా అవి ఏమాత్రమూ పట్టించుకోలేదు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఇంటర్నెట్లో ఎక్కడ చూసినా తెగ చక్కర్లు కొడుతున్నాయి. చివరికి డాల్ఫిన్లు కూడా సునీత బృందానికి ఆత్మీయంగా స్వాగతం పలికాయంటూ నెటిజన్లు మురిసిపోతున్నారు!

హోమ్ స్వీట్ హోమ్

నాసా వెల్‌కం మెసేజ్

'హోమ్, స్వీట్ హోమ్' అంటూ సునీత బృందాన్ని నాసా స్వాగతించింది. 'వెల్‌కం హోం... బచ్, సునీ, నిక్, అలెగ్జాండర్!' అంటూ ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది. నలుగురూ జాన్సన్ స్పేస్ సెంటర్‌లోకి ప్రవేశిస్తున్న ఫొటోలను షేర్ చేసింది. కాలిఫోర్నియాలోని స్పేస్ ఎక్స్ మిషన్ కంట్రోల్ కూడా వారికి సాదరంగా స్వాగతం పలికింది.

4,576 భూ ప్రదక్షిణలు

సునీత, విల్మోర్ 286 రోజుల పాటు ఐఎస్ఎస్‌లో గడిపారు. ఆ క్రమంలో ఏకంగా 4,576 సార్లు భూ ప్రదక్షిణ చేస్తూ 12.1 కోట్ల మైళ్ల ప్రయాణించారు!

వాటే రైడ్!

- స్పేస్ ఎక్స్ ఫ్రీడం డ్రాగన్ వ్యోమనౌక కమాండర్ హేగ్ చేసిన వ్యాఖ్య!

ఐఎస్ఎస్‌లోనూ, తిరుగు ప్రయాణ సందర్భంగా వ్యోమగాములు అనుభవించిన భావోద్వేగాలన్నింటికీ ఈ ఒక్క వ్యాఖ్య అద్దం పట్టింది.

భావి తరాలకు గొప్ప స్ఫూర్తి

రాష్ట్రపతి, ప్రధాని ప్రశంసలు

న్యూఢిల్లీ: భారత సంతతి అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్ తొమ్మిది నెలల తర్వాత భూమికి సురక్షితంగా తిరిగి రావడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ తదితర సినీ, రాజకీయ ప్రముఖులు సామాజిక మాధ్యమాల ద్వారా ఆమెకు ఘన స్వాగతం పలికారు. చెక్కుచెదరని గుండె నిబ్బరం, పట్టుదల, అంకిత భావం కలిగిన సునీత భవిష్యత్ తరాలకు గొప్ప స్ఫూర్తి అంటూ ప్రశంసలు కురిపించారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో కూడా సునీత రాకపై హర్షం వెలిబుచ్చింది. కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్‌తోపాటు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సునీతకు స్వాగతం పలికారు.

సునీత, విల్మోర్‌లకు సెల్యూట్: రాష్ట్రపతి ముర్ము

''మన ఆడబిడ్డ సునీత, ఆమె సహ వ్యోమగామి బచ్ విల్మోర్ ప్రదర్శించిన పట్టుదల, అంకితభావం, ఎప్పటికీ చెదరని స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. నాసా క్రూ9 మిషన్‌లో భూమికి సురక్షితంగా తిరిగి వస్తున్న సునీత బృందానికి అభినందనలు. దృఢ సంకల్పం, సమష్టి కృషి, అసాధారణ ధైర్యసాహసాల కలయికతో కూడిన ఒక చారిత్రక ప్రయాణం వీరిది. వీరి అచంచల సంకల్పానికి వందనం. పూర్తి స్థాయి ఆరోగ్యవంతులవ్వాలని కోరుకుంటున్నాను''.

కోట్లాదిమందికి స్ఫూర్తి: ప్రధాని మోదీ

''సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్‌ల సాహసం ఎల్లలెరుగని మానవ శక్తి సామర్థ్యాలకు పరీక్ష. గడ్డు పరిస్థితులెన్నిటినో ఎదుర్కొంటూ వీరు చూపిన అచంచలమైన సంకల్పం లక్షలాది మందికి ఎప్పటికీ స్ఫూర్తినిస్తుంది. అంతరిక్ష అన్వేషణ అంటే మానవ సామర్థ్యం యొక్క పరిమితులను అధిగమించడం, కలలు కనే ధైర్యం, వాటిని సాకారం చేసుకునే ధైర్యం కలిగి ఉండటం. సునీత ఒక ఐకాన్, మార్గదర్శకురాలు. ఆమె తన కెరీర్ అంతటా ఈ స్ఫూర్తిని ప్రదర్శించారు''.

సునీతకు భారత రత్న: మమతా బెనర్జీ

''అంతరిక్షంలో అన్ని సవాళ్లను ఎదుర్కొంటూ తొమ్మిది నెలలు గడిపిన సునీతా విలియమ్స్ భారతరత్నకు అర్హురాలు. కేంద్రం ఆమెకు దేశ అత్యున్నత పౌర పురస్కారాన్ని ప్రకటించాలి. సునీత, బుచ్ విల్మోర్‌లను సురక్షితంగా తిరిగి భూమిపైకి తీసుకువచ్చేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు''.

త్వరలో భారత్‌కు సునీత

- ఆమెకు సమోసా పార్టీ ఇస్తాం
- బంధువుల హర్షాతిరేకాలు

న్యూఢిల్లీ: నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్ సురక్షితంగా భూమికి తిరిగి రావడంపై భారత్‌లోని ఆమె బంధువులు సంతోషం వ్యక్తం చేశారు. ఇదంతా కలలా ఉందని ఆమె మరదలు ఫల్గుణీ ప్యాండ్యా అన్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో సమోసాలు తిన్న తొలి వ్యోమగామిగా సునీతా నిలవడం తెలిసిందే. ఆమెకు 'సమోసా పార్టీ' ఇవ్వడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నట్టు ఫల్గుణి చెప్పారు. సునీత త్వరలో భారత్‌లో పర్యటిస్తారని చెప్పారు. కచ్చితమైన తేదీ తెలియకున్నా సునీత ఈ ఏడాదిలోనే కచ్చితంగా భారత్‌కు వస్తారని తెలిపారు. విలియమ్స్ మళ్లీ అంతరిక్షంలోకి వెళ్తారా, లేక అంగారక గ్రహంపై అడుగుపెట్టే తొలి వ్యక్తి అవుతారా అని ప్రశ్నించగా, ''సునీత ఏం చేసినా అద్భుతంగా చేస్తారు. ఆమె అందరికీ రోల్ మోడల్'' అని కొనియాడారు. ''సునీత గత పుట్టినరోజు సందర్భంగా కాజు కత్లీ పంపా. మహా కుంభమేళకు వెళ్తున్నానని చెప్పగానే ఫొటోలు కావాలని సునీత అడిగారు. యాత్ర గురించి అన్ని విషయాలు చెప్పాలన్నారు'' అని వెల్లడించారు.

గుజరాత్‌లో సంబరాలు

మెహసానా (గుజరాత్): సునీతా విలియమ్స్ క్షేమంగా భూమికి చేరడంతో గుజరాత్‌లోని ఆమె పూర్వీకుల గ్రామం ఝులాసన్‌లో బుధవారం సంబరాలు అంబరాన్నంటాయి. నాసా లైవ్‌ను గ్రామ దేవాలయం వద్ద పెద్ద తెరపై అంతా కలిసి ఉత్కంఠగా చూశారు. తెల్లవారుజామున స్పేస్ ఎక్స్ డ్రాగన్ క్యాప్సూల్ ఫ్లోరిడా తీరంలో సముద్రంలో సురక్షితంగా దిగుతూనే వారంతా టపాసులు పేల్చారు. ఆనందంతో డ్యాన్సులు చేశారు. హర హర మహదేవ్ అంటూ నినాదాలు చేశారు. దీపావళి, హోలీలను తలపించేలా పండుగ వాతావరణం నెలకొంది. సునీతకు గౌరవసూచకంగా ప్రార్థనలు, బాణాసంచా నడుమ భారీ ఊరేగింపు జరిపారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు గుజరాతీ సంప్రదాయ జానపద నృత్యం గర్బా ప్రదర్శించారు. పాటలు పాడుతూ మిఠాయిలు పంచారు. తర్వాత అఖండజ్యోతిని నిమజ్జనం చేశారు. ఆమెను గ్రామానికి ఆహ్వానించేందుకు ఎదురుచూస్తున్నామని గ్రామస్తులు తెలిపారు. ఈ నేలతో ఆమె అనుబంధానికి గర్విస్తున్నామన్నారు.

ముందే తీసుకొచ్చేవాళ్లం

బైడెనే తిరస్కరించారు: మస్క్



వాషింగ్టన్: సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్ ఆగమనంపై స్పేస్ ఎక్స్ యజమాని ఎలాన్ మస్క్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వారిని తీసుకొస్తానని జో బైడెన్ ప్రభుత్వానికి ప్రతిపాదిస్తే రాజకీయ కారణాలతో తిరస్కరించారని ఆరోపించారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు పంచుకున్నారు. ''కేవలం 8 రోజుల కోసమని అంతరిక్షానికి వెళ్లిన వ్యోమగాములు దాదాపు 10 నెలలు అక్కడే ఉండిపోవాల్సి రావడం వింతే. స్పేస్ ఎక్స్ వారిని కొద్ది నెలలకే తీసుకొచ్చేది. ఆ మేరకు అమెరికా ప్రభుత్వానికి గతంలోనే చెప్పాం కూడా. ఈ ప్రతిపాదనను బైడెన్ ప్రభుత్వం ముందుంచాం. ఇది నిజం. కానీ రాజకీయ కారణాలతో తిరస్కరించారు'' అని చెప్పుకొచ్చారు. బైడెన్ ప్రభుత్వం వాళ్లను వారిని ఇంతకాలం అంతరిక్షంలోనే వదిలేయడం దారుణమన్నారు. సునీత తదితరులను సురక్షితంగా తీసుకొచ్చిన నాసా, స్పేస్‌ఎక్స్ బృందాలను మస్క్ అభినందించారు. ఈ మిషన్‌కు తొలి ప్రాధాన్యమిచ్చిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ధన్యవాదాలు తెలిపారు. గత జనవరి 20న ట్రంప్ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించగానే సునీత, విల్మోర్‌లను వీలైనంత త్వరగా తిరిగి తీసుకురావాలని తనను కోరినట్టు గతంలోనే తెలిపారు.

మాట నిలబెట్టుకున్నాం: వైట్‌హౌస్


అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయిన సునీత, విల్మోర్‌లను సురక్షితంగా తీసుకొస్తామన్న హామీని అధ్యక్షుడు ట్రంప్ నిలబెట్టుకున్నారని వైట్‌హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది. డ్రాగన్ వ్యోమనౌక ఫ్లోరిడా తీరంలో సముద్రంలో దిగిన వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ''9 నెలలపాటు ఐఎస్ఎస్‌లో చిక్కుకున్న వ్యోమగాములు ఎట్టకేలకు భూమికి చేరారు'' అని పేర్కొంది.

రైతు నేతల నిర్బంధం

చండీగఢ్: పంజాబ్‌లోని మొహాలీలో బుధవారం ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. రైతు సంఘాల నేతలు ఖనౌరీ, శంభు సరిహద్దు పాయింట్ల వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. బారికేడ్లతో అడ్డుకున్న పోలీసులతో వారు బాహాబాహీకి దిగారు. ఘటన నేపథ్యంలో పోలీసులు రైతు సంఘాల నేతలు జగ్జీత్ సింగ్ దల్లేవాల్, సర్వాన్ సింగ్ పంధేర్ మరికొందరు నేతలను అదుపులోకి తీసుకున్నారు. దల్లేవాల్ గతేడాది నవంబర్ 26 నుంచి నిరశన దీక్ష కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. పంటల కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)కి చట్టబద్ధత కల్పించడం తదితర డిమాండ్లతో రైతులు ఖనౌరీ, శంభుల వద్ద గతేడాది ఫిబ్రవరి 13వ తేదీ నుంచి నిరసనలు కొనసాగిస్తున్నారు. బుధవారం పోలీసులు, రైతుల మధ్య గొడవ నేపథ్యంలో ఖనౌరీ, చుట్టుపక్కల సంగ్రూర్, పటియాల్లో ముందు జాగ్రత్తగా అధికారులు ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. ఖనౌరీ వద్దకు అదనంగా పోలీసులను తరలించారు. శంభు, ఖనౌరీల వద్ద రైతుల శిబిరాలను తొలగించి, రాకపోకలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం ఒక ప్రణాళికను సిద్ధం చేసింది.

ముగిసిన ఏడో విడత చర్చలు

అంతకుముందు, రైతు సంఘాల నేతలతో కేంద్ర బృందం ఏడో విడత చర్చలు జరిపింది. సుహృద్భావ వాతావరణంలో సానుకూలంగా చర్చలు సాగుతున్నాయని బుధవారం సమావేశం అనంతరం కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చెప్పారు. చండీగఢ్‌లోని మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ భవనంలో జరిగిన ఈ భేటీలో వినియోగదారుల వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్‌తోపాటు పంజాబ్ మంత్రులు కూడా పాల్గొన్నారు. రైతుల డిమాండ్ల సాధన కోసం ముందుండి పోరాడుతున్న సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా(కేఎంఎం)లకు చెందిన 28 మంది సభ్యులతో కూడిన బృందం కూడా చర్చల్లో పాలుపంచుకుంది. మరో దఫా చర్చలు మే 4వ తేదీన జరుగుతాయని వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చెప్పారు.


రైతు నేతలను అరెస్టు చేస్తున్న పోలీసులు

అమెరికా యాజమాన్యంలోకి... ఉక్రెయిన్ విద్యుత్కేంద్రాలు

- వాటి భద్రతకు అదొక్కటే మార్గం
- జెలెన్‌స్కీకి ట్రంప్ ప్రతిపాదన
- గంటపాటు నేతల ఫోన్ చర్చలు

వాషింగ్టన్/కీవ్: రష్యా, ఉక్రెయిన్ యుద్ధానికి తెర దించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలు మరింత వేగం పుంజుకున్నాయి. వాటిలో భాగంగా రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్‌తో మంగళవారం గంటకు పైగా ఫోన్లో మాట్లాడిన ట్రంప్ బుధవారం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతోనూ ఫోన్ చర్చలు జరిపారు. యుద్ధానికి తెర దించే మార్గాలపై గంటపాటు సుదీర్ఘంగా చర్చించారు. పుతిన్‌తో తన ఫోన్ సంభాషణల సారాన్ని జెలెన్‌స్కీతో పంచుకున్నారు. వారి మధ్య సయోధ్య కుదిర్చే మార్గాలపైనే ప్రధానంగా చర్చించినట్టు అనంతరం ట్రంప్ ప్రకటించారు. ''నా ప్రయత్నాలు చాలావరకు ఫలించాయి. చర్చలు చాలా బాగా జరిగాయి'' అంటూ సోషల్ మీడియా హ్యాండిల్ ట్రూత్‌లో పోస్టు చేశారు. ఫిబ్రవరి 28న వైట్‌హౌస్‌లో ట్రంప్, జెలెన్‌స్కీ వివాదాస్పద భేటీ అనంతరం వారిద్దరూ మాట్లాడుకోవడం ఇదే తొలిసారి. ఉక్రెయిన్ విద్యుత్కేంద్రాలను అమెరికా యాజమాన్యంలోకి తీసుకునేందుకు అంగీకరించాలని ఈ సందర్భంగా ట్రంప్ ప్రతిపాదించినట్టు అమెరికా విదేశాంగ మంత్రి మార్కోరూబియో తెలిపారు. ప్లాంట్లు సురక్షితంగా ఉండాలన్నా, సజావుగా నడవాలన్నా అదొక్కటే మార్గమని అధ్యక్షుడు అభిప్రాయపడ్డారన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

కెన్నడీ హత్యకు కారకులెవరు?

- సీఐఏ పరోక్ష పాత్రను బహిర్గతం చేసిన రహస్య పత్రాలు
- తాజాగా 63వేల రహస్యపత్రాలు వెల్లడించిన ట్రంప్ సర్కార్

దల్లాస్(అమెరికా): కేవలం 43 ఏళ్లకే అగ్రరాజ్యానికి అధ్యక్షుడిగా జాన్ ఎఫ్.కెన్నడీ అధికారాన్ని కైవసం చేసుకోవడం ఎంత చరిత్రాత్మకమో ఆయన హత్యోదంతం అంతే వివాదాలు, మిస్టరీలతో అంతులేని రహస్యంగా మిగిలిపోయింది. ఇందులోని చిక్కుముడులను కొన్నింటిని విప్పేందుకు డొనాల్డ్ ట్రంప్ సర్కార్ ప్రయత్నాలు మొదలెట్టింది. దాదాపు 60 లక్షల పత్రాలు, ఫొటోలు, వీడియోలు, సౌండ్ రికార్డులు, సాక్ష్యాధారాల్లో గతంలో చాలావరకు బహిర్గతమైనా వాటి ద్వారా ఆయన హత్యకు కారణాలపై స్పష్టత రాలేదు. దీంతో మంగళవారం మరో 63,000 పేజీల కీలక సమాచారాన్ని అమెరికా నేషనల్ ఆర్కైవ్స్ అండ్ రికార్డ్స్ అడ్మినిస్ట్రేషన్ తాజాగా తమ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది.

ఆరోజు ఏం జరిగింది?

1963 నవంబర్ 22వ తేదీన డల్లాస్‌లో అధ్యక్షుడు కెన్నడీ, భార్య జాక్వెలిన్‌తో కలిసి కారులో ప్రయాణిస్తూ రోడ్డుకు ఇరువైపులా ఉన్న వందలమంది మద్దతుదారులకు అభివాదం చేస్తున్న సమయంలో కాల్పుల మోత మోగింది. ఈ సమయంలో కెన్నడీ బుల్లెట్ గాయాలతో ప్రాణాలు కోల్పోయారు. సమీపంలోని టెక్సాస్ స్కూల్‌బుక్ డిపాజిటరీ భవనం ఆరో అంతస్తులో తుపాకీతో ఉన్న 24 ఏళ్ల మాజీ నావికాదళ సైనికుడు లీ హార్వే ఓస్వాల్డ్‌ను పోలీసులు అరెస్ట్‌చేశారు.

తర్వాత ఏమైంది?

ఇక్కడే అసలు కథ మొదలైంది. హంతకుడిని పట్టుకున్నామని భావించేలోపే అతడిని చంపేశారు. ఓస్వాల్డ్‌ను రెండు రోజుల తర్వాత జైలుకు తరలిస్తున్న సమయంలో ఒక నైట్‌క్లబ్ యజమాని జాక్ రూబీ కాల్చి చంపాడు. అయితే కొంతకాలం తర్వాత జాక్‌రూబీ జైలులో ఉన్నప్పుడు ఊపిరి తిత్తిలో ధమనిలో రక్తం గడ్డకట్టి చనిపోయాడు. అసలు కెన్నడీని ఓస్వాల్డ్ ఎందుకు చంపాడు?. ఓస్వాల్డ్‌ను జాక్‌రూబీ ఎందుకు చంపాడు?. జాక్‌రూబీది సాధారణ మరణమేనా? అనేవి ఇప్పటికీ మిస్టరీగా ఉన్నాయి.

వెలుగులోకి సీఐఏ పాత్ర

విదేశాల రహస్యాలను అధ్యక్షుడికి చేరవేయాల్సిన సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ(సీఐఏ) తన వృత్తిధర్మానికి విరుద్ధంగా అధ్యక్షుడి పర్యటన వివరాలను శత్రుదేశాలకు చేరవేసిందని పలు పత్రాల్లో వెల్లడైంది. అయితే మొత్తం సీఐఏ వ్యవస్థకాకుండా సీఐఏలోని కొందరు ఏజెంట్లు అమెరికాకు వ్యతిరేకంగా పనిచేశారని తాజా పత్రాల్లో తేలింది. అమెరికాకు బద్ధశత్రువులైన నాటి సోవియట్ రష్యా, క్యూబా వంటి దేశాలు అధ్యక్షుడిని అంతమొందించేందుకు ప్రయత్నించాయని, ఆ పనిలో సఫలీకృతమయ్యాయని కొందరు వాదించారు. అయితే తాజా పత్రాల్లో దీనికి సంబంధించిన బలమైన సాక్ష్యాలు లేనప్పటికీ పరోక్ష సాక్ష్యాధారాలు వెలుగులోకి వచ్చాయి. కెన్నడీని హత్యచేసిన ఓస్వాల్డ్ అంతకుముందు రష్యాకు, క్యూబాకు వెళ్లేందుకు ప్రయత్నించాడని, వీసా కోసం దరఖాస్తు చేసుకున్నాడన్న ఆధారాలను తాజాగా నేషనల్ ఆర్కైవ్స్ బహిర్గతంచేసింది.

అసలు చంపింది ఎవరు?

ఘటనాస్థలిలో ఓస్వాల్డ్‌ను అదుపులోకి తీసుకున్నప్పటికీ, ప్రత్యక్ష సాక్షుల కథనాలు వేరుగా ఉన్నాయి. ఓస్వాల్డ్ దూరంగా బిల్డింగ్‌లో ఆరో అంతస్తులో ఉంటే కాల్పుల శబ్దాలు ఆ భవంతి నుంచికాకుండా పక్కనే ఉన్న పచ్చికబయళ్ల నుంచి వచ్చాయని పలువురు సాక్ష్యాలు ఇచ్చారు. దీంతో తర్వాతి అధ్యక్షుడు లైడన్ బీ జాన్సన్ ఆదేశాలతో ఏర్పాటైన వారెన్ కమిషన్ ఇచ్చిన నివేదిక పైనా తాజాగా అనుమానాలు రేకెత్తుతున్నాయి. సీఏఐలోని ఒక వర్గానికి కెన్నడీ అధ్యక్షుడిగా కొనసాగడం ఇష్టంలేదని, అందుకే వాళ్లు శత్రు దేశాలతో చేతులు కలిపారని మరో వాదన ఉంది. దీనికి బలం చేకూర్చే అంశం తాజాగా వెల్లడైంది. హత్య జరిగిన వెంటనే సీఏఐ ఏజెంట్ గ్యారీ అండర్‌హిల్ వాషింగ్టన్ సిటీ నుంచి పారిపోయి న్యూజెర్సీలో స్నేహితుని ఇంట్లో దాక్కున్నాడు. ఒకానొక సమయంలో స్నేహితుడితో మాట్లా డుతూ.. '' సీఐఏలోని ఒక ఉన్నతస్థాయి అధికార వర్గానికి కెన్నడీ అంటే అస్సలు గిట్టదు. వాళ్లే కెన్నడీని అంతంచేశారు. వాళ్లు దొరక్కుండా ఉండేందుకు ఓస్వాల్డ్‌ను బలిపశువును చేశారు'' అని అన్నారు. కొద్దినెలల తర్వాత ఏజెంట్ గ్యారీ చనిపోయాడు. ఆత్మహత్య చేసుకున్నట్లు రిపోర్టులొచ్చాయి. రహస్య పత్రాల్లో ఇంకా మూడింట రెండొంతులు బహిర్గతంచేయలేదని, అవి వెల్లడిస్తే హత్యపై స్పష్టత వస్తుందని పలువురు అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు చెబుతున్నారు.

బ్రహ్మానందంతో మాటా మంతీ...



ప్రపంచంలో సంతోషంగా ఉండే వ్యక్తుల

6 ఉత్తమ గుణాలు

1. నేను గొప్ప అని పోజు కొట్టకపోవడం
2. అవసరమైనప్పుడే మాట్లాడటం
3. రోజూ ఏదో ఒకటి నేర్చుకోవాలనుకోవడం
4. రోజూ ఒక చిన్న సాయం అయినా చేయడం
5. హాయిగా నవ్వడం... ఎక్కువగా నవ్వడం
6. నానా చెత్తను బుర్రకు చేర్చకపోవడం

సంతృప్తే సదానందం

World Happiness Day

బ్రహ్మాండమైన హాస్యనటుడు బ్రహ్మానందం. కానీ తనని మించిన హాస్య నటులు చాలామంది ఉన్నారని ఆయన అంటున్నారు. ఎలా అంటే..? 'చుట్టూ ఉన్నవాళ్లని చూస్తూ... ఆనందపరుస్తూ... నవ్విస్తూ ఉండగలిగితే నీ అంతటి హాస్య నటుడు ఇంకొకడు లేడు' అన్నారు బ్రహ్మానందం. సంతృప్తే సంతోషం అనే ఈ సదానందం 'వరల్డ్ హ్యాపీనెస్ డే' సందర్భంగా 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పంచుకున్న విశేషాలు.

ఆనందానికి మీరిచ్చే నిర్వచనం?

ఆనందం అనేది ఓ అనుభూతి... ఓ భావోద్వేగం. నవ్వు కూడా ఓ అనుభూతి. కేవలం శబ్దం కాదు. ఇక ఆనందం ఒక్కొక్కరిది ఒక్కో రకంగా ఉంటుంది. నువ్వు చేసే పని ద్వారా నువ్వు పొందే అనుభూతే ఆనందం. మన మనసుకి ఏదైతే ఆనందాన్నిస్తుందో అదే ఆనందానికి నిర్వచనం.

ఒక మనిషి నవ్వుతూ ఉన్నాడంటే ఆనందంగా ఉన్నట్టేనా?

ఉన్నట్టు కాదు. నవ్వు నిస్సహాయతలోనూ వస్తుంది. అలానే ఏడుస్తున్నాడంటే విపరీతమైన బాధలోనూ ఉన్నట్టు కాదు. మనం ఒక ట్రాజెడీ నాటకం చూస్తున్నప్పుడు ఏడుస్తుంటాం. కానీ అది మన వ్యక్తిగత బాధ కాదు. మనం చూస్తున్న దాని ద్వారా పొందిన అనుభూతి. 'వియ్ కెన్ గెట్ హ్యాపీనెస్ ఫ్రమ్ ట్రాజెడీనెస్ ఆల్సో'. ఇక మనిషి భావాలను బట్టి అతను బయటకు కనిపించేది... అతని లోపల జరిగేది ఒకటే అనుకోలేం.



ప్రస్తుతం నెగటివిటీ వైపే చాలామంది ఆకర్షితులవుతున్నారు... ఈ పరిస్థితి గురించి?

ప్రస్తుతం ఏ మనిషికైనా రెండే పద్ధతులు పని చేస్తాయి. నచ్చింది తీసుకోవడం.... నచ్చనిది పట్టించుకోకపోవడం. పాజిటివ్‌గా ఉండాలంటే నెగటివ్‌వైపు వెళ్లకుండా ఉండటమే. పోనీ వెళ్లడంలోనే ఆనందం ఉందీ అనుకుంటే... అది వారి ఆలోచనా విధానం. ఎక్కడైనా ఫలానాది జరిగింది అంటూ ఓ నెగటివ్ హెడ్‌లైన్ చదివితే... ఏం జరిగిందో తెలుసుకోవాలనే కుతూహలం. తీరా అసలు విషయంలో ఏమీ ఉండదు. సో... నెగటివిటీకి ఎట్రాక్ట్ అవుతున్నారు. అందుకే పెరిగిపోతోంది. ఈ పెరుగుదలకు కూడా కారణం మనమే. అందుకే పాజిటివిటీని పెంచడానికి ప్రయత్నించడం మంచిది.

చిన్నప్పుడు మీరు ఆర్థికపరమైన, ఇంకా ఎన్నో ఒడిదొడుకులు చూశారు. సో... మీకు పరిపూర్ణమైన ఆనందం పరిచయమైనది ఎప్పుడు?

నేనెప్పుడూ ఆనందం ఇలా ఉంటుంది... దుఃఖం ఇలా ఉంటుందీ అనుకోలేదు. రెండింటినీ వేరువేరుగా చూడలేదు... తెలియదు కూడా. ఆర్థిక సమస్యలుంటే దుఃఖం, అవి లేకుంటే ఆనందం అనుకోలేదు. ఒక మహర్షిలా తలకిందులుగా తపస్సు చేసి, నేర్చుకున్నటువంటి జ్ఞానం కాదిది. స్వతహాగానే ఏర్పడింది. ఈ పూట భోజనం ఉండదే అని బాధపడిపోలేదు. బట్టలు సరిగ్గా లేవా... ఓకే అనుకునే వాణ్ణి. అమ్మ పెట్టిందే బాగుందనుకోవడం.... నాన్న ఇచ్చినవే బాగున్నాయనుకోవడం. ఆనందాన్ని, దుఃఖాన్ని విభజించడం రాకపోవడం నాకు అలవాటుగా మారిపోయింది. ప్రస్తుతానికి అన్నీ ఉన్నాయి. బావుంది. అలాగని బ్రహ్మానందపడిపోలేదు. అప్పటి ఆ దుఃఖం తెలియకపోవడంవల్లే ఇప్పటి ఈ ఆనందం కూడా మనసుకి ఎక్కలేదు అనుకుంటుంటా. అయినా ప్రతిదీ లోతుగా విశ్లేషించి చూడక్కర్లేదు. సౌకర్యం ఇచ్చేది ఆనందం అంటా. అలాగే అసౌకర్యం ఆనందం ఇవ్వనిది కాదు కానీ విషాదం అని మాత్రం అనను.

స్థితప్రజ్ఞతతో ఉండటం అనేది మీకు చిన్నప్పుడే అలవాటైందనుకోవచ్చా?

ఏమో... ఏది ఏమైనా జీవితం నేర్పిన పాఠాలు కొన్ని ఉంటాయి. పేదరికమంటే నాకు విపరీతమైన ఇష్టం. అందుకే నేను పేదవాళ్లకి సహాయం చేసినా బయటకు చెప్పను... కానీ చేస్తూనే ఉంటా. ఇక పేదరికం అనేది మన దగ్గర ఏది లేదో దాన్ని సంపాదించడానికి కృషి చేసే అవకాశాన్ని కల్పిస్తుంది. నీ దగ్గర తిండి, డబ్బు, గౌరవం లేకపోతే వాటిని ఎలా సంపాదించుకోవాలా అని ఆలోచిస్తావు. అలా నీకు లేనిదాన్ని పొందడానికి దారి చూపించే ఓ మంచి మార్గం పేదరికం. అందులో నుంచి ఎలా బయటకు రావాలనే తపన ఉండాలి తప్ప మనకు లేదు... వాడికి ఉంది అని పోల్చి చూసుకోవడాలు ఉండకూడదు. ఈ లేదూ... ఉంది అనే ఆలోచనల్లో కన్నీళ్లు తప్ప ఏమీ మిగలవు.

పేరుకు తగ్గట్టు మీరు బ్రహ్మానందాన్ని పంచుతున్నారు... 'నాకీ పేరు ఎందుకు పెట్టాలనిపించింది' అని మీ తల్లిదండ్రులను ఎప్పుడైనా అడిగారా?

ఇలా మన గురించి ఒకరు అనుకుంటే హ్యాపీగా ఉంటుందేమో. నేనెప్పుడూ వాళ్లని అడగలేదు. అడుగుదామనే స్థాయికి చేరుకునే సరికి వాళ్లు పెద్దవాళ్లైపోయారు. మేం ఎనిమిది మంది సంతానం. నేను ఏడోవాడిని. ఏదో పేరు పెట్టారు... అనుకున్నానంతే. ఇప్పుడీ స్థితికి వచ్చాక నా తల్లిదండ్రులు పెట్టిన పేరుకి జస్టిఫికేషన్ జరిగిందని అనుకుంటుంటాను.

స్ట్రెస్‌లో ఉన్నప్పుడు కొందరు మీ కామెడీ సీన్లు చూసి, రిలీఫ్ అవుతుంటారు. మరి... మీ స్ట్రెస్ బస్టర్?

నేనెప్పుడూ ఆనందంగా ఉంటాను. నా ఫిలాసఫీ చెప్పాను కదా. బాధ, ఆనందం వేరు వేరు అనుకోను. కెరటం ఎగిసినప్పుడు విజయం అని, కిందపడినప్పుడు అపజయం అనీ అనుకుంటాం. కానీ అవి రెండూ ఒకటే. అలాగే ఆనందం, బాధ కూడా. గతంలో ఇదే ప్రశ్న అడిగి ఉండుంటే, మంచి భోజనం తింటే ఆనందం అనే వాణ్ణేమో. కానీ ఇప్పుడు ఈ 70 ఏళ్ల వయసులో తినే ఓపిక, తిన్నా అరిగించుకునే ఓపిక రెండూ లేవు. 'ఏం టోనండీ ఓ ముద్ద తినలేకపోతున్నాం' అనుకోవాలి. దీన్ని మళ్లీ బాధ అంటున్నాం. ఇది కూడా బాధ కాదు. ఆనందం, బాధ... ఈ రెండూ మన ఆలోచనా విధానం మీదే ఆధారపడి ఉంటాయి.



ప్రస్తుతం దాదాపు అందరి జీవితం ఒత్తిడి అయిపోయిన ఫీలింగ్...

ఒత్తిడి లేకుండా ఎప్పుడుంది? పూర్వం కూడా ఒత్తిడి జీవితమే. ఇప్పుడు ఉరుకుల పరుగుల జీవితం అంటున్నాం. మరి... జనాభా పెరిగిపోయారు కదా. సమస్యలు పెరిగాయి. భక్తి పెరిగింది. అన్ని రకాలుగా పెరుగుదలలు ఉన్నప్పుడు ఒత్తిడి కూడా వస్తుంది. అలాగే ఒత్తిడి సహజంగా రావడం... లేదా మనం తెచ్చుకుంటే రావడం... రెండు రకాలుగానూ వస్తుంది.

మీ లైఫ్‌లో డల్ మూమెంట్స్ ఉంటాయా?

సూర్యుడే డల్ అయిపోతాడు సాయంత్రానికి. మనమెంత? ఇదంతా ఓ నిరంతర ప్రక్రియ. అయితే కోరి డల్‌నెస్ తెచ్చుకోవడం వేరు... రావడం వేరు. సాగుతున్నప్పుడు డల్‌నెస్ అదే వస్తుంది. ఎలాగంటే ఇప్పుడు నాకు నాలుగు గంటలకల్లా కాఫీ ఇవ్వాలనుకోండి... ఓ రెండు నిమిషాలు లేట్ అయిందంటే... ఏంటో ఇవ్వడానికి ఆలస్యం చేస్తున్నారని డల్ అయిపోవచ్చు... ఏముందీ కాస్త లేట్ అయిందని కూల్‌గానూ ఉండొచ్చు. సో... డల్‌నెస్ అనేది సాగనప్పుడు రాదు. జీవితం అనేది మన చేతిలో స్టీరింగ్ లాంటిది. ఎటు తిప్పుతున్నామనేది మన చేతుల్లోనే ఉంటుంది.

ఇప్పుడు యువత చిన్న చిన్న విషయాలకే విపరీతంగా బాధపడిపోతున్న ధోరణి కనబడుతోంది... వాళ్లకి ఏం చెబుతారు?

ఇప్పుడు యువత ఆనందంగా లేరని చెప్పలేం. అయితే ఇప్పుడు యూత్‌లో ఎక్కువమంది కష్టపడకుండా ఎలాగైనా డబ్బులు సంపాదించుకోవాలనే దాని మీద దృష్టి పెడుతున్నట్లున్నారు. అలా కాకుండా కష్టపడి పని చేసి, సక్సెస్ సాధించాలి. వేరే ఇతర మార్గాల వైపు... అంటే సులువైన మార్గాల్లో వెళ్లి సంపాదించుకుంటే, కష్టపడి సాధించేదాంట్లో దొరికే తృప్తి దొరకదు. ఇలాంటివన్నీ సాధ్యమైనంత వరకూ చెప్పే ప్రయత్నం చేయాలి. మన హిందూ ధర్మం గొప్పదనం ఏంటంటే... ఎదుటివారిని బాధించకుండా ఉండటం. ఎవరి అభిప్రాయం వారిది అని గౌరవించడం.

– డి.జి. భవాని

ఫొటోలు: ఎస్.ఎస్. ఠాకూర్

ధన్‌రాజ్... తాగుబోతు రమేశ్... నవ్వించడంలో ఇద్దరూ ఇద్దరే. నవ్వించే వృత్తిలో ఉన్నందుకు మీ ఫీలింగ్? మీ జీవితంలో మరచిపోలేని ఆనందకర సంఘటన, తెరపై నవ్వులు పంచి, సహాయం చేస్తున్నారు... వ్యక్తిగత సహాయాల గురించి... వంటి ప్రశ్నలకు ఈ హాస్య నటులిద్దరూ ఈ విధంగా స్పందించారు



● భార్య శిరీష, కుమారులు సుక్రమ్, దీప్‌రాజ్‌లతో ధన్‌రాజ్

ఆనందం పంచుదాం - ధన్‌రాజ్

నవ్వడం ఒక యోగం... నవ్వించడం ఒక భోగం... నవ్వకపోవడం ఒక రోగం అన్నారు. జీవితానికి నవ్వనేది ఎంతో ముఖ్యం. సినిమాల ద్వారా ఎన్నో కోట్ల మందిని నవ్వించి, ఆనందపరిచే చాన్స్ నాకు దొరకడం ఆ దేవుడు, మా అమ్మా నాన్న ఇచ్చిన ఆశీర్వాదం అని భావిస్తాను. నా జీవితంలో ఆనందకర సంఘటనలు చాలా ఉన్నాయి. కానీ ఎన్ని ఉన్నా మా అబ్బాయిలు పుట్టినప్పుడు నాకు దక్కిన ఆనందానికి ఏదీ సాటి రాదు. జీవితంలో మనం ఎవరికైనా ఏదైనా సహాయం చేయాలంటే... అది అవతలివాళ్లని బాధపెట్టకుండా ఉండటమే అనుకుంటాను. వీలుంటే నవ్విద్దాం... బాధలో ఉంటే ఓదారుద్దాం. అంతే తప్ప కొత్త బాధని మాత్రం వారికి పరిచయం చేయాలనుకోవద్దు. ఎవరికీ హాని చేయకుండా ఉంటే మనం వాళ్లకి న్యాయం చేసినవాళ్లం అవుతాం. చుట్టూ ఉన్నవాళ్లని ఆనందంగా ఉంచుదాం... అలా ఆనందాన్ని పంచితే ఆటోమేటిక్‌గా ఆ ఆనందం మనకూ దగ్గరవుతుంది.

నవ్వించాలనే వచ్చా - తాగుబోతు రమేశ్



● భార్య స్వాతి, కుమార్తెలు ప్రశంస, హమ్సికలతో రమేశ్

నవ్వించడమే నా పని కావడం చాలా హ్యాపీగా ఉంది. ఎందుకంటే మా ఊరు గోదావరి ఖని నుంచి వచ్చేటప్పుడే నేను అందర్నీ నవ్విస్తానని చెప్పి మరీ హైదరాబాద్ వచ్చా. కమేడియన్‌గా ప్రూవ్ అయ్యా... అనుకున్నట్లే అందర్నీ నవ్విస్తున్నా. వృత్తిపరంగా ఇంతకు మించిన ఆనందం ఏం ఉంటుంది. ఇక నా జీవితంలో ఆనందకర సంఘటనలు అంటే... నా బిడ్డలే. మా అమ్మకు నేను పుట్టినప్పుడు ఆవిడకి కిక్. నాకు నా ఇద్దరు బిడ్డలు పుట్టినప్పుడు డబుల్ కిక్. ప్రపంచంలో ఇంతకు మించిన కిక్ ఏదీ ఉండదన్నంత ఆనందపడ్డాను. నా కుమార్తెలు పుట్టిన క్షణాన నాకు కలిగిన ఆనందం తాలూకు అనుభూతి ఎప్పటికీ ఉండిపోతుంది. సహాయం గురించి చెప్పాలంటే... చిన్న చిన్న సహాయాలు చాలామందికి చేశాను. కానీ బయటకు చెప్పను. ఎందుకంటే కుడి చేత్తో చేసిన సాయం ఎడమ చేతికి కూడా తెలియకూడదంటారు కదా. ఆ సహాయాల గురించి పక్కన పెడితే... వెండితెర నాకు ఇచ్చిన నవ్వుల పనిని నేను హ్యాపీగా చేసుకుంటూ... నా పని ద్వారా నవ్వించగలగడం నాకు ఆనందంగా ఉంది.

నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

'ఆ రోజుల్లో' 'మా రోజుల్లో' అంటూ పిచ్చుకలను తలచుకుంటూ బాధపడితే ఏం లాభం? సొంత లాభం కొంత మానుకొని 'నా ఇల్లు... నా పక్షులు' అనుకుంటే పిచ్చుకలు పూర్వకళతో సందడి చేస్తాయి. పిచ్చుకలు కనిపించడం అరుదైన దృశ్యం కావడం హైదరాబాద్‌కు చెందిన భావన శ్రీనివాస్‌ను బాధించింది. ఆ బాధే పిచ్చుకల సంరక్షణను ఉద్యమ స్థాయిలో చేసేలా చేస్తోంది.

పిచ్చుకలు మెచ్చేలా...



పిచ్చుకలు ఎందుకు కనిపించడం లేదో తెలుసా?

నగరీకరణ: కొత్త కాంక్రీట్ భవనాల నిర్మాణం, చెట్లు కొట్టివేత వల్ల పిచ్చుకలకు గూళ్లు కట్టుకునే అవకాశం తగ్గిపోయింది.

ప్లాస్టిక్ వినియోగం: మనం విసిరేసే ప్లాస్టిక్ వ్యర్థాలలో పక్షులు చిక్కుకుని మరణించడం పెరిగిపోయింది.

రసాయనాల ప్రభావం: వ్యవసాయ రంగంలో అధికంగా ఉపయోగించే రసాయనిక ఎరువుల వల్ల పురుగులతో పాటు చిన్నపాటి పక్షులు చనిపోతున్నాయి.

నీటి కొరత: ప్రత్యేకించి వేసవిలో పిచ్చుకలకు తాగేందుకు నీరు దొరకకపోవడం వాటి మనుగడకు కష్టంగా మారింది.

సమాజంలో పర్యావరణం పట్ల పెరుగుతున్న నిర్లక్ష్యం భావన శ్రీనివాస్‌ను ఆలోచనలో పడవేసింది. సమాజానికి తన వంతుగా ఏదైనా చేయాలనే ఆలోచనే 'జాగృతి అభ్యుదయ సంఘం'కు బీజం వేసింది. ఈ సంస్థ పక్షుల సంరక్షణ, మొక్కల పెంపకం, నీటి సంరక్షణ, ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణలాంటి అంశాలపై పనిచేస్తుంది.

ప్రతి ఇంటికి ఒక గూడు

ఇంటి చుట్టుపక్కల, తోటల్లో, రహదారుల పక్కన కనిపించే పిచ్చుకలు ఇప్పుడు చాలా అరుదుగా మాత్రమే కనిపిస్తున్నాయి. చెట్లు కొట్టివేయడం, ఆధునిక నిర్మాణాల వల్ల వాటికి గూళ్లు లేకుండా పోతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని భావన శ్రీనివాస్ 'పిచ్చుక గూళ్ల సంరక్షణ' కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి ఇంట్లో కనీసం ఒక మట్టి గూడు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో వేల సంఖ్యలో మట్టి గూళ్లను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

విద్యార్థులే వెన్నెముకగా...

గూళ్ల తయారీని గ్రామీణ మహిళలకు అప్పగించి వారికి ఉపాధి కల్పిస్తున్నారు. వేసవికాలంలో పిచ్చుకలు దాహంతో బాధపడకుండా, ప్రతి ఇంటి ముందు చిన్న నీటి తోగులు (నీటి గిన్నెలు) పెట్టేలా అవగాహన కలిగిస్తున్నారు. చెట్లు, బడులు, వృద్ధాశ్రమాలలో కూడా ఈ తోగులను ఏర్పాటు చేస్తున్నారు. పిచ్చుకల ప్రాముఖ్యతపై బడులలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 'ఒక ఇంట్లో ఒక గూడు' అనే ఉద్యమాన్ని విద్యార్థుల సహకారంతో ముందుకు తీసుకెళుతున్నారు. ఇప్పటికే వేలాది కుటుంబాలు పక్షుల సంరక్షణ ఉద్యమంలో భాగమయ్యాయి.

– శిరీష చల్లపల్లి

అవిగో పిచ్చుకలు!



రకరకాల కారణాల వల్ల పిచ్చుకల సంఖ్య తగ్గిపోతోంది. వాటిని రక్షించుకోవాలని వ్యవసాయ విశ్వ విద్యాలయంలో పక్షి విభాగం శాస్త్రవేత్త వాసుదేవరావుతో మాట్లాడాను. అట్టపెట్టెలతో చేసిన పిచ్చుక గూళ్లు ఇచ్చారు. మంచి మట్టితో తయారుచేసిన గూళ్లు ఎకో ఫ్రెండ్లీగా ఉంటాయి అనే ఆలోచనతో ఒక కుమ్మరి కళాకారుడికి నా కాన్సెప్ట్ చెప్పాను. అతను చేసి ఇచ్చాడు. సక్సెస్ అవుతామా లేదా తెలుసుకోడానికి ముందు మా ఇంట్లోనే పెట్టాము. సూపర్ సక్సెస్ అయ్యాం. ఇప్పుడు మా ఇంటి చుట్టూ వెయ్యి వరకు పిచ్చుకలు ఉన్నాయి. పిచ్చుకలను ఎవరు తీసుకెళ్లినా ఇతరులలో స్ఫూర్తి నింపడానికి ఆ విషయాన్ని వాట్సాప్ గ్రూపులో పెట్టండి అని చెబుతుంటాను. - భావన శ్రీనివాస్

సాక్షి సినిమా

విడుదలయ్యాక మా సినిమా రేంజ్ తెలుస్తుంది - షెరాజ్



● విహాన్షీ, షెరాజ్, కృతీ, నేహా

షెరాజ్ మెహదీ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'ఓ అందాల రాక్షసి'. ఈ చిత్రంలో విహాన్షీ హెగ్డే, కృతి వర్మ హీరోయిన్లుగా నటించారు. స్కై ఈజ్ ది లిమిట్ బ్యానర్‌పై షేర్ సమర్పణలో సురీందర్ కౌర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఈ సినిమాలో ఓ కీలక పాత్రలో నటించిన దర్శక–నిర్మాత–నటుడు తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ– ''భాష్య శ్రీ ఈ కథను నా దగ్గరకు తీసుకు వచ్చి, ఈ సినిమా కచ్చితంగా చేయాలన్నట్లుగా చెప్పారు. వీళ్లని ఎలాగైనా వదిలించుకోవాలని పెద్ద మొత్తంలో పారితోషికం చెప్పాను. అంత డబ్బు ఎలాగూ ఇవ్వలేరు... నన్ను వదిలేస్తారనుకున్నాను. కానీ నేనడిగినంత డబ్బు ఇచ్చారు. నా ఇన్నేళ్ల కెరీర్‌లో ఇంత మొత్తం చూసింది ఇదే తొలిసారి. ఇక ఉమెన్ సెంట్రిక్‌గా సాగే 'ఓ అందాల రాక్షసి' సినిమా కథ చాలా బాగుంది. ఈ సినిమా స్క్రిప్ట్ నాకు చాలా బాగా నచ్చింది. ఇలాంటి చిన్న సినిమాలు పెద్ద విజయాలు సాధించాలి'' అని అన్నారు. ''ఓ అందాల రాక్షసి' మూవీ థియేటర్స్‌లోకి రానంతవరకే చిన్న సినిమా. థియేటర్స్‌లోకి వస్తే ఈ మూవీ రేంజ్ ఏంటో ఆడియన్స్‌కు తెలుస్తుంది'' అని చెప్పారు షెరాజ్ మెహదీ, భాష్య శ్రీ. ''అమ్మాయిలపై జరిగే మోసాలు, దాడులను ఎలా ఎదుర్కోవాలి? అనేది ఈ సినిమాలో చక్కగా చూపించారు'' అని తెలిపారు నేహా దేశ్‌పాండే.

నవ్వించడానికి చేసిన సినిమా ఇది - సప్తగిరి



''మా కథకి పర్ఫెక్ట్ టైటిల్ 'పెళ్లి కాని ప్రసాద్'. ఈ పేరు డైరెక్టర్ అభిలాష్ ఫిక్స్ చేశారు. ఆ టైటిల్ వెయిట్‌ని కాపాడేలా మా సినిమా ఉంటుంది. వినోదం చాలా అద్భుతంగా కుదిరింది. ప్రమోషన్స్‌కి వెళ్లినప్పుడు ఇప్పటికే కొంతమంది నన్ను 'పెళ్లి కాని ప్రసాద్' అని పిలుస్తున్నారు. అందరూ అలా పిలిస్తే మా సినిమా ప్రేక్షకులకు బాగా చేరువ అయినట్టే. అంతకంటే ఆనందం ఏముంటుంది'' అని సప్తగిరి తెలిపారు. అభిలాష్ రెడ్డి గోపిడి దర్శకత్వంలో సప్తగిరి, ప్రియాంకా శర్మ జోడీగా నటించిన చిత్రం 'పెళ్లి కాని ప్రసాద్'. చాగంటి సినిమాటిక్ వరల్డ్ సమర్పణలో కేవై బాబు, భాను ప్రకాశ్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్ రెడ్డి ముత్యాల నిర్మించారు. నిర్మాత 'దిల్' రాజు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై రేపు (శుక్రవారం) ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా సప్తగిరి మాట్లాడుతూ– ''వెంకటేశ్‌గారి కెరీర్‌లో ఐకానిక్ క్యారెక్టర్ పెళ్లి కాని ప్రసాద్ ('మల్లీశ్వరి' చిత్రంలో). ఆయన పాత్రతో నా పాత్రని ఏ మాత్రం పోల్చుకోను. మా సినిమా ట్రైలర్ వెంకటేశ్‌గారు విడుదల చేసి.. 'కంటెంట్ చాలా పాజిటివ్‌గా ఉంది.. సినిమా హిట్ సాధించాలి' అని ఆశీర్వదించారు. మా సినిమాకి సపోర్ట్ చేసిన హీరోలు ప్రభాస్, వెంకటేశ్, దర్శకులు మారుతి, అనిల్ రావిపూడి, నిర్మాతలు 'దిల్' రాజు, శిరీష్ గార్లకు కృతజ్ఞతలు. ఈ మూవీలో ఎలాంటి సందేశం లేదు.. ప్రేక్షకులను నవ్వించడానికి చేసిన సినిమా. ఫైనల్ ఔట్‌పుట్ చూశాక మా నిర్మాతలూ సినిమా విజయంపై నమ్మకంగా ఉన్నారు. శేఖర్ చంద్ర మ్యూజిక్, నేపథ్య సంగీతం బాగుంటుంది. ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కొన్ని సినిమాలు చేస్తున్నాను. హీరోగా కూడా కొన్ని కథలు విన్నాను'' అని చెప్పారు.

కలహాలే లేని ప్రేమకథ



● శింగర మోహన్, వినయ్ కుమార్, మరే శివశంకర్

వినయ్ కుమార్, శ్రావణి మజ్జరి, అరవింద్ ముదిగొండ, నోమిన తార ప్రధాన పాత్రల్లో నటించిన పొయెటిక్ లవ్ స్టోరీ 'కాలమేగా కరిగింది'. శింగర మోహన్ దర్శకత్వంలో మరే శివశంకర్ నిర్మించిన ఈ చిత్రం రేపు (శుక్రవారం) విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో వినయ్ కుమార్ మాట్లాడుతూ– ''కాలమేగా కరిగింది' ఒక అందమైన ప్రేమకథా చిత్రం. కలహాలే లేని ప్రేమకథగా ఆకట్టుకుంటుంది. చిన్న చిత్రాలకు ఉండే ఇబ్బందులన్నీ పడ్డాం. మా మూవీని రిలీజ్ వరకు తీసుకురావడమే సక్సెస్‌గా భావిస్తున్నాం. మా సినిమాని ఆడియన్స్ థియేటర్స్‌లో చూడాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''ఈ సినిమా మా అందరి నాలుగేళ్ల కల. ఫ్యామిలీతో కలిసి చూడాల్సిన చిత్రం ఇది'' అని పేర్కొన్నారు అరవింద్. ''మోస్ట్ పొయెటిక్ లవ్‌స్టోరీగా మా మూవీ ఉంటుందని చెప్పడానికి గర్వపడుతున్నాను. మా మూవీ ట్రైలర్‌ను లాంచ్ చేసిన గౌతమ్ మీనన్‌గారి సపోర్ట్‌ను మర్చిపోలేం'' అని పేర్కొన్నారు శింగర మోహన్. ''అచ్చ తెలుగులో చేసిన స్వచ్ఛమైన ప్రేమకథ ఈ చిత్రం '' అని తెలిపారు మరే శివశంకర్.

సాక్షి బిజినెస్
గురువారం
20-3-2025

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
148	73
75,449	22,908

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	17,631	▲ 126
డోజోన్స్	41,734	▲ 153
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,707	▲ 1
డాక్స్	23,288	▽ 93
షాంఘై	3,426	▽ 3
నికాయ్	37,751	▽ 64

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	88,649	▲ 295
బంగారం (99.5 స్వచ్ఛత)	88,294	▲ 294
వెండి (కిలో)	99,968	▲ 432

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.25	87.27
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	111.30	114.16
€	యూరో	ఎస్‌బీఐ	93.53	96.21
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.31	58.77
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.07	56.28
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	62.54	67.21
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.15	23.71
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.65	24.43
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.08	12.97



గోల్డ్.. నాన్ స్టాప్ ర్యాలీ

- మరో రూ.700 జంప్; రూ.91,950 చేరిన పసిడి
- కొత్త గరిష్టానికి వెండి; కిలోకి రూ.1,000 పెరుగుదల

న్యూఢిల్లీ: పసిడి నాన్ స్టాప్ ర్యాలీ చేస్తోంది. బుధవారం మరో రూ.700 లాభపడింది. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాములకు 91,950కి చేరి సరికొత్త గరిష్టాన్ని నమోదు చేసింది. వివాహాల సీజన్‌కు ముందు జ్యుయలర్లు భారీ కొనుగోళ్లకు దిగినట్టు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. దీనికితోడు మధ్యప్రాచ్యంలో మళ్లీ ఉద్రిక్తతలు ఎగిసిపడడంతో ఇన్వెస్టర్లు సైతం కొనుగోళ్లకు ముందుకు వచ్చినట్టు విశ్లేషకులు చెబుతున్నారు. 99.5 శాతం స్వచ్ఛత బంగారం సైతం రూ.700 పెరిగి రూ.91,500కు చేరుకుంది. మరోవైపు వెండి సైతం కొత్త రికార్డు నమోదు చేసింది. కిలోకి రూ.1,000 పెరగడంతో రూ.1,03,500 జీవిత కాల గరిష్టానికి చేరుకుంది. ఎంసీఎక్స్ మార్కెట్లో ఏప్రిల్ డెలివరీ పసిడి కాంట్రాక్ట్ (10 గ్రాములు) రూ.288 పెరిగి రూ.89,000 మార్క్‌ను దాటేసింది. అంతర్జాతీయంగా చూస్తే కామెక్స్ మార్కెట్లో పసిడి ఔన్స్ ధర ముందురోజుతో పోల్చి చూస్తే పెద్దగా మార్పు లేకుండా 3,038 డాలర్ల వద్ద ఉంది. ఇంట్రాడేలో 3,045.39 డాలర్ల గరిష్టాన్ని నమోదు చేసింది. ఆసియా మార్కెట్లో బంగారం ఫ్యూచర్స్ ధర 3,052.31 డాలర్లను తాకింది.

అప్ ట్రెండ్ కొనసాగుతోంది..

బంగారం ధరలు అప్‌ట్రెండ్‌లో ఉన్నట్టు ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ సీనియర్ అనలిస్ట్ జతీన్ త్రివేది తెలిపారు. ఫెడ్ పాలసీ ప్రకటన ముందు ఒక పరిధిలో ట్రేడ్ అయినట్టు చెప్పారు. యూఎస్ ఫెడ్ పాలసీ కోసం ట్రేడర్లు వేచి చూస్తున్నారని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ సైతం తెలిపారు.


ఈ ఏడాది చివరికి 4,000 డాలర్లు...

అంతర్జాతీయంగా భౌగోళిక ఉద్రిక్తతలకుతోడు ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, సెంట్రల్ బ్యాంక్‌ల నుంచి కొనుగోళ్ల డిమాండ్ వంటి అంశాలతో 2025 చివరికి బంగారం ఔన్స్‌కు 4,000 డాలర్ల స్థాయిని చేరుకోవచ్చని కమోడిటీ మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. అంటే ఇక్కడ మరో 25 శాతం మేర బంగారం ధరలు పెరిగేందుకు అవకాశాలున్నాయన్నది వారి విశ్లేషణ. ఈ ప్రకారం చూస్తే రూపాయిల్లో బంగారం 10 గ్రాములకు రూ.1.14 లక్షలకు చేరుకోవచ్చని తెలుస్తోంది.

మూడోరోజూ లాభాలు

- సెన్సెక్స్ లాభం 148 పాయింట్లు
- 22,900 స్థాయిపైకి నిఫ్టీ

ముంబై: అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల ప్రకటనకు ముందు కన్జూమర్ డ్యూరబుల్స్, క్యాపిటల్ గూడ్స్, రియల్టీ రంగ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. కేంద్రం స్టీల్ దిగుమతులపై పన్ను విధింపు నిర్ణయంతో మెటల్ షేర్లు రాణించాయి. ఫలితంగా దేశీయ స్టాక్ సూచీలు మూడోరోజూ లాభాలు గడించాయి. సెన్సెక్స్ 148 పాయింట్లు పెరిగి 75,449 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 73 పాయింట్లు బలపడి 22,908 వద్ద నిలిచింది. చిన్న, మధ్య తరహా కంపెనీల షేర్లకు డిమాండ్ కొనసాగింది. బీఎస్ఈ స్మాల్, మిడ్ సూచీలు వరుసగా 2.28%, 2.17 శాతం పెరిగాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 19 పైసలు పెరిగి 86.37 వద్ద స్థిరపడింది. దేశీయ కరెన్సీకి ఇది వరుసగా నాలుగోరోజూ లాభాల ముగింపు.



- మూడు రోజుల వరుస ర్యాలీతో స్టాక్ మార్కెట్లో రూ.13.82 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.405 లక్షల కోట్లకు చేరింది. బుధవారం ఒక్కరోజే 4.67 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సొంతమయ్యాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..

మన రెమిటెన్సుల్లో యూఎస్, యూకే టాప్!	హ్యుందాయ్, హోండా వాహన ధరల పెంపు

ఆన్‌లైన్ గేమింగ్.. జూమింగ్

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ గేమింగ్ మార్కెట్ హద్దే లేదన్నట్టుగా శరవేగంగా విస్తరిస్తోంది. రియల్ మనీ గేమింగ్ ప్లాట్‌ఫామ్ వింజోగేమ్స్, ఐఈఐసీ సంయుక్త అంచనా ప్రకారం.. 2024లో ఆన్‌లైన్ గేమింగ్ మార్కెట్ విలువ 3.7 బిలియన్ డాలర్లుగా ఉంటే (సుమారు రూ.32,000 కోట్లు).. 2029 నాటికి 9.1 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.80,000 కోట్లు) వృద్ధి చెందనుంది. ముఖ్యంగా 86 శాతం వాటాతో రియల్ మనీ గేమ్స్ (ఆర్ఎంజీ) విభాగం ఈ మార్కెట్‌ను శాసించనుంది. శాన్‌ఫ్రాన్సిస్కోలో గేమ్ డెవలపర్ల సదస్సులో భాగంగా ఈ సంయుక్త నివేదికను వింజోగేమ్స్, ఐఈఐసీ విడుదల చేశాయి. ''భారత్‌లో ఆన్‌లైన్ గేమింగ్ పరిశ్రమ అసాధారణ వృద్ధి పథంలో కొనసాగుతోంది. 2029 నాటికి 9.1 బిలియన్ డాలర్ల మార్కెట్‌తో.. ఇన్వెస్టర్లకు 63 బిలియన్ డాలర్ల విలువైన అవకాశాలను అందించనుంది. టెక్నాలజీ పరమైన ఆవిష్కరణలు, మేధో సంపత్తి హక్కులు (ఐపీ), యూజర్లతో అనుసంధానం (ఎంగేజ్‌మెంట్) ద్వారా గేమింగ్‌కు భారత్‌ను బలమైన కేంద్రంగా (పవర్‌హౌస్) మార్చేందుకు వింజో కట్టుబడి ఉంది''అని వింజో సహ వ్యవస్థాపకుడు పవన్ నంద తెలిపారు.

- 2029 నాటికి రెండు రెట్ల వృద్ధి
- 9.1 బిలియన్ డాలర్లకు విస్తరిస్తుంది
- 86 శాతం రియల్ గేమింగ్ నుంచే
- వింజో గేమ్స్, ఐఈఐసీ అంచనా

59 కోట్ల యూజర్లు..

ఈ నివేదికలోని సమాచారం ప్రకారం చూస్తే దేశంలో 59.1 కోట్ల మంది గేమర్స్ ఉన్నారు. అంతర్జాతీయంగా ఉన్న గేమర్లలో 20 శాతం ఇక్కడే ఉన్నారు. 11.2 బిలియన్ మొబైల్ గేమ్ యాప్ డౌన్‌లు నమోదయ్యాయి. 1,900 గేమింగ్ కంపెనీలతో ఈ రంగం సుమారుగా 1.3 లక్షల మంది నిపుణులకు ఉపాధి కల్పిస్తోంది. ఈ రంగం 3 బిలియన్ డాలర్ల మేర విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) ఆకర్షించడం గమనార్హం. ప్రస్తుతం రూ.32 వేల కోట్ల ఆన్‌లైన్ గేమింగ్ మార్కెట్లో రియల్ మనీ గేమ్స్ (ఆర్ఎంజీ) వాటా 85.7 శాతంగా ఉంటే, 2029 నాటికి రూ.80 వేల కోట్ల మార్కెట్‌లోనూ 80 శాతం వాటా కలిగి ఉంటుందని ఈ నివేదిక పేర్కొంది. నాన్ రియల్ మనీ గేమ్స్ మార్కెట్ వాటా ఇదే కాలంలో 14.3 శాతం నుంచి 20 శాతానికి పెరుగుతుందని అంచనా వేసింది. దేశంలో ఏకైక లిస్టెడ్ గేమింగ్ సంస్థ నజారా టెక్నాలజీస్ అంతర్జాతీయంగా లిస్టెడ్ గేమింగ్ కంపెనీల్లో అధిక ప్రీమియం వ్యాల్యుయేషన్‌ను సొంతం చేసుకున్నట్టు తెలిపింది. ''ప్రస్తుత ఆన్‌లైన్ గేమింగ్ రంగం మార్కెట్‌కు (32వేల కోట్లు) నజారా మాదిరే విలువను ఆపాదించినట్టయితే.. అప్పుడు ఇతర గేమింగ్ కంపెనీల ఐపీవోల రూపంలో ఇన్వెస్టర్లకు 26 బిలియన్ డాలర్ల విలువ సమకూరనుంది. డిజిటల్ ఆర్థిక వ్యవస్థకుతోడు, బలపడుతున్న గేమ్ డెవలపర్ ఎకోసిస్టమ్, సానుకూల నియంత్రణ వాతావరణంతో 2034 నాటికి ఆన్‌లైన్ గేమింగ్ మార్కెట్ పరిమాణం 60 బిలియన్ డాలర్లకు చేరుకుంటుంది. 20 లక్షల ఉపాధి అవకాశాలను తెచ్చిపెడుతుంది''అని వివరించింది.



వొడాఫోన్ 5జీ షురూ..

- ముంబైలో ప్రారంభం
- త్వరలో మరో అయిదు నగరాల్లో



న్యూఢిల్లీ: దేశీ టెలికం మార్కెట్లో నిలదొక్కుకునే క్రమంలో వొడాఫోన్ ఐడియా బుధవారం 5జీ సర్వీసులను ప్రవేశపెట్టింది. ముందుగా ముంబైలో ప్రారంభించి, ఏప్రిల్ నాటికి ఢిల్లీ, బెంగళూరు, చండీగఢ్, పట్నా, మైసూర్ వంటి అయిదు నగరాలకు విస్తరించనున్నట్లు కంపెనీ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ జగ్బీర్ సింగ్ వెల్లడించారు. వచ్చే మూడేళ్లలో 17 సర్కిల్స్‌లోని 100 నగరాలు/పట్టణాల్లో విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం 'పరిచయ ఆఫర్' కింద రూ. 299 నుంచి ప్రారంభమయ్యే అన్‌లిమిటెడ్ ప్లాన్లతో యాడ్-ఆన్‌గా ఈ సేవలు లభిస్తాయి. అయితే, ఈ ఆఫర్ ఎంత కాలం ఉంటుందో వెల్లడి కాలేదు. వచ్చే మూడేళ్ల వ్యవధిలో రూ. 50,000-55,000 కోట్ల పెట్టుబడుల ప్రణాళికలు ఉండగా ఇందులో దాదాపు సగభాగం 5జీపై, మిగతా మొత్తాన్ని 4జీ కవరేజీ విస్తరణపై వెచ్చించనున్నట్లు సింగ్ చెప్పారు. కస్టమర్ల వినియోగాన్ని బట్టి 5జీ నెట్‌వర్క్ విస్తరణ ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం 17 కోట్ల యూజర్లతో రిలయన్స్ జియో, 12 కోట్ల మందితో భారతీ ఎయిర్‌టెల్ 5జీ మార్కెట్లో అగ్రస్థానంలో ఉన్నాయి.

శాట్‌కామ్ సంస్థలతో చర్చలు..

ఫైబర్ ఆప్టిక్ కేబుల్స్, సెల్ టవర్లు లాంటి కనెక్టివిటీ సదుపాయాలు లేని ప్రాంతాల్లో శాటిలైట్ కమ్యూనికేషన్ సర్వీసులను అందుబాటులోకి తెచ్చేందుకు శాట్‌కామ్ సంస్థలతో జట్టు కట్టే అవకాశాలు పరిశీలిస్తున్నట్లు సింగ్ చెప్పారు. అయితే, డివైజ్‌ల వ్యయాలు, నియంత్రణ సంస్థల నుంచి అనుమతులు తదితర అంశాలపై ఇంకా కొన్ని సందేహాలు నెలకొన్నాయని పేర్కొన్నారు. స్టార్‌లింక్ బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ సేవలను భారత్‌లో ప్రవేశపెట్టే దిశగా జియో ప్లాట్‌ఫామ్స్, ఎయిర్‌టెల్ ఇప్పటికే స్పేస్‌ఎక్స్‌తో జట్టు కట్టిన సంగతి తెలిసిందే.

జీఆర్‌టీ జ్యువెలర్స్ 'స్వర్ణ ఉగాది'

హైదరాబాద్: ఉగాది పండుగ సందర్భంగా జీఆర్‌టీ జ్యువెలర్స్ 'స్వర్ణ ఉగాది' ప్రత్యేక ఆఫర్ ప్రకటించింది. ఇందులో భాగంగా బంగారు ఆభరణాల కొనుగోలుపై గ్రాముకు రూ.50లు, పాత బంగారు ఆభరణాల మార్పిడిపై గ్రాముకు అదనంగా రూ.75లు అందిస్తుంది. డైమండ్-అన్‌కట్ డైమండ్ కొనుగోలుపై 10% తగ్గింపు ఇవ్వనుంది. వెండి వస్తువుల తయారీ ఛార్జీలపై 25%, వెండి ఆభరణాల ఎంఆర్‌పీ(గరిష్ట చిల్లర ధర)పై 10% తగ్గింపు ఇస్తుంది. ప్రత్యేక ఆఫర్‌ను కస్టమర్లంతా వినియోగించుకోవాలని కంపెనీ ఎండీ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు.

సాక్షి స్పోర్ట్స్



ముంబై ఇండియన్స్ తొలి మ్యాచ్‌కు కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టి20 క్రికెట్ టోర్నీ 18వ సీజన్‌లో ముంబై ఇండియన్స్ ఆడే తొలి మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ నాయకత్వ బాధ్యతలు నిర్వర్తిస్తాడు. ముంబై ఇండియన్స్ రెగ్యులర్ కెప్టెన్ హార్దిక్ పాండ్యాపై ఒక మ్యాచ్ నిషేధం అమలు కానుండటమే ఈ మార్పునకు కారణం. గత సీజన్‌లో హార్దిక్ పాండ్యా కెప్టెన్సీలో ముంబై ఇండియన్స్ జట్టు మూడుసార్లు నిర్ణీత సమయంలో పూర్తి ఓవర్ల కోటా పూర్తి చేయలేకపోయింది. దాంతో ఐపీఎల్ టోర్నీ నిబంధనల ప్రకారం హార్దిక్ పాండ్యాపై రూ. 30 లక్షల జరిమానాతోపాటు ఒక మ్యాచ్ నిషేధం విధించారు. ముంబై జట్టు గత సీజన్‌లోని తమ చివరి మ్యాచ్‌లో మూడోసారి స్లో ఓవర్‌రేట్ నమోదు చేసింది. ఫలితంగా గతేడాది పాండ్యాపై ఒక మ్యాచ్ నిషేధం అమలు చేయడం వీలు కాలేదు. దాంతో ఈ సీజన్‌లోని తొలి మ్యాచ్‌లో ఆ నిషేధం అమలు చేయనున్నారు. ఐపీఎల్ 18వ సీజన్‌లో ముంబై ఇండియన్స్ తమ తొలి మ్యాచ్‌ను 23న చెన్నైలో చెన్నై సూపర్ కింగ్స్‌తో ఆడనుంది.

రూ.4 కోట్ల 75 లక్షలు!

ధనశ్రీ వర్మకు భారత క్రికెటర్ చహల్ చెల్లిస్తున్న భరణం

ముంబై: భారత క్రికెట్ జట్టు లెగ్‌స్పిన్నర్ యుజువేంద్ర చహల్, ధనశ్రీ వర్మ మధ్య వివాహ బంధం అధికారికంగా ముగింపు దశకు వచ్చింది. వీరిద్దరు చాలా కాలంగా దూరంగానే ఉంటున్నా ఈ ఏడాది ఫిబ్రవరి 5న తమ విడాకుల కోసం ఫ్యామిలీ కోర్టులో కేసు వేశారు. కానీ హిందూ వివాహ చట్టం ప్రకారం సర్దుబాటు కోసం ప్రయత్నించేందుకు వీలుగా కనీసం ఆరు నెలల సమయం ఇస్తారు. దీనినే 'కూలింగ్ ఆఫ్ పీరియడ్'గా చెబుతారు. అయితే తాము రెండున్నరేళ్లకు పైగా విడిగానే ఉంటున్నామని, పరస్పర అంగీకారంతో విడాకులు కోరుతున్నాం కాబట్టి 'కూలింగ్ ఆఫ్ పీరియడ్'ను తొలగించి వెంటనే విడాకులు మంజూరు చేయాలని చహల్, ధనశ్రీ కోరారు. ఈ విజ్ఞప్తిని ఫ్యామిలీ కోర్టు కొట్టేయడంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. ఐపీఎల్ కారణంగా తాను కనీసం మూడు నెలలు అందుబాటులో ఉండలేనని కూడా చహల్ వెల్లడించాడు. దీనిపై స్పందించిన హైకోర్టు...ఈ నిబంధన నుంచి వీరిద్దరికి సడలింపు ఇవ్వాలని ఆదేశించడంతో పాటు విడాకులకు సంబంధించి గురువారమే తుది తీర్పు ఇవ్వాలని కూడా సూచించింది. మరోవైపు విడాకుల ప్రక్రియను ముగించే క్రమంలో ధనశ్రీకి చహల్ రూ. 4 కోట్ల 75 లక్షలు భరణం రూపంలో చెల్లించనున్నాడు. ఇందులో అతను ఇప్పటికే రూ. 2 కోట్ల 37 లక్షలు ఇచ్చేశాడు. యూట్యూబర్, కొరియాగ్రాఫర్ ధనశ్రీ వర్మతో చహల్‌కు డిసెంబర్, 2020లో పెళ్లి జరగ్గా... 18 నెలల తర్వాత జూన్ 2022 నుంచి వీరిద్దరు విడిగానే ఉంటున్నారు.



'గోల్'తో ఛెత్రి పునరాగమనం

మాల్దీవులుపై 3-0 గోల్స్ తేడాతో భారత్ ఘనవిజయం

షిల్లాంగ్: అంతర్జాతీయ ఫుట్‌బాల్ పునరాగమనంలో భారత జట్టు కెప్టెన్ సునీల్ ఛెత్రి గోల్‌తో మెరిశాడు. ఫలితంగా 12 మ్యాచ్‌ల నుంచి విజయం లేకుండా సాగుతున్న భారత ఫుట్‌బాల్ జట్టు ఎట్టకేలకు గెలుపు రుచి చూసింది. బుధవారం జరిగిన అంతర్జాతీయ స్నేహపూర్వక మ్యాచ్‌లో భారత్ 3-0 గోల్స్ తేడాతో మాల్దీవులుపై నెగ్గింది. భారత్ తరఫున రాహుల్ (35వ నిమిషంలో), లిస్టన్ కొలాకో (66వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. గత ఏడాది జూన్‌లో అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికిన 40 ఏళ్ల ఛెత్రి 77వ నిమిషంలో గోల్ చేసి జట్టు ఆధిక్యాన్ని మరింత పెంచాడు. ఛెత్రి కెరీర్‌లో ఇది 95వ అంతర్జాతీయ గోల్. తన రిటైర్మెంట్ తర్వాత జాతీయ జట్టు పేలవ ప్రదర్శన కారణంగా ఛెత్రి తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నాడు. 286 రోజుల అనంతరం 'బ్లూ జెర్సీ'లో మైదానంలో అడుగు పెట్టాడు. సునీల్‌కు ఇది 152వ మ్యాచ్ కాగా... 16 నెలల తర్వాత భారత జట్టు తొలి విజయం నమోదు చేసుకుంది. మొనొలో భారత ఫుట్‌బాల్ జట్టు హెడ్‌కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం జట్టుకు ఇదే మొదటి గెలుపు. భారత జట్టు చివరిసారిగా ఫిఫా ప్రపంచకప్ క్వాలిఫయింగ్ రౌండ్‌లో భాగంగా 2023 నవంబర్ 16న కువైట్‌పై విజయం సాధించింది.



సునీల్ ఛెత్రి

కోల్‌కథ ఎంతవరకు!

ఏ జట్టయినా విజయవంతమైన కూర్పును కొనసాగించాలనుకుంటుంది... కానీ కోల్‌కతా నైట్‌రైడర్స్ మాత్రం అందుకు విభిన్నమైన ప్రణాళికలతో అభిమానులను సైతం ఆశ్చర్యపరిచింది. దశాబ్దకాలం తర్వాత తమ జట్టుకు ఐపీఎల్ ట్రోఫీ అందించిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌ను వేలానికి వదిలేసుకున్న నైట్‌రైడర్స్... ఓ మామూలు ఆటగాడి కోసం భారీగా ఖర్చు పెట్టింది. జాతీయ జట్టుకు దూరమైన సీనియర్ ప్లేయర్ అజింక్య రహానేకు పిలిచి మరీ జట్టు పగ్గాలు అప్పగించింది. అయితే ఎన్ని మార్చినా కోర్ గ్రూప్‌ను మాత్రం కదల్చని కోల్‌కతా... డిఫెండింగ్ చాంపియన్‌గా టైటిల్ నిలబెట్టుకునేందుకు సై అంటోంది! ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లు మాత్రమే ఐపీఎల్ చరిత్రలో వరుసగా రెండేళ్లు చాంపియన్‌గా నిలిచాయి. నైట్‌రైడర్స్ ఈసారి తమ గెలుపు 'కథ'ను ఎంతవరకు తీసుకెళ్తుందనేది ఆసక్తికరం కానుంది! –సాక్షి క్రీడావిభాగం

డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి నైట్‌రైడర్స్

- ఇప్పటికే మూడుసార్లు ఐపీఎల్ టైటిల్ కైవసం
- రింకూ సింగ్, వరుణ్ చక్రవర్తిలపైనే అందరి దృష్టి

మరో 2 రోజుల్లో ఐపీఎల్



కెప్టెన్ రహానే

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చరిత్రలో చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ చెరో ఐదుసార్లు ట్రోఫీ చేజిక్కించుకోగా... ఆ తర్వాత అత్యధికంగా కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) మూడుసార్లు విజేతగా నిలిచింది. 2012, 2014, 2024లో కేకేఆర్ ట్రోఫీ హస్తగతం చేసుకుంది. గతేడాది ఐపీఎల్ వేలంలో 'కోర్ గ్రూప్'ను తిరిగి కొనసాగించిన ఫ్రాంచైజీ... జట్టుకు మూడోసారి కప్పు అందించిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ఆస్ట్రేలియా స్టార్ పేసర్ స్టార్క్‌ను మాత్రం వదిలేసుకుంది. పేస్ ఆల్‌రౌండర్ వెంకటేశ్ అయ్యర్ కోసం ఏకంగా రూ. 23 కోట్ల 75 లక్షలు ఖర్చు చేసి ఆశ్చర్యపరిచిన యాజమాన్యం... కోటిన్నర ప్రాథమిక ధరతో కొనుగోలు చేసుకున్న సీనియర్ బ్యాటర్ అజింక్య రహానేకు అనూహ్యంగా కెప్టెన్సీ పగ్గాలు అప్పగించింది. వేలంలో ఒక్కో జట్టు అత్యధికంగా 25 మందిని ఎంపిక చేసుకునే అవకాశం ఉండగా... కేకేఆర్ 21 మందినే తీసుకుంది. సిక్సర్ల వీరుడు రింకూ సింగ్‌కు రూ. 13 కోట్లు... 'మిస్టరీ స్పిన్నర్' వరుణ్ చక్రవర్తి, వెస్టిండీస్ టి20 స్పెషలిస్టులు రసెల్, నరైన్‌లకు రూ. 12 కోట్లు చొప్పున అందించి అట్టిపెట్టుకున్న ఫ్రాంచైజీ... హర్షిత్ రాణా, రమణ్‌దీప్‌లను రూ. 4 కోట్లతో కొనసాగించింది. ఆరుగురు ప్లేయర్లను అట్టిపెట్టుకునే అవకాశం ఉంటే దాన్ని సంపూర్ణంగా వినియోగించుకుంది.



రింకూ సింగ్



వెంకటేశ్ అయ్యర్

నరైన్‌పై భారీ అంచనాలు...

సుదీర్ఘ అనుభవం ఉన్న చంద్రకాంత్ పండిత్ కేకేఆర్‌కు కోచ్‌గా వ్యవహరిస్తుండగా... గతేడాది జట్టుకు మెంటార్‌గా ఉన్న గౌతమ్ గంభీర్... టైటిల్ గెలిచిన అనంతరం టీమిండియా హెడ్ కోచ్‌గా వెళ్లిపోయాడు. ఇప్పుడతడి స్థానంలో విండీస్ మాజీ ఆటగాడు డ్వేన్ బ్రావో మెంటార్‌గా వ్యవహరించనున్నాడు. ఐపీఎల్ చరిత్రలో ముంబై, చెన్నై జట్లు మాత్రమే వరుసగా రెండు సీజన్లు విజేతగా నిలిచాయి. ఇప్పుడు కోల్‌కతా ముందు అలాంటి అరుదైన అవకాశం మూడోసారి ఉంది. వెస్టిండీస్ స్పిన్ ఆల్‌రౌండర్ నరైన్‌ను ఓపెనర్‌గా దింపి మెరుగైన ఫలితాలు రాబట్టిన కేకేఆర్ ఈసారి కూడా అదే ప్లాన్ అనుసరిస్తుందనడంలో సందేహం లేదు. అంతర్జాతీయ క్రికెట్‌కు ఎప్పుడో వీడ్కోలు పలికిన నరైన్... కేకేఆర్ తరఫున అటు స్పిన్నర్‌గా ఇటు ఓపెనర్‌గా కీలక పాత్ర పోషిస్తున్నాడు. గత సీజన్‌లో 488 పరుగులు, 17 వికెట్లు తీసి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాడు. గుర్బాజ్, నరైన్ ఇన్నింగ్స్ ఆరంభించడం ఖాయమే కాగా... అజింక్య రహానే, వెంకటేశ్ అయ్యర్, రింకూ సింగ్, రసెల్, రమణ్‌దీప్ సింగ్ మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌కు రానున్నారు. బౌలింగ్‌లో వరుణ్ చక్రవర్తి, నరైన్, హర్షిత్ రాణా, వైభవ్ అరోరా కీలకం కానున్నారు.



రహానే రాణించేనా?

డిఫెండింగ్ చాంపియన్‌గా మరింత బాధ్యతగా ఉండాల్సిన కేకేఆర్... తన నిర్ణయాలతో ఆశ్చర్యపరిచింది. కప్పు అందించిన కెప్టెన్‌ను వదిలేసుకోవడం... తుదిజట్టులో ఉంటాడో లేదో నమ్మకంగా చెప్పలేని ఆటగాడికి జట్టు పగ్గాలు అప్పగించడం... వెరసి సీజన్ ఆరంభానికి ముందే వార్తల్లో నిలిచింది. ఫామ్‌లేమికి తోడు వయసు మీదపడుతున్న కారణంగా భారత జట్టుకు దూరమైన రహానే మరి కేకేఆర్‌ను ఎలా నడిపిస్తాడో చూడాలి. వెంకటేశ్ అయ్యర్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా... ఆస్థాన ఆటగాళ్లు రసెల్, నరైన్ కేకేఆర్‌కు ప్రధాన బలంకానున్నారు. బౌలింగ్, బ్యాటింగ్‌లో ఈ ఇద్దరు జట్టుకు చేకూర్చే విలువ మాటల్లో చెప్పలేనిది. ఇటీవల చాంపియన్స్ ట్రోఫీలో చక్కటి ప్రదర్శన కనబర్చిన వరుణ్ చక్రవర్తిపై భారీ అంచనాలు ఉన్నాయి. నోర్జే, స్పెన్సర్ జాన్సన్, హర్షిత్ రాణా, రామ్‌మన్ పావెల్, వైభవ్ అరోరాతో పేస్ విభాగం బలంగానే ఉన్నా... వీరు ఎలాంటి ప్రదర్శన కనబరుస్తారో చూడాలి. విదేశీ ఆటగాళ్ల కోటాలో నరైన్, రసెల్, గుర్బాజ్ తుది జట్టులో ఉండటం పక్కా కాగా... నాలుగో ప్లేయర్‌గా నోర్జే, మొయిన్ అలీలలో ఒకరికి అవకాశం దక్కొచ్చు.

కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు: రహానే (కెప్టెన్), రింకూ సింగ్, డికాక్, గుర్బాజ్, రఘువంశీ, పావెల్, మనీశ్ పాండే, లవ్‌నిత్ సిసోడియా, వెంకటేశ్ అయ్యర్, అనుకూల్ రాయ్, మొయిన్ అలీ, రమణ్‌దీప్, రసెల్, నోర్జే, వైభవ్, మయాంక్ మార్కండే, స్పెన్సర్ జాన్సన్, హర్షిత్ రాణా, నరైన్, వరుణ్, చేతన్ సకారియా.

అంచనా: డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతున్న కేకేఆర్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. బ్యాటింగ్, బౌలింగ్‌లో నాణ్యమైన ప్లేయర్లు ఉన్న కోల్‌కతా... స్థాయికి తగ్గ ఆటతీరు ప్రదర్శిస్తే ఫైనల్‌కు చేరడం పెద్ద కష్టం కాదు. రహానే జట్టును ఎలా నడిపిస్తాడనేది కీలకం.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

బిందె నిండాలంటే.. జాగారం చేయాల్సిందే



బిందెలతో ట్యాంకు వద్ద నిరీక్షిస్తున్న ఖండాల గ్రామస్తులు

ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చుతోంది. ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతుండటంతో భూగర్భ జలాలు క్రమేణా అడుగంటిపోతున్నాయి. దీంతో నీటి సమస్య జటిలమవుతోంది. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఖండాల గ్రామంలో మిషన్ భగీరథ ట్యాంక్ ఉన్నప్పటికీ ఆ ట్యాంకు ఎప్పుడు నిండుతుందో తెలియక ప్రతియేటా గ్రామ శివారులోని చేదబావి నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. అయితే ఎండల తీవ్రతతో ఆ బావి ఎండిపోవడంతో మిషన్ భగీరథే దిక్కైంది. అది కూడా మూడునాలుగు రోజులకు ఒకసారి ఆ ట్యాంకు నిండుతుంది. ఒక్కొక్కరికి రెండు బిందెలే వస్తుండటంతో వాటి కోసం గ్రామస్తులు వేకువజామునే బిందెలతో ట్యాంకు వద్దకు చేరుకుని జాగారం చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. తాగునీరే అందకపోగా మూగజీవాలకు, ఇతర అవసరాలకు నీరు లభించడం గగనమైంది. దీంతో గ్రామస్తులు పాలకులపై తీవ్రంగా మండిపడుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ ఆదిలాబాద్

భగీరథ ప్రయత్నం

ఆదిలాబాద్ జిల్లాలో భానుడి భగభగలకు చేతిపంపులు, చేద బావుల్లో భూగర్భ జలమట్టం అడుగంటుతోంది. బిందెడు నీటి కోసం ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీలు భగీరథ ప్రయత్నమే చేయాల్సి వస్తోంది. దీంతో ఎప్పుడు వస్తుందో తెలియని మిషన్ భగీరథ నీరే దిక్కవుతోంది. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పోతగూడ-2 గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన ఇంటి అవసరాల కోసం మిషన్ భగీరథ పైపులైన్ ద్వారా సరఫరా అయ్యే పైపువాల్ వద్ద చుక్కనీటిని ఒడిసిపట్టేలా ప్రత్యేకంగా ఓ రేకును అమర్చి బొట్టుబొట్టు నీరు డ్రమ్ముల్లో పడేలా ఏర్పాట్లు చేసుకోవడం నీటి సమస్యకు నిదర్శనంగా నిలుస్తోంది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



చుక్కనీరు వృథా కాకుండా రేకు సాయంతో డ్రమ్ములో నీరు పట్టుకుంటున్న గ్రామస్తుడు



మిషన్ భగీరథ పైపువాల్ వద్ద డ్రమ్మును ఏర్పాటు చేసిన దృశ్యం

కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీగా నందకుమార్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయానికి కొత్త వైస్ చాన్స్‌లర్‌గా పి.వి.నందకుమార్ రెడ్డి నియమితులయ్యా రు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ నియామకం మూడు సంవత్సరాల కాలపరిమితితో, ఆయన బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి అమల్లోకి వస్తుంది. నందకుమార్‌రెడ్డి సరోజినీదేవి కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా సేవలందించారు. విద్యావేత్తగా కూడా గుర్తింపు పొందారు. కాగా, వర్సిటీ ఏర్పాటైన 2014 తర్వాత పూర్తిస్థాయి రెగ్యులర్ వీసీని నియమించలేదు. ఇప్పటివరకు వీసీగా కొనసాగిన కరుణా కర్‌రెడ్డి 9 ఏళ్లకు పైగా ఇన్‌చార్జిగానే వ్యవహరించడం గమనార్హం.వర్సిటీకి రెగ్యులర్ వీసీని నియమిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తమవుతోంది.

హైదరాబాద్ - హోచిమిన్ విమాన సర్వీస్ ప్రారంభం




శంషాబాద్ (హైదరాబాద్): హైదరాబాద్ నుంచి వియత్నాంలోని హోచిమిన్ నగరానికి నేరుగా విమాన సర్వీసు ప్రారంభమైంది. వీయెట్ జెట్ ఎయిర్‌లైన్స్ ఈ నాన్‌స్టాప్ సర్వీసులను శంషాబాద్ విమానాశ్రయంలో బుధవారం ప్రారంభించింది. ప్రతి మంగళ, గురువారాల్లో హైదరాబాద్ నుంచి బయల్దేరే ఈ విమాన సర్వీసు.. హోచిమిన్ నగరంలోని టాన్ సోన్ న్హాట్ అంతర్జాతీయ విమానాశ్రయానికి నాలుగున్నర గంటల్లో చేరుకుంటుంది. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టు సీఈవో ప్రదీప్ ఫణీకర్ మాట్లాడుతూ.. ఇరు నగరాల మధ్య పర్యాటకాభివృద్ధికి కొత్త సర్వీసు దోహదం చేస్తుందని పేర్కొన్నారు.

పెద్దల జోలికి వెళ్లి చెప్పండి!

హైడ్రా తీరుపై హైకోర్టు మళ్లీ ఘాటు వ్యాఖ్యలు

- సంస్థ టార్గెట్ పేద, మధ్యతరగతి మాత్రమేనా?
- ప్రముఖులకు ఈ రాష్ట్రంలో ప్రత్యేక చట్టం ఉందా?
- మియాపూర్, దుర్గం చెరువు ఆక్రమణల పరిస్థితి ఏంటి?
- హైడ్రా పనితీరు ఆశాజనకంగా లేదన్న ఉన్నత న్యాయస్థానం



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో నీటి వనరులు, సర్కార్ భూముల పరిరక్షణే ప్రధాన ధ్యేయంగా ఏర్పాటైన హైడ్రా.. పేద, మధ్యతరగతి ప్రజలను మాత్రమే టార్గెట్ చేస్తున్నట్లు కనిపిస్తోందని హైకోర్టు వ్యాఖ్యానించింది. సంపన్నులు, రాజకీయ నేతలు, ఇతర ప్రముఖుల జోలికెళ్లడం లేదని, ఒకసారి వారి నిర్మాణాల్లో నిబంధనలు పాటించారో, లేదో పరిశీలించాలని ఘాటు వ్యాఖ్యలు చేసింది. సంపన్నులకు హైడ్రా ప్రత్యేక చట్టాన్ని అమలు చేస్తోందా అని నిలదీసింది. పేద, మధ్యతరగతికి చెందిన ఇళ్లను కూల్చి మీడియాలో ఫొటోలు వేయించుకోవడం కాదని.. మియాపూర్, దుర్గం చెరువు సహా పలుచోట్ల సర్కార్ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన ప్రముఖుల పరిస్థితి ఏంటని ప్రశ్నించింది. అందరికీ ఒకేలా న్యాయం దక్కినప్పుడే హైడ్రా ప్రజాప్రయోజనాలను పరిరక్షించినట్లు అవుతుందని తేల్చిచెప్పింది. 'ఒకప్పుడు హైదరాబాద్ అంటే చెరువులు, సరస్సుల నగరంగా పేరు ఉండేది. 2000కుపైగా చెరువులు ఉండగా, ఇప్పుడు 200 కూడా లేవు. చెరువుల రక్షణకు నాడు ప్రత్యేక చట్టాలు అమల్లో ఉండేవి. హైడ్రా ఏర్పాటు బాగానే ఉన్నా.. పనితీరు మాత్రం ఆశాజనకంగా లేదు. పేదలతోపాటు పెద్దలకు చెందిన అక్రమ నిర్మాణాలను కూల్చివేసినప్పుడే నిజమైన సార్థకత చేకూరుతుంది. ఇప్పటి ప్రభుత్వాల కంటే నాడు నిజాం చేపట్టిన చెరువుల పరిరక్షణ చర్యలే పకడ్బందీగా ఉన్నాయి. మీరాలం చెరువు పరిధిలో నిర్మాణాలపై ఉమ్మడి సర్వే చేపట్టి.. ఆక్రమణలు ఉంటే తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి'అని స్పష్టం చేసింది.

ప్రభుత్వానిదా? వక్ఫ్‌దా?

రాజేంద్రనగర్ మండలం అత్తాపూర్ సర్వే నంబర్ 329/1, 329/2, 329/3లోని ఆరు ఎకరాల భూమిపై తహసీల్దార్ జారీచేసిన నోటీసులను సవాల్ చేస్తూ ఫాతిమా, మరొకరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశా రు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 'సదరు భూమికి సంబంధించి వక్ఫ్ బోర్డు సీఈవో లేఖ మేరకు తహసీల్దార్ చర్యలు చేపట్టడం చెల్లదు. ఒకవేళ వక్ఫ్‌భూమి అయినా సీఈవో చర్యలు తీసుకోవచ్చు గానీ, నోటీసులు జారీ చేసే అధికారం తహసీల్దార్‌కు లేదు. ఆ నోటీసులను రద్దు చేయాలి'అని కోరారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 'ఇదే హైకోర్టులో దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం మేరకు మీరాలం చెరువు పరిధిలోని ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టాం. అన్ని చర్యలు తీసుకుంటున్నాం'అన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. మీరా లం చెరువుకు సంబంధించి పిటిషనర్ అభ్యంతరాలపై ఉమ్మ డి సర్వే నిర్వహించాలని రెవెన్యూ శాఖను ఆదేశించారు. ప్రభుత్వానిదే అని తేలితే చర్యలు చేపట్టాలని, వక్ఫ్ బోర్డుదని తేలితే చర్యలు తీసుకునే బాధ్యతను బోర్డుకు అప్పగించాలని చెప్పారు. నీటి వనరుల ఆక్రమణపై వాల్టా చట్టం కింద చర్యలు తీసుకోవచ్చంటూ విచారణ ముగించారు.

ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ జీఆర్ఎల్ విడుదల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో విస్తరణ అధికారి (ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్) సూపర్‌వైజర్ గ్రేడ్–1 ఉద్యోగ నియామకాలకు సంబంధించి నిర్వహించిన అర్హత పరీక్ష ఫలితాలను బుధవారం టీజీపీఎస్సీ విడుదల చేసింది. మొత్తం 181 ఈవో పోస్టులకు సంబంధించి 27 ఆగస్టు, 2022న టీజీపీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఉద్యోగాలకు 26,751 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఏడాది జనవరి 6, 7 తేదీల్లో అర్హత పరీక్షలు జరిగాయి. ఈ రెండు పరీక్షలకు 10,459 మంది అభ్యర్థులు హాజరయ్యారు. తాజాగా టీజీపీఎస్సీ 10,459 మంది అభ్యర్థులతో కూడిన జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ (జీఆర్ఎల్) విడుదల చేసింది. అలాగే ఫైనల్ 'కీ', రెస్పాన్స్ షీట్‌లను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఏప్రిల్ 17వ తేదీలోగా వీటిని అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలని కమిషన్ సూచించింది.

హెచ్‌సీఏ కేసులో ఈడీ దూకుడు

రూ.51.29 లక్షల విలువైన ఆస్తులు జప్తు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నిధుల గోల్‌మాల్ కేసు దర్యాప్తులో ఈడీ అధికారులు వేగం పెంచారు. కాంట్రాక్ట్ కంపెనీల నుంచి హెచ్‌సీఏ ట్రెజరర్ సురేందర్ అగర్వాల్, ఆయన కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల్లోకి మనీలాండరింగ్ సొమ్ము చేరినట్టు ఆధారాలు సేకరించారు. సరఫరాదారుల ద్వారా రూ.90.86 లక్షలు సురేందర్ కుటుంబ సభ్యులకు చేరినట్లు గుర్తించారు. ఇందులో సురేందర్ కుటుంబసభ్యులకు చెందిన రూ.51.29 లక్షలు విలువ చేసే స్థిరాస్తులను జప్తు చేశారు. ఈ మేరకు హైదరాబాద్ జోనల్ ఈడీ ఆఫీస్ బుధవారం ప్రకటన విడుదల చేసింది. క్రికెట్ బాల్స్, జిమ్ పరికరాలు, బకెట్ కుర్చీల కొనుగోళ్లలో క్విడ్ ప్రోకో జరిగినట్లు ఈడీ గుర్తించింది. అజహరుద్దీన్ హెచ్‌సీఏ ప్రెసిడెంట్‌గా ఉన్న సమయంలో వైస్ ప్రెసిడెంట్, ట్రెజరర్‌గా సురేందర్ బాధ్యతలు నిర్వర్తించాడు. వీరి హయాంలో 2019–22 సంవత్సరానికి బీసీసీఐ నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో అవసరమైన క్రికెట్ బాల్స్, జిమ్ పరికరాలు, బకెట్ కుర్చీలు కొనుగోలు చేయాల్సి ఉంది. ఇలా వచ్చిన నిధుల్లో భారీ అక్రమాలు జరిగినట్లు అప్పటి ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికలో వెల్లడైంది. దీనిపై ఉప్పల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. మనీలాండరింగ్ కోణంలో ఈడీ ఈసీఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేసింది.

అసభ్యకర వ్యాఖ్యలు మానుకోండి

రాజకీయ నేతలకు హైకోర్టు హితవు...కేటీఆర్‌పై ఎఫ్ఐఆర్ కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: రాజకీయ నాయకులు హుందాతనంతో వ్యవహరించాలని, మీడియాలో అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హైకోర్టు హితవు పలికింది. నేతల మాటలను లక్షలాది మంది ప్రజలు గమనిస్తుంటారని గుర్తుపెట్టుకోవాలని సూచించింది. కొందరు నేతలు సోషల్ మీడియాలో అసభ్యకరంగా మాట్లాడటం వారి వ్యక్తిత్వాన్ని తగ్గిస్తుందని పేర్కొంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావుపై సైఫాబాద్ పీఎస్‌లో దాఖలైన కేసును కొట్టివేసింది. 'నా మాటలు గుర్తుంచుకో.. చీ(ఫ్)ప్ మినిస్టర్.. మేం అధికారంలోకి వచ్చిన తొలిరోజే బాబాసాహెబ్ అంబేడ్కర్ సచివాలయం పరిసరాల్లోని చెత్తను తొలగిస్తాం. నీలాంటి ఢిల్లీ గులాం (బానిస) తెలంగాణ ఆత్మ గౌరవాన్ని అర్థం చేసుకోలేరు. చిన్నపిల్లల ముందు చెత్తమాటలు మాట్లాడిన రేవంత్ నైజం ఆయన వ్యక్తిత్వాన్ని సూచిస్తుంది. నీ మానసిక రుగ్మత నుంచి త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా'అని కేటీఆర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు గత ఏడాది ఆగస్టులో సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ముఖ్యమంత్రిని కించపరిచారని, అసభ్య పదజాలం వాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదులో పేర్కొన్నదంతా కల్పితమని.. ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ కేటీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ బుధవారం విచారణ చేపట్టి.. ఎఫ్ఐఆర్‌ను రద్దు చేస్తూ, తీర్పు వెలువరించారు.

మియాఖాన్‌గడ్డ నిషేధిత ప్రాంతం కాదు

డ్రోన్ల ఎగరేత కేసులో సీఎం రేవంత్‌పై ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి (నాడు ఎంపీ)పై 2020లో దాఖలైన కేసును హైకోర్టు కొట్టివేసింది. నార్సింగి పరిధిలోని మియాఖాన్‌గడ్డను నిషేధిత ప్రాంతంగా నోటిఫై చేయలేదని పేర్కొంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి నోటిఫికేషన్ జారీ కాలేదని చెప్పింది. ఎఫ్ఐఆర్‌లో అనవసర సెక్షన్లు జోడించారని, సాక్షుల్లో ఎక్కువ మంది పోలీసు సిబ్బందే ఉన్నారని అభిప్రాయపడింది. ఈ కారణాలను పరిగణనలోకి తీసుకుని ఎఫ్ఐఆర్‌ను రద్దు చేస్తున్నామని స్పష్టం చేసింది. 2020లో హైదరాబాద్ శివారులోని కేటీఆర్ ఫామ్‌హౌస్‌పై డ్రోన్ ఎగరేసి చిత్రీకరించిన ఆరోపణలపై నాటి ఎంపీ రేవంత్‌రెడ్డి అరెస్టయ్యారు. ఎలాంటి అనుమతులు లేకుండా డ్రోన్లు ఎగరేసి కెమెరాతో చిత్రీకరించడం నేరమని పోలీసులు అరెస్టు చేశారు. జీవో 111ను ఉల్లంఘించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫామ్‌హౌస్ నిర్మించుకున్నారని, ఆ విషయాన్ని నిరూపించేందుకు తాను డ్రోన్ ఎగరేసినట్లు రేవంత్ చెప్పారు. ఇదిలాఉండగా, ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో, రాజకీయ ప్రేరేపితంగా తనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, దాన్ని కొట్టివేయాలని కోరుతూ రేవంత్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టి.. బుధవారం తీర్పు వెలువరించారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి, ప్రభుత్వం తరఫున పీపీ పల్లె నాగేశ్వర్‌రావు వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పోలీస్ సిబ్బంది వాంగ్మూలాలతో ఏకీభవించలేమని చెబుతూ కేసు కొట్టివేశారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
గురువారం। 20-3-2025



ఎడ్లకు మేత.. గుండె కోత..

ఎస్సారెస్పీ కాలువ నీరు రాలేదు.. వ్యవసాయ బావిలో నీరు అడుగంటింది. పొట్టదశకు వచ్చిన వరి పైరు ఎండిపోతోంది. పంట చేతికొస్తే పెట్టుబడి కోసం తెచ్చిన అప్పు తీర్చుతామనే రైతు గంపెడాశ ఆవిరైపోయింది. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం మద్దిర్యాలకు చెందిన ఎండీ షరీఫ్.. తనకున్న నాలుగెకరాల్లో యాసంగి వరి వేశాడు. నీళ్లు అందక రెండెకరాల్లో పంట ఎండిపోయింది. దీంతో రైతు కుటుంబ సభ్యులు.. ఎండిన పైరును ఎద్దులకు మేతగా వినియోగిస్తూ ఇలా కనిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



పైరు ఎండి.. పశువులకు తిండి

హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఎండల తీవ్రతకు భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. బావులలో నీళ్లు తగ్గి పంటలకు సరిపడా సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. దిక్కుతోచని రైతులు కొంత పంటనైనా కాపాడుకుందామని నీరున్నంత వరకు పారించుకుని.. మిగతా పంటను మూగజీవాలకు వదిలేశారు.

– ధర్మసాగర్

బడ్జెట్‌లో బీసీలకు మొండిచెయ్యి

బీజేఎల్పీ ఉపనేత పాయల్ శంకర్



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో రెండురోజుల క్రితం బీసీల గురించి గొప్పగా మాట్లాడి.. తీరా బడ్జెట్ కేటాయింపులకు వచ్చేటప్పటికి ఈ వర్గాలకు ప్రభుత్వం మొండిచెయ్యి చూపిందని బీజేపీ శాసనసభా పక్ష (బీజేఎల్పీ) ఉపనేత పాయల్ శంకర్ విమర్శించారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 'బడ్జెట్‌లో రుణమాఫీకి నిధులు కేటాయించలేదు. నిరుద్యోగ భృతి ఊసే లేదు. ప్రతి నియోజక వర్గానికి 3,500 ఇళ్లు ఇస్తామని గత బడ్జెట్‌లో చెప్పారు కానీ ఇవ్వలేదు.. మళ్లీ ప్రస్తుత బడ్జెట్‌లోనూ అదే మాట చెప్పారు. ట్రిపుల్ ఆర్‌కు కేటాయింపులు లేవు. హైదరాబాద్ అభివృద్ధిని పట్టించుకోలేదు'అని మండిపడ్డారు. ప్రజలతో మరింతగా మద్యం తాగించి వచ్చే ఆదాయంతో ఖజానా నింపుకోవాలని ప్రభుత్వం చూస్తున్నట్టు కనిపిస్తోందని ధ్వజమెత్తారు. ఆరు గ్యారంటీలు, ఇతర హామీల అమలుపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని ప్రకటించారు. ప్రభుత్వానికి ఏ విధంగా రాబడి వస్తున్నది అనే అంశంపై పాలకులకు అసలు అవగాహనే లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అండ లేకపోతే రాష్ట్రం పరిస్థితి ఇంకా ఇబ్బందికరంగా ఉండేదని పేర్కొన్నారు. 'కాంగ్రెస్ సర్కార్‌కు బడ్జెట్ రూపకల్పన చేయడం రాదు. ఈ బడ్జెట్‌కు ఒక లక్ష్యం లేదు, న్యాయం లేదు, నిజాయితీ లేదు, స్వచ్ఛత లేదు'అని కాసం వెంకటేశ్వర్లు విమర్శించారు.

గాలి మేడల బడ్జెట్ ఇది: ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్



తెలంగాణ బడ్జెట్‌ను గాలిమేడల బడ్జెట్‌గా అభివర్ణించారు బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్. బుధవారం మండలి పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ, ఈ బడ్జెట్ అంచనాలన్నీ అవాస్తవాలని విమర్శించారు. ఆరు గ్యారంటీల మీద హడావుడి చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో వాటి ఊసే ఎత్తలేదన్నారు. దివాలాకోరు బడ్జెట్‌తో ప్రజలను ప్రభుత్వం వంచించిందన్నారు.

బీసీలను దగా చేసిన బడ్జెట్: ఎమ్మెల్సీ ఎల్. రమణ



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు అనేక సభల్లో 420 హామీలు, ఆరు గ్యారంటీలతో ఊదరగొట్టి బడ్జెట్‌లో మాత్రం శూన్యహస్తాన్ని చూపించిందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ ఎల్.రమణ ఆరోపించారు. మండలి మీడియా పాయింట్ వద్ద బుధవారం ఆయన మాట్లాడుతూ, చేతగాని పరిపాలనకు ఈ బడ్జెట్ నిదర్శనమని, బీసీలను దగా చేసే విధంగా కేటాయింపులు ఉన్నాయన్నారు. బతుకమ్మ చీరలకు ఆర్డర్స్ ఇవ్వకపోవటం వల్లనే చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకుంటున్నారని విమర్శించారు. చివరకు చేనేత కార్మికులను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం దగా చేసిందన్నారు.

కాంగ్రెస్ హామీలకు చోటే లేదు: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి



కాంగ్రెస్ ప్రభుత్వ బడ్జెట్‌లో ఆరు గ్యారంటీల ఊసేలేదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం మండలి పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర రైతాంగాన్ని మోసం చేసే విధంగా బడ్జెట్ ఉందన్నారు. కేసీఆర్ వల్లనే ఈ స్థితిలో ఉన్నామని పేర్కొంటున్న కాంగ్రెస్ నేతలు బయట మాత్రం దివాలా తీసిందని అబద్ధాలు చెబుతున్నారన్నారు. అలా చెప్పడం వారి భావదారిద్ర్యానికి నిదర్శనమని విమర్శించారు.

రాష్ట్ర బడ్జెట్ విప్లవాత్మకం


కాంగ్రెస్ ఎంపీలు మల్లు, షెట్కార్, చామల



సాక్షి, న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మకమైన బడ్జెట్ ప్రవేశపెట్టిందని కాంగ్రెస్ ఎంపీలు అన్నారు. బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు సీఎం, డిప్యూటీ సీఎం గాంధీ సూక్తిని అనుసరించారని తెలిపారు. అన్ని వర్గాలకు సముచిత కేటాయింపులు చేసిన బడ్జెట్ రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చుతుందని చెప్పారు. బుధవారం తెలంగాణ భవన్‌లోని గురజాడ హాల్‌లో ఎంపీలు మల్లు రవి, సురేశ్ షెట్కార్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. గొప్ప బడ్జెట్ ప్రవేశపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ధన్యవాదాలు తెలిపారు. రైతులకు తొలి ప్రాధాన్యం ఇస్తూ.. బలహీన వర్గాలకు సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన బడ్జెట్‌గా అభివర్ణించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు బడ్జెట్‌లో రూ.60 వేల కోట్లకుపైగా కేటాయించి మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం అని నిరూపించిందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకరించాలని ఎంపీలు డిమాండ్ చేశారు.

జీవన్‌రెడ్డికి నో.. కుటుంబ సభ్యులకు ఓకే

ముందస్తు బెయిల్ పిటిషన్‌లో హైకోర్టు తీర్పు



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా ఈర్లపల్లిలో భూ వివాదంపై చేవెళ్ల పీఎస్‌లో దాఖలైన కేసులో బీఆర్‌ఎస్ నేత ఆశన్నగారి జీవన్‌రెడ్డికి ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. అయితే, ఆయన భార్య రజిత, తల్లి రాజుబాయికి మాత్రం మంజూరు చేసింది. ఇద్దరు రూ.25 వేల చొప్పున వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని ఆదేశించింది. జీవన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు తన భూమిని కబ్జా చేశారని దామోదర్‌రెడ్డి అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో 2024, మేలో కేసు నమోదైంది. తాను ప్రశ్నిస్తే మారణాయుధాలు చూపించి బెదిరింపులకు పాల్పడ్డారని కూడా చెప్పారు. తొలుత ఈ ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ జీవన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ ఎదుర్కోవాల్సిందేనని చెబుతూ ఈ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. దీంతో ముందస్తు బెయిల్ కోరుతూ జీవన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. గత వారం తీర్పు రిజర్వు చేసిన న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ బుధవారం తుది ఉత్తర్వులు జారీ చేశారు. జీవన్‌రెడ్డికి ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరిస్తూ, కుటుంబ సభ్యులకు మాత్రం మంజూరు చేశారు.

శరభ.. శరభ

వీరభద్రుడికి వీరశైవుల ఆహ్వానం • శివకల్యాణోత్సవం సందర్భంగా వేడుక

కష్టాల నుంచి గట్టెక్కిస్తే శివుడిని వివాహమాడే ఆనవాయితీ



శివారాధనలో విన్యాసాలు చేస్తున్న జంగమయ్యలు



జాగంట కొడుతున్న ఎనుగంటి నాగేందర్

వేములవాడ: దక్షిణకాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీరాజరాజేశ్వర ఆలయంలో శివకల్యాణోత్సవాలకు ప్రత్యేకత ఉంది. అన్ని ఆలయాల్లో భక్తులు హాజరై స్వామి, అమ్మవార్ల వివాహ వేడుకను తిలకించి పులకించిపోతారు. కానీ వేములవాడలో శివకల్యాణం సందర్భంగా అత్యధిక మంది శివుడిని పెళ్లాడటం ఆనవాయితీ. అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కిస్తే స్వామినే పెళ్లాడుతామని మొక్కుకుంటారు. ఆ నమ్మకంతో కష్టాలు తొలగిపోయిన వారు ఏటా శివకల్యాణోత్సవం సందర్భంగా త్రిశూలం పట్టుకొని స్వామిని వివాహమాడుతుంటారు. శివకల్యాణోత్సవాల్లో ఆకట్టుకునే మరో ప్రత్యేకత వీరశైవులు (జంగమయ్యలు) వీరభద్రుడికి ఆహ్వానం పలికే వేడుక. వీరభద్రుడికి వీరశైవ ఆగమశాస్త్రం ప్రకారం ఇక్కడి జంగమయ్యలు పూజలు చేస్తుంటారు. ఈ నేపథ్యంలోనే వీరశైవ అర్చకులు దండకాలు (ఖడ్గాలు) వేస్తూ స్వామిని ఆహ్వానిస్తుంటారు. ఈ ఉత్సవాల్లో పట్టణానికి చెందిన 28 కుటుంబాలు పాల్గొంటాయి.



శంఖం పూరిస్తున్న పర్రె శరత్

స్మార్థ వైదిక పద్ధతిని అనుసరించి..

రాష్ట్రంలోని మిగతా శైవక్షేత్రాలలో 'కారణాగమము'అనుసరించి మహాశివరాత్రి పర్వదినం రోజునే కల్యాణోత్సవాలు చేస్తుంటారు. కానీ వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో మాత్రం 'స్మార్థ వైదిక'పద్ధతిని అనుసరించి మహాశివరాత్రి అనంతరం కామదహనం మరుసటి రోజున పార్వతీరాజరాజేశ్వరుల వివాహం జరిపిస్తుంటారు. ఈశ్వరుడు తపస్సులో ఉండగా, మన్మథుడు తన బాణాన్ని సంధించి తపస్సును భగ్నం చేశాడని, దీంతో ఈశ్వరునికి కోపమొచ్చి మన్మథున్ని త్రినేత్రంతో దహనం చేశాడని, అందుకోసమే కామదహనం తర్వాత మరుసటి రోజున ఈశ్వరుడు పార్వతిని కల్యాణం చేసుకుంటాడని అర్చకులు చెబుతున్నారు.

ఇల్లు సల్లంగుండాలని..

ఏటా రాజన్నను పెళ్లాడే శివపార్వతులు ముందుగా ఇల్లు సల్లంగుండాలని రుద్రాక్ష పూజ చేసుకుంటారు. తమ ఆరోగ్యాలు బాగుండాలని, ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కాలని, కుటుంబ సమస్యలు తీరాలని, మానసిక పరిస్థితులు మెరుగుపడాలని ఇలా అనేక సమస్యలతో సతమతమవుతున్న వారంతా వయో, లింగభేదం లేకుండా ఇక్కడి వీరశైవులతో రుద్రాక్షపూజ నిర్వహించుకుంటారు. అనంతరం రాజన్న కల్యాణోత్సవంలో పాల్గొంటారు. ఈ క్రమంలో ఇక్కడి వీరశైవులు వీరికి ప్రత్యేక పూజలు చేసి రుద్రాక్షధారణ నిర్వహిస్తారు. అనంతరం వారంతా రాజన్న సేవలో తపించడంతోపాటు తమతమ కుటుంబ వ్యవహారాల్లోనూ కొనసాగుతుంటుంటారు. రాజన్నకు ఉచిత ప్రచారకర్తలుగా పని చేస్తుంటారు.

విద్యపై ఇంత నిర్లక్ష్యమా?: టీఎస్‌యూటీఎఫ్

సాక్షి, హైదరాబాద్: విద్యకు 15 శాతం నిధులిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో చిత్తశుద్ధి కనబరచలేదని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి విమర్శించారు. కేవలం 7.57 శాతం నిధులే ఇవ్వడం నిర్లక్ష్యమేనన్నారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ గురించి మాట్లాడే ప్రభుత్వం, బడుగు బలహీనవర్గాలు చదివే ప్రభుత్వ స్కూళ్ల గురించి ఆలోచించకపోవడం దారుణమన్నారు. ఇలా చేస్తే నాణ్యమైన విద్య ఎలా అందుతుందని ప్రశ్నించారు.

ఇది అన్యాయం: మాచెర్ల రాంబాబు (ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి) విద్యకు కేటాయింపుల్లో ప్రభుత్వం అన్యాయం చేసింది. 20 శాతం నిధులివ్వాలని విద్యా కమిషన్ చెప్పినా పట్టించుకోలేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇవేవీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం.


మౌలిక వసతులు వద్దా?: నవాత్ సురేశ్, హనుమంతరావు (తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నేతలు) ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరిస్తామని చెప్పిన ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు నిధులివ్వకపోవడం సరికాదు. బడ్జెట్ కేటాయింపులు తీవ్ర నిరాశ కల్గించేలా ఉన్నాయి. విద్యలో నాణ్యత పెంచే దిశగా ప్రయత్నాలు లేవు.

బడుగులకు అన్యాయమే: మహిపాల్‌రెడ్డి, అరికెల వెంకటేశం (ఎస్‌జీటీయూ నేతలు) బడుగు, బలహీన పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ స్కూళ్లను చులకన చేయడం సరికాదు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఆధునిక వసతులు, క్రీడాభివృద్ధికి సరిపడా నిధులు ఇవ్వకపోవడం అన్యాయం.

ఇదో చరిత్రాత్మకం: ఎస్టీయూటీఎస్. ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు బడ్జెట్‌లో నిధులు ఇవ్వడాన్ని ఎస్టీయూటీఎస్ నేతలు సదానందం గౌడ్, జి పర్వతరెడ్డి స్వాగతించారు. ఇది చరిత్రాత్మకమని, దీంతోపాటు ప్రభుత్వ స్కూళ్లనూ బలోపేతం చేసేందుకు నిధులివ్వాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు.

బడ్జెట్‌తో భాగ్యనగరాభివృద్ధి తథ్యం

రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌ను విశ్లేషిస్తే.. ఫ్యూచర్ సిటీ, మూసీ సుందరీకరణ, హైదరాబాద్ మహానగరంగా అభివృద్ధి చెందడం ఖాయమని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి అభిప్రాయపడ్డారు. ఆయన బుధవారం తెలంగాణ సచివాలయ మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ అభివృద్ధి, సంక్షేమ, సేవారంగ, ప్రగతిశీల బడ్జెట్ అని కొనియాడారు. రాష్ట్ర బడ్జెట్ ప్రగతికి బాటలు వేస్తుందని, అభివృద్ధి, సంక్షేమ రంగాలకు సమపాళ్లలో నిధుల కేటాయింపులు జరిగాయని స్పష్టం చేశారు.



ఈ ఆటో చాలా కూల్ గురూ..

ఆటో పైకప్పు నిండా పచ్చని పూల మొక్కలు, గడ్డి మొక్కలను పెంచాడు. మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు నీరు పోస్తున్నాడు. ఆటో ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాడు. ప్రయాణికులకు చల్లదనాన్ని పంచేందుకు.. మహబూబాబాద్ మండలం దర్గా తండాకు చెందిన భూక్యా హ్యాంజ్యా అలియాస్ ఆటో అంజి వినూత్న ఆలోచనకు దృశ్య రూపమిది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్




కళ తప్పిన ప్రకృతి

ఆకురాలే సమయం వచ్చేసింది. వానాకాలం, చలికాలంలో పచ్చదనంతో ప్రకృతి ప్రేమికులను మురిపించిన గుట్టలు.. ఇప్పుడు ఎండ తీవ్రతతో మాడిపోతున్నాయి. తీవ్రమైన ఎండలతో చెట్లు ఆకురాల్చి మోడువారి కనిపిస్తున్నాయి. రాత్రివేళ కార్చిచ్చుతో మంటల్లో కాలిపోతున్నాయి. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం జయ్యారం శివారు, అంతర్గాం మార్గంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఎండిన చెట్లతో గుట్టలు బోసిపోయి కనిపించాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

చెరువు ఎండింది.. చేప చిక్కింది

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నిజాం చెరువు నీరు అడుగంటిపోయింది. దీంతో కొద్దిపాటి నీటిలోని చేపలను మాధవాపురం గ్రామానికి వలస వచ్చిన సైబీరియన్ కొంగలు సునాయాసంగా వేటాడుతున్నాయి. కోరుకున్న చేపను కొంగలు పట్టేసుకుని గుటుక్కుమనిపిస్తున్నాయి. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్



క్లుప్తంగా...

పోసాని బెయిల్‌పై ఉత్తర్వులు 21కి వాయిదా

గుంటూరు లీగల్: సీఐడీ నమోదు చేసిన కేసుపై సినీ నటుడు, రచయిత పోసాని కృష్ణమురళి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై వాదనలు పూర్తయ్యాయి. ఈ పిటిషన్‌పై ఈ నెల 21న ఉత్తర్వులు జారీ చేస్తామని గుంటూరు ఎక్సైజ్ కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి తెలిపారు.

ఆహార నాణ్యతపై ఐదేళ్లలో 45,409 పరీక్షలు

సాక్షి, అమరావతి :రాష్ట్రంలో ఆహార కల్తీ నివారణకు 2019–24 మధ్య 45,409 ఆహార శాంపిల్స్ సేకరించి, నిబంధనల ప్రకారం నాణ్యత విశ్లేషణల కోసం పరీక్షలు నిర్వహించినట్టు మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఆయా శాంపిల్స్‌కు నిర్వహించిన నాణ్యత పరీక్షల్లో 2,473 శాంపిల్స్‌లో ఉల్లంఘనలు జరిగినట్టు నిర్ధారణ అయ్యిందన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన శాసనసభలో సమాధానమిచ్చారు.

ఫిఫో జాతీయ ప్రధాన కార్యదర్శిగా అర్జిల్లి దాసు

సాక్షి, అమరావతి: ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫిషర్‌మెన్ ఆర్గనైజేషన్ (ఫిఫో) జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఏపీకి చెందిన మత్స్యకారనాయకుడు అర్జిల్లి దాసు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం తమిళనాడులోని కన్యాకుమారిలో జరిగిన సమాఖ్య జాతీయ సమావేశంలో నూతన పాలక వర్గ ఎన్నికలు జరిగాయి. దేశవ్యాప్తంగా 9 కోస్తా తీర ప్రాంత రాష్ట్రాలతో పాటు 4 కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 400కు పైగా మత్స్యకార సంఘాల భాగస్వామ్యంతో ఏర్పడిన ఈ సమాఖ్యకు తొలిసారి జాతీయ స్థాయి పాలకవర్గాన్ని ఏర్పాటు చేశారు.

'ఆస్త్రా గ్రీన్'కు 864.87 ఎకరాలు

సాక్షి, అమరావతి : ఆస్త్రా గ్రీన్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు 864.87 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ సంస్థ అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాల్లో 1,800 మెగావాట్ల సామర్థ్యం గల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టులను స్థాపించనుందని ప్రభుత్వం తెలిపింది. ఎకరా రూ.5 లక్షల చొప్పున ఈ ప్రాజెక్టు కోసం కొనుగోలు చేసేందుకు సంస్థ అంగీకరించడంతో ఆమోదం తెలిపినట్లు వెల్లడించింది.

ఏపీకి రావాల్సిన రూ.55 కోట్లు ఇవ్వండి

సాక్షి, అమరావతి: రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ నుంచి ఏపీకి రావాల్సిన రూ.55 కోట్లు చెల్లించాలని, పాత రికార్డులను అప్పగించాలని తెలంగాణ వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనిని ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ కోరారు. హైదరాబాద్ నాంపల్లిలో తెలంగాణ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనితో అబ్దుల్ అజీజ్ బుధవారం భేటీ అయ్యారు. అనంతరం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

కాంపోజిట్ గ్రాంట్ వెంటనే విడుదల చేయాలి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు 2024–25కి రెండో విడత స్కూల్ కాంపోజిట్ గ్రాంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ అమరావతి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గతంలో మొదటి విడతగా 50 శాతం విడుదల చేసిందని, మిగిలిన 50 శాతం నిధులను వెంటనే విడుదల చేయాలని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.వి.ప్రసాద్, రాధాకృష్ణ విద్యాశాఖకు విజ్ఞప్తి చేశారు.

'ఉపాధి' జాయింట్ కమిషనర్‌గా శివరామప్రసాద్

సాక్షి, అమరావతి : ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కార్యాలయంలో పని చేస్తున్న ఎన్వీ శివరామప్రసాద్‌ను పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయంలోని ఉపాధి హామీ పథకం విభాగపు జాయింట్ కమిషనర్ (ప్లాంటేషన్)గా నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులిచ్చింది. ఆయన మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు.

విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు సిద్ధం

సాక్షి, అమరావతి: వేసవిలో విద్యుత్ డిమాండ్‌కు సరిపడేలా సరఫరాను అందించేందుకు విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను సిద్ధం చేసినట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితిపై అధికారులతో బుధవారం సచివాలయంలో ఆయన సమీక్షించారు.

రాష్ట్రానికి బాబే బ్రాండ్ అంబాసిడర్: మంత్రి లోకేశ్

హనుమాన్‌జంక్షన్ రూరల్: రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషిచేస్తున్నారని రాష్ట్ర ఐటీ, మానవవనరుల శాఖ మంత్రి లోకేశ్ చెప్పారు. కృష్ణాజిల్లా బాపులపాడు మండలం మల్లవల్లిలోని ఏపీఐఐసీ పారిశ్రామికవాడలో అశోక్ లేలాండ్ బస్ బాడీ బిల్డింగ్ తయారీ పరిశ్రమను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబే ఏపీకి బ్రాండ్ అంబాసిడర్ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, టీజీ భరత్ తదితరులు పాల్గొన్నారు.

'యువిక'.. భావి శాస్త్రవేత్తలకు వేదిక

- అంతరిక్షం, స్పేస్ అప్లికేషన్స్‌పై ఇస్రో అవగాహన
- తొమ్మిదో తరగతి విద్యార్థులకు అవకాశం
- మార్చి 23 వరకు దరఖాస్తుల స్వీకరణ



వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): అంతరిక్ష పరిశోధనలపై మక్కువ ఉన్న విద్యార్థులను ప్రోత్సాహించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) పలు కార్యక్రమాలను నిర్వహిస్తుంది. వారిని ప్రత్యేకంగా తమ ప్రాంగణాలకు ఆహ్వానించి నూతన ఆవిష్కరణలపై ఉత్సాహాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తోంది. అందులో భాగంగా యువిక (యంగ్ సైంటిస్ట్)–2025 పేరిట ఉపగ్రహ ప్రయోగాలను తెలుసుకునేందుకు, శాస్త్రవేత్తలతో మాట్లాడేందుకు తొమ్మిదో తరగతి విద్యార్థులకు అవకాశం కల్పిస్తోంది. ఈ విధమైన అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఇస్రో పిలుపునిస్తుంది. అంతరిక్ష పరిశోధనల్లో ఇటీవల ఇస్రో 100 ప్రయోగాలు పూర్తి చేసుకుంది. అగ్రదేశాలకు దీటుగా భారత్ పలు పరిశోధనలు చేపడుతోంది. ఈ విజ్ఞానాన్ని విద్యార్థులకు తెలియజెప్పేందుకు, వారిలో స్ఫూర్తి నింపేందుకు ఇస్రో ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది.

యువిక లక్ష్యాలు ఇవీ..

- భారత అంతరిక్ష పరిశోధనలను విద్యార్థులకు పరిచయం చేయడం
- విద్యార్థులను స్పేస్ టెక్నాలజీ వైపు ప్రోత్సహించడం
- అంతరిక్ష పరిశోధకులుగా వారిని సిద్ధం చేయడం

ఎవరు అర్హులంటే...

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న తొమ్మిదో తరగతి విద్యార్థులు, ఆన్‌లైన్ పరీక్షలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఇస్రో ప్రాధాన్యతనిస్తోంది. ఎనిమిదో తరగతిలో సాధించిన మార్కుల్లో 50 శాతం, మూడేళ్లలో పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహించిన సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనల్లో పాల్గొంటే వాటి ఆధారంగా 2–10%, ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో చూపించిన ప్రతిభకు 10% వెయిటేజీ ఇవ్వనుంది. ఎన్‌సీసీ, స్కౌట్, గైడ్స్ విభాగాల్లో ఉంటే 5%, పల్లె ప్రాంతాలకు చెందిన వారికి 15% ప్రాధాన్యం ఇవ్వనుంది.

పరీక్ష ఎక్కడంటే...

ఇస్రో ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా 7 కేంద్రాల్లో చేపడుతోంది. డెహ్రాడూన్ (ఉత్తరాఖండ్), తిరువనంతపురం (కేరళ), సూళ్లూరుపేట (ఏపీ), బెంగళూరు (కర్ణాటక), అహ్మదాబాద్ (గుజరాత్), హైదరాబాద్ (తెలంగాణ), షిల్లాంగ్ (మేఘాలయ).

దరఖాస్తు ఇలా చేసుకోవాలి..

నాలుగు దశల్లో విద్యార్థులు దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలి. మొదటగా ఈ–మెయిల్ ఐడీతో వివరాలు నమోదు చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకున్న 48 గంటల వ్యవధిలో ఇస్రో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలి. క్విజ్ పూర్తి చేసిన 60 నిమిషాల తరువాత 'యువికా' పోర్టల్లో ఆన్‌లైన్ దరఖాస్తుతో పూర్తి వివరాలు నమోదు చేసి సమర్పించాలి. మూడేళ్లలో వివిధ అంశాల్లో విద్యార్థి సాధించిన ప్రగతికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు ఏవైనా ఉంటే, వాటి జెరాక్స్ కాపీలపై విద్యార్థి సంతకం చేసి అప్‌లోడ్ చేయాలి. దరఖాస్తులు సమర్పించేందుకు మార్చి 23 వరకు అవకాశముంది. ఎంపిక జాబితాను 2 విడతల్లో ప్రకటించి అర్హత సాధించిన వారికి సమాచారం అందిస్తారు. యువికా శిక్షణకు ఎంపికైన వారికి శిక్షణకు హాజరయ్యేందుకు రవాణా చార్జీలు, బస, భోజన వసతితో పాటుగా అన్ని సౌకర్యాలను ఇస్రో కల్పిస్తుంది.

కార్యక్రమం షెడ్యూల్ ఇలా..

వచ్చిన దరఖాస్తులను ఏప్రిల్ 7నాటికి వడపోసి ఎంపికైన విద్యార్థుల జాబితాలను ఇస్రో విడుదల చేస్తుంది. మే నెల 18 నుంచి విద్యార్థులను ఆహ్వానిస్తుంది. 19 నుంచి 30వ తేదీ వరకూ యువికా–25 కార్యక్రమం చేపడుతోంది. మే 31న ముగింపు కార్యక్రమం జరుగుతుంది. అదే రోజు ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తుంది. ఎంపికైన విద్యార్థులను మే లో 14 రోజులు ఇస్రోకు చెందిన స్పేస్ సెంటర్లకు తీసుకువెళ్తుంది. అక్కడి వింతలు, విశేషాలు, సప్తగ్రహ కూటమి తదితర అంశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తుంది. వారు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసి వారికి విజ్ఞానాన్ని అందిస్తారు.

విద్యార్థులకు మంచి అవకాశం

విద్యార్థులకు ఇస్రో వంటి సంస్థను సందర్శించటం, ఆయా పరిశోధనలపై అవగాహన పెంచుకోవటానికి ఇది మంచి అవకాశం. భావి శాస్త్రవేత్తలను ప్రోత్సహించేందుకు ఇస్రో చేపడుతోన్న యువికా కార్యక్రమాన్ని అర్హతగల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. సంబంధిత పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు పిల్లలకు సహకరించాలి. జిల్లా పరిధిలో డీవైఈవోలు, ఎంఈవోలు ఈ విషయంపై వారి పరిధిలో యంత్రాంగాన్ని చైతన్యపర్చాలి. పెద్ద సంఖ్యలో విద్యార్థులతో దరఖాస్తు చేయించాలి.

– యువీ సుబ్బారావు, డీఈవో, ఎన్టీఆర్ జిల్లా

అవగాహన కల్పిస్తున్నాం

యువికాలో పాల్గొనేందుకు, దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తున్నాం. గతంలో నిర్వహించిన అనేక సైన్స్ ఎగ్జిబిషన్లు, పోటీ పరీక్షల్లో ఎన్టీఆర్ జిల్లా విద్యార్థులు సత్తాచాటి జాతీయ స్థాయిలో వారి ప్రదర్శనలతో అబ్బురపర్చారు. ఇదేస్ఫూర్తితో పెద్ద సంఖ్యలో అర్హత గత విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం.

– డాక్టర్ మైనం హుస్సేన్, జిల్లా సైన్స్ అధికారి

ఎంఎస్‌ఎంఈలకు మంచి రోజులు

- 2023–24లో రూ.1.63 లక్షల కోట్ల విలువైన ఎగుమతులు
- ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడి



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి, నీతిఆయోగ్ సలహాదారు సంజీత్‌సింగ్

సాక్షి, విశాఖపట్నం: పీ4 విధానంతో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ)కు మంచి రోజులు రానున్నాయని రాష్ట్ర ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. 'ఎగుమతులకు ఎంఎస్ఎంఈల సాధికారత–అభివృద్ధి–ఆవిష్కరణల దిశగా' పేరిట విశాఖలో ఒకరోజు వర్క్‌షాప్ బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఏపీ నుంచి 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.1.63 కోట్ల విలువైన ఎగుమతులు జరిగాయని వెల్లడించారు. ఈ ఎగుమతుల్లో ఎంఎస్ఎంఈలు కీలకపాత్ర పోషించాయని చెప్పారు. భవిష్యత్‌లో ఈ ఎగుమతుల్ని మరింత వృద్ధిలోకి తీసుకెళ్లే బాధ్యత ప్రభుత్వం తీసుకుందన్నారు. సులభతర వాణిజ్యంలో ఏపీ నంబర్–1 రాష్ట్రంగా సుస్థిరంగా కొనసాగుతోందన్నారు. నీతిఆయోగ్ సలహాదారు సంజీత్‌సింగ్ మాట్లాడుతూ.. ఏపీకి చెందిన ఎంఎస్ఎంఈలు ఉత్పత్తులు, ఎగుమతుల్లో అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నాయని కొనియాడారు. ఆవిష్కరణలు, ఆర్థికపరమైన చిక్కులు, మార్కెటింగ్, సాంకేతికత అందిపుచ్చుకోవడంలో దేశంలోని ఎంఎస్ఎంఈలు ఇంకా వెనుకంజలో ఉన్నాయని.. వాటిపై దృష్టి సారించాలని సంజీత్‌సింగ్ సూచించారు. ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ టి.శివశంకర్, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈవో శేఖర్‌బాబు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల డిమాండ్లు పరిష్కరించండి!

మంత్రి, సీఎస్‌లకు పీడీఎఫ్ ఎమ్మెల్సీలు, యూనియన్ నేతల వినతి

సాక్షి, అమరావతి : రాష్ట్రంలోని అంగన్‌వాడీల డిమాండ్లను పరిష్కరించాలని, ఎన్నికల్లో టీడీపీ కూటమి ఇచ్చిన హామీలను అమలుచేయాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయనంద్‌లను పీడీఎఫ్ ఎమ్మెల్సీలు, యూనియన్ నేతలు కోరారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్, అసోసియేషన్ నేతలు బుధవారం సచివాలయంలో వారిని కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. గ్రాట్యుటీ అమలుచేయాలని, కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, మినీ సెంటర్లను మెయిన్ అంగన్‌వాడీ సెంటర్లుగా మార్పుచేయాలని, పెండింగ్ బిల్లులు అందించాలని వినతిపత్రాలు ఇచ్చారు. మంత్రి, సీఎస్‌ను కలిసిన వారిలో పీడీఎఫ్ ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ), బొర్రా గోపిమూర్తి, యూనియన్ నాయకులు కె. సుబ్బరావమ్మ, ఎంసీహెచ్ సుప్రజ, పి. పద్మ, విజయదుర్గ తదితరులున్నారు.

విధులకు ఆటంకం కల్పించిన వారిపై చర్యలు తీసుకోవాలి..

ఇదిలా ఉంటే.. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాలి మండలం గద్దలపాడు గ్రామానికి చెందిన అంగన్‌వాడి సెంటర్ పరిధిలో పదేళ్లుగా పనిచేస్తున్న ఎస్. హరిదేవి (వర్కరు), ఎం. గారమ్మ (హెల్పర్ల)ల విధులకు ఆటంకం కల్పించి దౌర్జన్యం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ (సీఐటీయూ) యూనియన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి. బేబీరాణి, కె. సుబ్బారావమ్మ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం మారిందని.. విధుల నుంచి తప్పుకోవాలని ఒత్తిడి చేయడం, ఆ పోస్టులను రూ.2 లక్షలకు వేలంలో పాడుకున్నామని కొందరు బెదిరింపులకు దిగడం దుర్మార్గమన్నారు. ఈ విషయాన్ని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇలాంటి రాజకీయ ఒత్తిళ్లు మానుకోవాలని వారు కోరారు.

మీడియా పాయింట్

చట్టసభలపై ప్రభుత్వానికి గౌరవం లేదు: బొత్స



సాక్షి, అమరావతి : చట్టసభలపై టీడీపీ కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం గౌరవంలేదు. కూటమి నేతలు నిబంధనలు పాటించకుండా తమకు నచ్చినట్లు సభను నడుపుతున్నారు. అప్పటికప్పుడు సభలో బిల్లులు తెస్తున్నారు. 'మండలి' చైర్మన్ ఫైనాన్స్ బిల్లుకు ఆమోదం తెలిపిన తర్వాత కూడా చర్చకు అవకాశం ఇస్తున్నారు. గౌరవంలేని సభలో ఉండటం అనవసరమని భావించి వాకౌట్ చేసి బయటికి వచ్చేశాం. అలాగే, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్రీడలకు సంబంధించిన ఫ్లెక్సీల ఏర్పాటులో ప్రోటోకాల్ పాటించలేదు. 'మండలి' చైర్మన్ ఫొటో పెట్టకుండా కించపరిచారు. ఇందుకు కారకులపై చర్యలు తీసుకోమని కోరాం. ఇక అడిగిన ప్రశ్నకు సరైన సమాధానం రావడంలేదు. అహంకారంతో ప్రవర్తిస్తున్నారు.

యువతను ఈ ప్రభుత్వం మోసం చేసింది : తూమాటి మాధవరావు, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ



నిరుద్యోగ భృతి అర్హులను గుర్తించారా లేదా అని ప్రశ్నిస్తే ప్రభుత్వం సమాధానం చెప్పలేక సభలో మా గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారు. 2014–19లో ఈ ప్రభుత్వం కేవలం 18వేల మందికి మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాలిచ్చింది. కానీ, వైఎస్ జగన్ తన ఐదేళ్ల పాలనలో ప్రభుత్వం, అనుబంధ రంగాల్లో ఆరు లక్షల మందికి ఉద్యోగాలు కల్పించారు. కూటమి ప్రభుత్వం 2014–19లోనూ, ఇప్పుడు నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువతను మోసంచేసింది. అదే జగన్ సచివాలయ వ్యవస్థ తెచ్చి ఒకేసారి లక్షా 30 వేల మందికి ఉద్యోగాలిచ్చారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనంచేసి 50 వేల మందికి లబ్ధిచేకూర్చారు. 2.60 లక్షల మంది వలంటీర్లకు అవకాశం కల్పించారు.

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి : టి. కల్పలత, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ



గత ప్రభుత్వంలో 10,700 మంది కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు 114 జీఓను అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారు. కానీ, ఈ ప్రభుత్వంలో ఇంతవరకూ ఎలాంటి చర్యలులేవు. మెడికల్ విభాగంలో మూడువేల మంది ఆ జీఓ వచ్చాక రెగ్యులర్ అయ్యారు. మిగతా వారు ఎదురుచూస్తున్నారు. ఇలా ఒక్క విద్యాశాఖలోనే మూడువేల మందికి పైగా ఉన్నారు. వారందరినీ క్రమబద్ధీకరించాలి. ఇక రాష్ట్రంలో మహిళలపై దాడులు భారీగా పెరిగాయి. పాలకులు అరికట్టలేకపోతున్నారు. చివరికి పోలీస్‌స్టేషన్లలో కూడా రక్షణ లేకుండాపోయింది.

సభ సాక్షిగా అనిత అబద్ధాలు : వరుదు కళ్యాణి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ



మహిళలపై నేరాలు తగ్గాయని హోంమంత్రి అనిత సభ సాక్షిగా అబద్ధాలు చెబుతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం.. గతేడాది జూన్ నుంచి ఈ ఏడాది జనవరి 31 వరకూ 16,809 నేరాలు నమోదయ్యాయని ఈ సమావేశాల్లో.. గతేడాది అక్టోబరు 31 వరకూ 7,393 నేరాలు నమోదయ్యాయని గత సమావేశాల్లో చెప్పారు. ఈ లెక్కన రోజుకి మహిళలపై 70 సంఘటనలు జరుగుతున్నాయి. గత ప్రభుత్వంలో తీసుకొచ్చిన దిశ యాప్‌ను టీడీపీ ప్రభుత్వం శక్తి యాప్‌గా మార్చింది. మద్యం, డ్రగ్స్ విచ్చలవిడితనంవల్లే మహిళలపై నేరాలు పెరుగుతున్నాయి. ఇక గంజాయిని అరికట్టడానికి 'ఈగల్' తెచ్చామంటున్నారు. కానీ, 'సెబ్' పేరుతో గంజాయిపై ఉక్కుపాదం మోపిందే గత ప్రభుత్వం.

దేవుని మాన్యాలు కబ్జా : పీవీ పార్థసారథి, బీజేపీ ఎమ్మెల్యే



రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షల 10 వేల ఎకరాల దేవదాయ శాఖ భూములున్నాయి. వీటిలో 1.13 లక్షల ఎకరాలు కబ్జాకు గురయ్యాయి. 2015 జీఓ–211 ప్రకారం హిందూ దేవాలయాల భూములు ప్రభుత్వానివి కావు. దేవుడివే. ప్రభుత్వం కేవలం కాపలాదారు మాత్రమే. ఇక దేవాలయాలకు ప్రభుత్వం రూ.2,400 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. వీటిని ఎప్పుడు చెల్లిస్తుందో స్పష్టంచేయాలి. దేవుని మాన్యాలను కాపాడి, కబ్జాదారులను శిక్షించాలి.

ఏపీ ఇన్ పార్లమెంట్

సమగ్ర శిక్షకు కేంద్రం రూ.2,361 కోట్లు

పీఎంశ్రీ పాఠశాలలకు మరో రూ.454 కోట్లు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.2,361 కోట్ల నిధులు కేటాయించింది. అలాగే, పీఎంశ్రీ పథకానికి మరో రూ.454 కోట్లు మంజూరు చేసింది. సమగ్ర శిక్షా స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఎస్‌పీడీ) బీ శ్రీనివాసరావు ఈ విషయాన్ని తెలిపారు. ఆటిజంతో ఇబ్బంది పడుతున్న దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేకంగా 125 కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. విద్యార్థినుల భద్రత కోసం 352 కేజీబీవీ, పీఎంశ్రీ పాఠశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

22 నుంచి కేజీబీవీల్లో ఆన్‌లైన్ ప్రవేశాలు

కాగా, కేజీబీవీల్లో 2025–26 విద్యా సంవత్సరానికి 6, 11 తరగతుల్లో ప్రవేశాలకు, 7 నుంచి 10 అలాగే 12వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు శ్రీనివాసరావు తెలిపారు. అర్హత గల బాలికలు మార్చి 22– ఏప్రిల్ 11వ తేదీ మధ్య https://apkgbv.apcfss.in/ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైన వారికి ఫోన్ ద్వారా సమాచారం అందుతుంది. లేదా సంబంధిత పాఠశాలలో నేరుగా తెలుసుకోవచ్చు. ఇతర వివరాలు, సందేహాలకు 70751 59996, 70750 39990 నంబర్లను సంప్రదించాలని శ్రీనివాసరావు తెలిపారు.

ఆర్‌వైఎస్ఎస్‌తో బర్మింగ్‌హామ్ వర్సిటీ ఒప్పందం

సాక్షి, అమరావతి: ప్రకృతి వ్యవసాయ పరిశోధన కోసం బర్మింగ్‌హామ్ విశ్వవిద్యాలయంతో రైతు సాధికార సంస్థ (ఆర్‌వైఎస్ఎస్) అవగాహన ఒప్పందం చేసుకుంది. మూడేళ్ల పాటు అమలులో ఉండే ఈ ఒప్పందానికి బర్మింగ్‌హామ్ వర్సిటీలోని స్కూల్ ఆఫ్ జియోగ్రఫీ, ఎర్త్, ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్ నుంచి డాక్టర్ ఫ్రేజర్ సుగ్డెన్ నాయకత్వం వహించనున్నారు.

'కాపు కార్పొరేషన్‌కు ఏటా రూ.3 వేల కోట్లివ్వాలి'

సాక్షి, అమరావతి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాపు కార్పొరేషన్‌కు ఏడాదికి రూ.3 వేల కోట్లు చొప్పున నిధులు కేటాయించాలని సీఎం చంద్రబాబును కాపు ఐక్య వేదిక బుధవారం ప్రకటన లో డిమాండ్ చేసింది. 'కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు 10 శాతం ప్రత్యేక రిజర్వేషన్ అమలు చేయాలి. కాపు కార్పొరేషన్‌కు డైరెక్టర్లను నియమించాలి. పల్నాడు జిల్లాకు కన్నెగంటి హనుమంతు, కృష్ణా జిల్లాకు వంగవీటి రంగా పేరు పెట్టి శ్రీకృష్ణదేవరాయల జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి' అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

'బదిలీల చట్టంలో లోపాలు సవరించాలి'

సాక్షి, అమరావతి: టీచర్ల బదిలీల చట్టంలో లోపాలున్నాయని, వాటిని సరిచేయాలని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు జమాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ చట్టంలో విద్యార్థి టీచర్ నిష్పత్తిని నిర్వచించలేదన్నారు. చట్టంలో '2009 విద్యాహక్కు చట్టం ప్రకారం' అన్నప్పుడు ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:30 ఉండాలని పేర్కొన్నారు.

విద్యా ఫలితాలపై సర్వే

సాక్షి, న్యూఢిల్లీ:దేశవ్యాప్తంగా విద్యా ఫలితాలపై కేంద్రం ఎప్పటికప్పుడు మూల్యాంకనాలను నిర్వహిస్తున్నట్లు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్‌చౌదరి తెలిపారు. రాజ్యసభ ప్రశ్నోత్తరాల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీ పరిమళ్ నత్వానీ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిస్తూ.. పాఠశాలల్లో విద్యార్థుల చదువు ఎలా ఉందనే అంశంపై 2017, 2021లో జాతీయ సాధన సర్వే చేసినట్టు తెలిపారు.

పోషక స్థితిపై సర్వే: ఐదేళ్లకంటే తక్కువ వయసున్న పిల్లలు, 15–49 సంవత్సరాల మహిళలు, 15–54 సంవత్సరాల పురుషుల పోషక స్థితిపై. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నిర్వహిస్తున్నట్టు కేంద్ర సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ తెలిపారు. పిల్లలు, మహిలలు, వృద్ధుల పోషకాహారం లోపంపై వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అడిగిన ప్రశ్నకు ఆమె లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

ఎరువుల బఫర్ స్టాక్ కింద 2 లక్షల టన్నులు

సాక్షి, అమరావతి: ప్రస్తుత రబీ సీజన్‌లో ఎరువుల కొరత లేదని, రానున్న ఖరీఫ్ సీజన్‌కు సరిపడా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయశాఖ డైరెక్టర్ ఎస్.డిల్లీరావు చెప్పారు. 'ఎరువుల సరఫరా–నిర్వహణ'పై మార్క్‌ఫెడ్, వ్యవసాయ శాఖ, రైల్వే వ్యాగన్ రేక్ పాయింట్ అధికారులతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డిల్లీరావు మాట్లాడుతూ గత ఖరీఫ్‌లో యూరియా కొరత వల్ల కొన్ని ప్రాంతాల రైతులు ఇబ్బందులుపడ్డారని చెప్పారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోండి

సాక్షి, అమరావతి: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపేందుకు.. కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిలిపివేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని సీఎం చంద్రబాబును సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎంకు రాసిన లేఖను బుధవారం ఆయన మీడియాకు విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించినప్పటికీ.. స్టీల్‌ప్లాంట్ యాజమాన్య వైఖరి మాత్రం ప్రైవేటీకరణ దిశగానే సాగుతోందని మండిపడ్డారు. ప్రైవేటీకరణపై గతంలో తీసుకున్న నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదని కేంద్ర ఆర్థిక శాఖ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ తెలియజేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఇది ముమ్మాటికీ రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల హామీ మేరకు స్టీల్ ప్లాంట్‌ను కాపాడాలని.. కార్మికుల తొలగింపును అడ్డుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

రాజధానిలో బిట్స్‌కు 70 ఎకరాలు

సాక్షి, అమరావతి: రాజధాని అమరావతిలో బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (బిట్స్) ఏర్పాటుకు ప్రభుత్వం 70 ఎకరాలు కేటాయించింది. అమరావతిలో ఐటీ టవర్ నిర్మాణానికి ఎల్ అండ్ టీ సంస్థకు పదెకరాలు కేటాయించింది. రాజధానిలో బడ్జెట్ హోటల్ ఏర్పాటుకు ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) చేసిన ప్రతిపాదనను పరిశీలించి భూకేటాయింపులపై నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించింది. రాజధానిలో భూకేటాయింపులపై మంత్రుల కమిటీ సిఫార్సులను అమలు చేస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

సాగర్ ఎర్త్‌డ్యాంపై మంటలు

నాగార్జునసాగర్: సాగర్ ప్రధాన డ్యాం ఎడమ వైపునున్న ఎర్త్‌డ్యాంపై బుధవారం అగ్ని ప్రమాదం జరిగింది. విద్యుదాఘాతంతో మంటలు లేచి, గడ్డికి అంటుకున్నాయి. మెయిన్ డ్యాంకు సమీపంలో వ్యూపాయింట్ దగ్గర విధులు నిర్వహిస్తున్నఎస్‌పీఎఫ్ సిబ్బంది మంటల తీవ్రత గమనించి అధికారులను అప్రమత్తం చేశారు. వెంటనే మెయిన్ డ్యాం వద్ద విధుల్లో ఉన్న సిబ్బంది, జెన్‌కో, సాగునీటి శాఖ సిబ్బంది అప్రమత్తమయ్యారు. అగ్నిమాపక సిబ్బంది నాలుగు గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఎర్త్‌డ్యాంపై విద్యుత్ కేబుళ్లు, సీసీ కెమెరాల కేబుళ్లు పూర్తిగా కాలిపోయాయి.

పీ4 సర్వేలో క్యూఆర్ కోడ్ ద్వారా సూచనల సేకరణ

సాక్షి, అమరావతి: స్వర్ణాంధ్ర–2047 లక్ష్యం పేరుతో ప్రభుత్వం నిర్వహిస్తున్న పీ–4 ఇంటింటి సర్వేలో క్యూఆర్ కోడ్ విధానం ద్వారా కూడా ప్రజల నుంచి సూచనలు తీసుకోవాలని ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు లక్ష్యం నిర్దేశించింది. రాష్ట్ర స్థాయిలో ప్లానింగ్ శాఖ ఈ విధానంలో జిల్లాల్లో అభిప్రాయ సేకరణకు ఆదేశాలు జారీ చేసింది. మండలానికి 2 వేల మంది చొప్పున, మున్సిపాలిటీల్లో 3 వేల మంది చొప్పున ప్రజల నుంచి సూచనలు సేకరించాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు ఆయా జిల్లాల కలెక్టర్లు బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

● దర్శనం

పంచారామాలలో ప్రసిద్ధం క్షీరారామం



పంచారామాలలో ప్రసిద్ధమైన క్షేత్రం క్షీరారామం. శ్రీ మహావిష్ణువుచే ప్రతిష్ఠించబడిన శ్రీ రామలింగేశ్వరుడు పార్వతీ సమేతంగా, బ్రహ్మాది దేవతలతో కొలువుదీరిన దివ్య క్షేత్రంగా క్షీరారామం ప్రసిద్ధి పొందింది. పశ్చిమగోదావరి జిల్లాలోని పాలకొల్లులోని ఈ మహిమాన్విత క్షేత్రం పూర్వపు శాసనాలు, కావ్యాల్లో 'క్షీరపురి, 'ఉపమన్యు పురం', పాలకొలను, దుగ్ధోప వనపురం తదితర పేర్లతో ప్రస్తుతి పొందింది.



పూర్వం ''ఉపమన్యుడనే బాల భిక్షుడు పాలకై పరమేశ్వరుని ప్రార్థించగా, శివుడు కరుణించి తన త్రిశూలాన్ని అక్కడి నేలపై గుచ్చాడట. అప్పుడు ఆ ప్రదేశం నుంచి పాలు ఉద్భవించాయని, అందుకే దీనికి 'క్షీరపురం', పాలకొలను'' అన్న పేర్లు కలిగాయని, అలాగే ఆ బాల భక్తుడి పేరు మీదుగా 'ఉపమన్యుపురం' అనే పేరు వచ్చిందని పండితుల వాక్కు. అదే నేటి పాలకొల్లు.

ఆలయ విశేషాలు...

క్షీరారామంలో వెలసిన స్వామి శ్రీ క్షీరా రామలింగేశ్వరుడు. తెల్లగా పాల వలె మెరిసే ఈ శివలింగం రెండున్నర అడుగుల ఎత్తులో ఉంటుంది. ఈ శివలింగంపై ఉన్న నొక్కులు కుమారస్వామి అమృత లింగాన్ని భేదించినపుడు తగిలిన బాణపు దెబ్బలని భక్తుల విశ్వాసం. ఈ శివలింగం పై భాగం మొనతేలి ఉండటంతో ఇది శివుడి కొప్పు భాగాన్ని సూచిస్తోందని పెద్దల వాక్కు. కాగా శాసనాల్లో ఈ స్వామిని 'కొప్పు లింగేశ్వరుడు'గా పేర్కొనటం విశేషం. ప్రతి ఏడాదీ ఉత్తరాయణ, దక్షిణాయన కాలాల్లో సూర్యోదయ సమయాల్లో, భానుడి కిరణాలు పెద్దగోపురం రెండో అంతస్థు నుంచి ప్రాకారాల మధ్యగా క్షీరా రామలింగేశ్వర లింగంపై ప్రసరించటం విశేషం.



పెద్దగోపురం...

దేవాలయానికి శిఖరం-శిరస్సు, గర్భాలయం-కంఠం, ధ్వజస్తంభం-జీవం కాగా గోపురం పాదం లాంటిదని ఆగమశాస్త్రం చెబుతోంది. ఎంతో పురాణ, చారిత్రక ప్రాశస్త్యం, అద్భుత శిల్పకళ కలిగిన శ్రీ క్షీరారామలింగేశ్వరాలయ గోపురం పాలకొల్లు పెద్దగోపురంగా ప్రసిద్ధి పొందింది. ఇది సుమారు 120 అడుగుల ఎత్తు కలిగి 9 అంతస్థులతో గోపురం చివరిదాకా వెళ్లేందుకు అనువుగా లోపలి వైపు మెట్లు కలిగి ఉంది. ఈ గోపురం మీది ఎన్నో అద్భుత శిల్పాలు చూపరులను కట్టి పడేస్తాయి.

ఉత్సవాలు...

ఈ క్షేత్రంలో ఉగాది, చైత్రశుద్ధ దశమినాడు స్వామి వార్ల కళ్యాణాలు, చైత్రశుద్ధ ఏకాదశినాడు రథోత్సవం, వినాయక చవితి, శరన్నవరాత్రి ఉత్సవాలు, మహాశివరాత్రి, కార్తీకమాస అభిషేకాలు, జ్వాలా తోరణం, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర కళ్యాణం, ముక్కోటి, లక్ష కుంకుమ, బిల్వార్చనలు, కోటి బిల్వార్చనలు, సహస్ర ఘటాభిషేకాలు వైభవోపేతంగా జరుగుతాయి. ఇవి కాక ఆయా సందర్భాలలో మరెన్నో విశేషపూజలు, ఉత్సవాలు జరుగుతాయి. మహా శివరాత్రి నాడు శ్రీ పార్వతీ సమేత క్షీరారామలింగేశ్వర, లక్ష్మీ జనార్ధనుల ఊరేగింపు రంగురంగుల విద్యుద్దీప కాంతుల నడుమ సాంస్కృతిక వేడుకలతో కన్నుల పండుగగా జరుగుతుంది. పర్వదినాల్లో భక్తి, భజన కార్యక్రమాలు, హరికథా కాలక్షేపాలు, పురాణ ప్రవచనాలు జరుగుతాయి.

– డి.వి.ఆర్.





● రంజాన్ కాంతులు

ఉపవాసాల అసలు ఉద్దేశ్యం

ఓ ముసలివాడు చెట్టు కింద కూర్చుని గబ గబ ఏదో తింటున్నాడు.

టోపీలు ధరించి ముగ్గురు ముస్లిం యువకులు అటుగా వెళుతూ, ఆ దృశ్యాన్ని చూసి...

''ఏంటి, పెద్దమనిషి! ఉపవాసం లేవా?'' అని అడిగారు వ్యంగ్యంగా.

''ఎందుకు లేనయ్యా. లక్షణంగా ఉన్నాను'' చెప్పాడాయన.

''హాహాహా --, మరి నువ్వు చేస్తున్న పని ఏమిటి?''

''అన్నం తింటున్నాను''

''ఉపవాసం ఉన్నాను అంటున్నావు, ఉపవాసం ఉంటే అన్నం తినకూడదు అని నీకు తెలియదా?''

''తెలుసు. కానీ ఏం చేయను. నేను ముసలి వాడిని ఆకలికి తట్టుకోలేను. అందుకే తినడం, తాగడం తప్ప నా శరీరం లోని మిగతా అవయవాలన్నీ ఉపవాసం పాటిస్తున్నాయి. మరి మీరంతా ఉపవాసం ఉన్నారా?''



''ఆ... ఉన్నాం. ఇంత వరకు మేము ఒక్క ఉపవాసం కూడా వదల లేదు తెలుసా?''

అని సమాధానం ఇచ్చారు కాస్త గర్వంగా.

''మీరు కేవలం కడుపును మాత్రమే మాడుస్తున్నారు. మీ కళ్ళతో, చెవులతో, నాలుక తో చేసే పనులు వల్ల మీ ఉపవాసాలు వీగిపోతాయి అని తెలియదా?''అన్నాడా వృద్ధుడు.

మీ మాటలు మాకేమీ అర్థం కాలేదు పెద్దాయనా...'' అన్నారాయువకులు.

''ఉపవాసాల అసలు ఉద్దేశ్యం మనలో దైవభీతిని పెంపొందించడం. సకల అవయవాలను చెడు పనులకు, అశ్లీల మాటలకు, చెడు ఆలోచనలకు దూరంగా ఉంచడం కోసమే. అంతేకానీ. ఇలా బజారుల వెంట తిరుగుతూ, అనవసరపు ఆలోచనలు, వ్యర్థమైన మాటలు, పనికిమాలిన పనులు, చేస్తూ నేను ఉపవాసం ఉన్నాను అనుకోవడం మూర్ఖత్వం కాదా'' ప్రశ్నించాడా పెద్దాయన.

''నిజమే పెద్ద మనిషీ, మమ్మల్ని క్షమించు. ఇక నుండి శ్రద్ధగా ఉపవాసాలు పాటిస్తాం'' అంటూ ఆయనకు సలాం చేసి, అక్కడినుంచి వెళ్లిపోయారా యువకులు.

– షేఖ్ అబ్దుల్ బాసిత్

● బౌద్ధ వాణి

మీకూ నాకూ అదే తేడా



బుద్ధుడిని చూడడంకోసం ఓరోజు అనేక మంది వచ్చారు. ఆ సమయంలో బుద్ధుడు ఓ చెట్టు కింద ఉన్న అరుగుమీద కూర్చుని ఉన్నారు.

బుద్ధుడు చేతిలో ఓ పట్టు రుమాలు ఉండటం చూసి అక్కడున్న వారందరికీ ఆశ్చర్యం వేసింది. విలాసాలకూ ఖరీదైన వస్త్రాలకూ ఆమడదూరంలో ఉండే బుద్ధుడి దగ్గర పట్టు రుమాలు ఉండటమేమిటని అందరూ చెవులుకొరుక్కున్నారు.

అక్కడ మౌనం ఆవరించిన తర్వాత బుద్ధుడు తన చేతిలో ఉన్న రుమాలుని చూపిస్తూ ఏమిటది అని అడిగారు.

అందరూ ఒక్క మాటగా అది పట్టు రుమాలు అని చెప్పారు. అనంతరం బుద్ధుడు ఆ రుమాలులో అయిదు ముళ్ళు వేసి చూపిస్తూ ఇప్పుడిదేమిటీ అని అడిగారు.


అందరూ ఒక్క మాటగా అది పట్టు రుమాలని చెప్పారు.

అప్పుడు బుద్ధుడు 'అదే మీకూ నాకూ తేడా. ఆ తేడా వల్లే మీరక్కడా నేనిక్కడా ఉన్నాను' అంటూ తన మాటలు కొనసాగించారు. 'అయిదు ముళ్ళు ఏంటంటే హింసకు పాల్పడకపోవడం, చైతన్యం కలిగి ఉండటం, అత్యాశకు దూరంగా ఉండటం, ఏం జరిగినా అబద్ధం చెప్పకపోవడం, నిజాయితీతో కూడిన సత్ప్రవర్తన కలిగి ఉండటం' అని చెప్పారు. ఈ అయిదూ అనుసరించగలిగితే ఎవరితోనూ ఏ గొడవలూ రావని ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఆ అయిదు పురోగతికీ, మానసిక ప్రశాంతతకూ ఎంతో అవసరం. అందుకోసమే బుద్ధుడు అయిదు ముడులు వేసారు. కానీ ఆ ముళ్ళ విషయం ఆలోచించని వాళ్ళందరూ ఆ రుమాలు పట్టుదనే చెప్పారు తప్ప వాళ్ళెవరికీ బుద్ధుడెందుకు ముళ్ళు వేసారన్నది ఆలోచించలేదు.

ధర్మ సందేహం

దేవాలయాల్లో రావిచెట్టు, వేపచెట్టు ఎందుకు ఉంటాయి...!!


మన సంప్రదాయాలలో ప్రతి ఒకటి అద్భుతమే.ప్రతి ఒక్కటీ జీవనవిధానానికి సంబంధించినవే. అందుకే చాలా ఆలయాలలో రావి చెట్టు, వేపచెట్టు ఉంటాయి, ఎక్కువ చోట్ల రావి, వేప చెట్లు కలిపి ఉంటాయి. రావిచెట్టును విష్ణు స్వరూపంగానూ, వేప చెట్టును లక్ష్మీస్వరూపంగానూ భావించి పెళ్లిళ్లు చేయిస్తుంటారు. అలా పెళ్లి చేసిన జమిలి వృక్షానికి భక్తితో ప్రదక్షిణలు చేస్తుంటారు. ఇలా జంట వృక్షాలను పూజిస్తే దాంపత్య దోషాలు తొలగి సంసారం సజావుగా సాగుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి. అంతేకాదు, ఆ రెండు వృక్షాల మీదినుంచి వచ్చే గాలికి శారీరక, మానసిక రుగ్మతలను పారద్రోలే శక్తి ఉందని ఆధునిక పరిశోధనలు సైతం నిరూపిస్తున్నాయి.



జోతిష శాస్త్రం ప్రకారం శనిదోషం పోవాలంటే ప్రతిరోజు రావిచెట్టు నీడన నిలబడటం, రావి చెట్టుకి నమస్కారం చెయ్యడం, రావిచెట్టుకు ప్రదక్షిణ చేయడం, శనివారం నాడు మాత్రం రావిచెట్టుని హత్తుకోవడం మంచిదని, ఈ విధంగా కొన్ని రోజులు చేస్తే శనిదోషం తొలుగుతుందట. రావి చెట్టు నీడన కొంచం సేపు కూర్చుంటే రక్తపోటు సక్రమ రీతిలో ఉంటుందని, రావిచెట్టు గాలి మంచి ఆలోచనలు కలిగిస్తుందనీ చెబుతారు వైద్యులు. అదేవిధంగా వేపచెట్టుకు కూడా ఎన్నో ఔషధ గుణాలున్నాయి. వేప చెట్టు గాలికి అన్నో రోగాలను కలిగించే క్రిములు చచ్చిపోతాయి, అమ్మవార్లకు వేపాకు బాగా ఇష్టం. అందుకే జాతర్ల సమయంలో వేపాకు ఎక్కువగా వాడతారు.

● సువార్త

ఆంతర్యంలోని ఆత్మీయతతోనే ఆశీర్వాదాలు...



గిబియోనీయులంటే అమ్మోరీయులనే శాపగ్రస్తుల సంతతికి చెందిన కనాను ప్రజలు. వాగ్దాన దేశమైన కనానులో యెహోషువా నాయకత్వంలో సాగుతున్న జైత్రయాత్రలో యెరికో, హాయి పట్టణాలు అప్పటికే నేలకూలగా ఆ వార్త విని, తాము కూడా వారి లాగా త్వరలోనే సంహారం కానున్నామని గ్రహించి గిబియోనీయులు ఇశ్రాయేలీయులతో శాంతియుత సంధి చేసుకోవడానికి నిర్ణయించుకొని, తాము ఎక్కడో దూరదేశానికి చెందిన వారమంటూ కపట నాటకమాడి యెహోషువా శరణు కోరారు. దేవుని వద్ద విచారణ కూడా చెయ్యకుండానే, యెహోషువ, ఇతర ఇశ్రాయేలీయుల పెద్దలు గిబియోనీయుల జోలికి రాబోమంటూ వారికి ప్రమాణం చేశారు. ఆ తర్వాత మూడు రోజులకు వాస్తవం తెలిసి వారిని నిలదీస్తే, మీ దేవుడు చాలా గొప్పవాడు, మీ పక్షంగా గొప్ప కార్యాలు చేశాడని విని ఆయన శరణులో, మీ నీడలో బతకాలని నిర్ణయించుకున్నామని వారు వెల్లడించారు. మాటిచ్చిన తర్వాత మడమ తిప్పకూడదన్న దేవుని ఆజ్ఞకు లోబడి ఇశ్రాయేలీయులు తమ ప్రమాణాన్ని నిలబెట్టుకున్నారు. సంధి ఒప్పందానికి దేవుడు కూడా ఆమోద ముద్ర వేశాడు. గిబియోనీయుల ఉదంతం విని ఆ వెంటనే మిగిలిన కనాను రాజులంతా కలిసి గిబియోనీయులతో సమిష్టిగా మహా యుద్ధం చెయ్యగా ఇశ్రాయేలీయులు కూడా వారికి అండగా నిలిచారు. దేవుడైతే ఒక రోజు పాటు సూర్యుణ్ణి ఉన్నచోటే నిలిపి మరీ వారికి ఘనవిజయాన్నిచ్చాడు(యెహో 10:12). ఇశ్రాయేలీయుల మధ్య పనివారుగా ఉండేందుకు అంగీకరించిన గిబియోనీయులకు, ఆలయంలో బలిపీఠం వద్ద కట్టెలు నరికే, నీళ్ల మోసితెచ్చే పనినిచ్చి, దేవుడు తన ఆరాధనా కార్యక్రమాల్లో వారికి భాగస్వామ్యాన్నిచ్చాడు. లేవీయులు అంటే అర్చకులుండే పట్టణాల్లో దేవుడు గిబియోను పట్టణాన్నికూడా చేర్చాడు. దావీదు వద్ద ఉన్న 30 మంది మహావీరుల్లో ఇష్మయా అనే గిబియోనీయుడు కూడా ఉన్నాడని బైబిల్ చెబుతోంది. చక్రవర్తిగా సొలొమోను గిబియోనులో బలులర్పించినపుడు దేవుడు అక్కడే ప్రత్యక్షమై అతనికి వరాలనిచ్చాడు, బబులోను చెరనుండి తిరిగొచ్చిన వారిలో 95 మంది గిబియోనీయులు కూడా ఉన్నారని బైబిల్లో నెహెమ్యా రాశాడు. యెరూషలేము ప్రాకారాలు తిరిగి నిర్మించిన వారిలో కూడా గిబియోనీయుల ప్రస్తావన ఉంది.

మామూలుగా అయితే కాలగర్భంలో కలిసిపోవాల్సిన గిబియోనీయులకు దేవుడు ఇంతటి మహా చరిత్రనిచ్చాడు. ఇశ్రాయేలీయులతో తలపడి కనానీయులంతా సంహారం కాగా. గిబియోనీయులనే కనాను ప్రజలు మాత్రం, దేవునికి తలవంచి, దేవుని ప్రజలతో సఖ్యత కోరుకొని తమ ప్రాణాలే కాదు, తమ ఉనికిని కూడా కాపాడుకున్నారు. పాములకున్న వివేకం, పావురాలకున్న నిష్కపటత్వం విశ్వాసికుండాలన్న యేసుప్రభువు వారి బోధనలకు గిబియోనీయలే ఉదాహరణ.

తలుపు చిన్నదైతే, లోనికి వెళ్లేందుకు తలవంచడమొక్కటే మార్గం. నేను తల వంచడమా? అనుకుంటే, తల బొప్పికట్టడం ఖాయం. అపకార దృష్టితో కాక ప్రాణభీతితోనే గిబియోనీయులు కపటనాటకమాడారని దేవునికి ముందే తెలుసు. ఆయన వారి పై వేషాలను కాదు, ఆంతర్యంలో తన పట్ల వారికున్న విశ్వాసాన్ని, భయభక్తుల్ని చూశాడు. పైకి మాత్రం నీతిమంతుల్లాగా నటిస్తూ గొప్పగా జీవించేవారి ఆంతర్యంలోని దుష్టత్వాన్ని, పైకి నాటకాలాడినా ఆంతర్యంలో వారి ఆత్మీయతను చూసి మరీ దేవుడు ప్రతిస్పందిస్తాడు. లేకపోతే వారితో సంధి చేసుకోవద్దని దేవుడు ఏదో విధంగా యెహోషువాకు తెలియజేసేవాడే లేదా వారితో సంధి చేసుకున్నావెందుకని ఆ తర్వాతైనా యెహోషువాను మందలించేవాడే. కత్తితో తల పడటం కన్నా యుక్తితో మెలగడమే మెరుగనుకొని గిబియోనీయులు అలా గొప్ప ఉపద్రవం నుండి తప్పించుకోవడమే కాక, దేవుని ప్రజల్లో భాగమయ్యారు, దేవుని ఆశీర్వాదాలకూ పాత్రులయ్యారు.

పై వేషాలు, పదవులు, నాటకాలను బట్టి కాక ఆంతర్యంలోని భక్తి, నీతి, పరిశుద్ధతను బట్టి దేవుడు ప్రతిఫలాన్నిస్తాడు. మనవాడు కదా, ఇలా చేయవచ్చా... అని ఇతరులను నిందించే ముందు, పైకి ఎంతో భక్తిగా, పవిత్రంగా, నీతిమంతుల్లాగా ప్రవర్తించే నా ఆంతర్యంలో లేదా మనవాళ్ళ ఆంతర్యంలో ఇంతటి ఆత్మీయ దుర్గంధమా? ఇన్ని మురికి కాలువలా? ఇంతటి భ్రష్టత్వమా... అని ప్రశ్నించుకునేవాడే నిజమైన విశ్వాసి. దేవుడు విశ్వాసి అంతర్యంలోని ఆత్మీయత, ఉదాత్తమైన ఆలోచనలను బట్టే అనూహ్యమైన విజయాలు, ఆశీర్వాదాలిస్తాడు, కోట్లాది మందికి విశ్వాసిని ఆశీర్వాదంగా మార్చుతాడు.

– సందేశ్ అలెగ్జాండర్

● నిర్మల వాణి

భూమి ఇరుసే సుషుమ్న

మనిషిలో సమతుల్యత అనేది భూమి మధ్యలో వున్న ఇరుసు లాంటిది. మానవుడిని అతిగా భవిష్యత్ లేక గతం వైపు వెళ్లకుండా ఒక నిశ్చలమైన, నిర్దిష్టమైన సమతుల్య స్థితిలో ఉంచేది అతనిలో అంతర్గతంగా సూక్ష్మ శరీర నాడీ వ్యవస్థలో ఉన్న సుషుమ్నా నాడి. అదే మనలోని ఇరుసు (అక్షం). మనం ఎప్పుడూ మనలోని ఇరుసు అయిన సుషుమ్న మీదనే ఉండాలి.

అలాగే భూమి ఇరుసే (అక్షం) సుషుమ్న. భూమాతలో నిక్షిప్తమై ఉన్న ఇరుసు ఎంత బలంగా పనిచేస్తుందంటే, విశ్వం ఎంత విశాలంగా వ్యాప్తి చెంది ఉన్నా సరే, భూమి తన ఇరుసు ఆధారంతో అత్యంత వేగంగా తిరుగుతూనే ఉంటుంది. తద్వారా పగలు మనం పనిచేసుకొనేటట్లు, రాత్రి నిద్రించేటట్లుగా మనలను సమతుల్య స్థితిలో ఉంచడానికి అది పగలు, రాత్రులను సృష్టించింది. అంతేకాకుండా తాను సూర్యుని చుట్టూ తిరుగుతూ, సగం దేశాలలో వేసవికాలం, సగం దేశాలలో శీతాకాలాన్ని కలిగించేలా పరిభ్రమిస్తూ ఉంటుంది. ఇరుసే ఇదంతా నిర్వహిస్తుంది. అంతేకాకుండా ఈ ఇరుసు విశ్వంలో పరిభ్రమించే గ్రహాలు, ఉపగ్రహాలకు భూమిని అవసరమైనంత దూరంలో ఉంచుతుంది.



పరమపూజ్య శ్రీ మాతాజీ నిర్మలాదేవి

ఈ కేంద్రం లేక ఇరుసు భూమి మేధస్సునే కాదు, పరిమళాన్ని కూడా ప్రతిబింబిస్తుంది. ఈ కేంద్రమే భూమి సుషుమ్నా నాడి అని చెప్పవచ్చు. ఈ కేంద్రం ద్వారానే 'స్వయంభూలు' వెలుస్తూ ఉంటాయి. భూకంపాల లాంటి గొప్ప విపత్తులు సంభవిస్తూ ఉంటాయి. నిజానికి కదిలేది ఈ ఇరుసే. అదొక గొప్పశక్తి. ఆ శక్తి భూమాతలోని లావాను వివిధ దిశలలో పంపిస్తుంది. ఆ లావా భూమి పైకి చొచ్చుకుని రావడం వల్ల భూకంపాలు, అగ్ని పర్వతాలలాంటివి ఏర్పడతాయి. ఇవన్నీ భూమాతలోని ఇరుసుకు ఉన్న అవగాహన వలననే ఏర్పడతాయి. అంతేకాదు ఋతువులు కూడా ఏర్పడతాయి. వివిధ రకాల ఆహార పదార్థాలు, కూరగాయలు, పండ్లు, వాటిని మనకు అందించడానికే ఈ కాలాలు సృష్టించబడ్డాయి. భూమాత తనలోని ఉష్ణాన్ని కోల్పోతే, మొత్తం మంచుతో గడ్డకట్టిపోవడం వలన మనకు తినడానికి ఏమీ ఉండదు. చంద్రగ్రహమే ఇక్కడ ఉన్నట్లుగా ఉంటుంది.



(తరువాయి వచ్చేవారం)

– డా, పి. రాకేష్
(పరమ పూజ్య శ్రీ మాతాజీ నిర్మలాదేవి ప్రవచనాల ఆధారంగా)

బిజినెస్ రీల్

హ్యుందాయ్, హోండా కార్స్ వాహన ధరల పెంపు

ఏప్రిల్ నుంచి కొత్త ధరలు అమల్లోకి



ముంబై: వాహన ధరల పెంపు కంపెనీల జాబితాల్లో హ్యుందాయ్ మోటార్ ఇండియా(హెచ్ఎంఐఎల్), హోండా కార్స్ చేరాయి. ''పెరుగుతున్న నిర్వహణ ఖర్చులు, ఇన్పుట్ వ్యయాలను కొంత భర్తీ చేయడానికి ధరలను సవరించాల్సి వస్తుంది. అందుకే వాహన ధరలను ఏప్రిల్ నుంచి 3% వరకు పెంచుతున్నాము'' అని హెచ్ఎంఐఎల్ డైరెక్టర్, సీఓఓ తరుణ్ గార్గ్ తెలిపారు. అమేజ్, సిటీ, సిటీ ఈ:హెచ్ఈవీ, ఎలివేట్తో సహా వేరియంట్, మోడల్ బట్టి ధరల పరిధి మారుతుందని హోండా కార్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కునాల్ బెహ్ల్ తెలిపారు. మారుతీ సుజుకీ ఇండియా, కియా ఇండియా, టాటా మోటార్స్లు తమ వాహన ధరలు వచ్చే నెల నుంచి పెంచే యోచనలతో ఉన్నట్లు ఇప్పటికే తెలిపారు.

టఫే వైస్చైర్మన్గా లక్ష్మీ వేణు



న్యూఢిల్లీ: ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్మెంట్ (టఫే) వైస్ చైర్మన్గా లక్ష్మీ వేణు నియమితులయ్యారు. ఇప్పటికే ఆమె సంస్థ డైరెక్టరుగా వ్యవహరిస్తున్నారు. లక్ష్మీకి ట్రాక్టర్లు, ఆటో విడిభాగాల పరిశ్రమలో గణనీయంగా అనుభవం, వ్యాపార నిర్వహణ సామర్థ్యాలు ఉన్నట్లు సంస్థ చైర్మన్ మల్లికా శ్రీనివాసన్ తెలిపారు. వ్యూహాత్మక లక్ష్యాల సాధనలో టఫే, ఐషర్ ట్రాక్టర్స్ బృందాలతో కలిసి పని చేయనున్నట్లు లక్ష్మీ తెలిపారు. బిజినెస్ టుడే 'వ్యాపారంలో అత్యంత శక్తివంతమైన మహిళలు', ఎకనమిక్ టైమ్స్ 'యంగ్ లీడర్స్ - 40 అండర్ 40' జాబితాల్లో లక్ష్మీ చోటు దక్కించుకున్నారు. ఆమె సుందరం-క్లేటన్ ఎండీగా వ్యవహరిస్తున్నారు.

ఉబెర్ టూవీలర్ రైడర్లకు మరింత భద్రత



న్యూఢిల్లీ: టూ-వీలర్ డ్రైవర్లు, రైడర్లకు మరింత భద్రత కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు రైడ్-షేరింగ్ సంస్థ ఉబెర్ వెల్లడించింది. ఇందులో భాగంగా ఢిల్లీలోని ఉబెర్ మోటో డ్రైవర్లకు సేఫ్టీ కిట్లను అందించింది. వీటిలో హెల్మెట్లు, సేఫ్టీ స్టిక్కర్లు మొదలైనవి ఉన్నాయి. ఉబెర్ మోటో యాప్లో హెల్మెట్లు ధరించాలంటూ ప్రయాణికులకు కూడా కోరే విధంగా ఫీచర్లు ఉంటాయని సంస్థ వివరించింది. ట్రాఫిక్లోను సులభంగా వెళ్లగలిగే వెసులుబాటు, సౌకర్యం, తక్కువ ఖర్చు వంటి అంశాలు బైక్ ట్యాక్సీలకు సానుకూలాంశాలుగా ఉంటున్నాయని పేర్కొంది.

కోడిగుడ్లు (హోల్సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-3-2025

విశాఖ	420-00
చిత్తూరు	470-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	420-00
విజయవాడ	440-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	420-00
వరంగల్	422-00
రిటైల్ ధర	4.80

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SHRIRAMFIN	667.4	3.91
HDFCLIFE	665.1	3.83
APOLLOHOSP	6,430.00	2.93
TATASTEEL	158.54	2.51
POWERGRID	276.7	2.18

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TECHM	1,397.50	-2.32
ITC	403.4	-1.39
TCS	3,505.00	-1.34
INFY	1,589.10	-1.26
SUNPHARMA	1,732.65	-0.87

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,425
ఎన్ఎస్ఈ	1,03,796
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,67,085
ఎఫ్ఐఐ	- 1,096
డీఐఐ	+ 2,141

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	70.92	$	66.75
బ్రెంట్	70.80	$	70.56

మన రెమిటెన్సుల్లో యూఎస్, యూకే టాప్!

- గల్ఫ్ దేశాలను మించిన అభివృద్ధి చెందిన దేశాల వాటా
- 2023-24లో ప్రవాస భారతీయులు పంపిన మొత్తం 10.32 లక్షల కోట్లు
- ఆర్బీఐ మార్చి బులెటిన్ నివేదిక వెల్లడి



ముంబై: అభివృద్ధి చెందిన దేశాల నుంచి ప్రవాస భారతీయులు మాతృదేశానికి పంపిస్తున్న రెమిటెన్స్లు (నిధుల బదిలీ) గణనీయంగా పెరుగుతున్నాయి. 2023-24లో 118.7 బిలియన్ డాలర్లను (10.32 లక్షల కోట్లు) ప్రవాసులు భారత్కు పంపించారు. 2010-11లో 55.6 బిలియన్ డాలర్ల రెమిటెన్స్లతో పోల్చి చూస్తే రెట్టింపయ్యాయి. యూఎస్, యూకే తదితర దేశాల్లో స్థిరపడిన భారతీయులు 2023-24లో భారత్కు పంపించిన రెమిటెన్స్లు గల్ఫ్ దేశాలను మించిపోయినట్టు మార్చి నెలకు సంబంధించి విడుదలైన ఆర్బీఐ బులెటిన్ వెల్లడించింది. భారతీయ నిపుణుల వలసల్లో మార్పులను ఇది ప్రతిఫలిస్తున్నట్టు పేర్కొంది. ఆర్బీఐలోని డిపార్ట్మెంట్ ఆఫ్ ఎకనమిక్ అండ్ పాలసీ రీసెర్చ్ విభాగం ఈ నివేదికను రూపొందించింది. అయితే ఇందులోని అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమే కానీ, ఆర్బీఐ అభిప్రాయాలను ప్రతిఫలించవని సెంట్రల్ బ్యాంక్ స్పష్టం చేసింది.

నివేదికలోని అంశాలు..

- అంతర్జాతీయ వలసదారుల్లో భారత్కు చెందిన వారు 1990లో 66 లక్షలుగా ఉంటే, 2024 నాటికి 1.85 కోట్లకు పెరిగారు. అంతర్జాతీయ వలసదారుల్లో భారత్ వాటా 4.3 శాతం నుంచి 6 శాతానికి పెరిగింది.
- ప్రపంచవ్యాప్తంగా ప్రవాస భారతీయుల్లో సగం మందికి గల్ఫ్ సహకార సమాఖ్య (జీసీసీ) కేంద్రంగా ఉంది.
- ఇంత కాలం భారత్కు రెమిటెన్స్ల్లో జీసీసీ దేశాల ఆధిపత్యం కొనసాగగా, క్రమంగా ఇది అభివృద్ధి చెందిన దేశాలైన యూఎస్, యూకే, సింగపూర్, కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాల వైపు మొగ్గుతోంది. 2023-24లో భారత్కు వచ్చిన మొత్తం రెమిటెన్స్ల్లో సగంపైన ఈ దేశాల నుంచే ఉంది.
- పనిచేసే వయసులోని అధిక జనాభాతో 2048 నాటికి భారత్ మానవ వనరులను సరఫరా చేసే కీలక దేశం కానుంది.

8.1 శాతం తెలంగాణకు

- 2023-24లో మొత్తం రెమిటెన్స్ల్లో 8.1 శాతం తెలంగాణ రాష్ట్రానికి వచ్చింది.
- అత్యధికంగా 20.5 శాతం మహారాష్ట్రకు వెళ్లింది. 2020-21లో ఇదే రాష్ట్రం వాటా 35.2 శాతంతో పోల్చి చూస్తే గణనీయంగా తగ్గింది.
- రెమిటెన్స్ల్లో కేరళ వాటా 10 శాతం నుంచి 19.7 శాతానికి పెరిగింది. తమిళనాడు 10.4 శాతం, కర్ణాటక 7.7% సొంతం చేసుకున్నాయి.
- 2023-24 రెమిటెన్స్ల్లో రూ.5లక్షలు అంతకు మించిన లావాదేవీలు 29 శాతంగా ఉన్నాయి.
- భారత్కు గత ఆర్థిక సంవత్సరం వచ్చిన రెమిటెన్స్ల్లో యూఎస్ వాటా 27.7 శాతానికి చేరింది. 2020-21లో ఇది 23.4 శాతంగా ఉంది.
- అలాగే యూకే నుంచి వచ్చిన రెమిటెన్స్లు ఇదే కాలంలో 6.8% నుంచి 10.8 శాతానికి పెరిగాయి.
- యూఏఈ 19 శాతంతో రెమిటెన్స్లకు రెండో అతిపెద్ద కేంద్రంగా ఉంది. 2020-21 రెమిటెన్స్ల్లో యూఏఈ వాటా 18 శాతంగా ఉండడం గమనార్హం.
- నిర్మాణ రంగం, హెల్త్కేర్, ఆతిథ్యం, పర్యాటకం తదితర రంగాల్లో ఉపాధి అవకాశాలతో భారత కార్మికులకు యూఏఈ ఆశ్రయమిస్తుంటే.. భారత నిపుణులకు యూఎస్ కీలక ఉపాధి కేంద్రంగా ఉంది.
- మహారాష్ట్ర, తెలంగాణ, పంజాబ్ నుంచి ఎక్కువ మంది విదేశీ విద్యకు వెళుతున్నారు. దీంతో దేశ రెమిటెన్స్ల్లో ఈ రాష్ట్రాల వాటా క్రమంగా పెరుగుతోంది.

వృద్ధికి పటిష్ట మూలాలు



బలమైన ద్రవ్య విధానాలు, మెరుగైన సమన్వయంతో కూడిన పరపతి విధాన కార్యాచరణ, డిజిటల్ వైపు మళ్లేందుకు తీసుకుంటున్న చర్యలు దీర్ఘకాలం పాటు స్థిరమైన ఆర్థిక వృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తాయని ఆర్బీఐ బులెటిన్ పేర్కొంది. స్థూల ఆర్థిక పరిస్థితులు మెరుగ్గా ఉన్నాయని, బలమైన దేశీ డిమాండ్, స్థిరమైన పెట్టుబడులు, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రభుత్వ మూలధన వ్యయాల పెంపు ఇవన్నీ కూడా నిలకడైన ఆర్థిక వృద్ధికి మద్దతునిస్తాయని తెలిపింది. ''అంతర్జాతీయంగా నెలకొన్న సవాళ్ల వాతావరణలోనూ భారత ఆర్థిక వ్యవస్థ బలంగా నిలబడింది. వ్యవసాయ రంగం పటిష్ట పనితీరుకు తోడు వినియోగం మెరుగుపడడం ఇందుకు సానుకూలించింది''అని వివరించింది. టారిఫ్ల తీవ్రత, వాటి అమలుపై అనిశ్చితి నెలకొన్నట్టు తెలిపింది. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల వల్లే విదేశీ పోర్ట్ఫోలియో పెట్టుబడులు స్థిరంగా బయటకు వెళ్లిపోతున్నట్టు తెలిపింది. 2024-25 చివరి త్రైమాసికంలో (2025 జనవరి-మార్చి) డిమాండ్ బలంగా ఉంటుందని కీలక సూచికలు తెలియజేస్తున్నట్టు పేర్కొంది.

స్టీల్ ప్రొడక్టులపై 12శాతం సుంకాలు

- 200 రోజులవరకూ అమలు
- ఆర్థిక శాఖకు డీజీటీఆర్ ప్రతిపాదన



న్యూఢిల్లీ: కొన్ని రకాల స్టీల్ ప్రొడక్టులపై 12 శాతం రక్షణాత్మక సుంకాలను విధించమంటూ వాణిజ్య శాఖ దర్యాప్తు విభాగం ట్రేడ్ రెమిడీస్ డైరెక్టరేట్ జనరల్(డీజీటీఆర్) తాజాగా ప్రతిపాదించింది. పెరుగుతున్న దిగుమతుల నుంచి దేశీ సంస్థలకు రక్షణ కల్పించేందుకు వీలుగా 200 రోజులవరకూ సుంకాల అమలుకు సూచించింది. ఉన్నట్టుండి ఊపందుకున్న అలాయ్, నాన్అలాయ్ స్టీల్ ఫ్లాట్ ప్రొడక్టుల దిగుమతులపై గతేడాది డిసెంబర్లో డీజీటీఆర్ దర్యాప్తు చేపట్టింది. వీటిని ఫ్యాబ్రికేషన్, పైప్ మేకింగ్, నిర్మాణం, క్యాపిటల్ గూడ్స్, ఆటో, ట్రాక్టర్లు, సైకిళ్లు, ఎలక్ట్రికల్ ప్యానెళ్లు తదితర వివిధ పరిశ్రమలలో వినియోగిస్తారు. దేశీ స్టీల్ అసోసియేషన్ ఫిర్యాదుమేరకు దర్యాప్తు నిర్వహించింది. ఈ జాబితాలో ఆర్సెలర్మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా, జేఎస్డబ్ల్యూ స్టీల్ కోటెడ్ ప్రొడక్ట్స్, భూషణ్ పవర్ అండ్ స్టీల్, జిందాల్ స్టీల్ అండ్ పవర్, సెయిల్ తదితర దిగ్గజాలున్నాయి.

విలువ ఆధారితంగా

ఇటీవల కొన్ని స్టీల్ ప్రొడక్టుల దిగుమతులు ఉన్నట్టుండి భారీగా పెరిగినట్లు దర్యాప్తులో డీజీటీఆర్ ప్రాథమికంగా గుర్తించింది. దీంతో విలువ ఆధారిత సుంకాల విధింపునకు ఈ నెల 18న నోటిఫికేషన్ ద్వారా సిఫారసు చేసింది. వెరసి 200 రోజులకు 12 శాతం ప్రొవిజనల్ సేఫ్గార్డ్ డ్యూటీలను విధించేందుకు ఆర్థిక శాఖకు నివేదించింది. వీటిపై ఆర్థిక శాఖ తుది నిర్ణయాన్ని తీసుకోవలసి ఉంది. ప్రధానంగా చైనా, జపాన్, కొరియా, వియత్నాం నుంచి దిగుమతులు పెరిగినట్లు తెలుస్తోంది. పరిశ్రమ వర్గాల వివరాల ప్రకారం ఆయా దేశాలలో స్థానిక డిమాండుకు మించి భారీస్థాయిలో సరఫరాలు జరుగుతున్నాయి. దీంతో 2021-22లో 2.293 మిలియన్ టన్నుల ప్రొడక్టులు దిగుమతికాగా.. దర్యాప్తు జరిపిన అక్టోబర్ 2023- సెప్టెంబర్ 2024సహా గత మూడేళ్ల(2021-24)లో 6.612 మిలియన్ టన్నులకు పెరిగాయి.

ఎన్విడియాతో ఐటీ దిగ్గజాల జత

- జాబితాలో విప్రో, టెక్ మహీంద్రా
- ఎల్అండ్టీ టెక్ సర్వీసెస్ సైతం



న్యూఢిల్లీ: గ్లోబల్ చిప్ తయారీ దిగ్గజం ఎన్విడియాతో దేశీ ఐటీ దిగ్గజాలు విప్రో, టెక్ మహీంద్రా, ఎల్అండ్టీ టెక్నాలజీ సర్వీసెస్ చేతులు కలిపాయి. వివిధ పరిశ్రమలకు ఏఐ ఆధారిత విభిన్న సొల్యూషన్లు అందించే బాటలో ఎన్విడియాతో విడిగా భాగస్వామ్యాలకు తెరతీస్తున్నాయి. చిప్ తయారీ దిగ్గజం ప్రస్తుతం కాలిఫోర్నియాలో నిర్వహిస్తున్న జీపీయూ టెక్నాలజీ వార్షిక సదస్సు(జీటీసీ)లో భాగంగా దేశీ ఐటీ కంపెనీలు ఎన్విడియా టెక్నాలజీల ఆధారంగా అందిస్తున్న సేవలను ప్రదర్శిస్తున్నాయి. ఎన్విడియా ఏఐ సాఫ్ట్వేర్ ఆధారిత అటానమస్ ఫార్మాకోవిజిలెన్స్(పీవీ) సొల్యూషన్లు టెక్ మహీంద్రా విడుదల చేసింది. ఔషధ భద్రత నిర్వహణలో వినియోగిస్తారు. తద్వారా వేగవంత, ఖచ్చితమైన పీవీ ప్రాసెస్కు వీలుంటుంది. ఎన్విడియా ఏఐ ఎంటర్ప్రైజ్ సాఫ్ట్వేర్ సహాయంతో విప్రో కొత్తతరహా ఏజెంటిక్ ఏఐ సర్వీసులను ప్రవేశపెట్టింది. తద్వారా ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలు తమ ప్రత్యేక ఇన్ఫ్రా, డేటా, వర్క్ఫోర్స్, బిజినెస్ నెట్వర్క్లను పటిష్టపరచుకోవడంతోపాటు ఏఐ సామర్థ్యాలను అభివృద్ధి, అమలు చేసేందుకు వీలుంటుంది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్, హెల్త్కేర్, ఎడ్యుకేషన్ తదితర రంగాలలో పౌర సేవలను భారీగా మెరుగుపరచేందుకు విప్రో ఎకోసిస్టమ్ వినియోగపడనుంది. ఎన్విడియా జెట్సన్ ప్లాట్ఫామ్ను వినియోగించుకోవడం ద్వారా ఏఐ ఆధారిత రైల్వే ట్రాక్ తనిఖీ సొల్యూషన్ ట్రాక్ఈఐను ఎల్అండ్టీ టెక్నాలజీ సర్వీసెస్ విడుదల చేసింది. తద్వారా రియల్ టైమ్ లోపాల గుర్తింపు, నిర్వహణలో మద్దతు తదితర ప్రపంచవ్యాప్త రైల్వే నెట్వర్క్ల భద్రతను పెంచేందుకు సహాయపడనుంది. ఎన్విడియా జీటీసీ 2025ను ఈ నెల 17-21 మధ్య కాలిఫోర్నియాలోని శాన్జోస్లో నిర్వహిస్తోంది. ఏఐలో తాజా ఆధునికతలను ప్రదర్శించేందుకు సదస్సు ఉపయోగపడుతోంది.

యథాతథ పాలసీకే ఫెడ్ ఓటు

4.25-4.5 శాతం వద్దే ఫండ్స్ రేట్లు



న్యూయార్క్: తాజా పాలసీ సమీక్షలో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించేందుకే నిర్ణయించింది. దీంతో ఫెడ్ ఫండ్స్ రేట్లు మరోసారి 4.25-4.5 శాతంవద్దే కొనసాగనున్నాయి. చైర్మన్ జెరోమీ పావెల్ అధ్యక్షతన రెండు రోజులపాటు సమావేశమైన ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ(ఎఫ్వోఎంసీ) గత సమీక్షలోనూ యథాతథ పాలసీ అమలుకే ఓటు వేసిన సంగతి తెలిసిందే. వివిధ దేశాలపై ప్రెసిడెంట్ ట్రంప్ ప్రతీకార టారిఫ్ల విధింపు, వీటి కారణంగా యూఎస్లో స్టాగ్ఫ్లేషన్ పరిస్థితులు తలెత్తనున్నట్లు ఆర్థికవేత్తల అంచనాల నడుమ ఎఫ్వోఎంసీ ఆచితూచి అడుగేస్తున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. దీంతో ఫెడ్ నిర్ణయాల తదుపరి చైర్మన్ పావెల్ ప్రసంగంపై ప్రపంచ కేంద్ర బ్యాంకులు దృష్టిపెట్టనున్నట్లు తెలియజేశారు. అయితే ఆర్థికవేత్తలు ఊహిస్తున్నట్లు 2025లో వడ్డీ రేట్ల కోతలపై ఫెడ్ నుంచి స్పష్టమైన సంకేతాలు వెలువడకపోవచ్చని అభిప్రాయపడ్డారు.

జొమాటోపై దివాలా పిటిషన్

ఎన్సీఎల్టీకి నోనా లైఫ్స్టైల్ అభ్యర్థన



న్యూఢిల్లీ: ఫుడ్ డెలివరీ అగ్రిగేటర్ జొమాటోపై గతంలో దాఖలు చేసిన దివాలా పిటిషన్ను పునరుద్ధరించమంటూ జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్(ఎన్సీఎల్టీ)ని తాజాగా నోనా లైఫ్స్టైల్ ప్రయివేట్ లిమిటెడ్ అభ్యర్థించింది. జొమాటోకు ఆపరేషనల్ క్రెడిటర్ అయిన నోనా లైఫ్స్టైల్ 2024లో దివాలా చర్యలకు ఫిర్యాదు చేసింది. అయితే ఈ పిటిషన్పై విచారణ చేపట్టేందుకు ఎన్సీఎల్టీ అనుమతించలేదు. ఈ నేపథ్యంలో జొమాటోపై పిటిషన్ను పునరుద్ధరించవలసిందిగా దుస్తుల సరఫరాదారు నోనా లైఫ్స్టైల్ మరోసారి ఢిల్లీ ఎన్సీఎల్టీ బెంచ్ను ఆశ్రయించింది. జొమాటోపై కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియకు ఆదేశించవలసిందిగా అభ్యర్థించింది. అయితే ఇద్దరు సభ్యుల ఎన్సీఎల్టీ బెంచ్ విచారణను ఏప్రిల్కు వాయిదా వేసింది.

2026లో ఐనాక్స్ క్లీన్ ఎనర్జీ లిస్టింగ్

గ్రూప్ నుంచి ఐదో కంపెనీ ఐపీవో బాట

న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరం(2025-26)లో ఐనాక్స్ క్లీన్ ఎనర్జీ పబ్లిక్ ఇష్యూ చేపట్టే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఐపీవోలో భాగంగా 10-15 శాతం వాటా విక్రయించే వీలున్నట్లు సంబంధిత వర్గాలు తెలియజేశాయి.



తద్వారా రూ. 5,000 కోట్లు సమీకరించవచ్చని అంచనా వేశాయి. వెరసి రూ. 50,000 కోట్ల(6 బిలియన్ డాలర్లు) విలువలో కంపెనీ ఐపీవోకు రావచ్చని పేర్కొన్నాయి. దీంతో ఐనాక్స్జీఎఫ్ఎల్ గ్రూప్ నుంచి ఐదో లిస్టెడ్ కంపెనీగా ఐనాక్స్ క్లీన్ ఎనర్జీ నిలవనుంది. ఇప్పటికే గ్రూప్ నుంచి గుజరాత్ ఫ్లోరోకెమికల్స్, ఐనాక్స్ విండ్, ఐనాక్స్ విండ్ ఎనర్జీ, ఐనాక్స్ గ్రీన్ స్టాక్ ఎక్స్ఛేంజీలలో ట్రేడవుతున్నాయి. కాగా.. ఐపీవో పూర్తయితే పునరుత్పాదక ఇంధన విభాగంలో ప్రయివేట్ రంగం నుంచి భారీ ఐపీవో చేపట్టిన కంపెనీగా ఐనాక్స్ క్లీన్ అవతరించనున్నట్లు తెలుస్తోంది. సెల్స్, మాడ్యూల్స్ తదితర సోలార్ తయారీతోపాటు స్వతంత్ర విద్యుదుత్పాదక కంపెనీగా ఐనాక్స్ క్లీన్ కార్యకలాపాలు విస్తరించింది.

ఇండస్ఇండ్లో వాటాలు పెంచుకునేందుకు అనుకూల తరుణం

- బ్యాంక్కు తాజా నిధుల అవసరం లేదు
- ఐఐహెచ్ఎల్ చైర్మన్ అశోక్ హిందుజా



ముంబై: ఇండస్ఇండ్ బ్యాంక్ స్టాక్ ధర భారీ పతనం కావడంతో.. ప్రమోటర్లు వాటాలు పెంచుకునేందుకు ఇది అనుకూల తరుణమని ఇండస్ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ (ఐఐహెచ్ఎల్) చైర్మన్ అశోక్ హిందుజా అన్నారు. హిందుజా గ్రూప్ పెట్టుబడుల సంస్థ 'ఐఐహెచ్ఎల్' ప్రస్తుతం ఇండస్ఇండ్ బ్యాంక్లో 16 శాతం వాటాతో ప్రమోటింగ్ సంస్థగా ఉంది. ఈ వాటాను 26 శాతానికి పెంచుకునేందుకు ఆర్బీఐ ఇటీవలే సూత్రప్రాయ ఆమోదం తెలపడం గమనార్హం. బ్యాంక్ ఖాతాల్లో రూ.2,100 కోట్ల విలువ మేర వ్యత్యాసాలు ఉన్నాయంటూ ఇటీవలే వెలుగు చూడడం, అనంతరం సంస్థ నికర విలువ (నెట్వర్త్) తగ్గిపోవడం తెలిసిందే. అయినప్పటికీ ప్రమోటర్ల నుంచి బ్యాంక్ నిధుల సాయం కోరలేదని అశోక్ హిందుజా తెలిపారు. అవసరమైతే బ్యాంక్కు నిధులు అందించేందుకు కట్టుబడి ఉన్నట్టు చెప్పారు. బ్యాంక్ క్యాపిటల్ అడెక్వసీ 15 శాతానికి పైన సౌకర్యంగానే ఉందన్నారు. ఈ ధరలో తాను మాత్రమే కాదని, ఏ వాటాదారుడు అయినా వాటా పెంచుకోవాలనే అనుకుంటారని వ్యాఖ్యానించారు. బ్యాంక్ ఖాతాల్లో వ్యత్యాసంపై వాస్తవాలను తేల్చేందుకు ఆడిటింగ్ సంస్థకు బాధ్యతలు అప్పగించగా, మార్చి నెలాఖరుకు అది రానున్నది. పీడబ్ల్యూసీ ఆడిటింగ్ నివేదికతో ఖాతాల్లో వ్యత్యాసానికి ఎవరు బాధ్యులన్నది తేలుతుందని అశోక్ హిందుజా అన్నారు. సీఎఫ్వో పదవి నుంచి గోదిండ్జైన్ తప్పుకోవడం వెనుక కారణాలపై మీడియా ప్రశ్నించగా, వ్యాఖ్యానించడానికి నిరాకరించారు.

బార్క్లేస్ బ్యాంక్ పెట్టుబడులు

దేశీయంగా రూ. 2,300 కోట్లకు రెడీ

ముంబై: దేశీ అనుబంధ సంస్థ బార్క్లేస్ బ్యాంక్ పీఎల్సీ ఇండియాకు బ్రిటిష్ మాతృ సంస్థ బార్క్లేస్ బ్యాంక్ రూ. 2,300 కోట్ల మూలధనం సమకూర్చనుంది. తద్వారా బ్యాంక్ బ్యాలన్స్షీట్ పటిష్టంకావడంతోపాటు ఇన్వెస్ట్మెంట్, ప్రయివేట్ బ్యాంకింగ్లో బిజినెస్ విస్తరించేందుకు సహాయపడనుంది. దీంతో మరింతమంది క్లయింట్లకు బ్యాంక్ చేరువకానుంది. ప్రధానంగా కార్పొరేట్, ఫైనాన్షియల్ పెట్టుబడులున్న క్లయింట్లు, అత్యంత సంపన్న వర్గాలలో మరింత విస్తరించనున్నట్లు బార్క్లేస్ బ్యాంక్ ఒక ప్రకటనలో పేర్కొంది. వెరసి ప్రపంచంలోనే వేగవంత వృద్ధిలో ఉన్న ఆర్థిక వ్యవస్థ పట్ల దీర్ఘకాలిక కట్టుబాటును ప్రదర్శిస్తున్నట్లు తెలియజేసింది.



ఎఫ్ఎంసీజీ రంగంలో మోస్తరు వృద్ధి

- ఆదాయం 6-8% మేర పెరగొచ్చు
- పట్టణాల్లో పుంజుకుంటున్న వినియోగం
- పటిష్టంగానే కంపెనీల నిర్వహణ లాభం
- 2025-26పై క్రిసిల్ రేటింగ్స్ అంచనా




న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ కంపెనీలకు వచ్చే ఆర్థిక సంవత్సరంలో (2025-26) ఆదాయం 1-2 శాతం మేర మెరుగుపడి 6-8 శాతం మధ్య ఉండొచ్చని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. గ్రామీణ ప్రాంతాల్లో స్థిరమైన డిమాండ్కు తోడు పట్టణ ప్రాంతాల్లో వినియోగం క్రమంగా పుంజుకుంటుండడం మోస్తరు వృద్ధికి తోడ్పడుతుందని పేర్కొంది. 2024-25 సంవత్సరానికి ఎఫ్ఎంసీజీ రంగంలో ఆదాయ వృద్ధి 5-6 శాతం వరకు ఉండొచ్చన్నది అంచనా. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడంతో సబ్బులు, బిస్కెట్లు, కాఫీ, హెయిర్ ఆయిల్, టీ తదితర ఉత్పత్తులపై ఈ మేరకు ధరల్లో కంపెనీలు ఉపశమనాన్ని కల్పించాయని.. ఫలితంగా వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఆదాయం మరో 2 శాతం మేర పెరగొచ్చని క్రిసిల్ పేర్కొంది. ఇక ఎఫ్ఎంసీజీ కంపెనీల నిర్వహణ లాభం 2024-25లో 50-100 బేసిస్ పాయింట్లు తగ్గగా.. 2025-26లో పటిష్టంగా 20-21 శాతం స్థాయిలో ఉంటుందని తెలిపింది. ఎఫ్ఎంసీజీ కంపెనీల రుణ పరపతి స్థిరంగా ఉన్నట్టు పేర్కొంది. సంప్రదాయ ఎఫ్ఎంసీజీ కంపెనీలు డైరెక్ట్ టు కన్జ్యూమర్ బ్రాండ్లను (డీ2సీ) సొంతం చేసుకోవడం కొనసాగుతుందని క్రిసిల్ రేటింగ్స్ తెలిపింది. డిజిటల్ ప్లాట్ఫామ్లను వినియోగించుకోవడం, పెరుగుతున్న పోటీ నేపథ్యంలో విక్రయాలు పెంచుకునేందుకు తక్కువ ధరల ప్యాక్లను ప్రవేశపెట్టడం వంటి చర్యలు కొనసాగొచ్చని పేర్కొంది.

డీ2సీ కంపెనీలకు విస్తృత అవకాశాలు..

''అమ్మకాలు మోస్తరుగా పుంజుకుంటాయన్నది మా అంచనా. ఆహార ద్రవ్యోల్బణం కొంత కిందకు దిగిరావడానికితోడు వడ్డీ రేట్లు సులభంగా మారడం, బడ్జెట్లో ప్రకటించిన పన్ను ఆదా నిర్ణయాలు వచ్చే ఆర్థిక సంవత్సరంలో పట్టణ డిమాండ్ను పెంచుతాయి. కనీస మద్దతు ధరలు పెంచడం, సంక్షేమ పథకాలకు స్థిరమైన కేటాయింపులతో గ్రామీణ ప్రాంతాల్లోనూ డిమాండ్ స్థిరంగా వృద్ధి చెందుతుంది. సంప్రదాయ ఎఫ్ఎంసీజీ కంపెనీలు పెరుగుతున్న పోటీని ఎదుర్కోవాల్సి వస్తోంది. స్థానిక కంపెనీలు తక్కువ ధరల బ్రాండ్లతో అమ్మకాలు పెంచుకుంటున్నాయి. డిజిటల్ ఛానళ్లకు ప్రాధాన్యం పెరుగుతుండడంతో డీ2సీ కంపెనీల పంపిణీకి పెద్ద ఎత్తున అవకాశాలు ఏర్పడ్డాయి'' అని క్రిసిల్ రేటింగ్స్ సీనియర్ డైరెక్టర్ అనుజ్సేతి తెలిపారు. ఎఫ్ఎంసీజీ కంపెనీల్లో 60 శాతం మేర పట్టణాల నుంచి వస్తుండగా, మిగిలినది గ్రామీణ ప్రాంతాల నుంచి వస్తున్నట్టు క్రిసిల్ రేటింగ్స్ తన నివేదికలో పేర్కొంది. ఎఫ్ఎంసీజీ రంగం అమ్మకాల్లో సగం మేర ఆహార పానీయాల నుంచే వస్తోందని, వ్యక్తిగత సంరక్షణ, గృహ సంరక్షణ ఉత్పత్తులు చెరో పావు శాతం వాటా కలిగి ఉన్నట్టు తెలిపింది. గత కొన్ని త్రైమాసికాల్లో గ్రామీణ ప్రాంతాల అమ్మకాలు పట్టణ విక్రయాలను మించినట్టు వెల్లడించింది. రానున్న రోజుల్లో ఉత్పత్తుల తయారీ వ్యయాలు, వర్షాలు, గృహాల వినియోగం ఈ రంగం వృద్ధిని నిర్ణయించే అంశాలుగా పేర్కొంది.

‘ఫ్యామిలీ’ నిబంధనల్లో సడలింపు లేదు


సైకియా

బీసీసీఐ కార్యదర్శి సైకియా స్పష్టీకరణ



న్యూఢిల్లీ: భారత క్రికెటర్లు టోర్నీ లేదా సిరీస్‌లకు వెళ్లినప్పుడు వారితో పాటు కుటుంబ సభ్యులను అనుమతించే విషయంలో ఇటీవల కొత్తగా రూపొందించిన నిబంధనలు ముున్ముందూ కొనసాగుతాయని బీసీసీఐ స్పష్టం చేసింది. వీటిలో ఎలాంటి మార్పులు చేయడం లేదని బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియా పేర్కొన్నారు. ఇటీవలి నిబంధనల ప్రకారం టీమ్ 45 రోజుల విదేశీ టూర్‌లో ఉంటే గరిష్టంగా రెండు వారాలు మాత్రమే ఫ్యామిలీని అనుమతిస్తారు. అయితే తాజాగా భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి ఈ తరహా నిబంధనను ప్రశ్నించాడు. ఏ ప్లేయర్ అయినా మ్యాచ్ పూర్తి కాగానే కుటుంబంతో గడపాలని అనుకుంటాడని, ఒంటరితనాన్ని అనుభవించడం ఇష్టపడరని వ్యాఖ్యానించాడు. ‘కొత్త విధానం రాత్రికి రాత్రి తీసుకొచ్చింది కాదు. ఎంతో మందితో చర్చించిన తర్వాతే అమల్లోకి తెచ్చాం. గతంలోనూ ఇదే తరహా విధానం భారత క్రికెట్‌లో ఉంది. జట్టు ప్రయోజలను దృష్టిలో ఉంచుకొనే ఇలాంటి నిర్ణయం తీసుకున్నాం’ అని సైకియా స్పష్టీకరించారు. నిజానికి 2020 ఆరంభం వరకు కూడా ఇవే నిబంధనలు అమల్లో ఉన్నాయి. అయితే కోవిడ్ వచ్చాక క్రికెటర్లు మానసికంగా ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో వాటిని సవరించి సిరీస్ మొత్తానికి కుటుంబ సభ్యులను అనుమతించారు. ఇటీవల ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్ వరకు ఇది సాగింది. అయితే ఏదైనా ప్రత్యేక పరిస్థితుల్లో కుటుంబాన్ని తమతో ఉంచుకోవాలంటే మాత్రం సదరు ఆటగాడు హెడ్ కోచ్, బీసీసీఐకి ముందుగా చెప్పి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. మరోవైపు బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్పోర్ట్స్ సైన్స్ హెడ్ నితిన్ పటేల్ పదవీ కాలం ఈ నెల 31 వరకు పొడిగించామని, ఆ తర్వాత ఆయన స్థానంలో మరొకరిని తీసుకుంటామని సైకియా చెప్పారు.

అభిషేక్ శర్మ రెండో ర్యాంక్ పదిలం



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టి20 ర్యాంకింగ్స్‌లో భారత ప్లేయర్లు అభిషేక్ శర్మ... వరుణ్ చక్రవర్తి తమ రెండో ర్యాంక్‌లను నిలబెట్టుకున్నారు. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో బ్యాటింగ్ విభాగంలో అభిషేక్ శర్మ... బౌలింగ్ విభాగంలో వరుణ్ చక్రవర్తి యథావిధిగా రెండో స్థానంలో కొనసాగుతున్నారు. అభిషేక్ శర్మ ఖాతాలో 829 పాయింట్లు ఉండగా... ఆస్ట్రేలియా ప్లేయర్ ట్రావిస్ హెడ్ 856 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచాడు. భారత్‌కే చెందిన తిలక్ వర్మ (804 పాయింట్లు) నాలుగో ర్యాంక్‌లో, సూర్య కుమార్ యాదవ్ (739 పాయింట్లు) ఐదో ర్యాంక్‌లో ఉన్నారు. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ‘మిస్టరీ స్పిన్నర్’ వరుణ్ చక్రవర్తికి (706 పాయింట్లు), టాప్ ర్యాంక్‌లో ఉన్న వెస్టిండీస్ స్పిన్నర్ అకీల్ హొసేన్ (707 పాయింట్లు) మధ్య కేవలం ఒక పాయింట్ వ్యత్యాసం ఉండటం గమనార్హం. భారత ఇతర బౌలర్లు రవి బిష్ణోయ్ ఆరో ర్యాంక్‌లో, అర్ష్‌దీప్ సింగ్ తొమ్మిదో ర్యాంక్‌లో ఉన్నారు. ఆల్‌రౌండర్ల విభాగంలో భారత స్టార్ హార్దిక్ పాండ్యా 252 పాయింట్లతో అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు.

ఐపీఎల్‌లో ‘సలైవా’కు అనుమతి!

యోచనలో గవర్నింగ్ కౌన్సిల్



న్యూఢిల్లీ: బంతిపై నునుపుదనం పెంచడం కోసం సలైవా (ఉమ్మి)ని వాడేందుకు అనుమతించాలంటూ ఇటీవల భారత పేసర్ మొహమ్మద్ షమీ విజ్ఞప్తి చేశాడు. సాధారణంగా ఉమ్మిని రుద్దడం వల్ల బంతి తన మెరుపును కోల్పోకుండా ఉండి రివర్స్ స్వింగ్‌కు సహకరిస్తుంది. ఎన్నో ఏళ్లుగా ఇది ఆటలో భాగంగానే ఉన్నా... కోవిడ్ వచ్చినప్పుడు దీనిపై ఐసీసీ నిషేధం విధించింది. ఇప్పుడు ఆ ప్రమాదం లేదు కాబట్టి నిబంధన తొలగించాలంటూ బౌలర్లు కోరుతున్నారు. ఈ విషయంలో బీసీసీఐ తీవ్రంగా ఆలోచిస్తోంది. బ్యాటర్ల ఆధిపత్యం సాగే లీగ్‌లో కొంతైనా బౌలర్లకు ‘రివర్స్ స్వింగ్’ ప్రయోజనం కలగవచ్చు. కాబట్టి కెప్టెన్లందరూ అంగీకరిస్తే ఐపీఎల్‌లో ‘సలైవా’ వాడేందుకు బోర్డు అనుమతించే అవకాశం ఉంది. మరోవైపు గతంలో లాగే హైట్, ఆఫ్ సైడ్ వైడ్‌లను నిర్ణయించే విషయంలో డీఆర్‌ఎస్ కొనసాగనుంది.

అసోం బాక్సర్లను ఆడనివ్వట్లేదు!

బీఎఫ్‌ఐ అధ్యక్షుడి ఆరోపణ


అజయ్ సింగ్

న్యూఢిల్లీ: భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్‌ఐ) ఎన్నికల దగ్గరవుతున్న నేపథ్యంలో ప్రత్యర్థుల మధ్య విమర్శలు కూడా పెరుగుతున్నాయి. తాజాగా బీఎఫ్‌ఐ అధ్యక్షుడు అజయ్ సింగ్... సస్పెన్షన్‌కు గురైన మాజీ కార్యదర్శి హేమంత కలితాపై కొత్త ఆరోపణలు చేశారు. అసోంకు చెందిన హేమంత తమ రాష్ట్రానికి చెందిన అగ్రశ్రేణి బాక్సర్లను జాతీయ మహిళా చాంపియన్‌షిప్‌లో ఆడకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతక విజేత అయిన లవ్లీనా బొర్గొహైన్‌తో పాటు ఇతర బాక్సర్లను ఈ ప్రతిష్టాత్మక టోర్నీ నుంచి తప్పుకోవాలని ఆయన ఆదేశించారంటూ అజయ్ సింగ్ వ్యాఖ్యానించారు. దాదాపు రెండేళ్ల తర్వాత నిర్వహిస్తున్న జాతీయ మహిళా బాక్సింగ్ చాంపియన్‌షిప్ గురువారం ప్రారంభం కానుంది. ‘ఇందులో ఆడేందుకు లవ్లీనా సిద్ధమైంది. అయితే వారు పాల్గొనకుండా చూడాలని హేమంత అధికారులకు ఫోన్‌లు చేశారు. ఎన్నో ట్రైన్, ఫ్లయిట్ టికెట్లు రద్దు చేశారు. సహజంగానే తమ రాష్ట్రానికి సంబంధించిన అంశం కాబట్టి ఇలాంటి స్థితిలో లవ్లీనాలాంటి బాక్సర్లు పునరాలోచనలో పడ్డారు’ అని ఆయన వెల్లడించారు. దీనిని హేమంత కలితా కొట్టిపారేశారు. తాను ఏ ప్లేయర్‌ను ఆపలేదని, దానికి తనకు సంబంధం లేదన్న హేమంత...టోర్నీ కోసం ప్రకటించిన తేదీల పట్ల అసంతృప్తితో వివిధ రాష్ట్ర సంఘాలు తప్పుకున్నాయనే విషయాన్ని గుర్తు చేశారు.


శ్రీకాంత్

శ్రీకాంత్ శుభారంభం

ప్రణయ్‌పై గెలుపుతో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ● తొలి రౌండ్‌లోనే ఓడిన సింధు

బాసెల్: స్విస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ప్రపంచ మాజీ నంబర్‌వన్, భారత అగ్రశ్రేణి ఆటగాడు కిడాంబి శ్రీకాంత్ శుభారంభం చేశాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 49వ ర్యాంకర్ శ్రీకాంత్ 23–21, 23–21తో భారత్‌కే చెందిన ప్రపంచ 28వ ర్యాంకర్ హెచ్‌ఎస్ ప్రణయ్‌ను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. ఈ గెలుపుతో శ్రీకాంత్ ముఖాముఖి రికార్డులో 7–3తో ప్రణయ్‌పై ఆధిక్యంలోకి వెళ్లాడు. ప్రణయ్‌తో 48 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రీకాంత్ రెండు గేముల్లోనూ గేమ్ పాయింట్లు కాపాడుకొని నెగ్గడం విశేషం. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో భారత్‌కే చెందిన క్వాలిఫయర్ శంకర్ ముత్తుస్వామి సుబ్రమణియన్ 21–5, 21–16తో మాగ్నస్ జొహాన్సన్ (డెన్మార్క్)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో భారత ప్లేయర్లు ఆయుశ్ శెట్టి 15–21, 19–21తో కెంటా నిషిమోటో (జపాన్) చేతిలో, కిరణ్ జార్జి 21–18, 17–21, 10–21తో రస్‌ముస్ గెమ్కే (డెన్మార్క్) చేతిలో ఓడిపోయారు.



ఇషారాణి ముందంజ

మహిళల సింగిల్స్‌లో భారత క్రీడాకారిణులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. భారత నంబర్‌వన్, ప్రపంచ మాజీ చాంపియన్ పీవీ సింధు 17–21, 19–21తో 39 నిమిషాల్లో ప్రపంచ 31వ ర్యాంకర్ జూలీ జేకబ్సన్ (డెన్మార్క్) చేతిలో అనూహ్యంగా ఓడిపోయింది. భారత్‌కే చెందిన ఇషారాణి బారువా, అనుపమ తొలి రౌండ్‌లో గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. క్వాలిఫయర్ ఇషారాణి 18–21, 21–17, 22–20తో భారత్‌కే చెందిన ఆకర్షి కశ్యప్‌పై, అనుపమ 21–14, 21–13తో అన్‌మోల్ ఖరబ్ (భారత్)పై గెలిచారు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో మాళవిక బన్సోద్ (భారత్) 22–20, 14–21, 19–21తో మిచెల్లి లీ (కెనడా) చేతిలో, రక్షితశ్రీ (భారత్) 11–21, 17–21తో లినె క్రిస్టోఫర్సన్ (డెన్మార్క్) చేతిలో ఓడిపోయారు. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ (భారత్) ద్వయం 21–16, 21–17తో అలైస్ ముల్లర్–కెల్లీ బుటెన్ (నెదర్లాండ్స్) జంటపై విజయం సాధించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది.



పాఠ్యాంశంగా ‘డోపింగ్’

క్రీడా మంత్రి మాండవియా పిలుపు

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా అద్భుత క్రీడా ప్రదర్శనలు అభిమానులను అలరిస్తున్నాయి. అదే సమయంలో మరోవైపు క్రీడల్లో ‘డోపింగ్’ జాడ్యం తీవ్రత కూడా పెరిగిపోతూ ఉంది. ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా పెద్ద సంఖ్యలో డోపింగ్ కేసులు బయటకు వస్తున్నాయి. కొన్నింటిలో ఆటగాళ్లు శిక్షలకు గురవుతుండగా, ఎక్కువ భాగం ఆటగాళ్లు తెలివిగా తప్పించుకోగలుగుతున్నారు. ఈ నేపథ్యంలో ఆటలో ప్రాథమికాంశాలు నేర్చుకునే సమయంలోనే డోపింగ్‌పై కూడా అవగాహన కల్పించి, వాటికి దూరంగా ఉండేలా ప్రోత్సహించాలని కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవియా అభిప్రాయపడ్డారు. ఇందు కోసం ‘డోపింగ్’ అంశాన్ని కూడా పాఠ్యాంశంగా చేరిస్తే బాగుంటుందని ఆయన పిలుపునిచ్చారు. నేషనల్ డోప్ టెస్టింగ్ లేబొరేటరీ (ఎన్‌డీటీఎల్) నిర్వహించిన వార్షిక సదస్సులో మంత్రి ప్రసంగించారు. ఇందులో దేశవ్యాప్తంగా శాస్త్రవేత్తలు, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా సమాఖ్యల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ‘యాంటీ డోపింగ్ సైన్స్–ఇన్నొవేషన్స్ అండ్ చాలెంజెస్’ అనే అంశంపై చర్చ సాగింది. ఆటగాళ్లు డోపింగ్‌కు దూరంగా ఉండేలా చేయడంలో వివిధ క్రీడా సమాఖ్యల అధికారులు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని ఆయన అన్నారు.

బ్యాటింగ్, కెప్టెన్సీని వేర్వేరుగా చూడాలి: గిల్

అహ్మదాబాద్: సారథ్యాన్ని, బ్యాటింగ్‌ను విడివిడిగా చూడగలిగితేనే విజయవంతమవుతామని భారత యువ ఓపెనర్ శుబ్‌మన్ గిల్ పేర్కొన్నాడు. ఈ నెల 22 నుంచి ప్రారంభం కానున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్‌లో గిల్... గుజరాత్ టైటాన్స్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ నేపథ్యంలో అతడు మాట్లాడుతూ... ‘కెప్టెన్సీని, బ్యాటింగ్‌ను వేర్వేరుగా ఉంచాలి. అప్పుడే విజయవంతం కాగలం. క్రీజులో అడుగుపెట్టినప్పుడు కేవలం బ్యాటింగ్‌పైనే దృష్టి పెడతా. నా అనుభవం నుంచి ఇదే నేర్చుకున్నా. ఫీల్డ్‌లో ఉన్నప్పుడు మాత్రం కెప్టెన్‌గా మరింత బాధ్యతగా వ్యవహరిస్తా’ అని అన్నాడు. 2023 సీజన్‌లో టైటాన్స్ తరఫున హార్దిక్ పాండ్యా సారథ్యంలో బరిలోకి దిగిన గిల్ 890 పరుగులతో సత్తా చాటాడు. ఇక గత ఏడాది సారథిగా బాధ్యతలు తీసుకున్న గిల్ 426 పరుగులు చేశాడు. అంతకుముందు ఏడాదితో పోల్చుకుంటే అతడి స్ట్రయిక్‌రేట్ 10 శాతం తగ్గింది. ‘సారథిగా ప్రతి రోజు నేర్చుకుంటూనే ఉంటా. అదే ఒక ఆటగాడిగా, కెప్టెన్‌గా నన్ను మరింత మెరుగుపరుస్తుందని నమ్ముతున్నా. కోచ్ ఆశిష్ నెహ్రా, విక్రమ్ సోలంకి సూచనలతో ముందుకు సాగుతున్నా. ఇంటా బయట అనే తేడా ఏమీ లేదు. మంచి లయలో ఉంటే వేదికతో సంబంధం ఉండదు. గత మూడేళ్ల ఫలితాలు పరిశీలిస్తే లీగ్‌లో అత్యధిక విజయాల శాతం మా జట్టుదే. దాన్నే కొనసాగిస్తే ఈ సీజన్‌ను కూడా చిరస్మరణీయం చేసుకోగలం’ అని గిల్ వివరించాడు. మ్యాచ్‌లు గెలవాలంటే భారీ స్కోర్లు చేయడం మాత్రమే కాదని... పిచ్, పరిస్థితులకు తగ్గట్లు ఆడటం ముఖ్యమని గిల్ పేర్కొన్నాడు.


గిల్

శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ... ‘డ్రా’తో సరి

సాక్షి, హైదరాబాద్: ఐ–లీగ్ జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు ఐదో ‘డ్రా’ నమోదు చేసుకుంది. ఇంటర్ కాశీ జట్టుతో బుధవారం డెక్కన్ ఎరీనాలో జరిగిన మ్యాచ్‌ను శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ జట్టు 2–2 గోల్స్‌తో ‘డ్రా’ చేసుకుంది. ఇంజ్యూరీ టైమ్‌లో గోల్ సమర్పించుకొని గెలవాల్సిన మ్యాచ్‌ను శ్రీనిధి జట్టు ‘డ్రా’తో సరిపెట్టుకుంది. ఆట 17వ నిమిషంలో ప్రశాంత్ చేసిన గోల్‌తో ఇంటర్ కాశీ జట్టు 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే 42వ నిమిషంలో డేవిడ్ కాస్టనెడా గోల్‌తో శ్రీనిధి జట్టు స్కోరును 1–1తో సమం చేసింది. ఈ లీగ్‌లో ‘టాప్ గోల్‌స్కోరర్’గా కొనసాగుతున్న కాస్టనెడాకిది 14వ గోల్ కావడం విశేషం. 72వ నిమిషంలో బ్రాండన్ వాన్‌లాల్‌రెమ్‌డికా గోల్‌తో శ్రీనిధి జట్టు 2–1తో ఆధిక్యంలోకి వెళ్లింది. శ్రీనిధి జట్టు గెలుపు ఖాయమనుకుంటున్న దశలో 90+1వ నిమిషంలో బిద్యాసాగర్ సింగ్ గోల్‌తో ఇంటర్ కాశీ జట్టు స్కోరును 2–2తో సమం చేసింది. నిర్ణీత 90 నిమిషాల తర్వాత ఇంజ్యూరీ టైమ్‌గా అదనంగా ఏడు నిమిషాలు ఆడించారు. ఈ సమయంలోనే ఇంటర్ కాశీ జట్టు ఓటమి అంచుల్లో నుంచి బయటపడి ‘డ్రా’తో మ్యాచ్‌ను ముగించింది. 12 జట్లు పోటీపడుతున్న ఐ–లీగ్‌లో శ్రీనిధి డెక్కన్ జట్టు 19 మ్యాచ్‌లు పూర్తి చేసుకుంది. ఇందులో 7 మ్యాచ్‌ల్లో గెలిచి, 7 మ్యాచ్‌ల్లో ఓడి, 5 మ్యాచ్‌లను ‘డ్రా’గా ముగించి 26 పాయింట్లతో ఎనిమిదో స్థానంలో ఉంది. శ్రీనిధి జట్టు తమ తదుపరి మ్యాచ్‌లో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న చర్చిల్ బ్రదర్స్ ఫుట్‌బాల్ క్లబ్ గోవా జట్టుతో తలపడుతుంది.



3 నిమిషాల 58.35 సెకన్లలో

మైలు పరుగు పూర్తి చేసిన కుర్రాడు


స్యామ్ రూత్

వెల్లింగ్టన్: వన్ మైల్ (ఒక మైలు) దూరం పరుగులో న్యూజిలాండ్ కుర్రాడు కొత్త రికార్డు సృష్టించాడు. ఈ దూరాన్ని నాలుగు నిమిషాల లోపు పూర్తి చేసిన అతి పిన్న వయస్కుడిగా అతను నిలిచాడు. 15 ఏళ్ల కివీస్ అథ్లెట్ స్యామ్ రూత్ 3 నిమిషాల 58.35 సెకన్లలో మైలు దూరాన్ని అధిగమించాడు. మరో 24 రోజుల్లో అతను 16వ పుట్టిన రోజును జరుపుకోనున్నాడు! గతంలో ఈ రికార్డు నార్వేకు చెందిన జేకబ్ ఇంజ్‌బ్రిట్సన్ పేరిట ఉంది. 2017లో మైలు పరుగును పూర్తి చేసినప్పుడు అతని వయసు 16 ఏళ్ల 250 రోజులు.

హారిక ఖాతాలో తొలి ఓటమి



నికోసియా (సైప్రస్): మహిళల గ్రాండ్‌ప్రి చెస్ నాలుగో అంచె టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్, హైదరాబాద్ క్రీడాకారిణి ద్రోణవల్లి హారిక తొలి పరాజయం చవిచూసింది. ఎలిజబెత్ పాట్జ్ (జర్మనీ)తో బుధవారం జరిగిన ఐదో రౌండ్ గేమ్‌లో హారిక 50 ఎత్తుల్లో ఓడిపోయింది. మరోవైపు భారత్‌కే చెందిన ప్రపంచ జూనియర్ చాంపియన్ దివ్య దేశ్‌ముఖ్ ఖాతాలో నాలుగో ‘డ్రా’ చేరింది. నానా జాగ్నిద్జె (జార్జియా)తో తో జరిగిన ఐదో రౌండ్ గేమ్‌ను దివ్య 41 ఎత్తుల్లో ‘డ్రా’ చేసుకుంది. ఏడుగురు గ్రాండ్‌మాస్టర్లు, ముగ్గురు అంతర్జాతీయ మాస్టర్లు (ఐఎం) తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీలో పోటీపడుతున్నారు. ఐదో రౌండ్ తర్వాత హారిక 2.5 పాయింట్లతో ఐదో స్థానంలో, దివ్య 2 పాయింట్లతో ఏడో స్థానంలో ఉన్నారు.

ఎన్నికల ఫలితాలు ప్రకటించవద్దు!

బాక్సింగ్ సమాఖ్యకు కోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ: భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్‌ఐ) ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఢిల్లీ హైకోర్టు కొత్త ఆదేశాలు ఇచ్చింది. వివిధ రాష్ట్ర సంఘాల నుంచి ఎన్నికైన వారికి మాత్రమే ప్రతినిధులుగా ఈ ఎన్నికల్లో ఓటు వేసేందుకు అర్హత ఉందంటూ బీఎఫ్‌ఐ జారీ చేసిన ఉత్తర్వులపై స్టే విధించింది. అయితే ఎన్నికలను నిర్వహించుకోవచ్చని, ఫలితాలను మాత్రం ప్రకటించరాదని ఆదేశించింది. ఫలితాల ప్రకటన తమ తుది ఉత్తర్వులకు లోబడి ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ నెల 28 బీఎఫ్‌ఐ ఎన్నికలు జరగనున్నాయి. దీనికి సంబంధించి ఈ నెల 7న జారీ చేసిన నియమావళిలో తాజా నిబంధనలు ఉన్నాయి. అయితే దీనిని సవాల్ చేస్తూ కొందరు కోర్టుకెక్కారు. బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్‌ను తమ ప్రతినిధిగా ఓటు వేసేందుకు హిమాచల్‌ప్రదేశ్ బాక్సింగ్ సంఘం ప్రతిపాదించగా... ఆయన ఎంపికైన వ్యక్తి కాదంటూ రిటర్నింగ్ అధికారి ఓటర్ల జాబితా నుంచి పేరును తొలగించారు. తాజా అంశంపై నాలుగు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలంటూ బీఎఫ్‌ఐని కోర్టు ఆదేశించింది.

అస్సాంలో రూ.10,601 కోట్లతో యూరియా ప్లాంట్

మహారాష్ట్రలో పగోటె నుంచి చౌక్‌కు గ్రీన్‌ఫీల్డ్ హైస్పీడ్ హైవే నిర్మాణం

ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసిన కేంద్ర కేబినెట్

న్యూఢిల్లీ: అస్సాంలో రూ.10,601.4 కోట్ల వ్యయంతో భారీ యూరియా తయారీ కర్మాగారాన్ని నిర్మించాలన్న ప్రతిపాదనకు ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదముద్ర వేసింది. పంటసాగుకు ప్రాణాధారమైన యూరియా విషయంలో విదేశాల నుంచి దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించే చర్యల్లో భాగంగా కొత్త ప్లాంట్‌ను నిర్మించనున్నారు. దీంతో యూరియా తయారీలో భారత్ మరింతగా స్వావలంభన సాధించనుంది. ఇది ఆత్మనిర్భరత కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లనుంది. అస్సాంలోని నామ్‌రూప్‌లో ఇప్పటికే పనిచేస్తున్న బ్రహ్మపుత్ర వ్యాలీ ఫెర్టిలైజర్ కార్పొరేషన్ లిమిటెడ్(బీవీఎఫ్‌సీఎల్) ఫ్యాక్టరీ ప్రాంగణంలోనే ఏటా 12.7 లక్షల టన్నుల సామర్థ్యంతో అమ్మోనియా-యూరియా కాంప్లెక్స్‌ను నిర్మించనున్నారు. నామ్‌రూప్-4 ప్రాజెక్ట్ పేరుతో మొదలెట్టే ఈ కర్మాగారం నిర్మాణాన్ని 48 నెలల్లోపు పూర్తిచేయనున్నారు. ప్లాంట్ ఏర్పాటుపై కేంద్ర అంతర్గత మంత్రుల కమిటీ పర్యవేక్షిస్తుంది. జాయింట్ వెంచర్ తరహాలో ఏర్పాటవుతున్న ఈ కొత్త కర్మాగారంలో అస్సాం ప్రభుత్వానికి 40 శాతం, బీవీఎఫ్‌సీఎల్‌కు 11 శాతం, హిందుస్తాన్ ఊర్వరక్, రసాయన్ లిమిటెడ్‌కు 13 శాతం, ఆయిల్ ఇండియాకు 18 శాతం, నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్‌కు 18 శాతం వాటా ఉండనుంది. బీవీఎఫ్‌సీఎల్ తన వాటా కింద స్థిరాస్తులను పెట్టనుంది. ''కొత్త ప్రాజెక్టుతో దేశీయంగా యూరియా ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుంది. ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాల్లో యూరియా లభ్యత అధికమవుతుంది. లభ్యత పెరగడంతో బిహార్, పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్ తూర్పు ప్రాంతాలు, జార్ఖండ్‌లోని రైతులు లాభపడతారు. కొత్త ప్లాంట్‌తో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభిస్తుంది. దీంతో దేశీయంగా యూరియాలో పూర్తి స్వావలంభనకు అవకాశాలు మెరుగవుతాయి''అని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది.

రూ.4,500 కోట్లతో ఆరు లైన్ల హైవే

మహారాష్ట్రలో పగోటే జేఎన్‌పీఏ పోర్ట్ నుంచి చౌక్‌కు 29.219 కిలోమీటర్ల పొడవునా నూతనంగా ఆరు వరసల హైస్పీడ్ జాతీయరహదారి నిర్మాణ ప్రతిపాదనకూ ఆమోదముద్రపడింది. నిర్మాణం, నిర్వహణ, బదలాయింపు(బీఓటీ) విధానంలో రూ.4,500.62 కోట్ల వ్యయంతో ఈ జాతీయ రహదారిని నిర్మించనున్నారు. ప్రధాని మోదీ సారథ్యంలోని ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ బుధవారం ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. పీఎం గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ సూత్రాలను పాటిస్తూ దేశంలోని ప్రధాన పోర్టులను చిన్న పోర్టులతో రోడ్డుమార్గంలో అనుసంధానించాలనే లక్ష్యంలో భాగంగా కొత్త హైవేను నిర్మించనున్నారు. కంటైనర్ల సంఖ్య విషయంలో జేఎన్‌పీఏ పోర్టు సామర్థ్యాన్ని పెంచాలన్నా, నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో సరకు ఎగుమతి సామర్థ్యాన్ని మరింతగా పెంచాలన్నా రహదారుల అనుసంధానం తప్పనిసరి అని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుతం జేఎన్‌పీఏ పోర్ట్ నుంచి 48వ జాతీయ రహదారిలోని జీక్యూ సెక్షన్‌కు చేరుకోవాలన్నా, పల్సాపే ఫటా, డి-పాయింట్, కలామ్‌బోలీ జంక్షన్, పాన్వెల్ ప్రాంతాల్లో రద్దీని దాటుకుని ముంబై-పుణె ఎక్స్‌ప్రెవే చేరుకోవాలన్నా వాహనాలకు చాలా సమయం పడుతోంది. కొత్త రహదారి అందుబాటులోకి వస్తే పోర్ట్ నుంచి వేగంగా రాకపోకలు సాధ్యమవుతాయి. దీంతో పోర్ట్, ఎయిర్‌పోర్ట్ మధ్య రోడ్డుమార్గంలో అనుసంధానం మెరుగవుతుంది. ఇప్పటికే పెద్ద కంటైనర్ ట్రక్కులు ఘాట్ రోడ్డులో వెళ్లకుండా సహ్యాద్రిలో రెండు సొరంగ మార్గాల గుండా వెళ్లేలా చేసి కాస్త ట్రాఫిక్ కష్టాలు తగ్గించారు. ఇకపై ఆరు వరసల జాతీయ రహదారి అందుబాటులోకి వస్తే ప్రయాణికుల, సరకు రవాణా వాహనాల రాకపోకలు చాలా సాఫీగా సాగుతాయని ప్రభుత్వం తెలిపింది.



చందమామపై సాయం సంధ్య

ఇదేమిటో ఊహించగలరా? చంద్రునిపై సూర్యాస్తమయ దృశ్యం. అచ్చెరువు కలిగించే ఈ ఫొటోను నాసా తాజాగా విడుదల చేసింది. పొద్దు కుంగుతుండగా సూర్య కిరణాల వెలుగుల్లో పైన మెరిసిపోతూ కన్పిస్తున్నది భూమి. మధ్యలోని చిన్న చుక్క శుక్రగ్రహం.

వచ్చే నెలలోనే కొత్త సారథి..!

బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఎంపికపై మల్లగుల్లాలు
- విధేయత, అనుభవం, ప్రాంతీయ ఆధారంగా చర్చ
- దక్షిణాదికి ఇవ్వదలిసేత్ ముందు వరుసలో కిషన్‌రెడ్డి
- మహిళ అయితే తమిళనాడు నుంచి వనతి శ్రీనివాసన్

సాక్షి, న్యూఢిల్లీ: కాషాయ దళానికి కొత్త అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియ వచ్చే నెలలో కొలిక్కి రానుంది. పార్లమెంట్ సమావేశాలు పూర్తయిన వెంటనే ఖరారు చేయాలని ఆ పార్టీ భావిస్తున్నట్లు సమాచారం. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి చివరికే ఈ ప్రక్రియ పూర్తి చేయాలని భావించినా వివిధ రాష్ట్రాల్లో సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ఆలస్యమైంది. దీంతో వచ్చే నెల రెండో వారంలోగా కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. ప్రాంతం, అనుభవం, విధేయతల అనుగుణంగా పలువురు సీనియర్ నేతల పేర్లపై చర్చ జరుగుతుండగా, దక్షిణాది రాష్ట్రాలకు అవకాశం ఇవ్వాలని భావిస్తే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.

భిన్న ప్రాతిపదికలు..

జాతీయ అధ్యక్షుడి ఎంపికలో ప్రధానంగా నాలుగు అంశాల ప్రాతిపదికన చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో ప్రాంతం, విధేయత, అనుభవంతో పాటు కొత్తగా మహిళను నియమించే అంశం తెరపైకి వచ్చింది. వచ్చే ఏడాది జరిగే తమిళనాడు, కేరళ రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో పెట్టుకోవడంతో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో సొంతంగా అధికారంలోకి రావాలని బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. అందుకే, దక్షిణాది రాష్ట్రాలకు ఈసారి అవకాశం ఇవ్వాలన్న చర్చ జరుగుతోంది. దక్షిణాది రాష్ట్రాల నుంచి అధ్యక్షుడి రేసులో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ముందు వరుసలో ఉన్నారు. 45 ఏళ్లుగా పార్టీలో ఉన్న అనుభవం, యువమోర్చా నుంచి పార్టీలో పనిచేసిన అనుభవం ఆయనకు అనుకూలంగా మారుతోంది. దక్షిణాది నుంచి గతంలో బంగారు లక్ష్మణ్, జానా కృష్ణమూర్తి, వెంకయ్య నాయుడు అధ్యక్షులుగా సేవలందించారు. ఇప్పటివరకు పార్టీ మహిళా అధ్యక్షురాలు లేనందున ఈసారి మహిళా అధ్యక్ష కోణంలోనూ చర్చ జరుగుతోంది. ఇందులో తమిళనాడుకు చెందిన కీలక నేత వనతి శ్రీనివాసన్ పేరు ముందు వరుసలో ఉంది. వచ్చే ఏడాది తమిళనాడు ఎన్నికలను దృష్టిలో పెట్టుకోవడంతో పాటు మహిళల మద్దతు కూడగట్టేందుకు ఈమె ఎంపిక కలిసొస్తుందన్నది పార్టీ అంచనా. బీజేపీ ప్రభుత్వం ఇటీవలే మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించడంతో పాటు ఢిల్లీ ముఖ్యమంత్రిగా మహిళను ఎంపిక చేసింది. అదే వరుసలో మహిళను జాతీయ అధ్యక్షురాలిగా నియమిస్తారనే చర్చ జరుగుతోంది. విధేయత, పార్టీలో పనిచేసిన అనుభవం ఆధారంగా చూస్తే భూపేంద్ర యాదవ్, ధర్మేంద్ర ప్రధాన్‌ల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఈ ఇద్దరు నేతలు ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలకు సన్నిహితులు. పైగా యూపీ, మహారాష్ట్ర, హరియాణా ఎన్నికల విజయాల్లో కీలక పాత్ర పోషించారు. వ్యూహాలు రచించడంలో దిట్టలైన వీరిద్దరిలో ఒకరి ఎంపిక జరిగితే అది కచ్చితంగా మోదీ, షాల సూచన మేరకే జరిగిందనే చెప్పాల్సి ఉంటుంది. ఇక ఆర్‌ఎస్‌ఎస్ మద్దతున్న నేతలుగా మాజీ ముఖ్యమంత్రులు, ప్రస్తుత ముఖ్యమంత్రులైన మనోహర్‌లాల్ ఖట్టర్, శివరాజ్‌సింగ్ చౌహాన్ పేర్లు వినిపిస్తున్నాయి. వీరికి ఆర్‌ఎస్‌ఎస్ నుంచి పూర్తిగా మద్దతున్నా, కేంద్రంలో వీరికున్న ప్రాధాన్యం దృష్ట్యా అధ్యక్ష ఎంపికలో వీరిని పరిగణనలోకి తీసుకుంటారా? లేదా? తేలాల్సి ఉంది.

గాజాలో పరిస్థితులు ఆందోళనకరం: భారత్

న్యూఢిల్లీ: ఇజ్రాయెల్ భీకర దాడులతో గాజాలో తలెత్తిన పరిస్థితులపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. సంక్షుభిత గాజాలోని పాలస్తీనియన్లకు మానవతా సాయం అందేలా చూడాలని ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చింది. బందీలందరినీ వెంటనే విడుదల చేయాలని హమాస్‌ను కోరింది. ఈ మేరకు విదేశాంగ శాఖ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం చర్చలు విఫలమైన అనంతరం ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో కనీసం 400 మంది చనిపోయినట్లు గాజా యంత్రాంగం వెల్లడించింది. తమ కీలక లక్ష్యాలు నెరవేరేదాకా విశ్రమించేది లేదని ఇజ్రాయెల్ ప్రధాన నెతన్యాహూ మంగళవారం ప్రకటించారు. హమాస్ వైఖరి మారుతుందనే ఆశాభావంతోనే రెండు వారాలపాటు సైనిక చర్యను నిలిపివేశామన్నారు. కాగా, ఇజ్రాయెల్ దాడులను కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా తీవ్రంగా ఖండించారు. ఇజ్రాయెల్‌కు ఏమాత్రం మానవత్వం లేదని మండిపడ్డారు.

ఈడీ ముందుకు లాలూ ప్రసాద్ యాదవ్

పాట్నా: ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ ఈడీ ఎదుట హాజరయ్యారు. 'ల్యాండ్ ఫర్ జాబ్స్' మనీ లాండరింగ్ కేసులో ఈడీ ఆయనకు మంగళవారం సమన్లు జారీ చేసింది. బుధవారం ఉదయం 10.30కు పట్నాలోని ఈడీ కార్యాలయంలో ఆయనను నాలుగు గంటల పాటు విచారించింది. లాలూ వెంట ఆయన పెద్ద కుమార్తె మీసా భారతి ఉన్నారు. లాలూకు మద్దతుగా ఆర్జేడీ కార్యకర్తలు భారీగా ఈడీ కార్యాలయం వద్దకు చేరుకుని నినాదాలతో హోరెత్తించారు. కేసులో సహ నిందితులుగా ఉన్న లాలూ భార్య రబ్రీదేవి, పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్‌లను ఈడీ మంగళవారమే విచారించింది. తమను ఎంత వేధిస్తే అంత బలంగా తయారవుతామని విచారణ అనంతరం లాలూ చిన్న కుమారుడు తేజస్వి యాదవ్ మీడియాతో అన్నారు. ''ఈ కేసు రాజకీయ ప్రేరేపితం. నేను రాజకీయాల్లో లేకుంటే ఇందులోకి లాగేవారే కాదు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల తర్వాత దర్యాప్తు సంస్థల దృష్టి బిహార్‌పైనే పడుతుందని ముందే ఊహించాను' అని చెప్పారు.

సీసీటీవీల కేసులో సత్యేందర్ జైన్‌పై ఏసీబీ కేసు

న్యూఢిల్లీ: రూ.571 కోట్ల సీసీటీవీ కెమెరాల ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఆప్ నేత, మాజీ మంత్రి సత్యేందర్ జైన్‌పై ఢిల్లీ ప్రభుత్వ అవినీతి వ్యతిరేక విభాగం(ఏసీబీ) కేసు నమోదు చేసింది. ఉన్నతాధికారుల అనుమతితో సత్యేందర్ జైన్‌పై సెక్షన్ అవినీతి నిరోధక చట్టంలోని 17ఏ కింద కేసు నమోదు చేసినట్లు ఏసీబీ జాయింట్ కమిషనర్ మాధుర్ వర్మ చెప్పారు. ఢిల్లీ వ్యాప్తంగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడంలో జాప్యం చేసినందుకు భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) పై విధించిన రూ.16 కోట్ల నష్టపరిహారాన్ని జైన్ రూ.7 కోట్లు లంచం తీసుకుని ఏకపక్షంగా మాఫీ చేసినట్లు ఆరోపణలున్నాయన్నారు.

మినీ బస్సులో చెలరేగిన మంటలు

నలుగురు సజీవ దహనం, ఐదుగురికి గాయాలు

పుణె: పుణే సమీపంలో ఓ మినీ బస్సులో మంటలు చెలరేగడంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురు ఉద్యోగులు సజీవ దహనమయ్యారు. ఐదుగురికి గాయాలయ్యాయి. వ్యోమా గ్రాఫిక్స్‌కు చెందిన 12 మంది ఉద్యోగులను బుధవారం వార్జే నుంచి హింజేవాడి తీసుకెళ్తుండగా ఈ ఘటన జరిగింది. ఉదయం 7.30 గంటల ప్రాంతంలో బస్సు డసాల్ట్ సిస్టమ్స్ సమీపంలో ఉండగా డ్రైవర్ కాళ్ల దగ్గర మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని పసిగట్టి నలుగురు ఉద్యోగులు వెంటనే కిందకు దూకారు. ఎమర్జెన్సీ డోర్ తెరుచుకోకపోవడంతో వాహనం వెనక భాగంలో ఉన్నవారు దిగడానికి వీలవలేదు. దాంతో నిస్సహాయంగా మృత్యువాత పడ్డారు.

2024లో 26 లక్షల ఫిర్యాదుల పరిష్కారం

న్యూఢిల్లీ: 2024లో సెంట్రల్ పబ్లిక్ గ్రీవెన్సెస్ రిడ్రెసల్ అండ్ మానిటరింగ్ సిస్టమ్(సీపీగ్రామ్స్)కు ప్రజల నుంచి అందిన 26 లక్షలకు పైగా ఫిర్యాదులను పరిష్కరించినట్లు కేంద్రం తెలిపింది. సిబ్బంది వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ బుధవారం ఈ మేరకు లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. సీపీగ్రామ్స్‌లో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను 21 రోజుల కాలపరిమితిలోగా పరిష్కరించేందుకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. 2019-24 సంవత్సరాల మధ్యకాలంలో మొత్తం 1.15 కోట్ల ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. ఫిర్యాదుల పరిశీలన పరిష్కారానికి లక్ష మందికి పైగా అధికారులు పనిచేస్తున్నట్లు చెప్పారు.

రిటైర్మెంట్ వయస్సు మార్పు ప్రతిపాదనేదీ లేదు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు మార్పునకు సంబంధించిన ప్రతిపాదనేదీ తమ పరిశీలనలో లేదని సిబ్బంది వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. ఈ విషయమై ఉద్యోగ సంఘాలు, సంస్థల నుంచి ఎలాంటి ప్రతిపాదన కూడా రాలేదని స్పష్టం చేశారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఈ మేరకు లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. అదేవిధంగా, ఉద్యోగుల రిటైర్మెంట్‌తో అయ్యే ఖాళీలను రద్దు చేసేందుకు విధానమేదీ ప్రభుత్వం వద్ద లేదని కూడా ఆయన అన్నారు.

టోల్ భారం తగ్గించేందుకు చర్యలు

న్యూఢిల్లీ: జాతీయ రహదారులపై వసూలు చేసే టోల్ చార్జీల్లో వినియోగదారులపై భారం తగ్గించేందుకు కేంద్రం చర్యలు ప్రారంభించింది. సహేతుకమైన రాయితీని అందించేందుకు రూపొందించిన విధానాన్ని త్వరలోనే ప్రకటిస్తామని కేంద్ర రోడ్డు రవాణా హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కారీ చెప్పారు. బుధవారం రాజ్యసభలో అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. జాతీయ రహదారిపై ఒకే సెక్షన్‌లో, ఒకే దిశలో 60 కిలోమీటర్ల లోపున టోల్‌ప్లాజా ఏర్పాటు చేయరాదన్న నిబంధనలకు అనుగుణంగానే చార్జీలు వసూలు చేస్తున్నారని చెప్పారు. 2019-20లో దేశంలో టోల్ ప్లాజాల వద్ద వసూలైన మొత్తం రూ.27 వేల కోట్లు కాగా, 2023-24 నాటికి ఇది ఏకంగా 35 శాతం పెరిగి రూ.64 వేల కోట్లకు చేరిందని మంత్రి వివరించారు.

ఐఐటీ మద్రాస్‌కు పూర్వ విద్యార్థి రూ.5 కోట్లు

సాక్షి, చెన్నై: ఐఐటీ మద్రాస్‌కు పూర్వ విద్యార్థి డాక్టర్ పరశురామ్ బాల సుబ్రమణియన్ రూ.5 కోట్లు విరాళంగా అందజేశారు. ఆక్వామాప్ పరిశోధన కేంద్రానికి ఈ మొత్తాన్ని అందించారు. ఈ సందర్భంగా మద్రాస్ ఐఐటీ ఆయన్ను విశిష్ట పూర్వ విద్యార్థి అవార్డుతో సత్కరించింది. ఆక్వామాప్ పరివర్తనాత్మక నీటి నిర్వహణ, విధానాల పరిష్కారాల కోసం పనిచేస్తుంది. ఈ కేంద్రం భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు(పీఎస్ఏ) కార్యాలయం ఆధ్వర్యంలో పనిచేస్తుంది. 2022లో డాక్టర్ పరశురామ్ బాలసుబ్రమణియన్, ఇతిహాస రీసెర్చ్ అండ్ డిజిటల్ అధ్యక్షుడు శ్రీకృష్ణన్ నారాయణన్ కలిసి ఆక్వా మాప్‌ను స్థాపించారు. పరశురామ్ ఐఐటీ మద్రాస్ నుంచి ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్‌లో పట్టభద్రుడయ్యారు.

మావోయిస్టుల డంప్ స్వాధీనం

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా దంతేశపురం అటవీ ప్రాంతంలో మావోయిస్టుల డంప్‌ను భద్రతా బలగాలు బుధవారం స్వాధీనం చేసుకున్నాయి. బెజ్జి పోలీస్ స్టేషన్ పరిధిలోని బోడ్రాజ్‌పదర్, మైలాసూర్, దంతేశపురం, కంగల్‌టాంగ్ సమీప అటవీ ప్రాంతాల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో జిల్లా పోలీసులు, డీఆర్జీ బలగాలు సంయుక్తంగా గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో దంతేశపురం అటవీ ప్రాంతంలో మావోయిస్టులు దాచిపెట్టిన బీజీఎల్ లాంచర్ సహా పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకుని క్యాంపునకు తరలించారు.

గాజాలోని ఐరాస అతిథిగృహంపై దాడి

డెయిర్ అల్-బలాహ్: గాజాలోని ఐరాస అతిథి గృహంపై బాంబు దాడి జరిగింది. బుధవారం జరిగిన ఈ ఘటనలో ఒక ఉద్యోగి చనిపోగా ఐదుగురు గాయపడినట్లు ఐరాస తెలిపింది. దాడికి పాల్పడింది ఎవరు; బాధితులు ఏ దేశానికి చెందిన వారో వివరించలేదు. మంగళవారం నుంచి గాజాపై ఇజ్రాయెల్ భీకరదాడులు మొదలు పెట్టడం తెల్సిందే.

విదేశీ పర్యటనకు అనుమతివ్వండి

బాంబే హైకోర్టుకు ప్రొఫెసర్ తెల్‌తుంబ్డే వినతి

ముంబై: విదేశీ పర్యటనకు అనుమతివ్వాలంటూ ఎల్గార్ పరిషత్ కేసులో నిందితుడు ప్రొఫెసర్ ఆనంద్ తెల్‌తుంబ్డే బుధవారం బాంబే హైకోర్టును ఆశ్రయించారు. జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) వద్ద ఉన్న తన పాస్‌పోర్టును అప్పగించేలా ఆదేశాలివ్వాలన్నారు. ముంబైను వీడి వెళ్లరాదని, పాస్‌పోర్టును ఎన్ఐఏకి అప్పగించాలనే షరతుతో ఎల్గార్ పరిషత్ కేసులో న్యాయస్థానం ఆయనకు బెయిలిచ్చింది. అయితే, నెదర్లాండ్స్, యూకేల్లోని వర్సిటీలు సెమినార్లు, ప్రసంగాల కోసం తనకు ఆహ్వానాలు పంపాయని తెల్‌తుంబ్డే కోర్టుకు విన్నవించారు. ఈ మేరకు ఏప్రిల్ 14, మే 21వ తేదీల మధ్య అనుమతిస్తే సరిపోతుందని వివరించారు. ప్రొఫెసర్ తెల్‌తుంబ్డే వాదనలను ఎన్ఐఏ న్యాయవాదులు తోసిపుచ్చారు. దిగువ కోర్టుకు వెళ్లకుండా హైకోర్టుకు రావడం సరికాదన్నారు. పిటిషన్‌పై తదుపరి విచారణను ఏప్రిల్ 2వ తేదీకి న్యాయస్థానం వాయిదా వేసింది.

వలసదారుల పడవ మునక

ఆరుగురు మృతి.. 40 మంది గల్లంతు

మిలాన్: మధ్యధరా సముద్రంలో ట్యునీషియా నుంచి వస్తున్నరబ్బర్‌డింగీ మునిగిన ఘటనలో ఆరు మృతదేహాలు లభ్యమైనట్లు ఇటలీ తీర రక్షక దళం తెలిపింది. నలుగురు మహిళలు సహా 10 మందిని మంగళవారం కాపాడామని, గల్లంతైన 40 మంది జాడ కోసం గాలిస్తున్నామంది. లంపెడుసా దీవికి సమీపంలో సముద్రంలో అల్లకల్లోల పరిస్థితుల కారణంగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు వెల్లడించింది. బాధితులు కామెరూన్, ఐవరీ కోస్ట్, గినియా, మాలి దేశాలకు చెందిన వారని సమాచారం.

హింస సమాజానికి మంచిది కాదు: ఆర్‌ఎస్‌ఎస్

బెంగళూరు: నాగ్‌పూర్‌లో ఇటీవల చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలను రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) ఖండించింది. ఏ రూపంలో ఉన్నా హింస సమాజానికి మంచిది కాదని పేర్కొంది. 17వ శతాబ్దంనాటి మొగల్ చక్రవర్తి ఔరంగజేబ్ సమాధి అంశం ప్రస్తుతానికి తగిన అంశం కాదంటూ వ్యాఖ్యానించింది. 21 నుంచి బెంగళూరులో జరిగే ఆర్‌ఎస్‌ఎస్ జాతీయ స్థాయి సమావేశాల సందర్భంగా బుధవారం సంస్థ ప్రధాన ప్రతినిధి సునీల్ అంబేకర్ మీడియాతో మాట్లాడారు. ఔరంగజేబ్ సమాధిని వేరే చోటుకు మార్చాలనే డిమాండ్ ప్రస్తుతానికి తగిన అంశం కాదని ఆయన పేర్కొన్నారు.

దేశంలోకెల్లా ధనిక, పేద ఎమ్మెల్యేలు... ఇద్దరూ బీజేపీవారే

ముంబైలోని ఘట్కోపర్ ఈస్ట్ ఎమ్మెల్యే ఆస్తులు రూ. 3,400 కోట్లు

పశ్చిమబెంగాల్‌లోని ఇండస్ ఎమ్మెల్యే ఆస్తి కేవలం రూ.1,700



పరాగ్ షా



నిర్మల్ కుమార్ ధార

న్యూఢిల్లీ: దేశంలోనే అత్యంత ధనిక ఎమ్మెల్యే, అత్యంత పేద ఎమ్మెల్యే ఇద్దరూ బీజేపీకి చెందినవారే. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) నివేదిక ఈ మేరకు వెల్లడించింది. 28 అసెంబ్లీలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లోని 4,092 మంది ఎమ్మెల్యేల ఆస్తులను వారి అఫిడవిట్ల ఆధారంగా సంస్థ అధ్యయనం చేసింది. వారి మొత్తం ఆస్తులు మూడు చిన్న రాష్ట్రాల వార్షికబడ్జెట్‌ను మించిపోవడం విశేషం. ముంబైలోని ఘట్కోపర్ ఈస్ట్ బీజేపీ ఎమ్మెల్యే పరాగ్ షా రూ.3,400 కోట్ల ఆస్తులతో దేశంలోనే అత్యంత ధనిక ఎమ్మెల్యేగా నిలిచారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ రూ.1,413 కోట్ల సంపదతో రెండో స్థానంలో ఉన్నారు. కర్నాటకలో మొత్తం 223 మంది ఎమ్మెల్యేలకు కలిపి రూ.14,179 కోట్ల ఆస్తులుండగా మహారాష్ట్రలోని 286 మంది ఎమ్మెల్యేలదగ్గర రూ.12,424 కోట్ల సంపద ఉంది.

మూడు రాష్ట్రాల వార్షిక బడ్జెట్‌ను మించి...

4,092 మంది ఎమ్మెల్యేల ఆస్తుల విలువ రూ.73,348 కోట్లు. ఇది 2023-24లో మేఘాలయ (రూ.22,022 కోట్లు), నాగాలాండ్ (రూ.23,086 కోట్లు), త్రిపుర (రూ.26,892 కోట్లు) రాష్ట్రాల ఉమ్మడి వార్షిక బడ్జెట్ల కంటే ఎక్కువ. ప్రధాన పార్టీల్లో బీజేపీ ఎమ్మెల్యేలకు అత్యధిక ఆస్తులున్నాయి. ఆ పార్టీకి చెందిన 1,653 మంది రూ. 26,270 కోట్ల ఆస్తులు కలిగి ఉన్నారు. 646 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు రూ.17,357 కోట్ల సంపద ఉంది. 134 టీడీపీ ఎమ్మెల్యేల మొత్తం సంపద రూ.9,108 కోట్లు. 59 మంది శివసేన ఎమ్మెల్యేల వద్ద రూ.1,758 కోట్లున్నాయి.

నిరుపేద ఎమ్మెల్యే నిర్మల్ కుమార్

పశ్చిమబెంగాల్‌లోని ఇండస్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ ఎమ్మెల్యే నిర్మల్ కుమార్ ధార అత్యంత పేద ఎమ్మెల్యేగా నిలిచారు. ఆయన ఆస్తుల విలువ కేవలం రూ.1,700 మాత్రమే. అత్యల్ప ఆస్తులు కలిగిన ఎమ్మెల్యేలున్న రాష్ట్రాలుగా త్రిపుర, మణిపూర్, పుదుచ్చేరి నిలిచాయి. 60 మంది త్రిపుర ఎమ్మెల్యేల మొత్తం ఆస్తులు రూ.90 కోట్లు. మణిపూర్‌లోని 59 మంది ఎమ్మెల్యేలకు రూ.222 కోట్లు, పుదుచ్చేరిలో 30 మంది ఎమ్మెల్యేలకు రూ.297 కోట్ల ఆస్తులున్నాయి.



ఉక్రెయిన్ సుమీ ప్రాంతంలోని ఓ భవనంలో చెలరేగిన మంటలు

విరామం అంటూనే విరుచుకుపడింది

ఉక్రెయిన్‌పై రష్యా భీకరదాడులు

కీవ్: అగ్రరాజ్యం అమెరికా ప్రోద్బలంతో కాల్పుల విరమణకు దాదాపు తలూపిన రష్యా చిట్టచివర్లో తల ఎగరేసింది. శాంతిని కోరుకుంటున్నామని, 30 రోజులపాటు ఉక్రెయిన్ ఇంధన, మౌలిక వసతులపై దాడులు చేయబోమని సూత్రప్రాయ అంగీకారానికి సిద్ధపడిన రష్యా వెనువెంటనే సమర నినాదం చేసింది. మంగళవారం రాత్రి నుంచి నిరాటంకంగా రష్యా డ్రోన్లు జనావాసాలపై దాడులు చేస్తున్నాయని ఉక్రెయిన్ బుధవారం ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో దాదాపు గంటకుపైగా ఫోన్‌లో సంభాషించిన కొద్దిగంటలకే రష్యా మళ్లీ తన భీకర దాడులను మొదలుపెట్టడం గమనార్హం. దాడులు ఆపబోమని తాజా ఘటనతో రష్యా చెప్పేసిందని, సమీ పట్టణంలోని ఒక ఆస్పత్రిపై, ప్రజల ఇళ్లపై డ్రోన్ల దాడులు జరిగాయి. ముఖ్యంగా డోనెట్స్క్ ప్రాంతంలోని నగరాలపై 150 డ్రోన్ల దాడులు జరిగాయి. వీటితోపాటు కీవ్, ఝిటోమిర్, చెర్నిహీవ్, పోల్టావా, ఖర్కీవ్, కిరోవోహర్డ్, డినిప్రోపెట్రోవ్స్క్, చెర్కసే ప్రాంతాలపైనా డ్రోన్లు విరుచుకుపడ్డాయి. అయితే ప్రాణనష్టం వివరాలు వెల్లడికాలేదు. ఉక్రెయిన్ సైతం డ్రోన్లకు పనిచెప్పింది. రష్యా ప్రాంతాలపై డ్రోన్ దాడులుచేసింది. 57 డ్రోన్లను కూల్చేశామని రష్యా ప్రకటించింది. చమురు శుద్ధి కర్మాగారాలపై దాడులు చేస్తోందని ఆరోపించింది. ''కాల్పుల విరమణ చర్చల వేళ ఇలా దాడులతో ఉక్రెయిన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. దీంతో చర్చలు రైలు పట్టాలు తప్పే ప్రమాదమొచ్చింది'' అని రష్యా రక్షణ శాఖ ఆగ్రహం వ్యక్తంచేసింది.

నాగ్‌పూర్ అల్లర్ల కేసులో ఎండీపీ నేత ఫహీమ్ అరెస్ట్

నాగ్‌పూర్: మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధిని కూల్చాలంటూ మహారాష్ట్రలో విశ్వహిందూ పరిషత్ ఇచ్చిన పిలుపుతో మొదలైన ఆందోళనలు చివరకు భారీస్థాయిలో అల్లర్లకు దారితీసిన ఘటనలో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న మైనారిటీ డెమొక్రటిక్ పార్టీ నేత ఫహీమ్ ఖాన్‌ను పోలీసులు అరెస్ట్‌చేశారు. ఫహీమ్‌ను యశోధరానగర్ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఇతనితోపాటు మరో 26 మంది నిందితులను కోర్టు మార్చి 21వ తేదీదాకా పోలీస్‌కస్టడీకి అప్పగిస్తూ ఆదేశాలిచ్చింది. ఛత్రపతి శంభాజీనగర్ జిల్లాలో సోమవారం బజరంగ్ దళ్, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో జరిగిన ఒక నిరసన కార్యక్రమంలో పవిత్ర వాక్యాలు రాసి ఉన్న ఒక వస్త్రాన్ని తగలబెట్టారన్న పుకార్లు వ్యాపించాయి. దీంతో మరో వర్గానికి చెందిన వందలాది మంది ఆందోళనకారులు సెంట్రల్ నాగ్‌పూర్‌లోని పలు ప్రాంతాల్లో అల్లర్లకు, పోలీసులతో ఘర్షణలకు దిగిన విషయం విదితమే. ఈ సందర్భంగా నమోదైన ఆరు ఎఫ్ఐఆర్‌లలో ఒకదాంట్లో ఫహీమ్ పేరు ప్రస్తావించి ఉంది. దీంతో ఫహీమ్‌ను అరెస్ట్‌చేశామని పోలీసులు చెబుతున్నారు. సోమవారం గణేశ్‌పేట్ పోలీస్‌స్టేషన్ బయట దాదాపు 60 మంది ఆందోళనకారులు చుట్టుముట్టిన ఘటనలో వాళ్లందర్నీ ఫహీమ్ ఖాన్ వెంటతీసుకొచ్చారని పోలీసులు ఆరోపిస్తున్నారు. తర్వాత భల్దార్‌పూర్‌లోని శివాజీ మహరాజ్ చౌక్ వద్ద అప్పటికే గుమిగూడిన దాదాపు 600 మంది ఆందోళనకారులకు కొత్తగా ఫహీమ్ ఖాన్, మరో ఎనిమిది మంది జతకలిశారని పోలీసులు తెలిపారు. అయితే ఖాన్‌ను ఎక్కడ, ఎప్పుడు అరెస్ట్‌చేశారనే వివరాలను పోలీసులు వెల్లడించలేదు. అల్లర్లను నడిపిస్తున్నదెవరో తేలాల్సి ఉందన్నారు.

మహిళా పోలీసులతో అల్లరిమూక అసభ్య ప్రవర్తన

అల్లర్లను సందర్భంగా మహిళా పోలీసులతో అల్లరిమూక అసభ్యంగా ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఒక మహిళా పోలీసు అధికారి దీనిపై ఫిర్యాదు చేశారు. ''మహిళా పోలీస్ ఆఫీసర్‌తో అల్లరిమూక అసభ్యంగా ప్రవర్తించింది. యూనిఫామ్‌ను లాగి అసభ్యంగా తాకాలని ప్రయత్నించింది. అనుచిత వ్యాఖ్యలు చేసింది. ఇతర మహిళా పోలీసులకేసి తప్పుడు సైగలు చేసింది. లేడీ ఆఫీసర్ ఫిర్యాదుతో ఆర్‌సీపీ బలగాలు రంగంలోకి దిగేలోపు పోలీసులను భయపెట్టేందుకు ప్రయత్నించింది''అని పేర్కొన్నారు. అల్లర్ల ఘటనలో 54 మందిని అరెస్టు చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. పోలీసులపైనే దాడికి తెగించిన మూకలను వదిలిపెట్టబోమని, కఠినంగా శిక్షించి తీరతామని ప్రకటించింది.

సీఐఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్ కొలువులు



ప్రభుత్వరంగ సంస్థలకు భద్రతను కల్పించే సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) పలు ఉద్యోగాలకు ప్రకటన విడుదల చేసింది. కేంద్ర హోంశాఖకు చెందిన ఈ సంస్థ అణుశక్తి ప్లాంట్లు, స్పేస్ స్టేషన్లు, కరెన్సీ నోట్ ప్రెస్, నౌకాశ్రయాలు, ఎయిర్‌పోర్టులు, స్టీల్‌ప్లాంట్లు, హైడ్రాలిక్/థర్మల్ పవర్‌ప్లాంట్లు తదితర సంస్థల భద్రతను చేపడుతుంది. తాజాగా ఈ సంస్థ 1,161 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. ఈ నేపథ్యంలో సీఐఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్ కొలువుల వివరాలు..

మొత్తం పోస్టులు: 1,116

- విభాగాలవారీగా.. కానిస్టేబుల్/కుక్-493, కానిస్టేబుల్/కాబ్లర్-09, కానిస్టేబుల్/టైలర్-23, కానిస్టేబుల్/బార్బర్-199, కానిస్టేబుల్/వాషర్మెన్-262, కానిస్టేబుల్/స్వీపర్ -152, కానిస్టేబుల్/పెయింటర్-02, కానిస్టేబుల్/ కార్పెంటర్-09, కానిస్టేబుల్/ఎలక్ట్రీషియన్-04, కానిస్టేబుల్/మెయిల్-04, కానిస్టేబుల్/వెల్డర్-01, కానిస్టేబుల్/చార్జ్ మెకానిక్: 01, కానిస్టేబుల్/ఎంపీ అటెండెంట్-02 ఉన్నాయి.

అర్హతలు

- ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ట్రేడ్ టెస్ట్, రాత పరీక్ష, డిటైల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్, రివ్యూ మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- రాత పరీక్షను ఓఎంఆర్/కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో ఇంగ్లిష్, హిందీ భాషల్లో నిర్వహిస్తారు. పీఎస్‌టీ/పీఈటీ, డాక్యుమెంటేషన్ అండ్ ట్రేడ్ టెస్ట్ తర్వాత రాత పరీక్ష ఉంటుంది. అన్ని దశల్లోనూ ఉత్తీర్ణులైన వారికి చివరగా మెడికల్ టెస్టులను నిర్వహిస్తారు. రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగానే తుది ఎంపిక జరుగుతుంది.

వయసు

- 21 నుంచి 27 సంవత్సరాల మధ్య ఉండాలి. ప్రభుత్వ/సీఐఎస్ఎఫ్ ఉద్యోగులకు గరిష్ఠ వయసులో మినహాయింపు ఉంటుంది.
- సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్(జీడీ), కానిస్టేబుల్(ఫైర్), కానిస్టేబుల్(ట్రేడ్స్ మెన్)గా పనిచేసిన జనరల్, ఓబీసీ అభ్యర్థులకు 40 ఏళ్ల వరకూ సడలింపు ఉంటుంది.
- ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 ఏళ్ల వరకూ మినహాయింపు ఉంటుంది. వీరంతా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మూడేళ్ల సర్వీసును విజయవంతంగా పూర్తిచేయాలి.
- ప్రతి విభాగంలోనూ 10 శాతం ఖాళీలను ఎక్స్-సర్వీస్‌మెన్‌లకు రిజర్వు చేస్తారు.

శారీరక ప్రమాణాలు

165 సెం.మీ. ఎత్తు, ఛాతీ కొలత 80-85 సెం.మీ. ఉండాలి. మహిళలు 155 సెం.మీ ఉండాలి, ఛాతీ 78-83 సెం.మీ. ఉండాలి. ఎత్తు, వయసుకు తగ్గ బరువు ఉండాలి. హైట్‌బార్ టెస్ట్‌లో గెలుపొందిన అభ్యర్థులకు మాత్రమే ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ (పీఎస్‌టీ) నిర్వహిస్తారు.

ఫిజికల్ ఎఫీషియెన్సీ టెస్ట్

ఈ పరీక్షలో భాగంగా 1.6 కిలో మీటర్ల పరుగును 6 నిమిషాల, 30 సెకన్లలో పూర్తిచేయాలి. 11 అడుగుల లాంగ్‌జంప్ మూడు ప్రయత్నాల్లో చేయగలగాలి. 3 అడుగుల, 6 అంగుళాల హైజంప్ మూడు ప్రయత్నాల్లో పూర్తిచేయాలి. ఈ మూడింటిలో ఒక్కదాంట్లో అర్హత సాధించలేకపోయినా అభ్యర్థులను తర్వాతి దశకు ఎంపిక చేయరు.

వంద మార్కులకు రాత పరీక్ష

ఓఎంఆర్/కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో 100 ప్రశ్నలు-100 మార్కులకు రాత పరీక్ష నిర్వహిస్తారు. జనరల్ నాలెడ్జ్, ఎలిమెంటరీ మేథమెటిక్స్, అనలిటికల్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్/హిందీ ప్రాథమిక పరిజ్ఞానాన్ని పరీక్షించే విధంగా ప్రశ్నపత్రం ఉంటుంది. ఈ పరీక్ష పదో తరగతి స్థాయిలో ఉంటుంది. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ విధానంలో మల్టిపుల్ ఛాయిస్‌లో ఉంటాయి. నెగెటివ్ మార్కింగ్ ఉండదు.

ముఖ్యమైన సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 03.04.2025
- వెబ్‌సైట్: https://cisfrectt.cisf.gov.in

విద్య, ఉద్యోగ సమాచారం

పాలిసెట్-2025

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్.. పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2025ను నిర్వహిస్తుంది. ఇందులో ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి.
» **పరీక్ష విధానం:** మొత్తం 120 ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలు ఉంటాయి. మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు వస్తాయి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.04.2025.
» **పరీక్ష తేది:** 30.04.2025(ఆఫ్‌లైన్ విధానంలో జరుగుతుంది).
» వెబ్‌సైట్: http://polycetap.nic.in

తెలంగాణ బీసీ గురుకులాల్లో 6, 7, 8, 9 తరగతుల్లో ప్రవేశాలు

తెలంగాణ రాష్ట్రంలో మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి బీసీ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9వ తరగతుల్లో (ఇంగ్లిష్ మీడియం) ప్రవేశాలకు అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, అనాథ బాల బాలికల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** విద్యార్థులు సంబంధిత జిల్లాలోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2022-23 లేదా 2023-24 విద్యా సంవత్సరం విద్యను అభ్యసించి ఉండాలి. ఆరో తరగతికి సంబంధించి ఐదో తరగతి, ఏడో తరగతికి సంబంధించి ఆరో తరగతి, ఎనిమిదో తరగతికి సంబంధించి ఏడో తరగతి, తొమ్మిదో తరగతికి సంబంధించి ఎనిమిదో తరగతి చదివి ఉండాలి. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు రూ.1,50,000, పట్టణ ప్రాంత విద్యార్థులకు రూ.2,00,000లకు మించకూడదు.
» **వయసు:** 31.08.2025 నాటికి ఆరో తరగతికి పన్నెండేళ్లు, ఏడో తరగతికి పదమూడేళ్లు, ఎనిమిదో తరగతికి పద్నాలుగేళ్లు, తొమ్మిదో తరగతికి పదిహేనేళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **పరీక్ష విధానం:** మొత్తం 100 మార్కులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. తెలుగు (15 మార్కులు), లెక్కలు(30 మార్కులు), సామాన్య శాస్త్రం(15 మార్కులు), సాంఘిక శాస్త్రం(15 మార్కులు), ఇంగ్లిష్(25 మార్కులు) సబ్జెక్టుల నుంచి ఆబ్జెక్టివ్ విధానంలో ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం 2 గంటలు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.03.2025.
» **హాల్‌టికెట్ డౌన్‌లోడ్ తేది:** 15.04.2025.
» **ప్రవేశ పరీక్షతేది:** 20.04.2025
» **వెబ్‌సైట్:** https://mjptbcwreis.telangana.gov.in

సీఎస్ఐఆర్-ఎన్‌జీఆర్ఐ, హైదరాబాద్‌లో 19 సైంటిస్ట్ పోస్టులు

సీఎస్ఐఆర్-నేషనల్ జియోగ్రాఫికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌జీఆర్ఐ)లో సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 19.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 21.04.2025 నాటికి 32 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.1,37,907.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా .
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.04.2025.
» **వెబ్‌సైట్:** https://www.ngri.res.in

ఐఐపీఈ, విశాఖపట్నంలో నాన్ టీచింగ్ పోస్టులు

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ(ఐఐపీఈ) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
» **పోస్టుల వివరాలు:** సూపరింటెండెంట్-01, అసిస్టెంట్ రిజిస్ట్రార్-02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** సూపరింటెండెంట్ ఇంజనీర్‌కు 50 ఏళ్లు, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌కు 40 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.03.2025.
» **వెబ్‌సైట్:** https://iipe.ac.in

ఎస్ఈసీఆర్, బిలాస్‌పూర్‌లో 835 అప్రెంటిస్‌లు

సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే బిలాస్‌పూర్‌లోని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ట్రేడ్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 835.
» **ఖాళీల వివరాలు:** కార్పెంటర్-38, సీవోపీఏ-100, డ్రాఫ్ట్స్‌మన్(సివిల్)-11, ఎలక్ట్రీషియన్-182, ఎలక్ట్రీషియన్(మెకానిక్)-05, ఫిట్టర్-208, మెషినిస్ట్-04, పెయింటర్-45, ప్లంబర్-25, మెకానిక్(ఏఆర్‌సీ)-40, ఎస్ఎండబ్ల్యూ-04, స్టెనో(ఇంగ్లిష్)-27, స్టెనో(హిందీ)-19, డీజిల్ మెకానిక్-08, టర్నర్-04, వెల్డర్-19, వైర్‌మెన్-90, కెమికల్ ల్యాబొరేటరీ అసిస్టెంట్-04, డిజిటల్ ఫోటోగ్రాఫర్-02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 25.03.2025 నాటికి 15 నుంచి 24 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.03.2025.
» **వెబ్‌సైట్:** https://secr.indianrailways.gov.in

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్‌లో వివిధ ఉద్యోగాలు

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్(ఓఎఫ్ఎంకే)లో ఒప్పంద ప్రాతిపదికన ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.


» **మొత్తం పోస్టుల సంఖ్య:** 07.
» **పోస్టుల వివరాలు:** అనాలసిస్ ఇంజనీర్-1, డిజైన్ ఇంజనీర్(మెకానికల్)-4, డిజైన్ ఇంజనీర్(ఎలక్ట్రికల్)-1, డిజైన్ అసిస్టెంట్(ఎలక్ట్రికల్)-1.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్(మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్)లో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 15.03.2025 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు అనాలసిస్ ఇంజనీర్‌కు రూ.60,000, డిజైన్ ఇంజనీర్‌కు రూ.50,000, డిజైన్ అసిస్టెంట్‌కు రూ.40,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డిప్యూటీ జనరల్ మేనేజర్/హెచ్‌ఆర్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్, ఎద్దుమైలారం, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ-502205 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 04.04.2025.
» **వెబ్‌సైట్:** https://avnl.co.in





ఏపీ ఈసెట్-2025

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి (ఏపీఎస్‌సీహెచ్ఈ).. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పాలిటెక్నిక్ డిప్లొమా, బీఎస్సీ(మ్యాథమేటిక్స్) ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏపీ ఈసెట్)-2025 నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా బీఈ/బీటెక్/బీఫార్మసీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ విధానంలో రెండో సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తారు. దీన్ని అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్శిటీ(జేఎన్‌టీయూ-ఎ) నిర్వహిస్తోంది.

» **కోర్సులు:** బీఈ/బీటెక్/బీఫార్మసీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ.
» **అర్హత:** పాలిటెక్నిక్ డిప్లొమా, బీఎస్సీ(మ్యాథమేటిక్స్) ఉత్తీర్ణులవ్వాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ద్వారా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.04.2025.
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 24.03.2025 నుంచి 26.03.2025 వరకు
» **హాల్ టికెట్ డౌన్‌లోడ్ ప్రారంభతేది:**01.05.2025
» **పరీక్ష తేది:** 06.05.2025.
» **వెబ్‌సైట్:** https://cets.apsche.ap.gov.in

విద్యుత్ జనరేటర్ ఆవిష్కర్త ఎవరు?



1. ఒక సెకండ్ల లోలకం పొడవు 100 సెం.మీ. దాని పొడవును మార్చిన డోలనావర్తన కాలం ఒక సెకనుకు మారినప్పుడు దాని పొడవు? (సెం.మీ.లలో)
1) 100 2) 50 3) 25 4) 75
2. అత్యంత కచ్చితంగా కాలాన్ని కొలిచే సాధనాలు?
1) చేతి గడియారాలు
2) పరమాణు గడియారాలు
3) నీటి గడియారాలు 4) పైవన్నీ
3. విమానాల తయారీలో ఇమిడి ఉన్న సూత్రం?
1) పాస్కల్ సూత్రం 2) బాయిల్ సూత్రం
3) ఆర్కిమెడీస్ సూత్రం
4) బెర్నౌలీ సూత్రం
4. నీటి కాఠిన్యతకు కారణమైనవి
1) కాల్షియం, మెగ్నీషియంల బైకార్బొనేట్లు
2) కాల్షియం,మెగ్నీషియంల క్లోరైడ్లు, సల్ఫేట్లు
3) కాల్షియం, మెగ్నీషియంల నైట్రేట్లు
4) కాల్షియం, మెగ్నీషియంల కార్బొనేట్లు
5. 1986లో కనిపించిన హేలీ తోకచుక్క మళ్లీ ఏ సంవత్సరంలో కనిపిస్తుంది?
1) 2062 2) 2022 3) 2046 4) 2056
6. వేసవిలో తారురోడ్డుపై ప్రయాణిస్తున్నప్పుడు దూరంగా నీరు ఉన్నట్లు కనిపిస్తుంది. దీనికి కారణం?
1) కాంతి పరావర్తనం 2) కాంతి ధృవణం
3) సంపూర్ణాంతర పరావర్తనం
4) కాంతి వివర్తనం
7. 0 డిగ్రీల సెంటీగ్రేడు వద్ద గాలిలో ధ్వనివేగం 332 మీ/సె. అయిన 1 డిగ్రీ సెంటీగ్రేడు ఉష్ణోగ్రత పెరిగితే అప్పుడు గాలిలో ధ్వని వేగం (మీ/సెలలో)
1) 332.608 2) 332
3) 330.608 4) 332.680
8. కిందివాటిలో తిర్యక్ తరంగాలు
1) స్ప్రింగ్‌లో ఏర్పడే తరంగాలు
2) కాంతి తరంగాలు 3) నీటి తరంగాలు
4) కాంతి, నీటి తరంగాలు
9. అత్యధిక కెలోరిఫిక్ విలువ గల పదార్థం?
1) అరటి పండు 2) గోధుమలు
3) మాంసం 4) వేరుసెనగ
10. ఆల్ఫా, బీటా, గామాల నిష్పత్తి
1) 3 : 2 : 1 2) 1 : 2 : 3
3) 1 : 3 : 2 4) 2 : 1 : 3
11. దూరపు వస్తువుల్ని మాత్రమే చూడగలిగి, దగ్గరి వస్తువుల్ని చూడలేనప్పుడు దృష్టి సవరణకు ఏ కటకాన్ని ఉపయోగిస్తారు?
1) కుంభాకార 2) పుటాకార
3) ద్వి పుటాకార 4) పైవన్నీ
12. న్యూటన్ మూడో గమన సూత్రం ఆధారంగా పనిచేసేది?
1) హెలికాప్టర్ 2) రైలు
3) రాకెట్ 4) విమానం
13. విశ్వ గురుత్వ స్థిరాంకం 'G'కు ప్రమాణం
1) Nm^2Kg^2 2) Nm^2Kg^{-2}
3) N^2m^2Kg 4) $Nm^{-2}Kg^{-2}$
14. పెట్రోలియంలో పెట్రో అనగా లాటిన్‌లో ?
1) నూనె 2) రాయి
3) మండుట 4) వాసన
15. 0.1 కిలోగ్రాముల బరువున్న ఒక పక్షి భూమికి 10 మీటర్ల ఎత్తులోని చెట్టు కొమ్మపై ఉన్న దాని స్థితిశక్తి?
1) 4.9 జౌల్స్ 2) 9.8 జౌల్స్
3) 20 జౌల్స్ 4) 0.1 జౌల్స్
16. ఓడలలో లంగరును పైకెత్తుటకు ఉపయోగించేది?
1) స్క్రూ జాక్ 2) విండ్‌లాస్
3) కాప్‌స్టన్ 4) వించ్
17. ద్రవాల విశిష్ట సాంద్రతను కనుగొనడానికి ఉపయోగించే పరికరం?
1) లాక్టో మీటర్ 2) హైడ్రో మీటర్
3) పైరో మీటర్ 4) బారో మీటర్
18. విద్యుదయస్కాంతాల తయారీకి ఉపయోగించేది?
1) ఉక్కు 2) మెత్తని ఇనుము
3) నిక్రోమ్ 4) మాంగనీస్
19. ఫెర్రో అయస్కాంతాల సాపేక్ష ప్రవేశ్య శీలత?
1) $\mu_r \leq 1$ 2) $\mu_r > 1$
3) $\mu_r = 1$ 4) $\mu_r >> 1$
20. కిందివాటిలో విద్యుత్ విశ్లేషణ అనువర్తనానికి ఉదాహరణ
1) ఎలక్ట్రో ప్లేటింగ్ 2) ఎలక్ట్రో టైపింగ్
3) లోహాల శుద్ధి 4) పైవన్నీ
21. లెడెన్ జాడీ అనేది ఒక
1) కెపాసిటర్ 2) అమ్మీటర్
3) వోల్ట్‌మీటర్ 4) ఓల్టా మీటర్
22. నిరోధానికి గుర్తు

1) 2)
3) 4)
23. డైనమో ఏ నిబంధన ఆధారంగా పనిచేస్తుంది?
1) లెంజ్ నియమం
2) ఫ్లెమింగ్ కుడిచేతి నిబంధన
3) ఆంపియర్ 4) మాక్స్‌వెల్
24. ఒక రేడియో ధార్మిక మూలకం అర్ధ జీవిత కాలం 6.93 రోజులు. దాని విఘటన స్థిరాంకం?
1) 0.1 రోజు$^{-1}$ 2) 00.1 రోజు$^{-1}$
3) 100 రోజులు 4) 1000 రోజులు
25. కింది వాటిలో ఐసోబార్
1) ${}_1H^1$, ${}_1H^2$, ${}_1H^3$
2) ${}_{10}Ne^{20}$, ${}_{10}Ne^{21}$, ${}_{10}Ne^{22}$
3) ${}_6C^{13}$, ${}_7N^{13}$ 4) ఏదీకాదు
26. కింది వాటిలో యంత్ర భాష
1) బేసిక్ 2) కోబాల్
3) ఫోర్ట్రాన్ 4) అసెంబ్లర్
27.  సంకేతం
1) p-n-p ట్రాన్సిస్టర్
2) n-p-n ట్రాన్సిస్టర్
3) p-p-n ట్రాన్సిస్టర్
4) n-p-p ట్రాన్సిస్టర్
28. వాయు స్థిరాంకం R విలువ
1) 0.0821 లీ-అట్మా.మోల్$^{-1}$k^{-1}
2) 8.314×10^7 ఎర్గ్‌మోల్$^{-1}$k^{-1}
3) 1.987 కోల్.మోల్$^{-1}$k^{-1}
4) అన్నీ
29. కింది వాటిలో సరైంది
1) 3p<4s<4p<3d 2) 3p<4s<4d<2s
3) 3s<3p<4s<3d 4) 4p<3d<5p<6s
30. ఆర్బిటాల్ ప్రాదేశిక దృగ్విన్యాసాలను తెలియజేసే క్వాంటం సంఖ్య
1) ప్రధాన క్వాంటం సంఖ్య
2) అజిమూతల్ క్వాంటం సంఖ్య
3) అయస్కాంత క్వాంటం సంఖ్య
4) స్పిన్ క్వాంటం సంఖ్య
31. పరమాణు సంఖ్య 57 నుంచి 70 వరకు గల మూలకాల్ని ఏమంటారు?
1) లాంథనైడ్స్ 2) ఆక్టినైడ్స్
3) ఛాల్కో జెన్స్ 4) హాలోజెన్స్
32. ఆక్సైడ్‌లతో పాటు పెరాక్సైడ్‌లను ఏర్పరిచే మూలకం
1) Be 2) Ba 3) Ca 4) Sr
33. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ ఫార్ములా
1) $CaSo_4\ 2H_2o$ 2) $CaSo_4\ ½\ H_2o$
3) $CaSo_4$ 4) $Ca\ Co_3$
34. కోణీయ ఆకృతి గల అణువు
1) నీరు 2) బెంజీన్
3) అమ్మోనియా 4) బేరియం క్లోరైడ్
35. అంతరణుక హైడ్రోజన్ బంధాలు గల అణువుకు ఉదాహరణ
1) HF 2) సాలిసిలిక్ ఆమ్లం
3) 0- నైట్రో ఫినాల్ 4) 0- క్లోరో ఫినాల్
36. $H_2+I_2 \rightleftharpoons 2HI$ చర్యకు k_p, k_c మధ్య సంబంధం
1) $k_p < k_c$ 2) $k_p = k_c$
3) $k_p > k_c$ 4) $k_p >> k_c$
37. STP వద్ద 1 మోల్ వాయువు ఆక్రమించు ఘన పరిమాణం
1) 2.24 లీటర్లు 2) 0.224 లీటర్లు
3) 22.4 లీటర్లు 4) 224 లీటర్లు
38. క్షార గుణం కలిగిన మానవ శరీర ద్రవం
1) ఉమ్మి 2) మూత్రం
3) జఠర రసం 4) రక్తం
39. 750 మిల్లీ లీటర్ల 0.4 మోల్‌ల NaOH ద్రావణంలో NaOH ఉన్న మోల్‌ల సంఖ్య?
1) 0.03 2) 0.3 3) 3.1 4) 0.4
40. అత్యంత శ్రేష్ఠమైన బొగ్గు
1) బిట్యుమస్ 2) ఆంథ్ర సైట్
3) సెమీ బిట్యుమస్ 4) లిగ్నైట్
41. కిందివాటిలో ఏరోమాటిక్ సమ్మేళనం

1) 2) 3)
4) 1, 3
42. కిందివాటిలో మెటామెరిజం సాదృశ్యకాలు
1) nబ్యూటేన్, ఐసో బ్యూటేన్
2) 1- క్లోరో బ్యూటేన్, 2- క్లోరో బ్యూటేన్
3) 1- ప్రొపనోల్, మిథాక్సీ ఈథేన్
4) ఇథాక్సీ ఈథేన్, మిథాక్సీ ప్రొపేన్
43. 96 శాతం ఆల్కహాల్‌ను ఏమంటారు?
1) వాష్ 2) రెక్టిఫైడ్ స్పిరిట్
3) అబ్సల్యూట్ ఆల్కహాల్
4) వెనిగర్
44. మూడు క్షారాల వరుసను ఏమంటారు?
1) కోడన్ 2) ట్రాన్ స్క్రిప్షన్
3) రెప్లికేషన్ 4) ట్రాన్స్‌లేషన్
45. నీటిలో కరిగే విటమిన్
1) A 2) D 3) E 4) C
46. ద్రగలన ప్రక్రియకు ఉపయోగించే కొలిమి
1) రివర్బరేటర్ 2) షాఫ్ట్
3) బ్లాస్ట్ 4) ఓపెన్‌హార్త్
47. అల్నికో మిశ్రమ లోహ సంఘటనం
1) Fe+C 2) Fe+Al+Ni+Co
3) Fe+Ni+Cr+Mn 4) Fe+cr+Ni
48. ముఖానికి వాడే పౌడర్‌లో ఉన్న ఫాటీ ఆమ్ల లవణం
1) K^+ 2) Na^+ 3) Mg^{2+} 4) Li^+
49. దృశ్య పరికరాలు, విద్యుత్ బల్బుల తయారీలో ఉపయోగించే గాజు
1) సోడా గాజు 2) పైరెక్స్ గాజు
3) క్వార్ట్జ్ గాజు 4) ఫ్లింట్ గాజు
50. టాల్క్ రసాయన నామం
1) మెగ్నీషియం సిలికేట్
2) మెగ్నీషియం కార్బొనేట్
3) మెగ్నీషియం ఆక్సైడ్
4) కాల్షియం సిలికేట్
51. ఆస్ప్రిన్ మందు నిర్మాణం

1) 2)
3) 4)
52. వల్కనైజేషన్ ప్రక్రియలో రబ్బరును ఏ మూలకంతో కలుపుతారు.
1) ఫాస్ఫరస్ 2) సిలికాన్
3) జింక్ 4) సల్ఫర్
53. రెండు విషయాల మధ్య ఎలాంటి సంబంధం లేదని చెప్పే ప్రకల్పన
1) నల్ ప్రకల్పన 2) ప్రకటనాత్మక ప్రకల్పన
3) ప్రాగుక్తి ప్రకల్పన 4) ప్రశ్నా ప్రకల్పన
54. జ్ఞాన సముపార్జనకు దోహదపడేది
1) తర్కం 2) స్పందన
3) కంఠస్థం 4) అధికారత్వం
55. సౌర గడియారం, నీటి గడియారాలను మొదటిసారిగా తయారు చేసింది?
1) బాబిలోనియన్లు 2) చైనీయులు
3) ఈజిప్టియన్లు 4) గ్రీకులు
56. ఆన్ ది రివల్యూషన్ ఆఫ్ ద సెలిస్టియల్ స్పియర్స్ అనే గ్రంథ రచయిత?
1) కోపర్నికస్ 2) గెలీలియో
3) అరిస్టాటిల్ 4) గ్రాహంబెల్
57. విద్యుత్ జనరేటర్ ఆవిష్కర్త
1) ఆయర్‌స్టడ్ 2) మాక్స్‌వెల్
3) బ్రోగ్లీ 4) ఫారడే
58. తరగతిలో బోధనాభ్యసనా కార్యకలాపాల ద్వారా విద్యార్థుల్లో వచ్చే ప్రవర్తనా మార్పులు
1) ఆశయాలు 2) లక్ష్యాలు
3) స్పష్టీకరణలు 4) విలువలు
59. భావావేశ రంగంలో అత్యున్నత లక్ష్యం
1) వ్యవస్థాపన 2) శీల స్థాపన
3) విలువ కట్టడం 4) ప్రతిస్పందించడం
60. దోషాలను గుర్తించుట అనేది ఏ లక్ష్యానికి చెందిన స్పష్టీకరణ
1) నైపుణ్యం 2) జ్ఞానం
3) అవగాహన 4) వినియోగం
61. ఒక విద్యార్థి సాంద్రత, సాపేక్ష సాంద్రతల మధ్య తేడాల్ని గుర్తించాడు. అతడిలో నెరవేరిన లక్ష్యం
1) జ్ఞానం 2) అవగాహన
3) వినియోగం 4) నైపుణ్యం
62. NTSE అనగా
1) నేషనల్ టాలెంట్ సైన్స్ ఎడ్యుకేషన్
2) నేషనల్ టాలెంట్ సైన్స్ ఎగ్జామ్
3) నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్
4) నేషనల్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్ ఎంట్రన్స్
63. విద్యార్థి కేంద్ర పద్ధతి కానిది
1) ఉపన్యాస పద్ధతి 2) సమస్యా పద్ధతి
3) ప్రాజెక్ట్ పద్ధతి 4) ప్రయోగ పద్ధతి
64. సహజ పరిసరాల్లో సమస్యను సాధించే పద్ధతి
1) హ్యూరిస్టిక్ పద్ధతి 2) ఉపన్యాస పద్ధతి
3) నియోజన పద్ధతి 4) ప్రకల్పన పద్ధతి
65. ప్రయోగశాలలోని వస్తువుల్ని విద్యార్థులకు ఇచ్చేటప్పుడు వాటి వివరాలను ఏ రిజిస్టర్‌లో పొందుపరుస్తారు?
1) ఇష్యూ రిజిస్టర్ 2) ఆర్డర్ రిజిస్టర్
3) రిక్వైర్‌మెంట్ రిజిస్టర్
4) స్టాక్ రిజిస్టర్
66. బౌద్ధిక వనరులకు ఉదాహరణ
1) వ్యవసాయ క్షేత్రాలు
2) పరిశ్రమలు 3) వర్షాలు
4) ఇంజనీర్లు, డాక్టర్లు
67. పాఠశాలలో వైజ్ఞానిక సంఘానికి ప్రధాన పోషకకర్త
1) ఉపాధ్యాయుడు 2) విద్యార్థి
3) ప్రధానోపాధ్యాయుడు
4) జిల్లా విద్యాధికారి
68. కిందివాటిలో మౌఖిక పరీక్షకు ఉదాహరణ
1) లఘు సమాధాన పరీక్ష
2) డ్రాయింగ్ పరీక్ష 3) ఇంటర్వ్యూ
4) ప్రయోగ పరీక్ష
69. ఎడ్గర్‌డేల్ అనుభవ శంఖువులో పైభాగాన ఉండేవి
1) ప్రత్యక్ష అనుభవాలు
2) కల్పితానుభవాలు
3) శాబ్దిక చిహ్నాలు 4) క్షేత్ర పర్యటనలు
70. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన పాఠ్యాంశాలను ప్రసారం చేసేవి?
1) మన టీవీ
2) కేయూ బ్యాండ్ 3) సప్తగిరి
4) మన టీవీ, కేయూ బ్యాండ్

సమాధానాలు

1) 3	2) 2	3) 4	4) 2	5) 1
6) 3	7) 1	8) 4	9) 4	10) 2
11) 1	12) 3	13) 2	14) 2	15) 2
16) 3	17) 2	18) 2	19) 4	20) 4
21) 1	22) 2	23) 2	24) 1	25) 3
26) 4	27) 1	28) 4	29) 3	30) 3
31) 1	32) 2	33) 2	34) 1	35) 1
36) 2	37) 3	38) 4	39) 2	40) 2
41) 4	42) 4	43) 2	44) 1	45) 4
46) 3	47) 2	48) 3	49) 4	50) 1
51) 2	52) 4	53) 1	54) 3	55) 3
56) 1	57) 4	58) 2	59) 2	60) 3
61) 2	62) 3	63) 1	64) 4	65) 1
66) 4	67) 3	68) 3	69) 3	70) 4

కోడ్ భాషలో SUPER ను ఏ విధంగా రాస్తారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

మెంటల్ ఎబిలిటీ

కోడింగ్ - డీకోడింగ్

1. ఒక ప్రత్యేక భాషలో 'EXERCISE' అనే పదాన్ని 'MTMVYRCM' గా రాస్తే అదే కోడ్ భాషలో 'RICE' అనే పదాన్ని ఏ విధంగా రాస్తారు.

- ఇందులో ఆంగ్ల పదంలోని అక్షరాలకు, కోడ్ పదంలోని అక్షరాలకు మధ్య సంబంధాన్ని కనుక్కోవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ప్రశ్నా పదం RICEలో ఉన్న అన్ని అక్షరాలు ఇచ్చిన పదం 'EXERCISE'లో ఉన్నాయి. దీని ఆధారంగా జవాబు కనుక్కోవచ్చు.

E X E R C I S E
↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓
M T M V Y R C M

కాబట్టి RICE కోడ్ VRYM

2. ఒక కోడ్ భాషలో BOARDను 40గా రాస్తే అదే కోడ్ భాషలో TUBEను ఏ విధంగా రాస్తారు?

- BOARD అనే పదంలోని అక్షరాల స్థాన విలువల మొత్తం 40

BOARD→ 2 + 15 + 1 + 18 + 4 = 40

అదే విధంగా

TUBE → 20 + 21 + 2 + 5 = 48

∴ TUBE కోడ్ 48

3. ఒక ప్రత్యేక కోడ్ భాషలో SOLVE THE PROBLEMS IN DOMESTIC SYSTEMను VROYH WKH SUREOHPV LQ GRPHVWLF VBVWHPగా రాస్తే అదే కోడ్ భాషలో కింది పదాలను ఏ విధంగా రాస్తారు?
a) HEN
b) INTER
c) MANGO

- HEN, INTER అనే రెండు పదాల్లోని అక్షరాలన్నీ పైన ఇచ్చిన ఆంగ్ల వాక్యంలో వచ్చాయి. కాబట్టి వాటికి కేటాయించిన కోడ్‌ల ఆధారంగా సమాధానం కనుక్కోవచ్చు.

a) HEN కోడ్ KHQ. అదేవిధంగా
b) INTER కోడ్ LQWHU, కానీ
c) MANGO అనే పదంలోని A, G అనే అక్షరాలు ఇచ్చిన ఆంగ్ల వాక్యంలో రాలేదు. కాబట్టి ఇప్పుడు ఇచ్చిన ఆంగ్ల వాక్యంలోని అక్షరాలకు, వాటి కోడ్ అక్షరాలకు మధ్య సంబంధాన్ని కనుక్కొని, దాని ఆధారంగా MANGO కోడ్ కనుక్కోవాలి.

ఆంగ్ల వాక్యంలోని ప్రతి అక్షరం, దాని తర్వాత మూడో అక్షరంతో కోడ్ చేసి రాశారు. కాబట్టి MANGO కోడ్ PDQJR అవుతుంది.

4. ఒక ప్రత్యేక కోడ్ భాషలో 'PUBLIC'ను 'QVCMJD'గా రాస్తే, అదే కోడ్ భాషలో 'OPINION'ను ఏ విధంగా రాస్తారు?

- PUBLIC అనే పదంలోని ప్రతి అక్షరాన్ని తర్వాత అక్షరంతో కోడ్ చేశారు.

P U B L I C
↓ ↓ ↓ ↓ ↓ ↓
Q V C M J D

అదే విధంగా OPINION అనే పదంలోని ప్రతి అక్షరాన్ని దాని తర్వాత అక్షరంతో కోడ్ చేయాలి.

O P I N I O N
↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓
P Q J O J P O

5. ఒక ప్రత్యేక కోడ్ భాషలో BRIGHTను 'CTLKMZ'గా రాస్తే, అదేకోడ్ భాషలో SUPERను ఏ విధంగా రాస్తారు?

- BRIGHT పదంలోని అక్షరాలను వరుసగా ఒకటో, 2వ, 3వ, 4వ, 5వ, 6వ అక్షరాలతో కోడ్ చేశారు.

B R I G H T
+1↓ +2↓ +3↓ +4↓ +5↓ +6↓
C T L K M Z

అదేవిధంగా

S U P E R
+1↓ +2↓ +3↓ +4↓ +5↓
T W S I W

∴SUPER ను TWSIW గా రాయవచ్చు.

6. ఒక ప్రత్యేక కోడ్ భాషలో 'STUDY'ని 'RSTCX'గా రాస్తే, అదే కోడ్ భాషలో CLASSను ఏ విధంగా రాస్తారు.


- STUDY అనే పదంలోని ప్రతి అక్షరాన్ని, దాని కంటే ముందున్న అక్షరంతో కోడ్ చేశారు. అదేవిధంగా CLASSను రాస్తే

C L A S S
↓ ↓ ↓ ↓ ↓
B K Z R R

∴CLASS కోడ్ BKZRR అవుతుంది.

7. ఒక కోడ్ భాషలో PETROLను OBOKFA గా రాస్తే అదే కోడ్ భాషలో DIESEL ను ఏ విధంగా రాస్తారు?

- PETROLలోని ప్రతి అక్షరాన్ని వరుసగా దాని



కంటే 1వ, 3వ, 5వ, 7వ, 9వ, 11వ స్థానాల్లో ముందున్న అక్షరంతో కోడ్ చేశారు.

P E T R O L
−1↓ −3↓ −5↓ −7↓ −9↓ −11↓
O B O K F A

అదేవిధంగా

D I E S E L
−1↓ −3↓ −5↓ −7↓ −9↓ −11↓
C F Z L V A

∴DIESELను CFZLVAగా రాయవచ్చు.

8. ఒక కోడ్ భాషలో LOVEను OLEVగా రాస్తే, అదే కోడ్‌భాషలో MARRIAGEను ఏ విధంగా రాస్తారు?

- ఈ ప్రశ్నకు మూడు సరైన సమాధానాలు ఉన్నాయి. అవి
  - LOVEఅనే పదంలో వరుసగా ప్రతి జత అక్షరాలను తారుమారు చేస్తూ రాస్తే OLEV వచ్చింది. అదే విధంగా MARRIAGEని రాస్తే
    MA RR IA GE→AMRRAIEG అవుతుంది.
  - మరో కోణంలో LOVE అనే పదంలోని సగం అక్షరాలను రివర్స్ ఆర్డర్‌లో, చివరి సగం అక్షరాలను రివర్స్ ఆర్డర్‌లో రాశారు. అదేవిధంగా MARRIAGE అనే పదంలోని 8 అక్షరాల్లో మొదటి సగం అక్షరాలను రివర్స్ ఆర్డర్‌లో రాస్తే RRAM అవుతుంది. అదేవిధంగా చివరి సగం అక్షరాలను రివర్స్ ఆర్డర్‌లో రాస్తే EGAI అవుతుంది.
    ∴MARRIAGE కోడ్ RRAMEGAI అవుతుంది.
  - మరో కోణంలో LOVE అనే పదంలోని ప్రతి అక్షరాన్ని, దాని తిరోగమన స్థానాక్షరంతో కోడ్ చేశారు.
    L తిరోగమన స్థానాక్షరం O
    O తిరోగమన స్థానాక్షరం L
    Vతిరోగమన స్థానాక్షరం E
    E తిరోగమన స్థానాక్షరం V

అదే విధంగా MARRIAGE అనే పదంలోని ప్రతి అక్షరాన్ని, దాని తిరోగమన స్థానాక్షరంతో కోడ్ చేస్తే

M A R R I A G E
↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓
N Z I I R Z T V

∴ MARRIAGE కోడ్ NZIIRZTV అవుతుంది.

9. ఒక ప్రత్యేక కోడ్ భాషలో నలుపు అంటే ఎరుపు; ఎరుపు అంటే నీలం; నీలం అంటే ఆకుపచ్చ; ఆకుపచ్చ అంటే తెలుపు; తెలుపు అంటే నలుపు; అయితే ఆ కోడ్ భాషలో బొద్దింక రక్తం రంగును దేనితో సూచిస్తారు?

- ఇలాంటి ప్రశ్నలు వచ్చినప్పుడు, ముందుగా చివర ఇచ్చిన ప్రశ్నకు, సమాధానం కనుక్కోవాలి. తర్వాత ఈ పదాన్ని కోడ్‌భాషలో దేనితో సూచిస్తారో తెలుసుకోవాలి.
- పై ప్రశ్నలో బొద్దింక రక్తం తెలుపు రంగులో ఉంటుంది. ఆ కోడ్ భాషలో తెలుపును నలుపుతో సూచిస్తారు.

∴ జవాబు: నలుపు

10. కోడ్ భాషలో ప్రిన్సిపాల్ అంటే విద్యార్థి; విద్యార్థి అంటే తండ్రి; తండ్రి అంటే ఉపాధ్యాయుడు; ఉపాధ్యాయుడు అంటే డాక్టర్; డాక్టర్ అంటే ఇంజినీర్ అయితే ఆ కోడ్ భాషలో తరగతిలో బోధించే వ్యక్తిని ఏమని పిలుస్తారు?

- తరగతిలో బోధించే వ్యక్తిని ఉపాధ్యా యుడు అంటారు. ఆ కోడ్ భాషలో ఉపాధ్యాయున్ని డాక్టర్ అంటారు

∴ జవాబు: డాక్టర్

11. SPACE అంటే TQBDF అయితే PURSE అంటే?
1) QTSRF 2) OTQRD
3) QVSTF 4) ESRUP

- SPACE అనే పదంలోని ప్రతి అక్షరాన్ని, దాని తర్వాత అక్షరంతో కోడ్ చేస్తే TQBDF వచ్చింది. అదే విధంగా PURSE అనే పదంలోని ప్రతి అక్షరాన్ని, దాని తర్వాత అక్షరంతో కోడ్ చేస్తే QVSTF వస్తుంది

∴ జవాబు: (3)

12. ఒక కోడ్ భాషలో vin min hin అంటే How are you? అని; hin fin vin అంటే Where are you? అని అర్థం. అయితే ఆ కోడ్ భాషలో
(a) How
(b) are కోడ్ పదాలను కనుక్కోండి?

- (a) How
How అనే పదం మొదటి వాక్యంలో మాత్రమే ఉంది. మొదటి వాక్యంలో How మినహా మిగిలిన రెండు పదాలు, రెండో వాక్యంలో కూడా ఉన్నాయి. కాబట్టి How కోడ్ min అవుతుంది. ఎందుకంటే min అనే పదం రెండో కోడ్ వాక్యంలో పునరావృతం కాలేదు.
(b) are
are అనే పదంతో పాటు మరో పదం youలు రెండు వాక్యాల్లో పునరావృతం అయ్యాయి. కాబట్టి వీటి కోడ్‌లు కూడా పునరావృతం అవుతాయి. రెండు కోడ్ వాక్యాల్లో vin, hin అనే రెండు పదాలు పునరావృతం అయ్యాయి.
కాబట్టి are కోడ్ vin లేదా hin అవుతుంది.

13. ఒక కోడ్ భాషలో MANGOను 13-1-14-7-15గా రాస్తే, అదేకోడ్ భాషలో GRAPESను ఏ విధంగా రాస్తారు?

- MANGO పదంలోని ప్రతి అక్షరాన్ని, ఆంగ్ల అక్షరాల వరుస క్రమంలో దాని స్థాన విలువతో కోడ్ చేశారు. అదేవిధంగా
GRAPES కోడ్ 7-18-1-16-5-19

14. ఒక కోడ్ భాషలో TABLEను 21-3-5-16-10గా రాస్తే, అదే కోడ్ భాషలో CHAIR ను ఏ విధంగా రాస్తారు?

- TABLE అనే పదంలోని అక్షరాల స్థాన విలువకు వరుసగా 1, 2, 3, 4, 5లను కలిపి రాశారు.
T→ 20+1=21
A→ 1+2=3
B→ 2+3=5
L→ 12+4=16
E→ 5+5=10
అదే విధంగా
C→ 3+1=4
H→ 8+2=10
A→ 1+3=4
I → 9+4=13
R→18+5=23
∴ CHAIR కోడ్ 4-10-4-13-23


15. ఒక కోడ్ భాషలో TREATMENTను 123415361గా రాస్తే, అదే కోడ్ భాషలో
a) MEAT
b) RENTలను ఏ విధంగా రాస్తారు?

- T R E A T M E N T
1 2 3 4 1 5 3 6 1
∴ MEAT కోడ్ - 5341
RENT కోడ్ - 2361

16. ఒక కోడ్ భాషలో STATEను 1-2-1-2 -5గా రాస్తే అదే కోడ్ భాషలో COUNTRYని ఏ విధంగా రాస్తారు.

- STATE అనే పదంలోని అక్షరాల స్థాన విలువలో ఒకే ఒక అంకె ఉంటే అదేవిధంగా, రెండంకెలు ఉంటే ఆ అంకెల మొత్తంగా కోడ్ చేస్తూ రాశారు.
S స్థాన విలువ 19
→ 1 + 9 = 10 → 1 + 0 = 1
T స్థాన విలువ 20→2+0=2
A స్థాన విలువ 1
T స్థాన విలువ 20→2+0=2
E స్థాన విలువ 5
కాబట్టి STATE కోడ్ 1-2-1-2-5
C స్థాన విలువ - 3
O స్థాన విలువ -15→1+5=6
U స్థాన విలువ - 21→2+1=3
N స్థాన విలువ - 14→1+4=5
T స్థాన విలువ - 20→2+0=2
R స్థాన విలువ - 18→1+8=9
Y స్థాన విలువ - 25→2+5=7
∴COUNTRY కోడ్ 3-6-3-5-2- 9-7

Growth of digital economy has given rise to



BANK EXAMS

GENERAL ENGLISH

MODEL QUESTIONS

Directions (Q.No 1-10): Read the following passage carefully and answer the questions that follow.

Five years ago, any sign of weakness in the Rupee would have been the cue for RBI officials, ministers and sundry economic commentators to lash out at Indian households for their unreasonable and unpatriotic love for gold.

And it is true that gold imports had a big role to play in India's yawning trade deficit and precarious balance of payments position in 2013.

But as the Rupee has entered shaky territory again it is oil rather than gold that has been the hot topic of debate. There's good reason for this shift.

A break down of India's import bill suggests that gold is no longer the villain of the piece when it comes to exchange rate woes. In fact, data suggest that the Indian saver's love affair with gold may be well past its prime.

When India faced a run on the Rupee and a widening trade deficit in 2013, its annual gold import bill had topped $50 billion for the second year running. Between FY10 and FY13, India saw consistently high demand for gold jewellery, bars and coins despite **galloping** global gold prices.

The bloated the country's gold import bill from about $28 billion in FY10 to a record $56 billion in FY12.

But gold imports have since seen **substantial moderation** from those excessive levels. In FY18, India's dollar outgo on gold imports amounted to just $34 billion, having shrunk 40 percent from the peak six years ago. Lest you think this is an **aberration**, gold imports have hovered in a narrow range of $27 billion to $35 billion for five years now. Bullion accounted for nearly 12 percent of the country's import bill in FY12. But its contribution is now down to about 7 percent.

This explains why debates around the current account deficit no longer **obsess** over the yellow metal.

Trends in domestic demand, tracked by the World Gold Council, show that Indian consumers have been cutting back on the volume of gold purchases in the last five years. In the years from 2010 to 2012, consumers accumulated anywhere between 900 and 1,000 tonnes of bullion a year. Jewellery accounted for about two-thirds of this volume, with bars and coins making up a third.

In the last five years though, bar and coin demand has halved from 355 tonnes in 2012 to 164 tonnes in 2017. Jewellery demand, after rising from 595 tonnes to 662 tonnes between 2012 to 2015, has flat-lined, slipping back to 573 tonnes in 2017.

As a result, aggregate domestic demand for gold has fallen by 20 percent between 2012 and 2017.

So, what has made Indian consumers cold-shoulder their favorite asset? Several factors seem to be at play.

Indian gold buyers view bullion as much as an investment as an item of adornment. We all know that any investment is most sought-after when its returns are soaring. So it was with gold.

In the five years following the global financial crisis in 2008, gold churned out bumper returns for Indian investors who hoarded it, thanks to a global flight to safe-haven assets and a steadily depreciating Rupee.

With domestic gold holders earning a 20 percent plus return for five consecutive years until 2013, investment demand for the yellow metal sky-rocketed. Gold is also seen as a hedge against inflation and the runaway price-spike in this period also **stoked** demand.

But with the global stock and bond markets staging a recovery from 2013, and inflation flagging, gold began to lose its **mojo**. As the Rupee stabilized, domestic gold investments suffered three consecutive years of negative returns from 2015 to 2017, dousing investor interest. Purchases of bars and coins, which topped 340 tonnes in 2013, had crashed to 164 tonnes by 2017.

1. The author of the passage asserts that gold is no longer the villain of the piece when it comes to exchange rate woes. Then who is the real culprit?
   1) Major steps of economic reforms taken by the incumbent government.
   2) Price hike of crude oil in global market and its impact of Indian economy.
   3) Exemption of petrol and diesel from GST
   4) All (1), (2) and (3)
   5) Only (1) and (2)
2. What is the meaning of the phrase 'substantial moderation' as used in the passage?
   A) Remarkable downward trend
   B) Noticeable upward movement
   C) Either upward or downward trend
   1) Only A 2) Only B 3)Only C
   4) None of these
   5) Other than those given as options
3. What was the impact of Indian households' unreasonable and unpatriotic love for gold in 2013 on Indian economy?
   A) Due to excessive demand by Indian household the government earned huge revenue through taxation resulting in improvement in Indian economy.
   B) The unreasonable demand of gold by Indian household gave rise to a situation of trade deficit.
   C) As a result of excessive demand of gold in Indian bullion market the balance of payments position improved.
   1) Only A 2) Only B 3) Only C
   4) Both A and B
   5) All A, B and C
4. Find the incorrect statement on the basis of the given passage.
   1) Bullion accounts for about 7 per cent of the country's import bill as of now.
   2) The consistent high demand for gold jewellery, bars and coins bloated the country's gold import bill to a record $56 billion in FY12.
   3) As per the observation of the World Gold Council, Indian consumers showed heightened inclination towards purchase of yellow metal in the last five years.
   4) Between 2012 and 2017 the aggregate domestic demand for gold has come down by 20 percent.
   5) None of the above
5. Why did people prefer to invest in gold rather than in other class of investments during the period following the global financial crisis in 2008 till 2013? Answer on the basis of the given passage.
   1) Because gold gave attractive returns on its sale
   2) Because the investment in gold was seen as a hedge against inflation
   3) Because of easy liquidity of gold
   4) Only (1) and (2)
   5) All (1), (2) and (3)

Directions (Q.No 6-8): Choose the word which is MOST SIMILAR in meaning to the word printed in bold as used in the passage.

6. **Obsess**
   1) Repulse 2) Dominate
   3) Exude 4) Distract 5) Rely
7. **Stoked**
   1) Slumped2) Declined
   3) Surged 4) Supplied5) Relied
8. **Mojo**
   1) Poison 2) Price
   3) Junk 4) Life 5) Charm

Directions (Q.No 9-10): Choose the word which is MOST OPPOSITE in meaning of the word printed in bold as used in the passage.

9. **Galloping**
   1) Jumping 2) Running
   3) Speedy 4) Halted 5) Flying
10. **Aberration**
    1) Conformity 2) Peculiarity
    3) Delusion 4) Weirdness
    5) Deviation

Directions (Q.No 11-15): Read each sentence to find out whether there is any grammatical or idiomatic error in it. The error, if any, will be in one part of the sentence, the number of that part is the answer. If there is "No error", the answer is 5. (Ignore errors of punctuation, if any).

11. (1) It is amazing how concern for / (2) the common man and the inconvenience caused to them / (3) has suddenly become / (4) a huge issue for the Opposition. / (5) No error
12. (1) Casting aspersions on the suitability / (2) of Donald Trump as president of the United States/ (3) amounts to disrespecting / (4) the American people's verdict. / (5) No error
13. (1) While Modi continues his harangue, / (2) some BJP members are behaving like Nero/ (3) playing the fiddle / (4) while Rome burnt. / (5) No error
14. (1) For India to remain a constitutional democracy / (2) we need a Supreme Court that operates/ (3) as an effective check on majority / (4) legislative and executive power. / (5) No error
15. (1) The Indian embassy in Beijing has now asked / (2) the government to consider extending / (3) the March 31 deadline for NRI / (4) as many cannot travel to India before then. / (5) No error

Directions (Q.No16-20): In the following questions, a sentence has been given with some of its parts in bold. To make the sentence grammatically and idiomatically correct, you have to replace the bold part with the correct alternative given below. If the sentence is correct as it is, give (5) as your answer (i.e, No correction required.)

16. Those with ears to the ground can hear the buzz of a movement that **are in way in** rural UP.
    1) is on the way in
    2) is towards the way of
    3) is way of 4) is underway in
    5) No correction required
17. Legalising betting will curtail the influence of unethical elements **on** the sports.
    1) of the 2) in the
    3) over 4) against
    5) No correction required
18. Researchers have found that **learning by doing** practice tests, a strategy known as retrieval practice, can protect memory against the negative effects of stress.
    1) learning by giving
    2) learning by taking
    3) learning by making
    4) learning by having
    5) No correction required
19. Growth of digital economy has given rise to hackers and fraudsters who take advantage of the weak **links to** the internet.
    1) links of 2) links in
    3) links from 4) link attached to
    5) No correction required
20. Because of the higher prices, many buyers of Indian Pepper **has switched to** Indonesia and Vietnam.
    1) have switched over to
    2) switched over to
    3) had switched into
    4) have to switched to
    5) No correction required

Directions (Q.No 21-23): Below in each question some parts of a sentence are given. Find the part of the sentence which is not really contributing to the main theme of the sentence and rearrange the remaining parts of the sentence to make a meaningful and grammatically correct sentence. If the given sentence is correct as it is then choose (5). If the sequence is the one which is not given then choose option (4) as your choice.

21. The two adventurous economic disruptions (A) / And approved rating (B) / Made him the darling of (C) / Bestowed Modi the mantle of a socialist messiah and (D) / The underprivileged (E).
    1) EDCA 2) ABDE 3) ADCE
    4) None of these
    5) NO correction required
22. A de facto majoritarian state is in existence (A) / whereby critiquing the BJP is tantamount to treason, (B) / Criticising the government is equivalent to sedition (C) / A new language has been invented (D) / And questioning the establishment is downright blasphemous. (E)
    1) ABED 2) DBCE 3) CABD
    4) None of these
    5) NO correction required

KEY

1) 2 2) 1 3) 2 4) 3 5) 4
6) 2 7) 3 8) 5 9) 4 10) 1
11) 2 (Replace 'them' with 'him'
12) 5
13) 4 (Replace 'burnt' with 'burns')
14) 3 (Replace 'majority' with majoritarian')
15) 3 (Replace 'NRI' with 'NRIs')
16) 4 17) 5 18) 2 19) 2 20) 1
21) 3 ('B' does not contribute to the main theme of the sentence)
22) 2 ('A' does not contribute to the main theme of the sentence)